
సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 7.00



'బీడుబడిన భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'



అనంతగిరిలో ప్రీ వెడ్డింగ్ షూట్..

- తారామతిలో ఫొటోషూట్స్... రాణిమహల్‌లో పెళ్లిళ్లు
- అనంతగిరిహిల్స్‌కూ పెళ్లిళ్ల తాకిడి
- సిటీపై ఆసక్తి చూపుతున్న అంతర్జాతీయ వెడ్డింగ్ ప్లానర్స్
- లక్నవరం, సోమశిలనూ వేదికలుగా తీర్చిదిద్దనున్న పర్యాటక శాఖ

వెడ్డింగ్స్.. డెస్టినేషన్

పెళ్లి..చిరకాలం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకం. సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ ఘనంగా పెళ్లిళ్లు చేయడం దక్షిణాది ప్రత్యేకత. అయితే కొన్నేళ్లుగా డెస్టినేషన్ వెడ్డింగ్స్ ట్రెండ్ కొనసాగుతోంది. మొదట్లో సెలబ్రిటీలు, దిగ్గజ వ్యాపారవేత్తలు మాత్రమే డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు విదేశాలకు వెళ్లేవారు. అనంతర కాలంలో ఆ ఖర్చును భరించగలిగే ఆర్థికస్తోమత ఉన్నవారు కూడా వాటి వైపు మొగ్గు చూపారు. భారత్‌లోని జోధ్‌పూర్, ఉదయ్‌పూర్, జైసల్మేర్, ముస్సోరీ, గోవా వంటి ప్రదేశాలు ఈ డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు వేదికలుగా ఆదరణ పొందాయి. కొంతకాలంగా నగరంలోని పలు ప్రాంతాలూ వీటికి కేంద్రాలుగా మారాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర పర్యాటకశాఖ నగరంతోపాటు రంగారెడ్డి, వరంగల్ జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ కోసం అన్ని సౌకర్యాలు కల్పించే దిశగా ప్రణాళికలు రచిస్తోంది. మరోవైపు ఈ వేదికల్లో వేడుకలు జరపడానికి అంతర్జాతీయ వెడ్డింగ్ ప్లానర్స్ కూడా ఆసక్తి చూపుతున్నారు. కొన్ని రోజుల క్రితం నగరం వేదికగా జరిగిన అంతర్జాతీయ వెడ్డింగ్ ప్లానర్స్ సమ్మేళనంలో ఆ దిశగా దృష్టి సారించారు.

16లో

..: సాక్షి, హైదరాబాద్ :..

డెస్టినేషన్ వెడ్డింగ్ ఎక్కడెక్కడ చేసుకోవచ్చు..
ఖర్చెంత ?

సూపర్ పోలీస్..!

స్నాచర్లను పట్టుకునేందుకు కొత్త ఎత్తుగడ

మెడలో చెయిన్‌తో, ఫోన్ మాట్లాడుతూ రోడ్డుపై నడక

- కాస్త దూరంలో తుపాకీతో మరో పోలీసు నిఘా
- స్నాచర్ పారిపోయేందుకు యత్నించే లోపు కాల్పులు
- ఓ స్నాచర్ కాలులోకి దూసుకెళ్లిన బుల్లెట్
- చిలకలగూడ, మార్కెట్– 2 ఠాణాల పరిధిలో కాల్పులు
- మొత్తం ఏడుగురు నిందితుల అరెస్టు..

- వివరాలు 7లో

చదువుకు షాన్‌దార్!

నగరంలో అందుబాటులో 'అంతర్జాతీయ'విద్య

సువిశాల ప్రాంగణాలు, సకల సదుపాయాలతో పాఠశాలలు


సీబీఎస్‌ఈతో పాటు ఐబీ, కేంబ్రిడ్జి స్థాయి సిలబస్‌తో బోధన

విదేశీ సంస్థలు, బడులతో అనుసంధానం.. అనుభవాలు పంచుకునేలా ఏర్పాట్లు

పాఠాలతో పాటు మానసిక, శారీరక వికాసానికి ప్రత్యేక శ్రద్ధ

ఆటలు, పాటలు, సృజనాత్మకత పెంపొందేలా కార్యక్రమాలు


ఫీజులు కూడా 'అంతర్జాతీయ స్థాయి'లోనే..!



ఎండాకాలం సెలవుల తర్వాత స్కూల్స్ మళ్లీ తెరుచుకున్నాయి. పిల్లలు, తల్లిదండ్రులు మళ్లీ బిజీ బిజీ అయిపోయారు. విద్యార్థుల్ని పాఠశాలలకు తీసుకెళ్లే వాహనాలతో ఉదయం వేళ రోడ్లు రద్దీగా ఉంటున్నాయి. పిల్లల భవిష్యత్తును నిర్దేశించేది పాఠశాలే కదా..అందుకే కొత్తగా పిల్లల్ని స్కూల్లో చేర్పించేటప్పుడు తల్లిదండ్రులు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. అందుబాటులో ఉన్న స్కూళ్లలో వసతులు, బోధన సౌకర్యాలు ఇతరత్రా అన్నీ పరిశీలించి పిల్లలను చేర్పిస్తుంటారు. అయితే హైదరాబాద్‌లో అన్ని రకాల స్కూళ్లు ఉన్నాయి. వీటిల్లో ఆ స్కూలు స్థాయిని బట్టి ఫీజుల్లో అంతరం, సిలబస్‌లో తేడా ఉంటుండగా.. వివిధ రకాల ప్రత్యేకతలతో యాజమాన్యాలు తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. హైదరాబాద్‌లో వేల సంఖ్యలో స్కూల్స్ ఉన్నాయి. కొన్ని స్కూల్స్‌లో స్టేట్ సిలబస్.. కొన్నింటిలో సీబీఎస్ఈ, మరికొన్నింటిలో ఐసీఎస్‌ఈ సిలబస్ చెబుతుంటారు. ఇక అంతర్జాతీయ పాఠశాలలు పరిగణించే కొన్ని స్కూళ్లు కూడా నగరంలో ఉన్నాయి. అలాంటి పాఠశాలలు ఏవి? ఎలాంటి వసతులు అందిస్తున్నాయి? నిజంగానే అంతర్జాతీయ స్థాయి విద్య, బోధన ఉందా?, ఫీజుల మాటేమిటి అనే వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

..సాక్షి, హైదరాబాద్..

అంతర్జాతీయ సిలబస్..



➤ విద్యా బోధన, వసతులు, ప్రత్యేకతల్లో కొత్త పుంతలు తొక్కుతూ కార్పొరేట్ స్థాయి స్కూల్స్ అనేకం నగరంలో ఉన్నాయి. అయితే ఇటీవల కాలంలో అంతర్జాతీయ స్థాయి బోధనా పద్ధతులతో హైదరాబాద్‌లో అనేక స్కూళ్లు వెలిశాయి. సీబీఎస్‌ఈతో పాటు ఇంటర్నేషనల్ బాకలరేట్ (ఐబీ), ఇంటర్నేషనల్ జనరల్ సర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (ఐజీసీఎస్ఈ), కేంబ్రిడ్జి ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ (సీఐఈ), బ్రిటిష్ కౌన్సిల్, ఇంటర్నేషనల్ బాకలరేట్ ప్రైమరీ ఇయర్స్ ప్రోగ్రామ్ (ఐబీ పీవైపీ), కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్కూల్స్ (సీఐఎస్) తదితర సిలబస్‌ల పేరిట తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. మస్సాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ), యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్ (యూనిసెఫ్) వంటి సంస్థలతో, విదేశాల్లోని పాఠశాలలతో అనుసంధానమై.. అక్కడి విద్యార్థులతో నేరుగా మాట్లాడేలా, చదువులో వారి అనుభవాలను ఇక్కడి విద్యార్థులతో పంచుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు యాజమాన్యాలు చెబుతున్నాయి. తద్వారా విద్యార్థుల్లో చదువుపై ఉన్న అవగాహనలో మార్పు వచ్చేలా, అంతర్జాతీయ స్థాయి ఆలోచనా విధానం అలవడేలా కృషి చేస్తున్నామని వారు పేర్కొంటున్నారు.

వసతులు ఎలా ఉంటాయి?

దాదాపుగా అన్ని పాఠశాలలు సమాన స్థాయిలో వసతులు అందిస్తున్నాయి. విశాలమైన తరగతి గదులు, స్మార్ట్ క్లాస్ రూమ్స్, ఆర్ట్ స్టూడియోలు, లాంగ్వేజ్ ల్యాబ్స్, డ్యాన్స్, మ్యూజిక్ రూమ్స్, విశాలమైన ప్లే గ్రౌండ్, ఆడిటోరియం, ఆంఫీ థియేటర్, డైనింగ్ హాల్స్ వంటి ఎన్నో సౌకర్యాలు ఉంటున్నాయి. ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంతో కళా నైపుణ్యం పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. గుర్రపు స్వారీ, స్విమ్మింగ్‌తో పాటు క్రీడల్లోనూ తర్ఫీదునిస్తున్నారు. దాదాపు అన్ని ఇంటర్నేషనల్ స్కూల్స్ కూడా సువిశాలమైన ప్రాంగణాల్లో వ్యక్తిత్వ వికాసం కోసం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తామని ఓ స్కూల్ యాజమాన్యం తెలిపింది. మానసిక ఎదుగుదల కోసం కూడా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దాదాపుగా అన్ని స్కూళ్లు 100 ఎకరాల వరకు విస్తీర్ణంలో ఉన్నాయి. చెట్లు, పచ్చిక బయళ్లతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూస్తున్నారు.



బోధన ఎలా?

విద్యార్థులకు పుస్తకాలే ప్రపంచం అనేలా కాకుండా వినూత్నమైన బోధనా పద్ధతులు అవలంబిస్తున్నారు. వివిధ రకాల సిలబస్‌ల్లో శిక్షణ పొందిన నిష్ణాతులైన టీచర్లను యాజమాన్యాలు నియమించుకుంటున్నాయి. అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో విద్యార్థులకు ఎలాంటి బోధన అందిస్తున్నారో పరిశోధనలు చేసి అలాంటి పద్ధతులను ఇక్కడ అనుసరిస్తున్నారు. బొమ్మల రూపాల్లో, కళాత్మక రూపాల్లో పిల్లలకు సులువుగా పాఠాలు అర్థమయ్యేలా బోధిస్తున్నారు. కామన్ గ్రౌండ్ కొలాబరేటివ్ మెథడాలజీ విధానంలో పిల్లలకు సులువుగా అర్థమయ్యేలా చెబుతున్నారు. దీంతో పిల్లల్లో చదువుపై ఆసక్తి పెరుగుతుందని ఓ నిర్వాహకుడు చెప్పారు. ఈ క్రమంలో కొన్ని స్కూళ్లు విదేశీ టీచర్లను సైతం నియమిస్తున్నాయి. ఇక్కడి బోధనా పద్ధతులు నచ్చి విదేశీ విద్యార్థులు కూడా ఇక్కడ చేరుతుండటం గమనార్హం.

పిల్లల్ని చేర్పించాలంటే..

➤ ముందుగా పాఠశాల వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత స్కూల్ టూర్ ఏర్పాటు చేస్తారు. స్కూల్‌లో ఉన్న వసతులు చూసుకున్నాక నచ్చితే ఫీజు, కర్రిక్యులమ్, లొకేషన్, రవాణా సదుపాయాలు వంటి వివరాలను అడ్మిషన్ అధికారితో మాట్లాడుకోవాలి. ఆ తర్వాత మీకు అప్లికేషన్ ఫారం లింక్ పంపిస్తారు. అందులో మీ పిల్లల పూర్తి వివరాలు నింపి సబ్మిట్ చేయాలి. ఆ తర్వాత మీ వివరాలను అడ్మిషన్ బృందం క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. వాళ్లు మీ వివరాల విషయంలో సంతృప్తి చెందితే సమాచారం పంపిస్తారు. ఆ తర్వాత టర్మ్ ఫీజు చెల్లించి సీటు పొందాలి. అయితే కొన్ని పాఠశాలల్లో ఎంట్రన్స్ పరీక్ష కూడా ఉంటుంది. అందులో మంచి మార్కులు సాధించాల్సి ఉంటుంది.

ఫీజుల మాటేమిటి?



➤ ఇంటర్నేషనల్ స్కూల్స్ కాబట్టి ఫీజులు కూడా ఆ స్థాయిలోనే ఉన్నాయి. ప్రీ నర్సరీకే ఏడాదికి కనీసం రూ.3.2 లక్షల ఫీజు ఉంది. ఇక సీబీఎస్ఈ సిలబస్ అయితే ఒకలా.. ఐబీ ప్రోగ్రామ్ అయితే మరోలా ఫీజులు ఉన్నాయి. 12వ తరగతికి కనీసం రూ.10.5 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.16 లక్షల వరకు ఉంది.

టాప్ స్కూల్స్ ఇవే..

ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్, ఆగాఖాన్ ఇంటర్నేషనల్ స్కూల్, మ్యాన్‌చెస్టర్ ఇంటర్నేషనల్ స్కూల్, గాడియమ్ స్కూల్, ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ హైదరాబాద్, శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్, బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్, గ్లెండేల్ ఇంటర్నేషనల్ స్కూల్, ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్, చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్, మెరు ఇంటర్నేషనల్ స్కూల్ వంటివి టాప్ స్కూల్స్ జాబితాలో ఉన్నాయి.

చదువుతో పాటు నైపుణ్యాల పెంపుదల



➤ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విద్య అందించేందుకు చాలా కృషి చేస్తున్నాం. నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో కూడా ఇక్కడ నేర్పిస్తాం. మేం అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఐబీ సిలబస్‌లో బోధిస్తున్నాం. బ్రిటన్, అమెరికాలోని ప్రఖ్యాత స్కూళ్లతో అనుసంధానమై అక్కడి బోధనా పద్ధతులను అనుసరిస్తున్నాం. చదువుతో పాటు వివిధ రంగాల్లో విద్యార్థులు తమ నైపుణ్యాలు పెంపొందించుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. - కందాడి కొండల్‌రెడ్డి, మాంచెస్టర్ గ్లోబల్ స్కూల్ చైర్మన్

హై ప్రోటీన్..

వాడటం మంచిది కాదు

నగరంలో విరివిగా సప్లిమెంట్స్ వినియోగం

తగిన శారీరక శ్రమ లేకుండా ప్రొటీన్ వినియోగంతో కండరాల క్షీణత


అతి వినియోగంతో అనర్థమంటున్న పరిశోధకులు

పౌడర్స్‌లో అనారోగ్య కారకాలు ఉన్నాయని వెల్లడి

ఆహారపదార్థాల ద్వారా పొందే ప్రొటీన్లే మేలని సూచన

జాతీయ పౌష్టికాహార సంస్థ (ఎన్ఐఎన్) నివేదిక

- వివరాలు 11లో







దిశ మారితే దశ మారిపోతుంది!

బస్సు దిగడంపై అత్యధికుల్లో కొరవడిన అవగాహన..

సాక్షి, హైదరాబాద్: రహదారి భద్రతా నిబంధనలు ఏం చెప్తున్నా...ఆర్టీసీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నా... నగరంలో కదులుతున్న బస్సు ఎక్కడం, దిగడం తప్పనిసరి పరిస్థితి. పురుషులు–మహిళలు ఇలా అందరికీ ఏదో ఒక సందర్భంలో ఈ అవసరం వస్తుంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు తర్వాత ఇది మరింత పెరిగింది. అయితే ఇప్పటికీ నగరవాసుల్లో అత్యధికులకు కదులుతున్న బస్సు ఏ దిశలో దిగాలన్న దానిపై అవగాహన లేదు. ఈ కారణంగానే ఇటీవల మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు వద్ద ఇంటర్మీడియెట్ ఫస్టియర్ విద్యార్థిని మెహరీన్ ప్రాణాలు పోగొట్టుకుంది. తనతో పాటు ఎక్కలేకపోయిన అక్క కోసం కదులుతున్న బస్సు దిగేందుకు ప్రయత్నించి కిందపడి అదే బస్సుచక్రాల కిందే నలిగిపోయింది. ఇలా కదులుతున్న బస్సు దిగాల్సి వచ్చినప్పుడు కచ్చితంగా ఆ బస్సు వెళ్తున్న దిశలోనే ముఖం ఉండేలా కిందికి దిగాలి. అయితే చాలామంది వ్యతిరేక దిశలో, డోర్ నుంచి నేరుగా ఉండే దిశలో దిగడానికి ప్రయత్నించి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. మెహరీన్ సైతం ఇలా వ్యతిరేక దిశలో దిగడానికి ప్రయత్నించి ప్రాణాలు కోల్పోయింది. మహిళలు–పురుషుల ప్రవేశాలు, టికెట్‌కు సరిపడ చిల్లర ఇవ్వండి, ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేయకండి వంటి ఎన్నో సూచనలను బస్సుల్లో రాసే అధికారులు సైతం ఈ విషయంపై అవగాహన కల్పిస్తే ఇలాంటి సంఘటనలను కొన్నైనా అరికట్టే అవకాశముంటుంది.



'గ్రామాల్లో సంపద పెరగాలి.
పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00

సంపుటి: 17
సంచిక: 92

ఆదివారం 23-6-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత్ ఘన విజయం

టి20 ప్రపంచ కప్ సూపర్-8 దశలో భారత్ వరుసగా రెండో విజయాన్ని సాధించింది. శనివారం జరిగిన పోరులో టీమిండియా 50 పరుగులతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసి దాదాపు సెమీస్‌లోకి అడుగు పెట్టింది. హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టును గెలిపించాడు. కుల్దీప్ యాదవ్‌కు 3 వికెట్లు దక్కాయి.

14లో



సుబోధ్‌పై వేటు.. నీట్-పీజీ వాయిదా

ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ సుబోధ్‌సింగ్‌పై కేంద్రం వేటు వేసింది. అలాగే, ఆదివారం జరగాల్సిన నీట్- పీజీ పరీక్షను వాయిదా వేశారు.

వివరాలు 6లో ▶



నీట్-యూజీపై సీబీఐ విచారణ

నీట్-యూజీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై కేంద్రం సీబీఐ విచారణకు ఆదేశించింది.

వివరాలు 6లో ▶



కొత్త చట్టమే..!

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి సర్కారు చర్యలు

ఆర్‌వోఆర్-2020 చట్టం పూర్తిగా మార్చాలని నిర్ణయం

- పాత చట్టంతో సమస్యలు పరిష్కారం కాకపోగా కొత్త సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయనే అభిప్రాయం
- పాత చట్టాన్ని సవరించాలని, కొత్త చట్టమైనా ఓకే అన్న ధరణి కమిటీ
- తమదైన ముద్ర ఉండేలా కొత్త చట్టం వైపే రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు!
- కీలక సవరణలతో ఆర్‌వోఆర్-2024 చట్టం ముసాయిదా రూపకల్పన పనిలో అధికారులు
- అధికార వికేంద్రీకరణ, రెవెన్యూ ట్రిబ్యునళ్ల ఏర్పాటుపై స్పష్టత!
- 18 లక్షల ఎకరాల పార్ట్-బీ భూములు, 9 లక్షల ఎకరాల సాదా బైనామాలకు పరిష్కారం
- వచ్చే బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రస్తుతమున్న ఆర్‌వోఆర్ చట్టం ఉపయోగపడదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్-2020) చట్టాన్ని పూర్తిగా మార్చాలనే నిర్ణయానికి వచ్చింది. పాత చట్టం స్థానంలో కొత్త చట్టం తీసుకురానుంది. అనేక అంశాల్లో స్పష్టతనిస్తూ కొత్త చట్టాన్ని తీసుకురావాలనే లక్ష్యంతో కొత్త రెవెన్యూ చట్టానికి రూపకల్పన చేస్తున్నట్టు సమాచారం. ముసాయిదా చట్టం సిద్ధమవుతోందని, వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో దీనికి ఆమోదం తెలిపే బిల్లును తీసుకువస్తారనే చర్చ రెవెన్యూ వర్గాల్లో జరుగుతోంది.

కొత్త చట్టమే ఉత్తమం!

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌ను అమల్లోకి తెస్తున్న సందర్భంగా, ఇంతకుముందున్న చట్టం స్థానంలో ఆర్‌వోఆర్-2020 చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధరణి పోర్టల్ పునర్నిర్మాణం కోసం నియమించిన ప్రత్యేక కమిటీ ఈ చట్టాన్ని అధ్యయనం చేసింది. ఈ చట్టం ద్వారా భూసమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యం కాదని, చాలా అంశాలపై ఇది స్పష్టత ఇవ్వడం లేదని, దీని ద్వారా భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోగా, కొత్త కొత్త సమస్యలు వస్తున్నాయని కమిటీలోని నిపుణులు అభిప్రాయపడ్డారు. పాత చట్టంలో చేయాల్సిన సవరణల గురించి పలు సిఫారసులు చేశారు. లేనిపక్షంలో పూర్తిగా కొత్త చట్టాన్నైనా తీసుకురావాలంటూ ప్రభుత్వానికి నివేదించారు. ఈ నేపథ్యంలోనే లోపభూయిష్టమైన పాత చట్టానికి మార్పులు చేయడం కన్నా తమ ముద్ర ఉండే విధంగా కొత్త చట్టాన్ని తీసుకురావడమే సమంజసమనే నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు వచ్చినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే పాత చట్టంలోని కొన్ని అంశాలను తీసుకుంటూనే, అవసరమైన

మిగతా 5వ పేజీలో ▶

అసైన్డ్, భూదాన్ కంగాళీకీ చెక్!

అసైన్డ్, భూదాన్, వక్ఫ్, దేవాదాయ భూములకు సంబంధించిన కంగాళీ కూడా లేకుండా అన్ని సమస్యలకు పరిష్కారం చూపే విధంగా పాత చట్టాన్ని మార్చి కొత్త చట్టాన్ని తయారుచేస్తున్నారని, రెవెన్యూ ట్రిబ్యునళ్ల పునరుద్ధరణ లాంటి కీలక అంశాలు కొత్త చట్టంలో ఉంటాయని తెలుస్తోంది. ధరణి పోర్టల్ ద్వారా వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ చేసే అధికారాలను జాయింట్ సబ్ రిజిస్ట్రార్ హోదాలో తహసీల్దార్లకే ఉంచాలా లేక డిప్యూటీ తహసీల్దార్లకు అప్పజెప్పాలా అన్న దానిపై కూడా కొత్త చట్టంలో స్పష్టత ఇవ్వనున్నట్టు సమాచారం. కాగా ధరణి పోర్టల్ పునర్నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ త్వరలోనే ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదికను సమర్పించనున్నట్లు తెలిసింది.



తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని పొక్లెయిన్‌లతో కూల్చివేయిస్తున్న అధికారులు

పతాకస్థాయికి టీడీపీ కక్షసాధింపు

పార్టీ ఆఫీసు కూల్చేశారు

- తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయం కూలగొట్టిన బాబు సర్కార్
- శనివారం ఉదయం 5:30 గంటలకు పొక్లెయిన్‌లు, బుల్డోజర్లతో కూల్చివేసిన సీఆర్‌డీఏ అధికారులు
- అంతకు ముందే శుక్రవారం హైకోర్టును ఆశ్రయించిన వైఎస్సార్‌సీపీ

12లో

మరోస్థాయికి చంద్రబాబు దమనకాండ

- ఈ బెదిరింపులు, కక్షసాధింపు చర్యలకు తలొగ్గేది లేదు 12లో
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రభుత్వ విద్యాసంస్థలకు

ఉచిత విద్యుత్



పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు వర్తింపు

- రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం.. త్వరలో ఉత్తర్వులు
- ఇకపై విద్యాసంస్థల బిల్లులు చెల్లించనున్న సంబంధిత శాఖల విభాగాధిపతులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థలన్నింటికీ ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సకాలంలో నిధులు విడుదలవక సర్కారీ బడులు, కళాశాలలు కరెంటు బిల్లులు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ఇంధన శాఖ త్వరలో ఉత్తర్వులు జారీ చేయనుంది.

ప్రత్యేక పోర్టల్‌తో అనుసంధానం

సర్కారీ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరా కోసం రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు ప్రత్యేక ఆన్‌లైన్ వెబ్ పోర్టల్‌ను రూపొందించనున్నాయి. విద్యాసంస్థలు ఏ శాఖ పరిధిలోకి వస్తే

మిగతా 5వ పేజీలో ▶

ప్రపంచస్థాయి హెల్త్ హబ్

వెయ్యి ఎకరాల్లో ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందన్న సీఎం రేవంత్‌రెడ్డి

- అన్ని రకాల వైద్యసేవలూ అందేలా ఆ హబ్‌ను తీర్చిదిద్దుతామని వెల్లడి..
- బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

బంజారాహిల్స్ (హైదరాబాద్): రాష్ట్రంలో వెయ్యి ఎకరాల్లో హెల్త్ టూరిజం హబ్‌ను ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందని, ప్రపంచ దేశాల నుంచి ఎవరైనా హైదరాబాద్‌కు వస్తే.. ఇక్కడ అన్ని రకాల వైద్య సేవలు అందుతాయనేలా హబ్‌ను తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 24వ వ్యవస్థాపక దినోత్సవం శనివారం

మిగతా 2వ పేజీలో ▶

'పాలమూరు'కు జాతీయ హోదా ఇవ్వండి



- కేంద్ర ప్రభుత్వానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వినతి
- మూసీ రివర్ ఫ్రంట్, ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టులకు నిధులివ్వండి
- కేంద్ర పథకాలకు రాష్ట్ర జనాభా నిష్పత్తి ప్రకారం కేటాయించండి
- పెండింగ్‌లో ఉన్న రూ. 2,250 కోట్ల 'విభజన' నిధులు విడుదల చేయండి
- తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో వివరాల వెల్లడి

12లో

దొంగే.. దొంగ అన్నట్లు ఉంది

సింగరేణి గనుల వేలాన్ని తాము అడ్డుకోలేదన్న కేటీఆర్ విమర్శలపై భట్టి

12లో

'సింగరేణి' విధ్వంసంపై విచారణ జరపాలి



- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్
- సమగ్ర దర్యాప్తు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తా
- సంస్థను ప్రైవేటీకరిస్తామనడం అబద్ధం.. తప్పుడు ప్రచారం నమ్మొద్దు

2లో

నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోరా?



- ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం
- గ్రూప్స్ అభ్యర్థుల సమస్యలు చర్చించకుండానే కేబినెట్ భేటీ ముగించారు
- ముఖ్యమంత్రి రేవంత్‌కు మాజీ మంత్రి బహిరంగ లేఖ

3లో

క్లుప్తంగా...

బీఆర్‌ఎస్‌ను వీడే ప్రసక్తే లేదు: పల్లా రాజేశ్వర్‌రెడ్డి


వర్జీనియాలో మీట్ అండ్ గ్రీట్‌లో పల్లా

జనగామ: తెలంగాణలో కక్షపూరిత రాజకీయాలు మొదలుపెట్టారని, పార్టీ మారాలని ప్రభుత్వం తనను ఒత్తిడి చేస్తోందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన వర్జీనియాలో శనివారం జరిగిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో మాట్లాడారు. జనగామ మీడియాకు ప్రెస్‌నోట్ రిలీజ్ చేశారు. ఉద్యమాల నుంచి రాజకీయాలకు వచ్చానని, తన పట్టుదల, అంకితభావం సీఎం రేవంత్‌రెడ్డికి కూడా తెలుసని చెప్పారు. రాజకీయాల్లో విలువలు పాటిస్తూ, గెలిచిన పార్టీలో ఐదేళ్లు ఉన్నప్పుడే ప్రజల విశ్వాసాన్ని చూరగొంటామని పల్లా తెలిపారు. పార్టీ మారాలంటూ ప్రభుత్వం ఒత్తిడి చేస్తున్నా భయపడేది లేదన్నారు. గడిచిన ఆరు నెలల కాలంలో తనతోపాటు భార్య, కుమారుడిపై కేసులు పెట్టి, విచారణ కమిటీలు కూడా వేశారని వెల్లడించారు. కేసులు, ఒత్తిళ్లు, విచారణను ఎదుర్కొంటూ పోరాటం చేస్తామన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో లేను
చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


స్వచ్ఛ ట్రక్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ కొండా

తాండూరు: బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో తాను లేనని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన తాండూరు నియోజకవర్గంలో పర్యటించారు. స్వచ్ఛ ట్రక్ ద్వారా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, పారిశుద్ధ్య పనులను ప్రారంభించారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో 7 ట్రక్కుల ద్వారా మరుగుదొడ్ల పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో ట్రక్ నిత్యం 30 పాఠశాలను శుభ్రం చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో కేంద్రమంత్రి అవుతానని ప్రచారం చేశారని విలేకరులు ప్రశ్నించగా.. మంత్రిగా అవకాశం రాకపోవడంతోనే తన నియోజకవర్గంలో పర్యటించే చాన్స్ లభించిందని విశ్వేశ్వర్‌రెడ్డి చమత్కరించారు. కార్యక్రమంలో యాలాల ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా రుణమాఫీ సంబురాలు
రెండ్రోజుల పాటు నిర్వహించాలని టీపీసీసీ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఏకకాలంలో రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు రాష్ట్రవ్యాప్తంగా సంబురాలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. 2004లో కరీంనగర్‌లో మాట ఇచ్చిన ప్రకారం సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని, 2022 డిసెంబర్‌లో రాహుల్ గాంధీ మాట ఇచ్చిన ప్రకారం రైతులకు రుణమాఫీ అమలు చేస్తున్నామని ప్రజలకు తెలియజేస్తూ రెండ్రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించాలని టీపీసీసీ నిర్ణయించింది. ఈ మేరకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో రైతులు, ప్రజలను సమీకరించి మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం రుణమాఫీ విషయంలో రైతులను మోసం చేసిందని, ఆ మోసంతో పాటు కాంగ్రెస్ పార్టీ చేసిన మేలును వివరిస్తూ, సీఎం రేవంత్, రాష్ట్ర మంత్రివర్గానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పార్టీ నేతలకు సూచించారు. రైతు భరోసా మార్గదర్శకాలు తయారయ్యాక వారం రోజుల పాటు గ్రామస్థాయిలో వేడుకలు నిర్వహించాలని టీపీసీసీ కిసాన్ సెల్ యోచిస్తోంది.


అబ్బే! ప్రాణహాని ఉందని కాదు!

ఎఫ్‌ఎంసీజీ అమ్మకాల్లో
రూరల్.. రూలర్!

ఏప్రిల్-జూన్ మధ్యలో అర్బన్ మార్కెట్ కంటే మెరుగ్గా రూరల్ మార్కెట్

- ఆర్థికమాంద్య పరిస్థితుల్లోనూ పెరుగుతున్న అమ్మకాలు
- సగటు భారత కుటుంబాల్లో 50 శాతం పెరిగిన బాటిల్డ్ సాఫ్ట్‌డ్రింక్స్ వినియోగం
- కన్సల్టింగ్ సంస్థ కాంటార్ తాజా నివేదికలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: భారత్‌లో వేగంగా అమ్ముడయ్యే వినిమయ వస్తువుల (ఎఫ్‌ఎంసీజీ) అమ్మకాల్లో అర్బన్ మార్కెట్‌ను రూరల్ మార్కెట్ అధిగమిస్తోంది. ఈ వస్తువుల అమ్మకాల్లో పట్టణ ప్రాంతాలను గ్రామీణ ప్రాంతాలు వెనక్కి నెడుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మధ్యలో అర్బన్ మార్కెట్ కంటే రూరల్ మార్కెట్ మెరుగైన స్థితిలోకి చేరుకుంది. ఆర్థికమాంద్య పరిస్థితుల్లోనూ ఎఫ్‌ఎంసీజీల అమ్మకాల్లో రూరల్ ఇండియా టాప్‌లో నిలిచింది. ప్రస్తుత పరిస్థితుల్లో నగరాల్లో ఈ వస్తువుల అమ్మకాలు కొంత ఇబ్బందుల్లోనే కొనసాగవచ్చునని, గ్రామీణ మార్కెట్ మాత్రం ఇప్పుడున్న స్థితిని మరింత బలోపేతం చేసుకునే అవకాశాలున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. కోవిడ్-19తో తలెత్తిన విపత్కర పరిస్థితులతో రూరల్ మార్కెట్ తిరోగమనంతో ఒత్తిళ్లకు గురికాగా, క్రమంగా పుంజుకున్నట్టు కన్సల్టింగ్ సంస్థ 'కాంటార్' తాజా నివేదికలో వెల్లడైంది.

నివేదికలో ఏం చెప్పారంటే..

- 2024 ప్రారంభం నుంచే గ్రామీణ మార్కెట్ అంచనాలకు మించి పుంజుకుంటోంది.
- 2023 సంవత్సరంలో మెరుగైన స్థితిలో ఉన్న అర్బన్ మార్కెట్ క్రమంగా దిగజారుతూ వస్తోంది.
- నగరాలు, పట్టణ ప్రాంతాల్లో కేంద్రీకృతమైన మార్కెట్‌గా ఉన్న న్యూడుల్స్, సాల్టీ స్నాక్స్ వంటి కేటగిరి వస్తువుల అమ్మకాల తగ్గుదలతో కూడా ఈ పరిస్థితి ఎదురైంది.
- సెంట్రల్ ఇండియాలో అధిక వర్షపాతం తదితర కారణాలతో రూరల్ మార్కెట్ పుంజుకునేందుకు అవకాశం ఏర్పడింది.
- ప్రస్తుతమున్న పరిస్థితుల్లో గ్రామీణ మార్కెట్ వృద్ధి చెందేందుకు మరిన్ని అవకాశాలున్నాయని, ఈ ఏడాది రాబోయే రోజుల్లో కూడా ఈ మార్కెట్ పురోగతిలోనే ముందుకు సాగుతుంది.

ఇదీ ఎఫ్‌ఎంసీజీ పల్స్ రిపోర్ట్

కూల్‌డ్రింక్స్ (బాటిల్డ్ సాఫ్ట్ డ్రింక్స్)తాగే సగటు భారతీయ కుటుంబాల సంఖ్య గణనీయంగా పెరిగింది. గత రెండేళ్లతో పోల్చితే గత మార్చితో ముగిసిన 2023-24లో ఇది 50 శాతానికి పెరిగినట్టుగా 'కాంటార్ ఎఫ్‌ఎంసీజీ పల్స్‌రిపోర్ట్' వెల్లడించింది. గత రెండేళ్లలో సగటు కుటుంబాల్లో 250 మిల్లీలీటర్ల సాఫ్ట్‌డ్రింక్స్ వినియోగంతో పెరుగుదల నమోదైంది.

- ప్రీమియం ల్యాండ్రీ ఐటమ్‌గా పరిగణిస్తున్న ఫాబ్రిక్ సాఫ్టనర్‌లను మాత్రం నాలుగు కుటుంబాల్లో ఒకటి మాత్రమే ఉపయోగిస్తోంది.

మిగతా వస్తువుల విషయానికొస్తే..

- ప్రీమియం ల్యాండ్రీ ఉత్పత్తిగా పరిగణిస్తున్న వాషింగ్ లిక్విడ్లు 2023-24 ఆర్థిక సంవత్సరంలో లక్ష టన్నుల మార్క్‌ను దాటి రికార్డ్ బ్రేక్ చేశాయి.
- మార్చి 2023తో పోల్చితే మార్చి 2024లో బాటిల్డ్ సాఫ్ట్‌డ్రింక్ కేటగిరి అనేది 41 శాతం వృద్ధి (మూవింగ్ యాన్యువల్ టోటల్)గా నమోదైంది.
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ చానళ్లలో వినియోగదారులు ఏడాదికి 156 సార్లు ఎఫ్‌ఎంసీజీ వస్తువులు (ప్రతీ 56 గంటలకు ఒకసారి) కొనుగోలు చేస్తున్నారు.

సింగరేణిలో ఆర్థిక విధ్వంసంపై
విచారణ జరపాలి

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్

- సమగ్ర దర్యాప్తు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తా
- సంస్థను ప్రైవేటీకరిస్తామనడం అబద్ధం.. తప్పుడు ప్రచారం నమ్మొద్దు
- బొగ్గు గనుల వేలం సకాలంలో జరపకపోతే కేంద్ర ప్రభుత్వ జోక్యం
- రాష్ట్రం యాక్షన్ చేయకపోతే తదుపరి చర్యలు తీసుకునే అధికారం కేంద్రానికి



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో సింగరేణి సంస్థలో జరిగిన ఆర్థిక విధ్వంసం, దోపిడీలపై విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా సీఎస్‌ఆర్ ఫండ్స్ వినియోగం, సింగరేణి సంస్థ ద్వారా పలువురి విలాసాలకు చెల్లించిన బిల్లులు, ఇతర అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని అన్నారు. ఈ సంస్థలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉన్నందున, దీనిపై విచారణ జరిపించాలని కోరుతూ బొగ్గు గనుల శాఖ మంత్రిగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానన్నారు. శనివారం మాజీ ఎంపీ పి.రాములు, మాజీ ఎమ్మెల్యే ప్రేంసింగ్ రాథోడ్, పార్టీ నాయకులు ప్రదీప్‌కుమార్, కాసం వెంకటేశ్వర్లు, ఎస్.ప్రకాష్‌రెడ్డిలతో కలిసి మీడియాతో మాట్లాడారు.

గోదావరి తీర ప్రాంతాల్లో జియోలాజికల్ సర్వే

'సింగరేణికి సంబంధించిన పరిపాలన అంతా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్నందున కేంద్రం జోక్యం చేసుకోలేక పోయింది. బొగ్గు, సహజ వనరుల విషయంలో, సుప్రీంకోర్టు తీర్పు విషయంలో కేంద్రం ఓ రిఫరీగా విధివిధానాలు, పారదర్శకత తదితర అంశాలపైనే దృష్టి పెట్టగలదు. ఈ శాఖ మంత్రిగా నాకు కేవలం ఆరు రోజుల అనుభవమే ఉంది. సింగరేణిపై త్వరలోనే సమీక్ష నిర్వహించి సమస్యలపై సానుకూలంగా స్పందిస్తా. సింగరేణిని ప్రైవేటీకరిస్తామనడం శుద్ధ అబద్ధం. తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమితో నిరాశా, నిస్పృహలకు గురైన బీఆర్‌ఎస్ నేతలు ఇష్టారీతిన ఆరోపణలు చేస్తున్నారు. బొగ్గు ఉత్పత్తిని పెంచుకునేలా, ఉపాధి అవకాశాలను మరింత పెంచేలా చర్యలు తీసుకుంటాం. తెలంగాణలో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో జియోలాజికల్ సర్వే జరుపుతాం. ఈ దిశలో ఇప్పటికే హైదరాబాద్‌లోని సర్వే ఆఫ్ ఇండియాతో ప్రాథమిక చర్చలు జరిపాం' అని కిషన్‌రెడ్డి తెలిపారు.

పారదర్శకంగా బొగ్గు గనుల వేలం

'సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా అవినీతికి తావులేకుండా, పారదర్శకంగా కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలం వేస్తోంది. ఇప్పటివరకు 9 రౌండ్లలో 107 బొగ్గు గనుల వేలం జరిగింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలకు సుమారు రూ.37 వేల కోట్ల ఆదాయం వచ్చింది. బొగ్గు గనుల వేలంతో 14 శాతం చొప్పున రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం లభిస్తుంది. ఇందులో కేంద్రం రూపాయి కూడా తీసుకోదు. ప్రస్తుతం ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలం సకాలంలో జరపకపోతే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటుంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించాలి. ఈనెలాఖరు వరకు సమయం ఉన్నందున ఒకవేళ రాష్ట్రం యాక్షన్ చేయకపోతే తదుపరి చర్యలు తీసుకునే అధికారం కేంద్రానికి ఉంటుంది..' అని కేంద్రమంత్రి వివరించారు.

సింగరేణికి కేసీఆర్ మరణశాసనం

'సింగరేణి సంస్థకు మాజీ సీఎం కేసీఆర్ మరణ శాసనం రాశారు. ఆ సంస్థను పూర్తిగా ధ్వంసం చేసింది బీఆర్‌ఎస్సే. కేసీఆర్ కుటుంబం తమ రాజకీయ జోక్యంతో దివాళా తీసే పరిస్థితికి తీసుకొచ్చారు. 2014 ఏప్రిల్ 1 నాటికి సంస్థ అకౌంట్లో రూ. 3,500 కోట్ల డిపాజిట్లు ఉండేవి. కానీ కేసీఆర్ కుటుంబం ఇష్టారాజ్యంగా ఎడాపెడా సింగరేణిని రాజకీయ క్షేత్రంగా వాడుకుంది. కేసీఆర్ ప్రభుత్వం సరిగ్గా చెల్లింపులు జరపకపోవడంతో మార్చి 31 నాటికి టీఎస్‌జెన్‌కో సింగరేణికి రూ.8,056 కోట్లు బకాయి పడింది. బొగ్గు, విద్యుత్‌కు సంబంధించి సుమారు రూ.30 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. నాలుగున్నరేళ్ల తర్వాత తమ ప్రభుత్వం వస్తుందంటూ మాజీ మంత్రి కేటీఆర్ పగటి కలలు కంటున్నారు. ఆయన పట్ల సానుభూతి చూపాలి..' అని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ చేతల ప్రభుత్వం కాదు

'కాంగ్రెస్ మాటల పార్టీ తప్పితే.. చేతల ప్రభుత్వం కాదు. ఉద్యోగ నియామకాల విషయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరిస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం హామీ తప్పితే మిగతా హామీలను తుంగలో తొక్కారు' అని కేంద్రమంత్రి విమర్శించారు.

నీట్‌తో దక్షిణాది రాష్ట్రాలకు ప్రయోజనం

'నీట్ పరీక్షా పత్రం లీక్ అవలేదు. దేశవ్యాప్తంగా 4వేల కేంద్రాల్లో పరీక్ష జరిగితే, కేవలం నాలుగు సెంటర్లలో ఒక పేపర్‌కు బదులు మరో పేపర్ ఇచ్చారు. నీట్ విషయంలో కేంద్రానికి ఎలాంటి దురుద్దేశం లేదు. ఈ పరీక్ష కారణంగా దక్షిణాది రాష్ట్రాలకు ప్రయోజనం కలుగుతోంది. మోదీ ప్రభుత్వ హయాంలో ప్రాంతీయ భాషల్లోనూ పరీక్ష నిర్వహిస్తున్నాం. నీట్ విద్యార్థులకు న్యాయం చేసి, మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా పరీక్ష నిర్వహణకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది..' అని కిషన్‌రెడ్డి తెలిపారు.

రాష్ట్రంలో రూ.5,048 కోట్ల సహకార రుణాల మాఫీ

టెస్కాబ్ చైర్మన్ రవీందర్ రావు



హన్మకొండ: రాష్ట్రంలో రూ.5,048.1 కోట్ల సహకార రుణాలు మాఫీ కానున్నాయని తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టీఎస్ కాబ్) చైర్మన్ మార్నేని రవీందర్ రావు చెప్పారు. ఆయన హనుమకొండలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని 396 డీసీసీబీ శాఖల పరిధిలో 823 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయని వివరించారు. ఈ సహకార సంఘాల్లోని 7.75 లక్షల మంది రైతులకు చెందిన రూ.5,048.1 కోట్ల రుణాల మాఫీ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామన్నారు. సహకార సంఘాల్లో చిన్న, మధ్య తరగతి రైతులు మాత్రమే రుణాలు తీసుకున్నారన్నారు. రూ.2 లక్షల రుణాలను ఒకేసారి మాఫీ చేయడం చరిత్రాత్మకమన్నారు. రుణమాఫీ నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

హామీల అమలును తట్టుకోలేకే విపక్షాల విమర్శలు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


నేలకొండపల్లి మండలం కోనాయిగూడెంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి (ఖమ్మం జిల్లా): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేస్తున్న రేవంత్ సర్కార్ తీరును చూసి తట్టుకోలేకే రాష్ట్రంలో విపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రైతులు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేసేందుకు రూ.31వేల కోట్ల నిధులు కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లో శనివారం పర్యటించిన ఆయన పలుచోట్ల సమావేశాల్లో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లను నిరుపేదలకు ముందు మంజూరు చేస్తామని మంత్రి వెల్లడించారు. రెండు విడతల్లో ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు కూడా కేటాయిస్తామని, రేషన్‌కార్డులు, ఆసరా పింఛన్లు మంజూరు చేస్తామని తెలిపారు. కాగా, ఇన్నాళ్లు మూలపడిన ఎత్తిపోతల పథకాలను మరమ్మతు చేయించి రైతుల సాగునీటి కష్టాలు తీరుస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో పైరవీకారుల వల్ల అర్హత లేని వారికి పథకాలు అందినట్లు తేలితే తొలగిస్తామని మంత్రి పొంగులేటి హెచ్చరించారు. ఈ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ టైటానిక్‌లా మునిగిపోతుంది

- నీట్‌పై కేంద్రాన్ని ప్రతిపక్షాలు బద్నాం చేస్తున్నాయి
- బీజేపీలోకి ఎవరు వచ్చినా స్వాగతిస్తాం
- 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు


'మీట్ ది ప్రెస్'లో రఘునందన్‌రావు

సాక్షి, హైదరాబాద్: గత పదేళ్లలో చోటుచేసుకున్న కుంభకోణాలపై విచారణకు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్ ఇంటికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రాక తప్పదని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. అవినీతి, అక్రమాలకు సంబంధించిన వివిధ కేసుల్లో అన్ని వేళ్లూ కేసీఆర్ వైపే చూపిస్తున్నాయని ఆయన చెప్పారు. గొర్రెల స్కాం, ఫోన్ ట్యాపింగ్.. ఇలా వివిధ కేసుల్లో ఇరుక్కున్న అధికారులు అందరూ కేసీఆర్ పేరే చెబుతున్నారన్నారు. రాబోయేరోజుల్లో బీఆర్‌ఎస్‌కు కంపల్సరీ రిటైర్మెంట్ స్కీం (సీఆర్‌ఎస్) ఖాయమన్నారు. టైటానిక్‌షిప్ మాదిరిగా బీఆర్‌ఎస్ నావ మునిగిపోతుందని అన్నారు. బీజేపీలోకి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, అలాగే నక్సలైట్లు, మరెవరు వచ్చినా స్వాగతిస్తామన్నారు. శనివారం తెలంగాణ జర్నలిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో రఘునందన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ములుగు మండలం క్షీరసాగర్ గ్రామంలో 80 మంది దళితుల భూములను బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి అక్రమంగా లాక్కున్నారని ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన వెంటనే తాను క్షీరసాగర్ నుంచే పని మొదలుపెడతానని, దళితుల భూములను తిరిగి వారికి అప్పగించేందుకు కృషి చేస్తానని చెప్పారు. మీడియా ప్రతి నిధులు అడిగిన వివిధ ప్రశ్నలకు రఘునందన్‌రావు సమాధానాలిస్తూ.. నీట్ పరీక్షపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. బీజేపీ రాష్ట్ర విభాగానికి కొత్త అధ్యక్షుడిని నియమిస్తారనే ప్రచారంపై స్పందిస్తూ.. 'ఈ విషయంలో పార్టీ అధిష్టానం ఆదేశాలు తప్పకుండా పాటిస్తా. దీనిపై ఎమ్మెల్యే రాజాసింగ్ తన అభిప్రాయం వెల్లడించారు' అని అన్నారు. జర్నలిస్ట్ యూనియన్ సంఘం అధ్యక్షుడు కప్పర ప్రసాదరావు, ప్రధానకార్యదర్శి బింగిస్వామి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌ది సాహసోపేత నిర్ణయం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేయబోతున్నారని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. మంత్రి శనివారం నల్లగొండ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. రైతుభరోసా కూడా అమలు చేయాలని నిర్ణయించామన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో రుణమాఫీని ఆరేడు విడతల్లో చేసిందని, కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయం తీసుకుని ఒకేసారి రెండు లక్షల రుణ మాఫీ చేయబోతున్నారని చెప్పారు. అందుకు రైతుల పక్షాన తాను కృతజ్ఞతలు తెలుపుతున్నానని మంత్రి అన్నారు.

రుణమాఫీ నిర్ణయం చరిత్రాత్మకం

కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: రైతులకు రూ. 2 లక్షల వరకు ఏకకాలంలో రుణమాఫీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో శనివారం వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఏకకాలంలో రుణమాఫీ అనేది కేవలం కాంగ్రెస్‌కే సాధ్యం అని మరోసారి రేవంత్‌రెడ్డి నిరూపించారని అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ ఆరు విడతలు చేసిందని, కేసీఆర్ కేవలం రూ.11,930 కోట్లు రుణమాఫీ చేశారని తెలిపారు. రుణమాఫీపై రేవంత్‌రెడ్డి కేబినెట్ నిర్ణయం తీసుకోవడం రైతాంగానికి శుభసూచకమని అన్నారు. జాతీయ కిసాన్ సెల్ తరఫున ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న మాజీ మంత్రి హరీశ్‌రావు సిద్ధంగా ఉండాలన్నారు. కాగా, రైతులకు రుణమాఫీ నిర్ణయంతో గాంధీభవన్‌లో కిసాన్ కాంగ్రెస్ నేతలు సంబరాలు చేసుకున్నారు.

లక్ష్మీపుత్రుడు లంకాపుత్రుడుగా మారారు

మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, గణేష్ బిగాల, మెతుకు ఆనంద్

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్‌కు, తెలంగాణ ప్రజలకు ద్రోహం చేసిన పోచారం శ్రీనివాస్ రెడ్డి లక్ష్మీపుత్రుడు కాదని, లంకా పుత్రుడుగా మారారని బీఆర్‌ఎస్ నేతలు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శనివారం మాజీ ఎమ్మెల్యేలు ఎ.జీవన్‌రెడ్డి, గణేష్ బిగాల, డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌లో పోచారం అన్ని పదవులూ అనుభవించారని, ఇప్పుడు మళ్లీ అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ చెంత చేరారని విమర్శించారు. పోచారం, ఆయన కుటుంబ సభ్యులగురించి సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో చాలా నీచంగా మాట్లాడారని, ఆయనే ఇపుడు కాంగ్రెస్‌లో సిగ్గు లేకుండా చేర్చుకున్నారని విమర్శించారు. పోచారం తన నియోజక వర్గానికి రూ.7,500 కోట్ల నిధులు తీసుకెళ్లారని, రాష్ట్రంలోనే అత్యధికంగా డబుల్ బెడ్రూం ఇళ్లు కేసీఆర్ బాన్సువాడకు కేటాయించారని చెప్పారు. కేసీఆర్ రుణం తీర్చుకోలేనిదన్న పోచారం ఇప్పుడు పార్టీకి ద్రోహం చేశారని అన్నారు.

రైతులను నట్టేట ముంచుతున్న రేవంత్ సర్కార్

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి
- నేను పార్టీ మారను: మాజీ మంత్రి ఎర్రబెల్లి


మీడియాతో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి. చిత్రంలో ఎర్రబెల్లి దయాకరరావు

సాక్షి, హైదరాబాద్: వానాకాలం సీజన్ మొదలవుతున్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన రైతుభరోసా హామీని ఇప్పటికీ రేవంత్ ప్రభుత్వం అమలు చేయడం లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. రైతాంగం గొంతుకోయడమే ఈ ప్రభుత్వం పనిగా పెట్టుకుందని, రైతులను నమ్మించి నట్టేట ముంచుతోందని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఈ పాటికే రైతుబంధు డబ్బులు పడాల్సి ఉందని, రైతుభరోసా పేరు చెప్పి రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. రైతు భరోసాపై మంత్రి వర్గ ఉపసంఘం వేసి జూలై 15 దాకా డెడ్ లైన్ పెట్టారని, అయితే అప్పటికే నాట్లు వేసే పని పూర్తవుతుందని, సీజన్ అయిపోయాక రైతు భరోసా ఇస్తారా? అని ప్రశ్నించారు. రైతు భరోసాకు అర్హులెవరో ఇప్పటి దాకా ఎందుకు తేల్చలేదని నిలదీశారు. కేసీఆర్ హయాంలో 68.90 లక్షల మందికి 11 విడతల్లో 72 వేల కోట్ల రూపాయలను రైతుబంధు కింద ఇచ్చినట్లు చెప్పారు. మంత్రివర్గ ఉపసంఘం పేరుతో కొద్ది మందికే రైతు భరోసా ఇచ్చే కుట్రకు తెర లేపారని, రైతు భరోసాకు పట్టాదార్ పాస్ పుస్తకాలే ప్రామాణికం కావాలని అన్నారు. ఇదిలా ఉండగా రుణమాఫీ జరిగినట్టే కొన్ని మీడియా సంస్థలు ప్రచారం చేస్తున్నాయని, డిసెంబర్ 9న రైతు రుణాలు మాఫీ చేస్తామని చెప్పి ఇపుడు కేబినెట్లో చర్చిస్తారా? అని ప్రశ్నించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ మాట్లాడుతూ తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలను కొట్టిపడేశారు.

మీ అబద్ధాలకు సమాధిలో
గోబెల్స్ సిగ్గుపడుతున్నాడు

ముఖ్యమంత్రి రేవంత్‌ను ఉద్దేశించి మాజీ మంత్రి కేటీఆర్ ఎద్దేవా

- సింగరేణి బొగ్గు బ్లాకుల వేలం విషయంలో రాష్ట్ర ప్రయోజనాలను కాంగ్రెస్ దెబ్బతీస్తోందని ధ్వజం



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన ప్రభుత్వం సాగిస్తున్న దుష్ప్రచారాన్ని చూసి అబద్ధాల ప్రచార సృష్టికర్త జోసెఫ్ గోబెల్స్ కూడా సమాధిలో సిగ్గుతో తలదించుకుంటున్నాడని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ఎద్దేవా చేశారు. సింగరేణి బొగ్గు బ్లాక్‌ల వేలం విషయంలో రేవంత్ అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. తెలంగాణలోని బొగ్గు గనుల అమ్మకాన్ని కేసీఆర్ వ్యతిరేకించినందునే గత ప్రభుత్వం ఎన్నడూ వేలంలో పాల్గొనలేదన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బకొడుతోందని ఆరోపించారు. గతంలో నియంతృత్వ పోకడలతో తెలంగాణ బొగ్గు గనులను కేంద్రం వేలం వేసినా బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యతిరేకించడం వల్లే ఆ గనుల నుంచి తట్టెడు బొగ్గు కూడా ఎత్తలేకపోయిందని కేటీఆర్ గుర్తుచేశారు. రేవంత్ పేర్కొన్న రెండు కంపెనీలు 2021లో మహారాష్ట్రలో కాంగ్రెస్, శివసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గనులు దక్కించుకున్న విషయాన్ని రేవంత్ మర్చిపోరాదన్నారు.

కాంగ్రెస్, బీజేపీ తోడుదొంగలు

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను క్రూరంగా అణచివేసి వేల మందిని చంపిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని కేటీఆర్ దుయ్యబట్టారు. తెలంగాణ ప్రయోజనాలను కాంగ్రెస్, బీజేపీ కలసికట్టుగా తాకట్టు పెడుతున్న తీరును తెలంగాణ పౌరులు గమనిస్తున్నారన్నారు. ప్రజల హక్కులు, ఆస్తులు, వనరులను తాకట్టు పెట్టడంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు తోడుదొంగల్లా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికే నదీజలాల వాటాను వదులుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. సింగరేణిని ప్రైవేటుపరం చేయాలన్న బీజేపీకి కాంగ్రెస్ సహకరిస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. గనుల వేలంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని తెలంగాణ చరిత్ర క్షమించదన్నారు. తెలంగాణకు సీఎం రేవంత్, కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న ద్రోహానికి సరైన సమయంలో ప్రజలు గుణపాఠం చెబుతారని కేటీఆర్ హెచ్చరించారు.

పెట్టుబడుల్లో తెలంగాణ అగ్రస్థానం

గత ఆర్థిక సంవత్సరం 2023-24లో దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు భారీగా తగ్గినా బీఆర్‌ఎస్ సాగించిన పాలన వల్లే తెలంగాణ మాత్రం 100 శాతానికి మించి ఎఫ్‌డీఐలను సాధించిందని కేటీఆర్ పేర్కొన్నారు. 2022-23తో పోలిస్తే 2023-24లో గుజరాత్ 55 శాతం, తమిళనాడు 12 శాతం ఎక్కువ పెట్టుబడులను సాధించగా తెలంగాణ ఏకంగా 130 శాతం వృద్ధి సాధించిందన్నారు. అమెజాన్ వెబ్ సేవల కోసం రూ. 36,300 కోట్లు, మైక్రోసాఫ్ట్ రూ.16 వేల కోట్ల పెట్టుబడులతో రావడంతో ఇది సాధ్యమైందన్నారు.

ప్రపంచస్థాయి హెల్త్ హబ్

▶ మొదటి పేజీ తరువాయి

ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయి హెల్త్ హబ్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అందులో బసవతారకం ఆస్పత్రికి స్థానం కచ్చితంగా ఉంటుందని చెప్పారు. పేదలకు సేవలందించే ఉద్దేశంతో ఆనాడు ఎన్టీఆర్ ఈ ఆస్పత్రి నిర్మాణానికి పూనుకున్నారని, చంద్రబాబు నాయుడు ఆస్పత్రిని పూర్తి చేసి పేదలకు సేవలందించేలా చేశారని పేర్కొన్నారు. ఆస్పత్రికి సంబంధించి ఎలాంటి సహకారం కావాలన్నా తమ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీనిచ్చారు. అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో తెలుగు రాష్ట్రాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఆస్పత్రి వేడుకల్లో పాల్గొనడం తనకెంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ఏపీ ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడుతూ తాము అడిగిన వెంటనే పెండింగ్‌లో ఉన్న భూమి లీజు పొడిగించిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ట్రస్ట్ బోర్డు సభ్యుడు, ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



'ప్రైమరీ'లో ప్రగతి జాడేదీ?

- దేశవ్యాప్తంగా ప్రాథమిక విద్యార్థుల్లో ప్రమాణాల లేమి
- కేంద్ర విద్యాశాఖ 'న్యాస్'సర్వేలో వెల్లడి
- ఐదో తరగతికి వచ్చినా సరిగా చదవలేని, రాయలేని దుస్థితి
- గణితంలో మరీ వెనుకబడిపోతున్న విద్యార్థులు
- రెండేళ్ల కిందటి లక్ష్యాల సాధన దిశగా కనిపించని మార్పు
- టీచర్ల కొరతే సమస్యకు కారణమంటున్న అధికారవర్గాలు

సాక్షి, హైదరాబాద్: దేశ వ్యాప్తంగా ప్రాథమిక విద్యలో విద్యార్థుల ప్రమాణాలు ఆశించిన స్థాయిలో లేవని కేంద్ర విద్యా శాఖ పేర్కొంది. తెలంగాణ సహా అన్ని రాష్ట్రాల్లో ఈ లోపం కనిపిస్తోందని.. దీన్ని అధిగమించేందుకు కసరత్తు అవసరమని తెలిపింది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. 2026 నాటికి దశల వారీగా ప్రమాణాలు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చిన రాష్ట్రాలు.. ఆ దిశగా అడుగులు వేయలేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. కేంద్రం ప్రతీ రెండేళ్లకోసారి నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్)ను నిర్వహించి.. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థుల ప్రమాణాలను పరిశీలిస్తుంది. అలా తాజాగా చేపట్టిన సర్వేలో తేలిన అంశాలను వెల్లడించింది.

కనీస స్థాయి కూడా ఉండక..

ప్రతి విద్యార్థికి ఐదో తరగతికి చేరేసరికి చదవడం, రాయడంతోపాటు సబ్జెక్టుల్లో ప్రాథమిక అవగాహన అవసరం. ఇది తేల్చేందుకు కేంద్ర విద్యాశాఖ సర్వేలో 28 అంశాలపై స్వల్పస్థాయి ప్రశ్నలు ఇచ్చింది. విద్యార్థుల్లో 56– 68 శాతం మంది 50శాతం ప్రశ్నలకే సమాధానం ఇచ్చారు. గణితంలో అయితే 70 శాతం మంది విద్యార్థులు 30శాతం ప్రశ్నలకు కూడా సమాధానం ఇవ్వలేకపోయారు. 8వ తరగతి విద్యార్థులు కూడా గణితంలో 37శాతం ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వలేకపోతున్నట్టు సర్వేలో గుర్తించారు. ప్రాంతీయ భాషల్లో రాయడం, చదవడంలోనూ విద్యార్థులు వెనుకబడి ఉన్నారు. ఈ కేటగిరీలో కనీసం సగం ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వగలిగినవారు 53 శాతం మంది మాత్రమే. చాలా రాష్ట్రాల్లో 13.85 శాతం మంది 8వ తరగతి వచ్చే సరికే బడి మానేస్తున్నారని.. దీన్ని కనీసం 6 శాతానికి తగ్గించాలని రాష్ట్రాలకు కేంద్రం టార్గెట్ పెట్టింది.

నెరవేరని లక్ష్యం!

రెండేళ్ల క్రితం సర్వే చేసిన సమయంలో కేంద్రం అన్ని రాష్ట్రాల విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించింది. కనీసం 50శాతం, ఆపైన ప్రశ్నలకు సరైన సమాధానం రాసేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించింది. ఆ సమయంలో తర్వాతి ఐదేళ్లలో వంద శాతం లక్ష్యాన్ని చేరుకుంటామని రాష్ట్రాలు హామీ ఇచ్చాయి. కానీ ఇప్పటివరకు పెద్దగా మార్పు మొదలైనట్టు కనిపించలేదని కేంద్రం భావిస్తోంది. ఈ నేపథ్యంలో మరోమారు కొత్త లక్ష్యాలను నిర్దేశించే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. పిల్లల్లో ప్రమాణాలు పెరగకపోవడానికి పాఠశాలల్లో టీచర్ల కొరతే కారణమని అధికారులు అంటున్నారు. ప్రైవేటు స్కూళ్లలో కూడా కరోనా తర్వాత నాణ్యమైన టీచర్లు దొరికే పరిస్థితి లేక సమస్యగా మారిందని విశ్లేషిస్తున్నారు.

సామర్థ్యాల పెంపునకు 2021లో పెట్టుకున్న లక్ష్యాలివీ..
(ప్రశ్నలకు ఇవ్వగలిగిన సమాధానాలు శాతాల్లో)

సంవత్సరం	3వ తరగతి		5వ తరగతి		8వ తరగతి	
	భాష	గణితం	భాష	గణితం	భాష	గణితం
2021–22	68	69	57	56	53	37
2022–23	80	79	75	75	70	70
2023–24	85	85	80	80	75	75
2024–25	90	90	90	90	80	80
2025–26	100	100	100	100	85	85

క్లుప్తంగా...

విద్యుత్ ఉద్యోగులకు డీఏ పెంపు

ట్రాన్స్‌కో ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్ల కరువు భత్యం 3.004 శాతం పెరిగింది. వారి డీఏను 8.776 శాతం నుంచి 11.78 శాతానికి పెంచుతూ తెలంగాణ ట్రాన్స్‌కో సంస్థ సీఎండీ ఎస్ఏఎం రిజ్వీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పెరిగిన డీఏ జనవరి 1, 2024 నుంచి వర్తింపజేయనున్నారు. 2023 జూలై–డిసెంబర్(గతంలో పెంచారు), 2024 జనవరి–మే మధ్య కాలానికి పెరిగిన డీఏ బకాయిలను ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు 11 సమాన వాయిదాల్లో చెల్లించనున్నారు. సంప్రదాయం ప్రకారం ట్రాన్స్‌కో ఉత్తర్వులను అనుసరిస్తూ.. జెన్‌కో, టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ సంస్థలు సైతం తమ ఉద్యోగులు, పెన్షనర్ల డీఏను ఈ మేరకు పెంచుతూ త్వరలో ఉత్తర్వులు జారీ చేయనున్నాయి.

నిమ్స్‌లో 51 ఉద్యోగాలకు నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో ఉద్యోగ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. 51 సీనియర్ రెసిడెంట్ పోస్టులకుగాను ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని నిమ్స్ డైరెక్టర్ వెబ్‌నోట్ విడుదల చేశారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 26 వరకు గడువు విధించారు. రూ.500 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. రేడియాలజీ అంకాలజీ, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, మైక్రోబయాలజీ విభాగాల్లో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీ ఉన్నాయని తెలిపారు. అత్యధికంగా అనెస్థీషియాలజీ, క్రిటికల్ కేర్‌లో 17 పోస్టులు ఉన్నాయన్నారు. రేడియాలజీ, ఇమేజాలజీలో 11, న్యూరాలజీలో 6, పాథాలజీలో 5, క్లినికల్ ఇమ్యునాలజీ, ఎండోక్రైనాలజీ, మెడికల్ జెనెటిక్స్, హెమటాలజీ విభాగాల్లో రెండు చొప్పున ఖాళీలున్నట్లు వెల్లడించారు.

నిమ్స్‌లో పీహెచ్‌డీకి నోటిఫికేషన్

దరఖాస్తుకు ఈనెల 27 వరకు గడువు

సాక్షి, హైదరాబాద్: నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. నిమ్స్ ఎంట్రన్స్ పరీక్ష, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. పీహెచ్‌డీ మూడేళ్ల ఫుల్ టైం ప్రోగ్రామ్ అయితే గరిష్టంగా ఐదేళ్లలో పూర్తి చేయొచ్చు. డాక్టోరల్ కమిటీ అనుమతి మేరకు మరో మూడేళ్లు పొడిగించే అవకాశం ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వరంగ సంస్థలు, యూనివర్సిటీలు, ఇతర సంస్థలకు చెందిన ఉద్యోగులు అడ్మిషన్ సమయానికి సదరు సంస్థ నుంచి 'నో అబ్జెక్షన్'సర్టిఫికెట్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ సమయంలో ఇతర డిగ్రీలు, డిప్లొమా కోర్సులు చేసేందుకు అనుమతి ఉండదు. రూ.2 వేల దరఖాస్తు రుసుము, మెడికల్ ఎగ్జామినేషన్ ఫీజు రూ.4,050 ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా ఈనెల 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. నిమ్స్ ఎంట్రన్స్ పరీక్ష జూలై 13న నిర్వహించనున్నారు. పూర్తి వివరాల కోసం నిమ్స్ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. విభాగాలు–సీట్లు: బయోకెమిస్ట్రీ 3, క్లినికల్ ఫార్మకాలజీ అండ్ థెరప్యూటిక్స్ 1, ఎమర్జెన్సీ మెడిసిన్ 1, మెడికల్ జెనెటిక్స్ 4, మెడికల్ అంకాలజీ 2, మైక్రోబయాలజీ 5, న్యూరాలజీ 1, నెఫ్రాలజీ 6, పాథాలజీ 1, ఫిజియోథెరపీ 2 ఉన్నాయి.

అమ్మణి ఫౌండేషన్ కృషి అభినందనీయం

మంత్రి దామోదర రాజనర్సింహ

సాక్షి, హైదరాబాద్: మహిళా సంక్షేమంపై అమ్మణి ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. అమ్మణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూలై 1న నిర్వహించనున్న '5కే రన్'కు సంబంధించి వాల్‌పోస్టర్ శనివారం మంత్రి తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. మహిళా సంక్షేమంపై అవగాహన పెంచేందుకు 5కే రన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలని మంత్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో అమ్మణి ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఆమని, భారతి, భోగరాజు, కిషన్, సామాజికవేత్త నల్ల గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోరా?

- ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం
- గ్రూప్స్ అభ్యర్థుల సమస్యలు చర్చించకుండానే కేబినెట్ భేటీ ముగించారు
- గ్రూప్1 మెయిన్స్‌కు 1:100 చొప్పున అనుమతించండి
- గ్రూప్ 2, గ్రూప్ 3కి అదనంగా ఉద్యోగాలు కలపండి
- పరీక్షల తేదీల మధ్య వ్యవధి పెంచాలి
- సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: గ్రూప్ పరీక్షల అభ్యర్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను, వారి సమస్యల గురించి చర్చించకుండా మంత్రివర్గ సమావేశం ముగించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ గ్రూప్ పరీక్షలు రాస్తున్న అభ్యర్థుల డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస అధికారంలోకి వచ్చి 6 నెలలు గడచినా కొత్త ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగ యువతను రోడ్డు మీదకు తెచ్చారన్నారు. గ్రూప్ 1, డీఎస్సీ తదితర ఉద్యోగాల కోసం చేపట్టిన నియామక ప్రక్రియపై వారు చేస్తున్న విజ్ఞప్తిని వినే పరిస్థితిలో ప్రభుత్వం లేకపోవడం శోచనీయమన్నారు.

వ్యవధి పెంచి ఒత్తిడి తగ్గించాలి

పోటీ పరీక్షల తేదీల మధ్య కాలవ్యవధి తక్కువ ఉండటంతో అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. డీఎస్సీ, గూప్ 2 పరీక్షల మధ్య వారంవ్యవధి మాత్రమే ఉన్నందున అభ్యర్థులకు ఒత్తిడిని తగ్గించేందుకు పరీక్షల షెడ్యూల్‌ను సవరించాలని కోరారు. జాబ్ కేలండర్ ప్రకటన, మెగా డీఎస్సీ నోటిఫికేషన్, రూ.4 వేల నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేయాలన్నారు. జీవో 46 ద్వారా ఏర్పడిన సమస్యలను పరిష్కరించి అభ్యర్థులకు న్యాయం చేయాలని హరీశ్‌రావు కోరారు.

1:100 చొప్పున అనుమతించాలి

గ్రూప్ 1 పరీక్షకు పెద్ద సంఖ్యలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో మెయిన్స్‌కు 1:100 చొప్పున అభ్యర్థులను అనుమతించాలని హరీశ్‌రావు కోరారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో 1:100 చొప్పున అనుమతించిన విషయాన్ని గుర్తు చేశారు. తద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు గ్రూప్ 1 ఉద్యోగాలను సాధించే అవకాశాలు పెరుగుతాయన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గతంలో ఇదే అంశంపై అసెంబ్లీ వేదికగా డిమాండ్ చేశారన్నారు. అలాగే గ్రూప్ 2కు రెండువేలు, గ్రూప్ 3కి మూడు వేల ఉద్యోగాలు అదనంగా కలిపి నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కృష్ణయ్య, వేముల రామకృష్ణ తదితరులు

నీట్ రద్దు చేసి విచారణ జరిపించాలి: ఆర్.కృష్ణయ్య

కాచిగూడ (హైదరాబాద్): నీట్ పరీక్షను రద్దుచేసి సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీపై బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం బర్కత్‌పురాలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యంలతో కలిసి ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్ చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రూ.లక్షలు ఖర్చుపెట్టి శిక్షణ తీసుకొని పరీక్షలు రాస్తే.. చివరి నిమిషంలో పేపర్ లీకేజీ కుంభకోణాలు జరిగి విద్యార్థుల భవిష్యత్ అంధకారమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ప్రధాని మోదీ ఇప్పటివరకు స్పందించకపోవడం శోచనీయమన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, లేనిపక్షంలో దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

కిషన్‌రెడ్డి ఇల్లు ముట్టడి.. ఉద్రిక్తత

- నీట్ పరీక్ష రద్దుకు డిమాండ్
- విద్యార్థి యువజన సంఘాల నేతల అరెస్ట్



కిషన్‌రెడ్డి ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నేతలు. చిత్రంలో బల్మూరి వెంకట్ తదితరులు

కాచిగూడ (హైదరాబాద్): నీట్ పరీక్షను రద్దుచేసి అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం బర్కత్‌పురలోని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి ఇంటిని ముట్టడించారు. విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కేంద్రంలోని బీజేపీ ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నీట్ సమస్య పరిష్కారానికి కిషన్‌రెడ్డి చొరవ చూపాలని, నష్టపోయిన తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు న్యాయం చేయలేకపోతే తన పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. కిషన్‌రెడ్డికి గనుల వేలం పాటపై ఉన్న శ్రద్ధ, లక్షలాది మంది విద్యార్థులపై లేకపోవడం సిగ్గుచేటన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ నీట్ పరీక్ష పేపర్ లీకేజీ అంశంపై చాయ్‌పే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించేలా కిషన్‌రెడ్డి ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా పోలీసులు, విద్యార్థులు, యువత మధ్య తోపులాట జరగడంతో ఉద్రిక్తత నెలకొంది. విద్యార్థి, యువజన సంఘాల నేతలను పోలీసులు అరెస్ట్ చేసి నల్లకుంట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, అశోక్‌రెడ్డి (ఎస్ఎఫ్ఐ), లక్ష్మణ్ (ఏఐఎస్ఎఫ్), నాగేశ్వర్ రావు (పీడీఎస్‌యూ), పి.మహేశ్(పీడీఎస్‌యూ), ఎం.అరుణ్‌కుమార్ (వీజేఎస్), అనిల్ (ఏపీఎస్‌యూ), కోటా రమేష్, వెంకట్ (డీవైఎఫ్ఐ), కల్లూరు ధర్మేంద్ర (ఏఐవైఎఫ్), కేఎస్ ప్రదీప్ (పీవైఎల్), రాజీవ్‌రెడ్డి (యువజన కాంగ్రెస్), రవి (పీవైఎల్) తదితరులు పాల్గొన్నారు.


నీట్ లీకేజీలో బీజేపీ నేతల హస్తం

- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి
- ఓయూలో నిరాహార దీక్షలో టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్



దయాకర్‌కు నిమ్మరసం తాగిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: నీట్–2024 పేపర్ లీకేజీ వ్యవహారంలో బీజేపీ నాయకుల హస్తం ఉందని, వెంటనే రద్దు చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ పీహెచ్‌డీ స్కాలర్ చనగాని దయాకర్‌గౌడ్ ఆరోపించారు. శనివారం యూనివర్సిటీ లైబ్రరీ ఎదుట ఎన్ఎస్‌యూఐ నాయకులతో కలసి నీట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం వెలుగుచూసినా దానిపై ఇప్పటివరకు విచారణ చేపట్టకపోవడం సిగ్గు చేటన్నారు. నీట్‌కు హాజరైన 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేసిన ఎన్‌టీఏ డైరెక్టర్‌ను తొలగించాలన్నారు. దేశవ్యాప్తంగా జరిగిన నీట్, యూజీసీ నెట్ పరీక్షల నిర్వహణలో విఫలమైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవీ నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను రాష్ట్రంలో తిరగనివ్వబోమని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యం క్షీణించడంతో పోలీసుల సూచన మేరకు ప్రొఫెసర్లు కాశీం, కొండ నాగేశ్వర్‌రావు వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు.



నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించిన బీజేవైఎం కార్యకర్తలు
- పోలీసుల లాఠీచార్జీ... పలువురి అరెస్టు... లాఠీచార్జీని ఖండించిన బీజేపీ నాయకులు



బీజేవైఎం కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

గన్‌ఫౌండ్రీ /సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. మహేందర్ డిమాండ్ చేశారు. శనివారం బీజేవైఎం ఆధ్వర్యంలో నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చక పోవడం దుర్మార్గమన్నారు. గ్రూప్–2, 3 పోస్టులను పెంచాలని, 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం టీఎజీపీఎస్సీ కార్యాలయం లోపలికి వెళ్లేందుకు యత్నించిన కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జీ చేసి అడ్డుకున్నారు. లాఠీచార్జీలో బీజేవైఎం అధ్యక్షుడు సెవెళ్ల మహేశ్, నాయకులు అనితారెడ్డితోపాటు పలువురు కార్యకర్తలు గాయపడ్డారు. మరికొంతమంది నిరుద్యోగ సంఘం నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. టీజీపీఎస్సీ ముట్టడి కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పవన్‌రెడ్డి, గణేశ్, బి.సురేశ్, ఉపాధ్యక్షుడు ఎన్. మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

లాఠీచార్జీని ఖండించిన కిషన్‌రెడ్డి

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీజీపీఎస్సీ ఎదుట ధర్నా నిర్వహించిన బీజేవైఎం కార్యకర్తలపై జరిగిన లాఠీచార్జీని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. కాగా లాఠీచార్జీలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీజేవైఎం అధ్యక్షుడు సెవెళ్ల మహేశ్, నాయకులు అనితా రెడ్డి తదితరులను మహేశ్వర్‌రెడ్డి పరామర్శించారు.

రేపట్నుంచి జూనియర్ డాక్టర్ల సమ్మె

- ఏడు ప్రధాన డిమాండ్లతో ఆందోళన.. సోమవారం నుంచి విధుల బహిష్కరణ
- అత్యవసర, ఐసీయూ సేవలు మాత్రం కొనసాగింపు



గాంధీఆస్పత్రి ప్రాంగణంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న జూడాలు

సాక్షి, హైదరాబాద్/గాంధీ ఆస్పత్రి: జూనియర్ డాక్టర్లు నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఈనెల 24 నుంచి అత్యవసర సేవలు మినహా మిగతా విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఏడు ప్రధాన డిమాండ్ల సాధనలో భాగంగా సమ్మె చేపడుతున్నట్లు తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్‌జీ సాయిశ్రీహర్ష, ఐజక్ న్యూటన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో సమ్మెకు దిగాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. శనివారం గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో భోజన విరామ సమయంలో జూనియర్ డాక్టర్లు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. 24 నుంచి తలపెట్టే సమ్మెలో అత్యవసర సేవలు, ఐసీయూ సేవలు మినహా మిగతా అన్ని రకాల సర్వీసులు నిలిపివేయనున్నట్లు జూనియర్ డాక్టర్ల సంఘం స్పష్టం చేసింది. సమ్మె నేపథ్యంలో ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో ఔట్ పేషెంట్, వార్డు సర్వీసులు, ఎలక్టివ్ సేవలు మాత్రం నిలిచిపోనున్నాయి. కార్యక్రమంలో టీ–జూడా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహర్ష, గాంధీ యూనిట్ అధ్యక్షుడు వంశీకృష్ణ, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరీశ్‌లతోపాటు పీజీలు, హౌస్‌సర్జన్లు, సూపర్ స్పెషాలిటీ పీజీలు, సీనియర్ రెసిడెంట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇవీ డిమాండ్లు

- ఎలాంటి జాప్యం లేకుండా ప్రతి నెలా స్టైపెండ్ నిధులు విడుదల చేయాలి
- సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్‌కు రూ.1.25 లక్షలు గౌరవ వేతనం చెల్లించాలి
- ఉస్మానియా ఆస్పత్రికి కొత్త భవనాన్ని నిర్మించాలి
- ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు 15 శాతం కోటా తొలగించాలి
- నూతన మెడికల్ కాలేజీల్లో వసతిగృహాలు, రవాణా, పరిశోధనశాల సదుపాయాలు కల్పించాలి
- బోధనాస్పత్రులు, కాలేజీల్లో సెక్యూరిటీ ఔట్‌పోస్టు బలోపేతం చేయాలి
- సెక్యూరి టీ ఔట్‌పోస్టు లేనిచోట కొత్తగా ఏర్పాటు చేయాలి





“ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలో నున్నవారందరు ఆయన శబ్దము విని, మేలు చేసినవారు జీవ పునరుత్థానమునకును, కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.పాడ్యమి ఉ.5.41 వరకు, తదుపరి విదియ తె.4.35 (తెల్లవారితే సోమవారం), **నక్షత్రం:** పూర్వాషాఢ సా.6.25 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** రా.2.12 నుండి 3.45 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.50 నుండి 5.42 వరకు, **అమృతఘడియలు:** ప.1.34 నుండి 2.54 వరకు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం : 6.33
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

సురేష్ గోపీ (త్రిశ్శూర్ బీజేపీ ఎంపీ)
రాయని డైరీ

మాధవ్ శింగరాజు

“మోదీజీ మీ పట్ల ఒక మంచి అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు సురేష్” అన్నారు సురేంద్రన్!

సురేంద్రన్ కేరళ బీజేపీ అధ్యక్షులు. ఆయన పక్కనే పార్టీ సీనియర్ లీడర్ మురళీ ధరన్ ఉన్నారు.

“అవును సురేష్, మోదీజీ మీ పట్ల ఒక మంచి అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు” అన్నారు మురళీధరన్.

నవ్వాన్నేను.

“నిజం సురేష్, మీ పరమత సహనం మోదీ జీకి నచ్చింది” అన్నారు సురేంద్రన్!

“అవును సురేష్, మీ పరపార్టీ సహనం కూడా” అన్నారు మురళీధరన్!

ఈసారి పెద్దగా నవ్వాన్నేను.

“ఎందుకు నవ్వుతున్నారు! చర్చికి వెళ్లి స్తుతులు చెల్లించారు. బంగారు జపమాలను విరాళంగా ఇచ్చారు. ఇఫ్తార్ విందులకు వెళ్లారు. దగ్గర కూర్చొని వడ్డించారు. క్యాథలిక్ కెథడ్రాల్ చర్చికి వెళ్లారు. బంగారు కిరీటం కానుకగా ఇచ్చారు. ఇవన్నీ కూడా మోదీజీ దృష్టిలో మిమ్మల్ని ప్రత్యేకమైన నాయకుడిగా నిలబెట్టాయి” అన్నారు సురేంద్రన్.



“అంతేకాదు సురేష్... దివంగత సీపీఐ (ఎం) నేత ఇ.కె.నయనార్ ఇంటికి వెళ్లి మీరు ఆయన కుటుంబ సభ్యుల్ని పరామర్శించటం, దివంగత కాంగ్రెస్ నేత కె.కరుణాకరన్ సమాధిని సందర్శించటం, వారిద్దరినీ మీ రాజకీయ గురువులుగా మీరు కీర్తించటం పైన కూడా మోదీజీ పూర్తి సంతృప్తితో ఉన్నారు” అన్నారు మురళీధరన్!

“ఇందులో నన్ను అభినందించటానికి కానీ, నన్నొక ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టటానికి గానీ ఏముంది?!” అన్నాను.

“లేకేం సురేష్, ఇవన్నీ కూడా పైనుంచి ఒకరు మిమ్మల్ని ఆదేశించకుండానే మీ అంతట మీరు చొరవ తీసుకుని చేసినవి! ఒక బీజేపీ లీడర్ త్రిశ్శూర్‌లో 14 శాతం ఉన్న ముస్లిం ఓటర్ల ఇఫ్తార్ విందుకు వెళ్లటం, 21 శాతం ఉన్న క్రిస్టియన్ ఓటర్ల చర్చిలకు విరాళాలు ఇవ్వటం మంచి విషయమే కదా” అన్నారు సురేంద్రన్!

నాక్కొంచెం అర్థమైంది.

“ఒక బీజేపీ లీడర్ సీపీఐ(ఎం), కాంగ్రెస్ లీడర్‌లను కొనియాడటం కూడా మంచి సంప్రదాయమే. కానీ ఇందిరాగాంధీని ‘మదర్ ఆఫ్ ది నేషన్’ అనటాన్నే మోదీజీ ఎలా తీసుకొని ఉంటారో తెలీదు. ఒకటైతే నిజం. రాష్ట్రపతి నామినేట్ చేసిన రాజ్యసభ సభ్యుడిగా 2016 నుంచి 2022 వరకు మీరెలాగైతే స్వతంత్రంగా ఉన్నారో, బీజేపీ లోక్ సభ సభ్యుడిగా 2024 జూన్ 4 నుంచి అంతే స్వతంత్రంగా ఉన్నారని మోదీజీ అనుకునే ఉంటారు” అన్నారు మురళీధరన్.

నాకు మరికొంచెం అర్థమైంది.

“ఇందిరాగాంధీని నేను ‘మదర్ ఆఫ్ ది నేషన్’ అనటంలోని నా ఆంతర్యం మీడియాకు అర్థం కాలేదు సురేంద్రన్. కాంగ్రెస్‌కి కరుణాకరన్ ఎలాగైతే ఫాదర్ ఆఫ్ కేరళనో, అలాగే కాంగ్రెస్‌కి ఇందిరాగాంధీ మదర్ ఆఫ్ నేషన్ అని నా ఉద్దేశం” అన్నాను.

“మీ ఉద్దేశాన్ని మోదీజీ చక్కగా అర్థం చేసుకున్నారు సురేష్. కానీ కేరళ బీజేపీలోని వాళ్లే ఇంకోలా అర్థం చేసుకుంటారేమోనని ఆయనకు సందేహం కలగకుండా ఉంటుందంటారా?” అన్నారు మురళీధరన్.

“కేరళలో బీజేపీకి ఇప్పుడున్న 16.68 శాతం ఓటు షేరును మరింతగా పెంచే బాధ్యతను మీరు తీసుకుంటారని మోదీజీ భావిస్తున్నారు సురేష్. మీరు ఎక్కడికైనా వెళ్లండి. కానీ బీజేపీ నుండి వెళ్లిపోలేదని మాత్రం మర్చిపోకండి. మీరెన్నైనా కానుకలు ఇవ్వండి. కానీ స్టేట్‌మెంట్‌లు మాత్రం ఇవ్వకండి. రాజకీయ మనోభావాలు కేరళలో మత విశ్వాసాల కంటే పార్టీ విశ్వాసాల్నే తేలిగ్గా మండించేస్తాయి” అన్నారు సురేంద్రన్!

ఇది మాత్రం నాకు అర్థం కాలేదు!

పార్టీలను గానీ, మత విశ్వాసాలను గానీ తేలిగ్గా మండించే స్వభావం కలిగి ఉండే రాజకీయ మనోభావాలను తేలిగ్గా చల్లార్చే అగ్నిమాపకాలుగా మార్చుకోలేమా?!

ఏ ఫర్ ఎటాక్... పీ ఫర్ పొక్లెయిన్?



జనతంత్రం

వర్ధెల్లి మురళి

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈమధ్య ఓ కొటేషన్ చెప్పారు. ‘ఏ ఫర్ అమరావతి, పీ ఫర్ పోలవరం’. ఈ రెండూ తన ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ముఖ్యమైనవనే ఉద్దేశంతో ఆ మాట చెప్పారు. ఎన్నికలకు ముందు ఆయన ఎక్కువ ప్రచారం చేసింది మాత్రం సూపర్ సిక్స్ హామీలు, మేనిఫెస్టోలోని ఇతర హామీల గురించే! ఈ నేపథ్యంలోంచి చూసినప్పుడు ‘ఏ ఫర్ ఆల్, పీ ఫర్ పీపుల్’ అనే కొటేషన్ ఆయన నోటినుంచి రావాల్సింది. విభజిత రాష్ట్రానికి తొలిదఫా ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటి ప్రాధాన్యతలనే ఇప్పుడాయన పునరుద్ఘాటించారు.

నిజమే, ఆర్థిక రంగానికి గ్రోత్ ఇంజన్ లాంటి ఒక మహానగరం ఏ రాష్ట్రాభివృద్ధికైనా అవసరమే. అలాగే పోలవరం కూడా! పోలవరం ఆంధ్రుల జీవనాడి అనే సెంటిమెంట్ కూడా బలపడిపోయింది. ఈ సెంటిమెంట్ వయసు డెబ్బయ్ ఐదు పైనే ఉంటుంది. ఈ రెండు అంశాలపై ఎవరికీ పేచీ ఉండదు. కానీ, మహానగర అభివృద్ధికోసం తొలి ఐదేళ్ల కాలంలో ఆయన ఎంచుకున్న మార్గం గమ్యం చేర్చేదేనా? పోలవరం నిర్మాణంపై ఆయన అనుసరించిన పద్ధతి సమర్థనీయమేనా అన్న ప్రశ్నలు చర్చనీయాంశాలవుతున్నాయి.

గడిచిన డెబ్బయ్యేళ్ల ప్రపంచ చరిత్రలో నిర్మాణమైన ఏ ఒక్క గ్రీన్ ఫీల్డ్ నగరం కూడా ఆశించిన స్థాయిలో విజయవంతం కాలేదు. షెన్‌జెన్ (చైనా), నవీ ముంబై (ఇండియా) మాత్రమే అంచనాలను సగం మేరకు అందుకోగలిగాయి. ఇక దేశ రాజధాని నగరాల కోసం నిర్మాణమైన గ్రీన్‌ఫీల్డ్ నగరాల కథలన్నీ ఫెయిల్యూర్ స్టోరీలే. మయన్మార్ నిర్మించుకున్న రాజధాని నగరం నేపిడా ఒక నిర్జన కాంక్రీట్ జంగిల్‌ను తలపిస్తున్నది. పుత్రజయ (మలేషియా), కాన్‌బెర్రా (ఆస్ట్రేలియా), ఆస్థానా (కజికిస్థాన్), డొడోమా (టాంజానియా) నగరాల్లో ఇప్పటికీ ప్రభుత్వ పీఠాలు, అధికార యంత్రాంగ కార్యకలాపాలు తప్ప జనజీవన స్రవంతులు కనిపించడం లేదు.

అమరావతి నిర్మాణం కోసం చంద్రబాబు గత ప్రభుత్వం ఎంచుకున్న రియల్ ఎస్టేట్ మోడల్ కూడా సాధారణ ప్రజలు ఇక్కడ నివసించడానికి అనువైనది కాదు. ఈ మోడల్ వల్ల పెరిగే అద్దెలను, భూముల ధరలను మధ్యశ్రేణి ఉద్యోగులు సైతం భరించలేరు. వారంతా విజయవాడ, మంగళగిరి, గుంటూరు వంటి ప్రాంతాల్లో నివసిస్తూ ఉద్యోగం కోసం వచ్చిపోవలసిందే. అటువంటి పరిస్థితి ఏర్పడితే మరో పుత్రజయ అనుభవమే మనకు మిగులుతుంది.

అలా జరగకూడదనే మనం కోరుకుంటాము. జన సమ్మర్దంతో అమరావతి కిటకిటలాడాలనే కోరుకుంటాము. రాయల కాలం నాటి విజయనగరంలా వీధులన్నీ రతనాల రాశులతో తులతూగాలనే ప్రార్థిస్తాము. ‘చెరువులో చేపల్ని నింపినట్టు నా నగరాన్ని మనుషులతో నింపు దేవుడా’ అని హైదరాబాద్ నిర్మాత కులీ కుతుబ్‌షా అల్లాను వేడుకున్నట్టుగానే మనమూ వేడుకోవచ్చు. కానీ అందుకు అనువైన పరిస్థితులు ఉండవనే నిపుణులు చెబుతున్నారు. గ్రీన్‌ఫీల్డ్ మహానగరాలు అవాంఛనీయమని పర్యావరణ నిపుణులు కూడా హెచ్చరిస్తున్నారు. కానీ మనం మనకు నచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తున్నాము.

పోలవరం విషయంలోనూ చంద్రబాబు గత ప్రభుత్వం వేసింది తప్పటడుగేనని నిష్పాక్షిక పరిశీలన జరిపితే ఎవరికైనా అర్థమవుతుంది. జాతీయ హోదా లభించిన ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతను కేంద్రానికే వదిలేసి ఉంటే రాష్ట్రానికి మేలు జరిగేది. అలాకాకుండా, అడిగి మరీ భుజాన వేసుకొని ఆపసోపాలు పడవలసిన పరిస్థితిని ఎదుర్కొంటున్నాము. డయాఫ్రమ్ వాల్‌కు సంబంధించిన సంక్షోభంలో ఇప్పుడు రాష్ట్రం ఇరుక్కొనిపోయింది. ఇది తేలితే తప్ప ప్రాజెక్టు ముందుకు కదలదు.

ప్రధాన డ్యామ్‌కు పునాదిగా వేసేదాన్ని డయాఫ్రమ్ వాల్ అంటారు. ఇది దృఢంగా ఉండటమే ప్రాజెక్టుకు కీలకం. అందుకని వరద కోతకు గురికాకుండా ఉండటం కోసం ముందుగానే ఎగువభాగం నుంచి నది ప్రవాహాన్ని పక్కకు మళ్లించి కొంత దూరం ప్రధాన నదికి సమాంతరంగా పారించి దిగువన మళ్లీ నదిలో కలిపేస్తారు. ఈ ప్రవాహ నియంత్రణ కోసం చేసే ఏర్పాట్లను అప్రోచ్ చానల్, స్పిల్ చానల్, స్పిల్‌వేలుగా వ్యవహరిస్తారు. ఆ తర్వాత ప్రధాన డ్యామ్‌కు ఎగువన, దిగువన రెండు మట్టి కట్టలను ప్రవాహానికి అడ్డంగా నిర్మిస్తారు. వీటినే ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లుగా వ్యవహరిస్తారు.

గడిచిన డెబ్బయ్యేళ్ల ప్రపంచ చరిత్రలో నిర్మాణమైన ఏ ఒక్క గ్రీన్ ఫీల్డ్ నగరం కూడా ఆశించిన స్థాయిలో విజయవంతం కాలేదు. షెన్‌జెన్ (చైనా), నవీ ముంబై (ఇండియా) మాత్రమే అంచనాలను సగం మేరకు అందుకోగలిగాయి. ఇక దేశ రాజధాని నగరాల కోసం నిర్మాణమైన గ్రీన్‌ఫీల్డ్ నగరాల కథలన్నీ ఫెయిల్యూర్ స్టోరీలే. మయన్మార్ నిర్మించుకున్న రాజధాని నగరం నేపిడా ఒక నిర్జన కాంక్రీట్ జంగిల్‌ను తలపిస్తున్నది. పుత్రజయ (మలేషియా), కాన్‌బెర్రా (ఆస్ట్రేలియా), ఆస్థానా (కజికిస్థాన్), డొడోమా (టాంజానియా) నగరాల్లో ఇప్పటికీ ప్రభుత్వ పీఠాలు, అధికార యంత్రాంగ కార్యకలాపాలు తప్ప జనజీవన స్రవంతులు కనిపించడం లేదు.
అమరావతి నిర్మాణం కోసం చంద్రబాబు గత ప్రభుత్వం ఎంచుకున్న రియల్ ఎస్టేట్ మోడల్ కూడా సాధారణ ప్రజలు ఇక్కడ నివసించడానికి అనువైనది కాదు. ఈ మోడల్ వల్ల పెరిగే అద్దెలను, భూముల ధరలను మధ్యశ్రేణి ఉద్యోగులు సైతం భరించలేరు. వారంతా విజయవాడ, మంగళగిరి, గుంటూరు వంటి ప్రాంతాల్లో నివసిస్తూ ఉద్యోగం కోసం వచ్చిపోవలసిందే. అటువంటి పరిస్థితి ఏర్పడితే మరో పుత్రజయ అనుభవమే మనకు మిగులుతుంది.

ఈ పనులన్నీ పూర్తయిన తర్వాతనే డయాఫ్రమ్ వాల్ కడతారని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్న మాట. కాఫర్ డ్యామ్‌లను పూర్తిగా కట్టాలంటే అవి ప్రవాహాన్ని అడ్డుకునేంత మేర ఎగువ జనావాస ప్రాంతాలను ఖాళీ చేసి ప్రజలకు పునరావాసం కల్పించాలి. ఆ పని చేయలేదు కానీ, కాఫర్ డ్యామ్‌లను సగం కట్టి వదిలేశారు. స్పిల్‌వే, స్పిల్ ఛానల్ పనులను పునాది స్థాయిలోనే వదిలేశారు. డయాఫ్రమ్ వాల్‌ను మాత్రం రికార్డు సమయంలో నిర్మించామని అప్పట్లో బాబు ప్రభుత్వం ఓ వేడుకను కూడా జరిపినట్టు గుర్తు. 2018 జూన్ 11 నాటికి డయాఫ్రమ్ వాల్ పూర్తయినట్టు అక్కడో పైలాన్‌ను ఆవిష్కరించారు.

ఆ తర్వాత దాదాపు సంవత్సర కాలానికి అంటే 2019 మే 30న రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. జూన్, జూలై మాసాల్లో వచ్చిన భారీ వరదలకు డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నట్టుగా కొంతకాలం తర్వాత వెల్లడైంది. ‘రికార్డు’ సమయంలో డయాఫ్రమ్ వాల్ కట్టిన తర్వాత కూడా కాఫర్ డ్యామ్‌లు పూర్తిచేయడానికి, స్పిల్ చానల్ పునాదులు పూర్తిచేయడానికి బాబు ప్రభుత్వానికి ఏడాది సమయం మిగిలింది. కాని నెల రోజుల సమయం మాత్రమే ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ పనులు చేయకపోవడం వల్లనే డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నదని టీడీపీ ప్రచారంలో పెట్టింది.

ముందు చేయవలసిన పనులు చేయకుండా ఎకాఎకిన డయాఫ్రమ్ వాల్ ఎందుకు కట్టవలసి వచ్చిందన్న ప్రశ్నకు టీడీపీ నుంచి ఇప్పటివరకు స్పష్టమైన సమాధానం రాలేదు. కమీషన్లు భారీగా ముట్టే పనులనే ముందుగా చేపట్టారు తప్ప ప్రోటోకాల్ పాటించలేదన్న వైసీపీ వారి విమర్శకు కూడా కచ్చితమైన సమాధానం రాలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాఫర్ డ్యామ్‌లను పూర్తిచేయడంతోపాటు ప్రవాహాన్ని సమాంతరంగా మళ్లించే పనిని పూర్తి చేశారు. ప్రాజెక్టు కుడి ఎడమ కాలువలను జలాశయంతో అనుసంధానించే పనిని కూడా పూర్తి చేశారు. డ్యామ్ నిర్మాణ స్థలంలో ఏర్పడిన అగాధాలను పూడ్చి పూర్వపు స్థితికి తీసుకొచ్చారు. ఇక మిగిలిన డయాఫ్రమ్ వాల్ విషయంలో ఏం చేయాలో చెబితే శరవేగంగా పనులు పూర్తి చేస్తామని జగన్ ప్రభుత్వం కేంద్రాన్ని 2022 డిసెంబర్ నుంచి కోరుతూ వస్తున్నది.

మొన్నటి పోలవరం పర్యటనలో చంద్రబాబు కూడా ఇదే విషయాన్ని చెప్పారు. రిపేర్లు చేయాల్సి వస్తే 400 కోట్లకు పైగా ఖర్చవుతుందనీ, కొత్తగా కట్టాలంటే 900 కోట్లు అవుతుందనీ, ఏ సంగతీ కేంద్రం తేల్చాలని చెప్పారు. కనుక పోలవరం విషయంలో జరిగిన వ్యవహారాలన్నీ గమనంలోకి తీసుకుంటే మాటల్లో చెప్పేంత ప్రాధాన్యత వారి మస్తిష్కంలో లేదనే సంగతి స్పష్టమవుతుంది. ‘ఏ ఫర్ ఆల్, పీ ఫర్ పీపుల్’ అనేది వారి విధానం కాదు. ‘ఏ ఫర్ అమరావతి, పీ ఫర్ పోలవరం’ అనే మాటల వెనుక అర్థాలు వేరు. ప్రత్యర్థుల మీద ‘ఏ ఫర్ ఎటాక్, పీ ఫర్ పొక్లెయిన్’ విధానాన్ని మాత్రం కొత్త ప్రభుత్వం కచ్చితంగా అమలు చేస్తున్నదని చెప్పవచ్చు.

శుక్రవారం నాడు ఆంధ్రప్రదేశ్ పదహారో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. సభ్యులందరూ పదవీ ప్రమాణాలు చేశారు. అసెంబ్లీ ఆవరణలోకి ఆయన కారును అనుమతించడం ద్వారా జగన్‌మోహన్‌రెడ్డికి తాము చాలా మర్యాద ఇచ్చామని ప్రభుత్వ సభ్యులు మీడియాతో చెబుతున్నారు. ఔను, నోటితో నవ్వి నొసటితో వెక్కిరించారు. ఆయనను ప్రతిపక్ష నాయకుడిగా తాము గుర్తించబోవడం లేదనే స్పష్టమైన సంకేతాలను వారు పంపించారు. ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించే ఉద్దేశం ప్రభుత్వానికి ఉంటే సభా నాయకుడు ఎమ్మెల్యేగా ప్రమాణం చేసిన వెంటనే జగన్‌మోహన్‌రెడ్డిని పిలిచేవారు. ఇది సంప్రదాయం. కానీ, మంత్రిమండలి సభ్యులందరి ప్రమాణాలు పూర్తయ్యాకనే ఆయన్ను పిలిచారు.

ప్రతిపక్షంగా గుర్తింపు పొందాలంటే పది శాతం సభ్యులుండాలన్న చట్టపరమైన నిబంధన ఏదీ లేదు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీలకు సమయాన్ని కేటాయించడం, ఆ పార్టీ సభ్యులకు గదులను కేటాయించడం కోసం తొలి లోక్‌సభ స్పీకర్ జీ.వీ. మావలంకర్ పెట్టిన 10 శాతం నిబంధనను ప్రతిపక్ష నాయకుడి గుర్తింపుకోసం తప్పుగా అన్వయిస్తున్నారు. పది శాతం సభ్యులున్న పార్టీని పార్లమెంటరీ పార్టీగా, అంతకంటే తక్కువమంది సభ్యులున్న పార్టీలను పార్లమెంటరీ గ్రూపులుగా మావలంకర్ వర్గీకరించారు. అంతే తప్ప ప్రతిపక్ష నాయకుని ప్రస్తావనే ఆ నిబంధనలో లేదు. 1977లో చేసిన చట్టంలోనే ప్రతిపక్ష నాయకుని ప్రస్తావన వచ్చింది. ప్రతిపక్షాల్లో పెద్ద పార్టీగా అవతరించిన పార్టీ నాయకుడిని ఈ చట్టం ప్రతిపక్ష నేతగా గుర్తిస్తున్నది.

ప్రతిపక్షంగా గుర్తింపు పొందాలంటే పది శాతం సభ్యులుండాలన్న చట్టపరమైన నిబంధన ఏదీ లేదు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీలకు సమయాన్ని కేటాయించడం, ఆ పార్టీ సభ్యులకు గదులను కేటాయించడం కోసం తొలి లోక్‌సభ స్పీకర్ జీ.వీ. మావలంకర్ పెట్టిన 10 శాతం నిబంధనను ప్రతిపక్ష నాయకుడి గుర్తింపుకోసం తప్పుగా అన్వయిస్తున్నారు. పది శాతం సభ్యులున్న పార్టీని పార్లమెంటరీ పార్టీగా, అంతకంటే తక్కువమంది సభ్యులున్న పార్టీలను పార్లమెంటరీ గ్రూపులుగా మావలంకర్ వర్గీకరించారు. అంతే తప్ప ప్రతిపక్ష నాయకుని ప్రస్తావనే ఆ నిబంధనలో లేదు. 1977లో చేసిన చట్టంలోనే ప్రతిపక్ష నాయకుని ప్రస్తావన వచ్చింది. ప్రతిపక్షాల్లో పెద్ద పార్టీగా అవతరించిన పార్టీ నాయకుడిని ఈ చట్టం ప్రతిపక్ష నేతగా గుర్తిస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభలో ఉన్న ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ ఒక్కటే. ఆ పార్టీకి లభించిన సీట్లు పదకొండే కావచ్చు. కానీ 40 శాతం ఓట్లు వచ్చాయి. ఈ ఓట్లను దామాషా పద్ధతిలోకి అనువదిస్తే 70 సీట్లు గెలిచినట్టు లెక్క.

ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభలో ఉన్న ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ ఒక్కటే. ఆ పార్టీకి లభించిన సీట్లు పదకొండే కావచ్చు. కానీ 40 శాతం ఓట్లు వచ్చాయి. ఈ ఓట్లను దామాషా పద్ధతిలోకి అనువదిస్తే 70 సీట్లు గెలిచినట్టు లెక్క. ప్రతిపక్ష నేతను నిర్ణయించడం కోసం చట్టంలో మూడు నిబంధనలు పెట్టారు. ఒకటి – లోక్‌సభ / శాసనసభలో సభ్యుడై ఉండాలి. రెండు – ఎక్కువ మంది సభ్యులున్న ప్రతిపక్ష పార్టీ నాయకుడై ఉండాలి. మూడు – స్పీకర్ గుర్తించాలి. ఈ స్పీకర్ గుర్తింపును తప్పుగా వ్యాఖ్యానిస్తున్నారు. ప్రతిపక్షాల్లో రెండు పార్టీలకు సమానంగా సభ్యులున్నప్పుడు ఉత్పన్నమయ్యే పరిస్థితుల్లో స్పీకర్ ఆ పార్టీల ఓట్ల శాతాన్ని, ఇతర విషయాలను పరిగణనలోకి తీసుకుంటారు. అంతవరకే ఆయన విచక్షణాధికారం. ఎక్కువ సభ్యులున్న ఒకే పార్టీ ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకుడిని ప్రతిపక్ష నేతగా గుర్తించడమే చట్టం సారాంశం.

ఈ స్ఫూర్తిని అధికార పార్టీ ప్రదర్శించలేదనే చెప్పాలి. శాసనసభను గౌరవ సభగా మారుస్తామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలకూ, ఆచరణకూ మధ్యన లంకె కుదరడం లేదు. శాసనసభ వ్యవహారాలను పక్కనబెడితే, రాష్ట్రంలో అలుముకుంటున్న రాజకీయ వాతావరణం ప్రజాస్వామ్య ప్రియులను కలవరానికి గురిచేస్తున్నది. ఓట్ల లెక్కింపు రోజున ప్రారంభమైన దాడులు మూడు వారాలుగా ప్రతిపక్ష కార్యకర్తలపై యథేచ్ఛగా జరుగుతూనే ఉన్నాయి. పోలీసుల ప్రేక్షక పాత్ర షరా మామూలే. తాజాగా వైఎస్సార్‌సీపీ గుంటూరు కార్యాలయాన్ని కూడా పొక్లెయిన్లతో నేలమట్టం చేశారు. ఇది అధికారిక కూల్చివేత. ఈ అధికారిక కూల్చివేతలు ఇంకా ఉంటాయట! అనుమతుల్లేవనే ఒక ముద్ర వేసి, కూల్చేస్తారట! ఒక అక్రమ భవంతిలో నివాసముండే ముఖ్యమంత్రి ప్రతిపక్ష కార్యాలయాలను అక్రమం అనే ముసుగేసి కూల్చివేయడం సమంజసమేనా?

vardhelli1959@gmail.com

పొంతన లేని వాదంతో దుష్ప్రచారాలు

సందర్భం



వి.వి.ఆర్. కృష్ణంరాజు

‘సృజనశీలతను అందరూ అభినందిస్తారు... కానీ అనాగరీకులు మాత్రమే విధ్వంసంలో అందాన్ని చూస్తారు’ అంటాడు కందియ కమలేశ్వరన్ అనే మలేషియన్ గాయకుడు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ పాలనతో పాటు విధ్వంసమూ ప్రారంభమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రత్యర్థులపై హత్యాకాండ, గృహ దహనాలు కొనసాగుతున్నాయి. దీనికి తోడు కొత్తగా యూపీ తరహా బుల్డోజర్ సంస్కృతికి తెరతీశారు. తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని హైకోర్టు ఆదేశాలు ఖాతరు చేయకుండా ఆగమేఘాల మీద కూల్చేశారు. 2022 జూన్ 17వ తేదీన ‘యూపీ గవర్నమెంట్ వర్సెస్ జమాతే ఇస్లామీ’ కేసులో సుప్రీం కోర్టు... కూల్చి వేతలు ఒక వర్గాన్ని లక్ష్యం చేసేవిగా ఉండకూడదని పేర్కొంది. కానీ ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వ ఆదేశంతో సీఆర్‌డీఏ అధికారులు వైఎస్సార్ కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని పార్టీ కార్యాలయాన్ని కూల్చేశారు. సీఆర్‌డీఏ చట్టంలోని 115 సెక్షన్ ప్రకారం ఫైనల్ కన్ఫర్మేషన్ ఆర్డర్ ఇవ్వలేదు. 137 సెక్షన్ ప్రకారం ఇచ్చిన నోటీసులకు సమాధానం పొందడానికి సహేతుక సమయం ఇవ్వలేదు.

కృష్ణా కరకట్ట వద్ద నదీతీరాన చంద్రబాబు నిర్మించిన ప్రజావేదిక కూల్చి వేతను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ కూల్చివేతతో ముడి పెడుతున్నారు. నిజానికి రాష్ట్ర క్యాబినెట్ తీర్మానంతో జీఓ ద్వారా పొందిన భూమిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని అన్ని అనుమతులతో నిర్మిస్తున్నారు. కానీ ప్రజా వేదికను ప్రభుత్వ భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించారు. నదీ తీరాన నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనంలో నివసిస్తున్న చంద్రబాబు నిర్మించిన ఈ ప్రజా వేదిక వల్ల కరకట్టపై తమ రాకపోకలకు అంతరాయం కలుగుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. 2019లో చంద్రబాబు ఓడిపోయిన తర్వాత ప్రజా వేదిక వద్దకు ప్రజలు రావడం లేదు, దీంతో కొత్త ప్రభుత్వం ఈ అక్రమ కట్టడాన్ని కూల్చేసింది.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. ‘ఓటుకు నోటు’ కేసు తర్వాత చంద్రబాబు నాయుడు హడావిడిగా హైదరాబాద్ విడిచి కృష్ణా బరాజ్‌కు కుడివైపున కరకట్ట– నదీ ప్రాంతానికి మధ్యలోని ఫ్లడ్ బ్యాంక్ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనం (లింగమనేని ఎస్టేట్) లోకి మకాం మార్చారు. కృష్ణా కరకట్ట ప్రాంతంలో గుంటూరు జిల్లా పరిధిలో 48 భవనాలు, కృష్ణా జిల్లా పరిధిలో 18 భవనాలతో పాటు ప్రకృతి వైద్యశాల కూడా ‘నదీ పరిరక్షణ చట్టం–1884’ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినవేనని స్వయానా అప్పటి రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు 2015 జనవరిలో చెప్పడమే కాక, వివిధ శాఖల నుంచి నోటీసులు కూడా ఇప్పించారు. ఇవన్నీ బడాబాబులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినవేననీ, వీటిని కూల్చి వేస్తామనీ హడావిడి చేశారు. ఈ కూల్చివేసే భవనాల లిస్టులో లింగమనేని ఎస్టేట్ కూడా ఉంది.



తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

వీటి నిర్మాణంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఈ అక్రమ నివాసంతో పాటు మిగిలిన అక్రమ కట్టడాలను కూడా సక్రమం చేయడానికి, ఫ్లడ్ బ్యాంక్ పరిధిని మార్చడానికి హడావిడిగా చంద్రబాబు ప్రభుత్వం జీఓలు తెచ్చింది. అయితే ఇవేమీ చట్టం ముందు నిలబడేవి కాదు. కృష్ణా బరాజ్‌కు కుడివైపున నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనంలో ముఖ్యమంత్రి నివసించడం ‘రివర్ కన్సర్వెన్సీ యాక్ట్’ను ఉల్లంఘించడమే. ఈ యాక్ట్ ప్రకారం నదిని ఆనుకుని 500 మీటర్ల వరకూ ఎటువంటి నిర్మాణాలనూ చేయకూడదు. కాని ముఖ్యమంత్రి నివసిస్తున్న భవనం నదికి వందమీటర్ల దూరంలోనే ఉంది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ నాలుగేళ్ళ క్రితం ఉత్తర్వులు ఇస్తూ, నది తీరాన 200 మీటర్ల వరకూ నిషేధిత ప్రాంతంగా, 500 మీటర్ల వరకూ నియంత్రణ ప్రాంతంగా ప్రకటించింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ 1996 మార్చి ఎనిమిదో తేదీన విడుదల చేసిన జీఓ నం. 111 ప్రకారం నదికి సమీపాన ఎటువంటి నిర్మాణాలు చేయకూడదు, ఎటువంటి వ్యర్థ పదార్థాలూ నదిలో వదల కూడదు. ఈ ప్రాంతంలో ఉన్న ముఖ్యమంత్రి నివాసంతో పాటు ఏ కట్టడానికీ డ్రైనేజ్ సదుపాయం లేదు. అక్కడి రోగులు, స్థానికులు విసర్జించే మలినం కృష్ణానీటిలో కానీ, నదీ సమీపాన బహిరంగ ప్రదేశాలకు కానీ చేరుతోంది.

కేంద్ర పొల్యూషన్ బోర్డు నివేదిక ప్రకారం నదీజలాల్లో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ) ఐదు రోజుల సగటు విశ్లేషణల్లో లీటర్‌కు రెండు మిల్లీ గ్రాముల కన్నా తక్కువ ఉండాలి. గుంటూరు జిల్లా అమరావతి వద్ద కృష్ణా జలాల్లో బీఓడీ 1.4 మిల్లీగ్రాములుండగా... అదే నీటిలో కరకట్ట వద్ద బీఓడీ 2.6 మిల్లీ గ్రాములకు పెరిగిపోయింది. ప్రమాదకర బాక్టీరియా, వైరస్‌లు, ప్రోటోజోవా యూనిట్లు కరకట్ట జలాల వద్ద చాలా ఎక్కువగా ఉన్నాయి. కంటికి కనిపించని ఈ క్రిములతో కూడిన కాలనీ ఫార్మింగ్ యూనిట్స్ మోస్ట్ ప్రాబబుల్ నంబర్ ప్రతి వంద మిల్లీ లీటర్లకు అమరావతి వద్ద కృష్ణా జలాల్లో 150గా నమోదు కాగా... అది కరకట్ట వద్ద 210 గా నమోదైంది. ఈ కలుషిత జలాలనే విజయవాడ, గుంటూరు ప్రజలు తాగవలసి వస్తోంది. ఈ నీటిని యథాతథంగా తాగిన అనేక మంది అస్వస్థులవుతున్నారు.

కరకట్ట వాస్తవాలు విజయవంతంగా మరుగున పడేసిన పాలకులు రుషికొండ టూరిజం ప్రాజెక్టును మాత్రం ఒక పెద్ద వార్తాంశంగా మార్చేశారు. కొండను తొలిచేసి, పర్యావరణానికి పాతరేసి అక్కడ రూ. 500 కోట్లతో జగన్ మోహనరెడ్డి తనకోసం ప్యాలస్ నిర్మించుకుంటున్నా రంటూ ప్రచారం చేశారు. నిజానికి విశాఖను ఒక అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడానికి జగన్ మోహన్ రెడ్డి ప్రయత్నించారు. దీనిలో భాగంగానే పర్యాటక శాఖ రుషికొండపై అన్ని హంగులతో నిర్మాణాలు చేపట్టింది. విశాఖలో ‘గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్’ నిర్వహణకు సుమారు రూ. 150 కోట్లు వ్యయం చేశారు. దీనిలో అత్యధిక భాగం విశాఖ స్టార్ హోటళ్ళకు చెల్లించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆ హోటళ్ళకు దీటుగా రిసార్ట్స్ నిర్మిస్తున్నారు. ఇక్కడ వేంగి ఏబీ; కళింగ గజపతి, విజయనగర ఏబీసీ బ్లాక్‌లనూ; వాటిలో సువిశాల సమావేశ మందిరాలు, పెద్ద రెస్టారెంట్, ప్రీమియం విల్లా సూట్స్, ఫిట్‌నెస్ సెంటర్లు నిర్మిస్తున్నారు. సమావేశ మందిరాలు, రెస్టారెంట్, ఫిట్‌నెస్ సెంటర్లు ఉన్న చోట ఏ ముఖ్యమంత్రి అయినా ఎలా నివాసముంటారు? ఇవేమీ గమనించకుండా అది జగన్ నివాసమంటూ ప్రచారం చేశారు.

విశాఖలో తూర్పు నావికా దళం కార్యాలయంతో పాటు అనేక కేంద్ర సంస్థలున్నాయి. నిత్యం పదుల సంఖ్యలో విదేశాల నుంచి వాణిజ్య నౌకలు వస్తుంటాయి. దేశ విదేశాల నుంచి అధికారులు, నిపుణులు వస్తుంటారు. దీనికి తోడు రాష్ట్రపతి, ప్రధాన మంత్రి వంటివారు వస్తే వారి అవసరాలు తీర్చే విధంగా విలాసవంతమైన విల్లా సూట్స్ నిర్మించారు. ఇవి పూర్తయితే విశాఖలో ఒక వర్గానికి చెందిన స్టార్ హోటళ్ళ టర్నోవర్ దెబ్బతింటుందనే భయంతోనే ఈ రిసార్ట్స్‌పై ప్రతికూల ప్రచారం చేస్తూ జగన్‌మోహన్ రెడ్డిపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు కూడా వచ్చాయి. కొందరు ఫేక్ న్యూస్‌ను ఒక పెద్ద ఆయుధంగా చేసుకుని వ్యక్తిత్వ హననాలకు పాల్పడుతున్నారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకోకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

వ్యాసకర్త ఎ.పి. ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు । 89859 41411

క్లుప్తంగా...

తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా బోనాలు

● మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది బోనాల ఉత్సవాల నిర్వహణ కు సీఎం రేవంత్‌రెడ్డి రూ.20కోట్లను మంజూరు చేశారని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఆషాఢ బోనాల ఉత్సవాలు నిర్వహించాలని మంత్రి కొండా సురేఖ దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. మరికొన్ని రోజుల్లో బోనాల ఉత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ పరిధిలోని దేవాదాయ శాఖ కమిషనర్లతో మంత్రి సురేఖ శనివారం సచివాలయంలో సమావేశ మయ్యారు. బోనాల ఉత్సవ ఏర్పాట్లు, బడ్జెట్ కేటాయింపు తదితర అంశాలపై సురేఖ ఈ సందర్భంగా చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బోనాలను నిర్వహించేందుకు ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తనతోపాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ సభ్యులుగా, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి సహా మొత్తంగా ఏడుగురు ఈ కమిటీలో ఉంటారని వెల్లడించారు. బోనాల ఉత్సవాలను దూరదర్శన్ యాదగిరి చానల్‌లో ప్రత్యక్ష ప్రసారాలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఢిల్లీ కేంద్రంగా తెలంగాణ భవన్‌లో తెలంగాణ ఖ్యాతి ఇనుమడించేలా ఉత్సవాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్‌లో జాతీయ ఎస్టీ కమిషన్ కార్యాలయం

● జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్



హన్మకొండ: హైదరాబాద్‌లో జాతీయ ఎస్టీ కమిషన్ ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ చెప్పారు. ఆయన హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో శనివారం విద్యుత్ ఎస్టీ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్టీ విద్యుత్ ఉద్యోగులు తమ సమస్యలను జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డిని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులపై దాడులు, ఇతర సమస్యలపై దినపత్రికల్లో వచ్చిన కథనాలను సుమోటోగా స్వీకరించనున్నట్లు చెప్పారు. కమిషన్ వెబ్‌సైట్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చన్నారు. మారుమూల తండాలకు ఎస్టీ కమిషన్ వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

కౌలు రైతు ఆత్మహత్య


నాగయ్య

నకిరేకల్: ఆర్థిక ఇబ్బందులతో కౌలు రైతు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామానికి చెందిన జిల్లా నాగయ్య (38)కు సొంత వ్యవసాయ భూమి లేకపోవడంతో గ్రామంలోని పలువురు రైతుల దగ్గర భూములను కౌలుకు తీసుకుని సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నాడు. భార్య వ్యవసాయ కూలి పనులకు వెళ్తుంది. నాగయ్య గత సీజన్‌లో వ్యవసాయం పెట్టుబడుల కోసం పలువురి దగ్గర అప్పులు తెచ్చాడు. దీనికి తోడు ఆయనకు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో నాగయ్య శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. భార్య వచ్చేసరికి ఆయన ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సుధీర్‌కుమార్ తెలిపారు.

గురుకుల టీచర్లకు త్వరలో పోస్టింగ్

● నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన
● సబ్జెక్టులవారీగా పరిశీలన షెడ్యూల్ విడుదల చేసిన సొసైటీలు
● పరిశీలన తర్వాత వెబ్ కౌన్సెలింగ్... ఆన్‌లైన్ పద్ధతిలో పోస్టింగ్‌లు



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల నుంచి దాదాపు నాలుగు నెలల క్రితం ఉద్యోగ నియామక ఉత్తర్వులు పొందిన సుమారు 8,500 మంది అభ్యర్థులకు అతిత్వరలో పోస్టింగ్‌లు ఇచ్చేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. వచ్చే నెల మొదటి వారంలో వారంతా విధుల్లో చేరే అవకాశాలున్నాయి. ఉద్యోగాలు లభించిన వారిలో ఎక్కువ మంది ఫిబ్రవరిలో నియామక పత్రాలు పొందగా... ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో మరికొందరికి నియామక పత్రాల పంపిణీ నిలిచిపోవడం తెలిసిందే. తాజాగా ఎన్నికల కోడ్ ముగియడంతో పెండింగ్ అభ్యర్థులకు నియామక పత్రాలు ఇచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రెండు, మూడు రోజుల్లో వారికి నియామక పత్రాలు అందించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత సొసైటీలు ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నాయి. ఇప్పటికే బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బి. సైదులు ధ్రువపత్రాల పరిశీలనకు షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 24 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి కూడా ఆ సొసైటీ పరిధిలో ధ్రువపత్రాల పరిశీలనకు శనివారం షెడ్యూల్ జారీ చేశారు. దీంతో మైనారిటీ, జనరల్, ఎస్టీ గురుకుల సొసైటీలు కూడా షెడ్యూల్ విడుదలకు సిద్ధమయ్యాయి. ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తయ్యాక పోస్టింగ్‌లు ఇచ్చేందుకు గురుకుల సొసైటీలు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయించాయి. పైరవీలకు తావులేకుండా పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించేందుకే ఈ దిశగా ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. జూలై 7 నాటికి ఎస్సీ గురుకుల సొసైటీ పోస్టింగ్ ఆర్డర్లు విడుదల చేయనున్నట్లు ఆ సొసైటీ కార్యదర్శి తెలిపారు. ఇతర గురుకుల సొసైటీలు సైతం అదే తరహా కార్యాచరణ చేపట్టినట్లు తెలుస్తోంది.

వైద్య శాఖలో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోండి

● అధికారులకు మంత్రి దామోదర ఆదేశం
● ఫుడ్‌సేఫ్టీపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖతో పాటు అనుబంధ శాఖల్లో ఉద్యోగ ఖాళీల భర్తీకి చర్యలు వేగవంతం చేయాలని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పలు రకాల పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతించిందని, ఇంకా అవసరమైన మేరకు అనుమతులు జారీ చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. శనివారం ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో తెలంగాణ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్(టీఎంఐడీసీ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం), బ్లడ్‌బ్యాంక్‌లు, ఎఫ్ఎస్ఎస్ఏఐ యాక్ట్ అమలు తదితరాలపై సంబంధిత అధికారులతో మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫుడ్ సేఫ్టీపై నిరంతర పర్యవేక్షణ, తనిఖీలు నిర్వహించడం వల్ల నాణ్యమైన ఆహారం అందించడంలో దేశంలోనే తెలంగాణకు ఉత్తమ రాష్ట్రంగా గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లోని వసతి గృహాలు, క్యాంటీన్లతో పాటు అన్ని ఆసుపత్రులలో ఉన్న క్యాంటీన్లలో ఫుడ్ సేఫ్టీపై నిరంతర పర్యవేక్షణ, నిఘా పెట్టాలని పేర్కొన్నారు. విద్యాసంస్థలతో పాటు ఆసుపత్రుల్లో ఉన్న క్యాంటీన్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్‌లు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ల ద్వారా విస్తృత తనిఖీలు నిర్వహించాలని, ఫుడ్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని మంత్రి ఈ సందర్భంగా అధికారులకు సూచనలు చేశారు. నాచారంలో ఉన్న ఫుడ్ సేఫ్టీ ల్యాబ్‌ను బలోపేతం చేయడంతో పాటు ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ శివలీల తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళి

● మొక్కలు నాటాలని పిలుపునిచ్చిన బీజేపీ

సాక్షి, హైదరాబాద్: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆదివారం ప్రతి కార్యకర్త వారి మాతృమూర్తి పేరుతో మొక్కలు నాటడంతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని బీజేపీ పిలుపునిచ్చింది. ఈనెల 25న ఎమర్జెన్సీ వ్యతిరేక దినం నిర్వహణ సందర్భంగా జిల్లాల వారీగా సెమినార్లు నిర్వహించి, ఇందిరాగాంధీ నియంతృత్వానికి ఎదురొడ్డి పోరాడిన ప్రజాస్వామ్య పరిరక్షకులకు నివాళులర్పించాలని పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా ఎమర్జెన్సీతో పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాసిన గత కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ విధానాన్ని ప్రజలకు వివరించాలని సూచించింది. శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై శనివారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, పార్టీ నాయకులు ఎస్.ప్రకాశ్‌రెడ్డి, ఎస్.కుమార్, కట్టా సుధాకర్, రాణీరుద్రమ, సునీతారెడ్డి, రచనారెడ్డి, సోలంకి శ్రీనివాస్, సుభాష్ చందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మేడిపల్లిని పరామర్శించిన రేవంత్‌రెడ్డి


ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పిల్లలను ఓదారుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

అల్వాల్/చొప్పదండి: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరామర్శించారు. నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. శనివారం సాయంత్రం అల్వాల్ పంచశీల కాలనీలో నివాసముండే రూపాదేవి నివాసానికి రేవంత్‌రెడ్డి వచ్చి ఎమ్మెల్యే సత్యంను పరామర్శించారు. రూపాదేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పిల్లలను దగ్గరకు తీసుకుని ధైర్యం చెప్పారు. రేవంత్‌రెడ్డి వెంట సలహాదారుడు నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి ఉన్నారు.

టీచర్ల దశాబ్దాల కల నెరవేర్చిన సీఎం రేవంత్‌రెడ్డి

● పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల దశాబ్దాల కల నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి కొనియాడారు. ముప్పైఏళ్లుగా అప్‌గ్రేడేషన్‌కు నోచుకోని భాషా పండితులు, పదోన్నతులకు నోచుకోని ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లకు అవాంతరాలను అధిగమించి పదోన్నతులు కల్పించారని, బదిలీలకు అవకాశం ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద ముఖ్యమంత్రి చిత్రపటానికి పీఆర్టీయూ తెలంగాణ తరఫున పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఉపాధ్యాయుల సమస్యలను ఎవరూ వినలేదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్క సమస్యను కూడా పరిష్కరించకపోగా అవమానాలపాలు చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో 22 వేల మంది భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులొచ్చాయని, 60 వేల మంది టీచర్లు తాము ఉన్న చోటు నుంచి మరొక ప్రదేశానికి బదిలీ కానున్నారని వివరించారు. ఈమేరకు సీఎంకు విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, పర్వతి సత్యనారాయణ, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మంచిరెడ్డి అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్

▶ మొదటి పేజీ తరువాయి

ఆ శాఖ విభాగాధిపతి (హెచ్ఓడీ)కి ఆ పోర్టల్‌ను లాగిన్ చేసే సదుపాయం కల్పిస్తాయి. తమ శాఖ పరిధిలోని విద్యాసంస్థల వివరాలను వెబ్ పోర్టల్‌లో చేర్చడం/తొలగించడం/సవరణలు(యాడ్/డిలీట్/ఎడిట్) చేయడానికి అవకాశం ఉంటుంది. అవసరాన్నిబట్టి ఆయా విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని లేదా నిలిపివేయాలని కోరే వెసులుబాటును హెచ్ఓడీలు పొందనున్నారు.

ఇన్‌చార్జీలకు 'ఉచిత'బిల్లులు

విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరా చేసినా ప్రతినెలా క్రమం తప్పకుండా మీటర్ రీడింగ్ తీసి ఇన్‌చార్జి అధికారికి బిల్లులు జారీ చేస్తారు. ఇన్‌చార్జి అధికారులకు బిల్లులు జారీ చేస్తే ఉచిత విద్యుత్ దుర్వినియోగం కాకుండా అరికట్టేందుకు వారు చర్యలు తీసుకొనే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. ఎన్ని యూనిట్ల విద్యుత్ వాడారు? ఎంత బిల్లు వచ్చిందనే వివరాలు అందులో ఉండనున్నాయి. అయితే ఆ బిల్లులను సదరు పాఠశాల/కళాశాల/విద్యాసంస్థ చెల్లించాల్సిన అవసరముండదు. అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు సంబంధించిన బిల్లులను సంబంధిత విభాగాధిపతులు తమ శాఖ బడ్జెట్ నిధుల నుంచి ప్రతి నెలా డిస్కంలకు చెల్లించనున్నాయి.

విభాగాధిపతుల పర్యవేక్షణ...

విభాగాధిపతులు తమ శాఖ పరిధిలోని విద్యాసంస్థల విద్యుత్ వినియోగం, బిల్లుల మొత్తం, గత కాలానికి సంబంధించిన వినియోగం, జారీ అయిన బిల్లులు, జరిపిన చెల్లింపులు, చెల్లించాల్సిన బకాయిల వంటి సమాచారంతో నివేదికలను వెబ్ పోర్టల్‌లో చూసుకోవడానికి వీలుండనుంది. విద్యా సంస్థ, మండలం, జిల్లావారీగా సైతం ఈ నివేదికలు ఆన్‌లైన్‌లో జనరేట్ కానున్నాయి. సంబంధిత విభాగాధిపతులు బడ్జెట్ కేటాయింపుల నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించడానికి వీలుగా పోర్టల్‌ను రాష్ట్ర ఆర్థిక శాఖతో అనుసంధానించనున్నారు.

విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరా కోసం ఆన్‌లైన్ పోర్టల్‌లో లాగిన్ సదుపాయంగల విభాగాధిపతులు

విద్యా సంస్థ	విభాగాధిపతి
పాఠశాలలు	పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్
ఇంటర్మీడియట్ కళాశాలలు	ఇంటర్ బోర్డు డైరెక్టర్
ఐటీఐలు	ఉపాధి కల్పన, శిక్షణ శాఖ కమిషనర్
విశ్వవిద్యాలయాలు	ఉపకులపతులు
వైద్య కళాశాలలు	వైద్య విద్యాశాఖ డైరెక్టర్
పాలిటెక్నిక్ కళాశాలలు	సాంకేతిక విద్యాశాఖ కమిషనర్
బీసీ సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాలు	బీసీ సంక్షేమ వసతి గృహ విద్యాసంస్థల బోర్డు
ఎస్సీ సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాలు	సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యాసంస్థల బోర్డు
ఎస్టీ సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాలు	గిరిజన సంక్షేమ వసతి గృహ విద్యాసంస్థల బోర్డు
మైనారిటీల సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాలు	మైనారిటీల సంక్షేమ వసతి గృహ విద్యాసంస్థల బోర్డు
నిమ్స్	డైరెక్టర్

ఆయిల్‌పామ్ ధరలు స్థిరీకరించండి

● కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల లేఖ
● గెలలు టన్నుకు రూ.15వేలుగా నిర్ధారించాలని సూచన



సాక్షి, హైదరాబాద్: ఆయిల్‌పామ్ రైతాంగాన్ని ప్రోత్సహించేందుకు ధరలను స్థిరీకరించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు శనివారం కేంద్ర ప్రభుత్వానికి మంత్రి తుమ్మల ప్రత్యేకంగా లేఖ రాశారు. ఆయిల్‌పామ్ గెలలకు టన్ను ధర రూ.15 వేలుగా నిర్ణయించాలని, అదేవిధంగా పామాయిల్ ధర కనీసం టన్నుకు రూ.లక్ష వరకు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడానికి కేంద్ర ప్రభుత్వం 1992 నుంచి వివిధ కార్యక్రమాల ద్వారా ఆయిల్ పామ్ అభివృద్ధిని ప్రోత్సహిస్తోందని, ప్రస్తుతం రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమైన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్–ఆయిల్ పామ్ ద్వారా అమలు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరణ చేపట్టేందుకు 14 కంపెనీలకు అనుమతులిచ్చామని, ఆయిల్ పామ్ మొక్కలు పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా 44 నర్సరీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రస్తుతం ఆయిల్ పామ్ గెలల ధర టన్నుకు రూ.13,438గా ఉందని, అంతర్జాతీయ మార్కెట్‌లో తగ్గుతున్న ముడి పామాయిల్ ధరలు, వంట నూనెల దిగుమతి సుంకంపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు రైతులను నిరాశపరచడమే కాకుండా కొత్తగా ఆయిల్ పామ్ వైపు మొగ్గు చూపుతున్న రైతులపై ప్రతికూల ప్రభావం చూపిస్తోందన్నారు. ముడి పామాయిల్ దిగుమతులపై ఉన్న సుంకాన్ని కేంద్రం పూర్తిగా ఎత్తివేయడంతో ఆయిల్ పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ కారణంగా ఖమ్మం జిల్లాలో చాలామంది ఆయిల్ పామ్ రైతులు తమ తోటలను తొలగించి వాటి స్థానంలో వేరే పంటల సాగుకు మారారని మంత్రి లేఖలో పేర్కొన్నారు.

కొత్త చట్టమే..!

▶ మొదటి పేజీ తరువాయి

కీలక సవరణలు చేస్తూ రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ఓఆర్- 2024) చట్టాన్ని రూపొందించే పనిలో అధికారులు ఉన్నారు. దీనిపై న్యాయపరమైన అభిప్రాయాన్ని తీసుకున్న తర్వాత కేబినెట్‌లో ఆమోదించి, తర్వాత బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీ ఆమోదం పొందేలా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

కీలకాంశాల్లో మార్పులతో...: రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న ఆర్ఓఆర్ చట్టంలోని కీలకాంశాల్లో మార్పులు చేస్తూ కొత్త చట్టం తీసుకురావాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. ముఖ్యంగా భూసమస్యల పరిష్కారం కోసం పలు స్థాయిల్లోని అధికారులకు ఉండే అధికారాల వికేంద్రీకరణపై కొత్త చట్టంలో స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లకు ఎలాంటి అధికారాలు ఇవ్వాలి అనే అంశాలపై స్పష్టత ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. దీంతో పాటు భూ రికార్డుల ప్రక్షాళన సందర్భంగా పాస్ పుస్తకాలు ఇవ్వకుండా పార్ట్-బీలో పెట్టిన 18 లక్షల ఎకరాలు, సాదాబైనామాల కింద లావాదేవీలు జరిగి పాస్ పుస్తకాలు రాని 9 లక్షల ఎకరాల భూములకు పరిష్కారం చూపించే దిశలో చట్టం రూపొందుతోందని తెలుస్తోంది.

అప్పల బాధతో నేతన్న ఆత్మహత్య


నాగరాజు


సిరిసిల్ల టౌన్: అప్పుల బాధతో సిరిసిల్లలో ఓ నేత కార్మికుడు ఆత్మహత్య కు పాల్పడ్డాడు. సిరిసిల్ల పరిధిలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కుడిక్యాల నాగరాజు (43) నేత కార్మికుడు. ఆయన భార్య లావణ్య బీడీ కార్మికురాలు. వీరికి ఇద్దరు కుమారులు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత సిరిసిల్లలో బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వకపోవడంతో ఆరు నెలలుగా నాగరాజు పనుల్లేక ఖాళీగా ఉంటున్నాడు. ఇంటి నిర్వహణకు చేసిన అప్పులు రూ.4 లక్షలకు చేరాయి. పెద్దకొడుకును ఇటీవల ప్రైవేటు కాలేజీలో చేర్పించగా.. ఫీజు రూ.25 వేలు చెల్లించాల్సి ఉంది. చేతిలో పనిలేక.. ఇంట్లో డబ్బులు లేక.. అప్పుల బాధతో మనోవేదనకు గురై శుక్రవారం ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నాగరాజును జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఇంటి పెద్దదిక్కు మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది.

మైనింగ్ అధికారిపై ట్రాక్టర్ డ్రైవర్ దాడి


మైనింగ్ అధికారిపై దాడికి దిగుతున్న ఇసుక ట్రాక్టర్ డ్రైవర్

వేములవాడ: వేములవాడ పట్టణ శివారులోని మూలవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లు ఏకంగా మైనింగ్ అధికారి (ఆర్ఐ)పై శనివారం దాడికి దిగారు. అనుమతులతో నడుస్తున్నాయా? అక్రమంగా నడుస్తున్నాయా? అనే అంశంపై మైనింగ్ అధికారులు శనివారం వేములవాడకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. దీంతో ఓ ట్రాక్టర్ డ్రైవర్ నడిరోడ్డుపై జనం చూస్తుండగానే మైనింగ్ అధికారిపై దాడికి దిగాడు. ఈ వీడియో స్థానికంగా వైరల్‌గా మారింది. ఈ విషయమై టౌన్ సీఐ వీరప్రసాద్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదన్నారు.

ఖమేనీ కనుసన్నల్లో... ఇరాన్‌లో ఎన్నికలకు వేళాయె


ఖమేనీ

రైసీ మరణంతో అధ్యక్ష పదవికి ఎన్నికలు
- 28న ఓటింగ్, 30న ఫలితాల వెల్లడి
- రేసులో ఆరుగురు, నెజాద్‌కు మొండిచేయి

అగ్ర రాజ్యాల ఆంక్షలు. నానాటికీ దిగజారుతున్న ఆర్థిక పరిస్థితి. హక్కుల కోసం రోడ్డెక్కుతున్న మహిళలు. కరడుగట్టిన మతవాద పాలనపై యువతలోనే గాక సర్వత్రా తీవ్రతరమవుతున్న అసంతృప్తి. ఇన్ని గడ్డు సమస్యల నడుమ ఇరాన్‌లో అధ్యక్ష ఎన్నికలకు వేళైంది. మూడున్నర దశాబ్దాలుగా ఇరాన్‌ను ఏకఛత్రంగా పాలిస్తున్న సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ అభీష్టానుసారం ఎంపికైన ఆరుగురు అభ్యర్థులు రేసులో ఉన్నారు. వారిలో ఖమేనీ వీర విధేయుడే పీఠమెక్కడం లాంఛనమే కానుంది. జనాల్లో ఇప్పటికీ తిరుగులేని ఆదరణ ఉన్న మాజీ అధ్యక్షుడు అహ్మదీనెజాద్ తదితరుల అభ్యర్థిత్వాన్ని తిరస్కరించడం ద్వారా జనాకర్షక నేతలెవరూ పోటీలో ఉండకుండా సలక జాగ్రత్తలూ తీసుకున్నారు. దాంతో ఎప్పట్లాగే ఈసారి కూడా ఇరానీలు అధ్యక్ష ఎన్నికలపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఈ పరిస్థితిని ఊహించే ఆరుగురిలో డాక్టర్ మసూద్ పెజెష్కియాన్ రూపంలో ఒక సంస్కరణలవాదిని ఎంపిక చేశారు. ఆయన్ను చూసి జనాలు ఎంతో కొంత పోలింగ్ బూత్‌లకు వస్తారని ఆశిస్తున్నారు. అంతిమంగా విజేత మాత్రం మిగతా ఐదుగురు కరడుగట్టిన మతవాదుల్లోంచే ఒకరు కానున్నారు. అది ఎవరన్నది జూన్ 28న జరిగే పోలింగ్‌లో తేలనుంది.

ప్రభుత్వంపై విమర్శలే ప్రచారాస్త్రాలు

అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ గత మే 19న హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం పాలవడంతో ఇరాన్‌లో ఏడాది ముందుగానే ఎన్నికలు అనివార్యమయ్యాయి. ప్రధాని పదవిని రద్దు చేస్తూ, అధ్యక్ష పదవి స్థాయిని పెంచుతూ 1998లో రాజ్యాంగ సంస్కరణలు చేసిన అనంతరం దేశంలో ముందస్తు ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. ఎన్నడూ లేని విధంగా అభ్యర్థులంతా ఈసారి ప్రభుత్వంపై నేరుగా విమర్శలు ఎక్కుపెడుతుండటం విశేషం. దేశ ఆర్థిక దుస్థితికి ప్రభుత్వ తప్పుడు విధానాలే కారణమని వారంతా బాహాటంగా తప్పుబడుతున్నారు. ఇదంతా ప్రజలను పోలింగ్ బూత్‌కు రప్పించేందుకు ఖమేనీ చేస్తున్న ప్రయత్నాల్లో భాగమేనని చెబుతున్నారు. ఇరాన్‌లో అధ్యక్ష ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగిన దాఖలాలు లేవని అంతర్జాతీయ నిపుణులతో పాటు ఇరాన్ మేధావులు కూడా అంటుంటారు. ఎన్నికల ఫలితాలను ఖమేనీ పూర్తిగా నిర్దేశించడమే గాక తనకు అనుకూలంగా మార్చేస్తారన్నది సర్వత్రా ఉన్న అభిప్రాయం.

ఎన్నిక ఇలా...

ఇరాన్ అధ్యక్షున్ని ప్రత్యక్ష ఓటింగ్ పద్ధతిన ఎన్నుకుంటారు. పదవీకాలం నాలుగేళ్లు. పూర్తి అధికారాలు సుప్రీం లీడర్ ఖమేనీవే అయినా అధ్యక్షునికి కూడా పలు కీలక దేశీయ విధాన నిర్ణయాలతో పాటు కొంతమేరకు విదేశాంగ విధానంపై కూడా చెప్పుకోదగ్గ అధికారాలుంటాయి. 12 మంది మత పెద్దలు తదితరులతో కూడిన గవర్నింగ్ కౌన్సిల్ ఖమేనీ నిర్దేశాలకు లోబడి అధ్యక్ష అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. ఈసారి 80 దరఖాస్తులను వడపోసి ఆరుగురిని మాత్రం పోటీకి అనుమతించింది. తన ఆధిపత్యానికి సవాలుగా మారతారనుకున్న వారెవరికీ అవకాశం దక్కకుండా ఖమేనీ అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారు. ఆ క్రమంలోనే బాగా జనాకర్షణ ఉన్న మాజీ అధ్యక్షుడు నెజాద్‌తో పాటు మూడుసార్లు పార్లమెంట్ స్పీకర్‌గా చేసిన అలీ లారిజానీ అభ్యర్థిత్వం కూడా తిరస్కరణకు గురైంది. తిరస్కృత జాబితాలో ఏడుగురు మహిళలు కూడా ఉన్నారు! జూన్ 28న ఓటింగ్ జరగనుంది. 30కల్లా ఫలితాలు వెలువడే అవకాశముంది. ఎవరికీ 50 శాతానికి మించి ఓట్లు రాని పక్షంలో తొలి రెండు స్థానాల్లో నిలిచే అభ్యర్థుల మధ్య తిరిగి ఎన్నిక జరుగుతుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఆ ఆరుగురు

జనరల్ మహమ్మద్ బఖర్ గలీబాఫ్



పార్లమెంట్ స్పీకర్. రాజధాని టెహ్రాన్ మేయర్‌గా, సైనిక విభాగమైన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కమాండర్‌గా, దేశ పోలీస్ చీఫ్‌గా చేసిన అనుభవముంది. పైగా ఖమేనీకి అత్యంత సన్నిహితుడు కూడా. ఆయనతో బంధుత్వమూ ఉందంటారు. దాంతో గలీబాఫ్‌కే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు పరిశీలకులు భావిస్తున్నారు. సైన్యంలోని కీలక అధికారుల మద్దతు అదనపు బలం కానుంది. కాకపోతే ఆయనపై లెక్కలేనన్ని అవినీతి ఆరోపణలున్నాయి. పైగా గతంలో రెండుసార్లు అధ్యక్ష పదవికి పోటీ పడి ఓడారు.

సయీద్ జలిలీ




మాజీ చీఫ్ న్యూక్లియర్ నెగోషియేటర్. ఇరాన్–ఇరాక్ యుద్ధంలో కాళ్లు పోగొట్టుకున్నారు. యుద్ధవీరునిగా దేశమంతటా కాస్తో కూస్తో పేరున్న నేత. ఈయనకూ ఖమేనీ ఆశీర్వాదముందని చెబుతారు. దాంతో జలిలీ అవకాశాలకు గండి కొట్టేందుకు గలీబాఫ్ శాయశక్తులా ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. దీనికి తోడు జనాదరణ విషయంలో మరో అహ్మదీనెజాద్‌లా ఎదిగే సత్తా ఉండటం కూడా జలిలీ అవకాశాలకు గండి కొట్టవచ్చని పరిశీలకుల అభిప్రాయం.

ముస్తాఫా పోర్ మొహమ్మదీ



రేసులో ఉన్న ఆరుగురిలో ఏకైక మతాధికారి కావడం ఈయనకు కలిసొచ్చే అంశం. పైగా 85 ఏళ్ల ఖమేనీ తన వారసుని ఎంపికపై గట్టిగా దృష్టి సారించారు. కుమారుడు కుమారుడు ముజ్తబాకు పగ్గాలు అప్పగించాలని భావిస్తున్నారు. ఈ సమయంలో అధ్యక్ష పదవిలో మత పెద్ద ఉండటం మేలని ఖమేనీ భావించే పక్షంలో మొహమ్మదీకి చాన్సుంటుందని చెబుతున్నారు. కాకపోతే సుప్రీం లీడర్ పదవి కోసం ముజ్తబాతో పోటీ పడే సత్తా ఉండటం మొహమ్మదీకి ప్రతికూలంగా మారవచ్చు.

మసూద్ పెజెష్కియాన్



గట్టి సంస్కరణలవాది. దేశ ఆరోగ్య మంత్రిగా చేశారు. విద్యావంతునిగా మంచి పేరే ఉంది. మితిమీరుతున్న మతవాదంపై ప్రజల్లో ప్రబలుతున్న అసంతృప్తిని చల్లార్చేందుకే ఈయనను అభ్యర్థుల జాబితాలో చేర్చినట్టు చెబుతున్నారు. 2008 నుంచీ పార్లమెంటు సభ్యుడు. అందరికీ ఆమోదయోగ్యమైన కొత్త ముఖం మేలని ఖమేనీ భావిస్తే తప్ప మసూద్‌కు అవకాశాలు తక్కువేనని విశ్లేషకులు అంటున్నారు.

అలీ రజా జకానీ



టెహ్రాన్ మేయర్. గతంలో పలు ఉన్నత పదవులు నిర్వహించారు. పబ్లిక్ పార్కుల్లో మసీదు నిర్మాణాన్ని మద్దతిచ్చి విమర్శలకు గురయ్యారు. 2021లో కూడా అధ్యక్ష పదవికి పోటీ పడ్డా పెద్దగా ఓట్లు సాధించలేదు. ఈసారి కూడా జకానీ పేరు గట్టి పోటీదారుగా పెద్దగా పరిగణనలో లేదు. కాకపోతే ఖమేనీకి వీర విధేయుడు.

ఆమిర్ హొసేన్ గజీజాదే హషేమీ



ప్రస్తుతం 12 మంది దేశ ఉపాధ్యక్షుల్లో ఒకరు. రిటైరైన సైనికులు, యుద్ధాల్లో మరణించిన సైనికుల కుటుంబాల సంక్షేమ బాధ్యతలు చూస్తున్నారు. దాంతో ఆయా వర్గాల్లో మంచి ఆదరణే ఉంది. కాకపోతే ఈయనకు కూడా ఈసారి అవకాశం ఉండకపోవచ్చని చెబుతున్నారు.

నీట్-యూజీ అవకతవకలపై సీబీఐ విచారణ

న్యూఢిల్లీ: వైద్య విద్యలో అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్–యూజీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై కేంద్రం సీబీఐ విచారణకు ఆదేశించింది. పేపర్ లీకయ్యిందని, నీట్‌ను రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో... ఆరోపణలపై సమగ్ర విచారణ కోసం దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తున్నట్లు విద్యాశాఖ శనివారం రాత్రి ప్రకటించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ ఏడాది మే 5న నీట్–యూజీ పరీక్షను నిర్వహించింది. పేపర్ లీక్ అయ్యిందని, అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తడంతో శనివారం కేంద్ర ప్రభుత్వం పలు నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించింది. నీట్- యూజీలో అవకతవకలు, చీటింగ్, ఒకరికి బదులు మరొకరు పరీక్షలు రాయడం, మాల్‌ప్రాక్టీసు జరిగిందని ఆరోపణలు వచ్చాయి. 'పరీక్షల నిర్వహణలో పారదర్శకత కోసం, సమగ్ర దర్యాప్తు కోసం నీట్–యూజీ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి అప్పగించాలని నిర్ణయించాం' అని విద్యాశాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. మే 5న జరిగిన నీట్- యూజీ పరీక్షకు దాదాపు 24 లక్షల మంది హాజరయ్యారు. జూన్ 4న ఫలితాలు ప్రకటించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 67 మందికి 720గాను 720 మార్కులు వచ్చాయి. దాంతో అనుమానాలు తలెత్తాయి. అంతేకాకుండా సమయం నష్టపోయినందుకు ఆరు సెంటర్లలో 1,563 మందికి గ్రేస్ మార్కులు కలిపారు. దీనిపై అభ్యర్థుల్లో ఆగ్రహావేశాలు పెల్లుబుకడంతో ప్రభుత్వం వీరి గ్రేస్ మార్కులను రద్దుచేసింది. ఆదివారం వీరికి మళ్లీ పరీక్ష నిర్వహిస్తోంది.

ఎన్‌టీఏ డీజీ సుబోధ్‌పై వేటు


సుబోధ్‌కుమార్

న్యూఢిల్లీ: కీలకమైన నీట్, నెట్ పరీక్షల్లో పేపర్ లీకేజీ ఆరోపణలు దుమారం రేపుతున్నాయి. ఆరోపణలు వెల్లువెత్తుతుండటంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. నీట్, నెట్ పరీక్షలను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) డైరెక్టర్ జనరల్ సుబోధ్ సింగ్‌పై శనివారం వేటు వేసింది. ఇండియా ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్, ఎండీ ప్రదీప్ సింగ్ ఖరోలాకు ఎన్‌టీఏ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. యూజీసీ–నెట్ పరీక్ష నిర్వహించిన మరుసటి రోజే, ఈనెల 19న కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. పరీక్షల సమగ్రతకు భంగం వాటిల్లిందని హోంశాఖ తెలుపడంతో యూజీసీ- నెట్‌ను రద్దు చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, పీహెచ్‌డీల ప్రవేశానికి నెట్ పరీక్షను ఏడాదికి రెండుసార్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తుంది.

నేటి నీట్-పీజీ పరీక్ష వాయిదా

న్యూఢిల్లీ: వైద్య విద్యలో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్–పీజీ పరీక్షను కేంద్ర ఆరోగ్య శాఖ శనివారం ఆఖరి నిమిషంలో వాయిదా వేసింది. విద్యార్థుల ప్రయోజనాల కోసమే ముందుజాగ్రత్తగా ఈ చర్య తీసుకున్నామని, వీలైనంత త్వరలో కొత్త తేదీని ప్రకటిస్తామని వెల్లడించింది. ఈ పరీక్ష ఆదివారం జరగాల్సి ఉంది.

సూరజ్ రేవణ్ణపై లైంగిక వేధింపుల కేసు

బనశంకరి: జేడీఎస్‌కు చెందిన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దాడి, నగ్న వీడియోల కేసు దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. తాజాగా ప్రజ్వల్ తమ్ముడు డాక్టర్ సూరజ్ రేవణ్ణ (36)పై కూడా లైంగిక వేధింపుల కే సు నమోదైంది. ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణ తనపై అసహజ లైంగిక దాడికి పాల్పడ్డారని చేతన్ కే.ఎస్. అనే జేడీఎస్ కార్యకర్త శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హాసన్ జిల్లా అరకలగూడుకు చెందిన చేతన్ వీడియోలను కూడా విడుదల చేయడంతో కన్నడ రాజకీయాల్లో మరోసారి సంచల నం చెలరేగింది. లోక్‌సభ ఎన్నికల సమయంలో పరిచయమైన సూరజ్ ఫాంహౌస్‌కు పిలిచి లైంగిక దాడికి యత్నించాడని చేతన్ ఆరోపించాడు.

డబ్బులు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్

చేతన్, అతని బంధువు డబ్బులు డిమాండ్ చేశారని, ఇవ్వకపోతే లైంగిక వేధింపుల కేసు పెడతామని బ్లాక్‌మెయిల్ చేశారని సూరజ్ రేవణ్ణ ముఖ్య అనుచరుడైన శివకుమార్ సైతం శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతో స్నేహం చేసిన చేతన్.. సూరజ్ రేవణ్ణ బ్రిగేడ్‌కు పని చేయడం ప్రారంభించాడని, కుటుంబ ఖర్చులకు డబ్బు ఇవ్వాలని కోరగా తాను నిరాకరించడంతో సూరజ్ రేవణ్ణపై లైంగిక వేధింపుల కేసు పెడతామని బెదిరింపులకు దిగారని శివకుమార్ పేర్కొన్నారు. మొదట రూ. 5 కోట్లు తర్వాత దాన్ని తగ్గించి రూ. 2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారని అన్నా రు. శివకుమార్ ఫిర్యాదుతో చేతన్, అతని బంధువుపై కేసు నమోదైంది.

'నీట్' నిందితులకు నార్కో బ్రెయిన్ మ్యాపింగ్ టెస్టులు!

పాట్నా/దేవగఢ్: నీట్–యూజీ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో బిహార్ పోలీసు శాఖ ఆర్థిక నేరాల విభాగం అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నీట్ అసలైన ప్రశ్నపత్రాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) నుంచి సేకరించారు. పేపర్ లీకేజీకి సంబంధించి గత నెలలో పాట్నాలోని ఓ ఇంట్లో సోదాల్లో స్వాధీనం చేసుకున్న ప్రశ్నపత్రాలతో ఈ ప్రశ్నపత్రాలను సరిపోల్చనున్నారు. ఫోరెన్సిక్ టెస్టు తర్వాత సరిపోల్చే ప్రక్రియ చేపట్టనున్నట్లు అధికారులు చెప్పారు. మరోవైపు ఈ కేసులో అరెస్టయిన నిందితులకు నార్కో అనాలిసిస్, బ్రెయిన్ మ్యాపింగ్ టెస్టులు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాల్లో మనీ లాండరింగ్ కోణం కూడా ఉండడంతో ఈడీ సైతం దర్యాప్తు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

'పరీక్ష'ల సంస్కరణలపై కమిటీ

ఇస్రో మాజీ చైర్మన్ కె.రాధాకృష్ణన్ నేతృత్వం



ఢిల్లీ: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పరీక్షలు పారదర్శకంగా, న్యాయంగా, సాఫీగా నిర్వహించేందుకు ఏడుగురు సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్ర విద్యా శాఖ శనివారం ప్రకటించింది. ఈ నిపుణుల కమిటీకి ఇస్రో మాజీ చైర్మన్ కె.రాధాకృష్ణన్ నేతృత్వం వహిస్తారు. పరీక్షల నిర్వహణ ప్రక్రియ, డాటా భద్రతకు చేపట్టాల్సిన చర్యలు, ఎన్‌టీఏ నిర్మాణం, పనితీరుకు సంబంధించి చేపట్టాల్సిన సంస్కరణలను ఈ కమిటీ సిఫారసు చేస్తుంది. రెండు నెలల్లో ఈ కమిటీ తమ నివేదికను విద్యాశాఖకు సమర్పిస్తుంది. నీట్, యూజీసీ- నెట్ పరీక్షల్లో అవకతవకలపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కేంద్రం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయడం గమనార్హం.


కమిటీ సభ్యులు:

1. కె.రాధాకృష్ణన్ (ఇస్రో మాజీ చైర్మన్); 2. డాక్టర్ రణదీప్ గులేరియా (ఎయిమ్స్ మాజీ డైరెక్టర్); 3. ప్రొఫెసర్ బీజే రావు (వైస్ చాన్సలర్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్); 4. ప్రొఫెసర్ రామమూర్తి కె. (ఐఐటీ మద్రాస్); 5. పంకజ్ బన్సల్ (పీపుల్స్ స్ట్రాంగ్ సహ వ్యవస్థాపకుడు)
6. ఆదిత్య మిట్టల్ (డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్, ఐఐటీ ఢిల్లీ)
7. గోవింద్ జైస్వాల్ (జాయింట్ సెక్రటరీ, కేంద్ర విద్యాశాఖ)

బిహార్‌లో కూలిన మరో వంతెన

సివన్: బిహార్‌లో మరో వంతెన కూలిపోయింది. సివన్ జిల్లాలో దారౌండా, మహారాజ్‌గంజ్ గ్రామాలను అనుసంధానిస్తూ కాలువపై నిర్మించిన చిన్నపాటి వంతెన శనివారం ఉదయం 5 గంటల సమయంలో కూలింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదని జిల్లా మేజిస్ట్రేట్ ముకుల్‌కుమార్ గుప్తా చెప్పారు. ఇలా చాలా పాత వంతెన అని తెలిపారు. నీటి ప్రవాహం వల్ల పిల్లర్లు బలహీనంగా మారి వంతెన కూలిందని అన్నారు. 1991లో ఈ బ్రిడ్జిని నిర్మించినట్లు స్థానిక అధికారి సూర్యప్రతాప్ సింగ్ వెల్లడించారు. బిహార్‌లో వంతెన కూలడం వారం రోజుల వ్యవధిలో ఇది రెండో ఘటన. అరారియా జిల్లాలో కొత్తగా నిర్మించిన 180 మీటర్ల పొడవైన వంతెన మంగళవారం కూలిపోయిన సంగతి తెలిసిందే.

బాల రామున్ని ప్రతిష్టించిన పూజారి మృతి



వారణాసి: అయోధ్య రామాలయంలో బాల రాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రధాన పూజారి ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ (86) శనివారం పరమపదించారు. గత కొద్ది రోజులుగా దీక్షిత్ అనారోగ్యంతో బాధపడుతున్నారని కుటుంబసభ్యులు తెలిపారు. ఇక్కడి మణికర్ణిక ఘాట్‌లో అంత్యక్రియలు జరుగుతాయని వెల్లడించారు. ఈ ఏడాది జనవరి 22న అయోధ్య రామాలయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన విషయం తెలిసిందే. వారణాసిలోని ప్రముఖ పండితుల్లో ఒకరైన లక్ష్మీకాంత్ దీక్షిత్ మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన వారు. కాకపోతే ఆయన కుటుంబం కొన్ని తరాలుగా వారణాసిలోనే నివసిస్తోంది.

చైనాలో వరద బీభత్సం: 53 మంది మృతి

బీజింగ్: ఆకస్మిక వర్షాలు, వరదలతో దక్షిణ చైనా వణికిపోతోంది. వర్షాల ధాటికి కొండ చరియలు విరిగిపడుతున్నాయి. బురద ప్రవాహం గ్రామాలను ముంచెత్తుతోంది. వరదల కారణంగా గాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లో 47 మంది, ఫుజియాన్ ప్రావిన్స్‌లో ఆరుగురు మృత్యువాత పడ్డారు. మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. వర్షాలు, వరదల వల్ల భారీగా ఆస్తినష్టం వాటిల్లినట్లు అధికారులు వెల్లడించారు. పెద్ద సంఖ్యలో ఇళ్లు కూలిపోయాయి.

గాజాపై దాడులు... 42 మంది దుర్మరణం

ఖాన్ యూనిస్: గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. షతీ శరణార్థుల శిబిరం, పొరుగునున్న తుఫాపై శుక్ర, శనివారాల్లో జరిగిన దాడుల్లో కనీసం 42 మంది దుర్మరణం పాలైనట్టు పాలస్తీనా మీడియా విభాగం పేర్కొంది. ''యుద్ధం మొదలైన నాటినుంచి గాజాలో మృతుల సంఖ్య 37,500 దాటింది. దాదాపు లక్ష మంది దాకా గాయపడ్డారు'' అని వివరించింది. ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు పశ్చిమ రఫాలోకి మరింతగా చొచ్చుకొస్తున్నాయి. పైనుంచి యుద్ధ విమానాలు బాంబుల వర్షం కురిపిస్తున్నాయి. మరోవైపు, గత అక్టోబర్ నుంచి నిరంతరాయంగా జరుగుతున్న దాడుల దెబ్బకు గాజాలో ఆరోగ్య వ్యవస్థ నేలమట్టమైపోయిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ''ఇప్పటిదాకా కనీసం 9,300 మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ బందీలుగా పట్టుకుంది. వారితో అత్యంత అమానుషంగా ప్రవర్తిస్తోంది'' అని పాలస్తీనా శనివారం ఆరోపించింది.

అభివృద్ధి భాగస్వామి బంగ్లాదేశ్

సంబంధాలు బలపడాలి: మోదీ
- బంగ్లా ప్రధాని హసీనాతో భేటీ
- సమగ్ర ఆర్థిక ఒప్పందంపై మళ్లీ చర్చలకు నిర్ణయం

న్యూఢిల్లీ: సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం(సీఈపీఏ)పై చర్చలు ప్రారంభించాలని, ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకొనే దిశగా ప్రణాళిక రూపొందించుకోవాలని భారత్, బంగ్లాదేశ్ నిర్ణయించుకున్నాయి. రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత్ వచ్చిన బంగ్లా ప్రధాన మంత్రి షేక్ హసీనాతో శనివారం ప్రధాని నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలు, వ్యాపార వాణిజ్యపరమైన అంశాలపై విస్తృతంగా చర్చించారు. మయన్మార్ పరిణామాలతోపాటు రోహింగ్యా కాందిశీకుల అంశంపై అభిప్రాయాలు పంచుకున్నారు. అనంతరం సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. భారత్‌కు బంగ్లాదేశ్ అతిపెద్ద అభివృద్ధి భాగస్వామి అని మోదీ అన్నారు. బంగ్లాదేశ్‌తో సంబంధ బాంధవ్యాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లడంలో భాగంగా సీఈపీఏపై చర్చలు ప్రారంభించామని నిర్ణయించినట్లు తెలిపారు. రక్షణ రంగంలో పరస్పర సహకారంపై విస్తృతంగా చర్చించామన్నారు. రక్షణ ఉత్పత్తుల తయారీ, సైనిక దళాల ఆధునీకరణ విషయంలో ఇరుదేశాలు సహకరించుకోవాలని ఆకాంక్షించారు.

భారత్ విశ్వసనీయ మిత్రదేశం: హసీనా

ఇండో–పసిఫిక్ కార్యక్రమంలో చేరాలన్న బంగ్లాదేశ్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని మోదీ చెప్పారు. ''ఇరు దేశాల బంధానికి పౌరుల మధ్య సంబంధాలే పునాది. వైద్య సేవల కోసం వచ్చే బంగ్లా పౌరులకు ఈ–మెడికల్ వీసా కల్పిస్తాం. బంగ్లాదేశ్‌లోని రంగపూర్‌లోని కొత్తగా అసిస్టెంట్ హైకమిషన్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నాం. 1996 నాటి గంగా నది నీటి ఒప్పందాన్ని నవీకరించడానికి సాంకేతిక చర్చలు ప్రారంభిస్తాం. తీస్తా నది పరిరక్షణ, నిర్వహణపై చర్చించడానికి బంగ్లాదేశ్‌కు టెక్నికల్ టీమ్‌ను పంపుతాం'' అని ప్రధాని వివరించారు. సుస్థిరమైన, సౌభాగ్యవంతమైన, ప్రగతిశీల బంగ్లాదేశ్‌ను బంగబంధు షేక్ ముజిబుర్ రెహ్మాన్ కలలుగన్నారని, ఆ కలను నిజం చేయడానికి తమవంతు సహకారం అందిస్తామని నరేంద్ర మోదీ ప్రకటించారు. భారత్ తమకు అతిపెద్ద పొరుగు దేశమని, తమకు అత్యంత విశ్వసనీయ మిత్రదేశమని షేక్ హసీనా పునరుద్ఘాటించారు. భారత్‌తో సంబంధాలకు అత్యధిక విలువ ఇస్తున్నామని ఆమె పునరుద్ఘాటించారు.

10 ఒప్పందాలపై సంతకాలు

డిజిటల్, సముద్రయానం, సముద్ర వనరుల వినియోగం, రైల్వే, అంతరిక్షం, పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ టెక్నాలజీ, ఆరోగ్యం, వైద్య వంటి కీలక రంగాల్లో సహకారం పెంపొందించుకోవడమే లక్ష్యంగా భారత్, బంగ్లాదేశ్ శనివారం 10 ఒప్పందాలపై సంతకాలు చేశాయి.


శనివారం ఢిల్లీలో బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో భేటీ అయిన ప్రధాని మోదీ

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో షేక్ హసీనా భేటీ

న్యూఢిల్లీ: వేర్వేరు రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకొనే దిశగా భారత్, బంగ్లాదేశ్ వేగంగా ముందుకు సాగుతున్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హర్షం వ్యక్తం చేశారు. నూతన రంగాల్లో సహకారం పెంపొందించుకుంటున్నాయని, రానున్న రోజుల్లో ఇరు దేశాల మధ్య సంబంధాలను ఈ సహకారమే నిర్ణయిస్తుందని చెప్పారు. శనివారం రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపది ముర్ముతో బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా సమావేశమయ్యారు. భారత్, బంగ్లాదేశ్ మధ్య సంబంధాలను బలోపేతం చేసుకొనేలా కలిసి పనిచేయాలని నిర్ణయానికొచ్చారు. షేక్ హసీనాను కలవడం సంతోషంగా ఉందని ముర్ము పేర్కొన్నారు.

పెట్రో జీఎస్టీ ఎంతన్నది... రాష్ట్రాలే నిర్ణయించుకోవాలి

- ఆర్థిక మంత్రి నిర్మల వ్యాఖ్యలు
- ప్లాట్‌ఫాం టికెట్లకు ఇక నో జీఎస్టీ
- పలు రైల్వే సేవలపై కూడా
- సోలార్ కుక్కర్లు, పాల క్యాన్లపై 12 శాతం
- జీఎస్టీ కౌన్సిల్ భేటీలో నిర్ణయం



న్యూఢిల్లీ: ప్లాట్‌ఫాం టికెట్లకు ఇకపై జీఎస్టీ ఉండబోదు. వాటితో పాటు రిటైరింగ్ రూములు, వెయిటింగ్ రూములు, క్లోక్ రూములు, ప్లాట్‌ఫాంలపై బ్యాటరీ వాహనాలు తదితర రైల్వే సేవలపై కూడా జీఎస్టీ తొలగించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సారథ్యంలో శనివారం జరిగిన జీఎస్టీ కౌన్సిల్ 53వ సమావేశం ఈ మేరకు పలు సిఫార్సులు చేసింది. కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడా ఈ సందర్భంగా నిర్మల చర్చలు జరిపారు. కేంద్రం ఇచ్చే 50 ఏళ్ల వడ్డీ లేని రుణాల పథకం ప్రయోజనాలను రాష్ట్రాలు అందిపుచ్చుకోవాలన్నారు. పెట్రోల్, డీజిల్‌ను కూడా జీఎస్టీ పరిధిలోకి తేవాలన్నది కేంద్రం ఉద్దేశమని ఆమె పునరుద్ఘాటించారు. ''అందుకు అంగీకరించాల్సింది ఇక రాష్ట్రాలే. అవి ఒక్కతాటిపైకి వచ్చి చర్చించి పెట్రోల్, డీజిల్‌పై ఎంత శాతం జీఎస్టీ వేయాలో నిర్ణయించుకుని కౌన్సిల్‌కు తెలపాలి'' అని భేటీ అనంతరం నిర్మల మీడియాతో అన్నారు. ''ఇన్‌పుట్ క్రెడిట్ పన్నులో మార్పుచేర్పులు చేయాలని నిర్ణయం జరిగింది. ఇన్‌వాయిసింగ్ తదితరాల్లో అక్రమాలకు అడ్డుకట్టే వేసేందుకు ఇకపై దేశవ్యాప్తంగా బయోమెట్రిక్‌తో కూడిన ఆధార్ అథెంటికేషన్ తప్పనిసరి చేస్తున్నాం. జీఎస్టీ చెల్లింపు తుది గడువును ఏప్రిల్ 30 నుంచి జూన్ 30కి పొడిగించాం. తద్వారా వర్తకులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి సంస్థలు, పరిశ్రమలకు లబ్ధి చేకూరుతుంది'' అని మంత్రి వివరించారు. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు...

- అన్ని రకాల సోలార్ కుక్కర్లపై ఇకనుంచి 12 శాతం జీఎస్టీ
- అన్ని రకాల కార్టన్ బాక్సులపై జీఎస్టీ 18 నుంచి 12 శాతానికి తగ్గింపు. జమ్మూ కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల పళ్ల వ్యాపారులకు ప్రయోజనం.
- స్ప్రింకర్లపై జీఎస్టీ 12 శాతానికి తగ్గింపు.
- విద్యా సంస్థల హాస్టళ్లలో కాకుండా బయట ఉండే విద్యార్థులకు నెలకు రూ.20 వేల దాకా దాకా జీఎస్టీ మినహాయింపు
- స్టీల్, అల్యూమినియం, ఇనుప పాల క్యాన్లపై 12 శాతం జీఎస్టీ.
- జీఎస్టీ ఎగవేత తదితర ఉదంతాల్లో జరిమానాలపై వడ్డీ ఎత్తివేత.

ప్రొటెం స్పీకర్‌పై రగడ


భర్తృహరి మహతాబ్


కె.సురేశ్

దళితుడిని అవమానించారంటున్న కాంగ్రెస్

చైర్‌పర్సన్ ప్యానెల్‌లో ఉండబోమని విపక్షాల హెచ్చరిక

న్యూఢిల్లీ: 18వ లోక్‌సభ తొలి సమావేశాలకు ముందే అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం వేడెక్కుతోంది. ప్రొటెం స్పీకర్ ఎంపిక తాజా వివాదానికి కారణమైంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏడుసార్లు ఎంపీ అయిన భర్తృహరి మహతాబ్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించిన విషయం తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. బీజేపీ పార్లమెంటరీ సంప్రదాయాలను తుంగలో తొక్కిందని ఆరోపించింది. తమ పార్టీ ఎంపీ కె.సురేశ్ అందరికంటే సీనియర్ అని, ఆయన ఎనిమిదిసార్లు ఎంపీగా ఎన్నికయ్యారని.. సంప్రదాయం ప్రకారం నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించడానికి ప్రొటెం స్పీకర్‌గా సురేశ్‌ను నియమించాల్సిందని వాదిస్తోంది. దళితుడు కాబట్టే సురేశ్‌ను బీజేపీ పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించింది. వాస్తవానికి 18వ లోక్‌సభలో కె.సురేశ్, వీరేంద్ర కుమార్‌లు ఇద్దరు ఎనిమిదేసి సార్లు ఎంపికైన, అందరికంటే సీనియర్ సభ్యులు. అయితే వీరేంద్ర కుమార్ కేంద్ర మంత్రివర్గంలో చేరడంతో.. సురేశ్ ప్రొటెం స్పీకర్ కావాలి. కానీ బీజేపీ ఏడుసార్లు ఎంపీ అయిన మహతాబ్‌ను ఎంచుకుంది. ఆయనకు సహాయకారిగా ఉండేందుకు కె.సురేశ్, టీఆర్ బాలు (డీఎంకే), సుదీప్ బందోపాధ్యాయ్ (టీఎంసీ), రాధామోహన్ సింగ్, ఫగ్గన్‌సింగ్ కులస్తే (బీజేపీ)లతో చైర్ పర్సన్ ప్యానెల్‌ను ఏర్పాటు చేశారు. బీజేపీ వైఖరికి నిరసనగా చైర్ పర్సన్ ప్యానెల్‌కు దూరంగా ఉండే అంశాన్ని విపక్షాలకు చెందిన కె.సురేశ్, టి.ఆర్. బాలు, సుదీప్ బందోపాధ్యాయ్‌లు పరిశీలిస్తున్నారని విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. దళితుడు కాబట్టే సురేశ్‌ను ప్రొటెం స్పీకర్‌గా ఎంపిక చేయలేదనే వాదనను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కొట్టిపారేశారు. సురేశ్ ఎనిమిదిసార్లు ఎంపిక అయినప్పటికీ.. ఆయన వరుసగా ఎన్నికైన ఎంపీ కాదని, 1998, 2004 లోక్‌సభల్లో ఆయన సభ్యుడు కాదని పేర్కొన్నారు. మరోవైపు మహతాబ్ ఏడుసార్లు వరుసగా ఎంపీగా గెలిచారని, అందుకే ఆయన్ను ప్రొటెం స్పీకర్‌గా ఎంచుకున్నామని వాదించారు.

ప్రొటెం స్పీకర్ ఎంపికపై అబద్ధాలు చెబుతూ కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగానే గిరిజన మంత్రి కిరణ్ రిజిజును అవమానిస్తోందని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఎదురుదాడికి దిగారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖను చూస్తున్న తొలి గిరిజన మంత్రిని అయినప్పటికీ కాంగ్రెస్ అబద్ధాలు, బెదిరింపులకు లొంగబోనని రిజిజు అన్నారు. 'నిబంధనలను పాటిస్తాని, ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన.. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ నినాదాన్ని అనుసరిస్తా'రని రిజిజు పేర్కొన్నారు. సురేశ్‌ను పరిగణనలోకి తీసుకోకపోవడం పార్లమెంటరీ సంప్రదాయాలను కాలరాసే ప్రయత్నమేనని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు. బీజేపీని 240 సీట్లకే ప్రజలు పరిమితం చేసినా కాషాయపార్టీ ప్రజాస్వామ్యం, సంప్రదింపులు, పార్లమెంటరీ సంప్రదాయాలు, ప్రతిపక్షాలు అంటే ఏమిటనే దానిని అర్థం చేసుకోవడం లేదని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. నిరంకుశ బీజేపీ విపక్ష అభ్యర్థిని ప్రొటెం స్పీకర్‌గా కూడా చూడాలనుకోవడం లేదన్నారు. అందుకే ఫిరాయింపుదారు భర్తృహరి మహతాబ్‌ను ఎంచుకుందన్నారు. మహతాబ్ సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేడీ నుంచి బీజేపీలోకి మారి.. ఆ పార్టీ టికెట్‌పై కటక్ నుంచి గెలుపొందారు.

అందరి దృష్టీ స్పీకర్ ఎన్నికపైనే...

18వ లోక్‌సభ తొలి సమావేశాలు ఈ నెల 24 నుంచి ప్రారంభమవుతున్న విషయం తెలిసిందే. 24, 25 తేదీల్లో నూతన సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుంది. అనంతరం 26న జరిగే స్పీకర్ ఎన్నికపై అందరి దృష్టీ నెలకొంది.

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 23 । జూన్ । 2024



వ్యాపారంలో నష్టాలతో చోరీలు

మేడ్చల్‌లో బుర్ఖా ధరించి.. నగల దుకాణం లోకి చొరబడి.. యజమానిపై కత్తితో దాడి చేసి దోపిడీకి పాల్పడిన కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. -8లో



ఆర్టీఏకు సాంకేతిక దన్ను!

డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లు, వాహనాల స్క్రాపింగ్ పద్ధతుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొనేందుకు రవాణా శాఖ చర్యలకు ఉపక్రమించింది. -10లో

గరిష్టం/కనిష్టం
33.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. గరిష్టంగా 33, కనిష్టంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉంటాయి.

తక్కువ ఖర్చుతోనే కీమోథెరపీ

నిమ్స్‌లో అందుబాటులోకి హెచ్‌ఐపీఈసీ యంత్రం

సాక్షి, సిటీబ్యూరో: సామాన్య ప్రజలకు సైతం తక్కువ ఖర్చుతో అత్యాధునిక వైద్య సేవలందించడంలో నిమ్స్ ఆస్పత్రి ముందుంటుందని సర్జికల్ అంకాలజీ విభాగాధిపతి డా.రాజశేఖర్ శాంతప్ప అన్నారు. శనివారం నిమ్స్‌లో హెచ్‌ఐపీఈసీ యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన హైపర్‌థెర్మిక్ ఇంట్రా పెరిటోనియల్ కీమోథెరపీ (హెచ్‌ఐపీఈసీ) యంత్రం నిమ్స్ ఆస్పత్రి సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఖర్చయ్యే ఈ చికిత్స నిమ్స్‌లో రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల్లోనే లభిస్తుందన్నారు. ఇది ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ పరిధిలోకి వస్తుందని ఆయన తెలిపారు. కేన్సర్ బాధితులకు తక్కువ ఖర్చుతో మెరుగైన చికిత్స అందించేందుకు ఇది సరైన అవకాశం అని పేర్కొన్నారు. పొత్తికడుపు కేన్సర్, అండాశయ కేన్సర్ చికిత్సలో గణనీయమైన ఫలితాలు ఇస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేకుండా డ్రైవింగ్ చేస్తే కేసులు

సాక్షి, సిటీబ్యూరో: మైనర్లతో సహా నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వాహనదారులపై నగర పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ క్రమంలో 85 మంది వాహన యజమానులపై ఐపీసీ 420 కింద కింద 35 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. వాహనాలు నడుపుతూ పట్టుబడిన 40 మంది మైనర్లతో పాటు ఆయా వాహన యజమానులపైనా కేసులు నమోదు చేశారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపే వారిపై ఎంవీ యాక్ట్‌లోని 188 /177 చట్టం కింద 3 నెలల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరించారు.

ఫోన్ మాట్లాడుతూ బస్సు నడిపితే కఠిన చర్యలు

స్కూల్ బస్సుల డ్రైవర్లకు జేటీసీ రమేష్ హెచ్చరిక



సాక్షి, సిటీబ్యూరో: మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ బస్సు నడిపినా, ర్యాష్ డ్రైవింగ్ చేసినా కఠిన చర్యలు తప్పవని రవాణాశాఖ హైదరాబాద్ జేటీసీ రమేష్ స్కూల్ బస్సు డ్రైవర్లను హెచ్చరించారు. పిల్లలను పాఠశాలకు తీసుకెళ్లే, తిరిగి ఇళ్ల వద్దకు చేర్చే వరకు ప్రతి క్షణం ఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శనివారం ఖైరతాబాద్ ఆర్టీఏలో నిర్వహించిన స్కూల్ బస్ డ్రైవర్ల సమావేశంలో ఆయన పలు సూచనలు, సలహాలు, హెచ్చరికలతో భద్రతా పాఠాలను బోధించారు. రహదారి భద్రతా నిబంధనలను ఉల్లంఘించే వాహనాలను నడిపితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. బస్సులను ఎప్పటికప్పుడు కండిషన్‌లో ఉంచుకోవాలని, డ్రైవర్లు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా బస్సులను నడపాలని చెప్పారు. 'మీ పట్ల ఎంతో నమ్మకంతో తల్లిదండ్రులు తమ పిల్లలను బస్సెక్కిస్తున్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయొద్దు. జాగ్రత్తగా బస్సులు నడపండి. చిన్నారులను క్షేమంగా ఇళ్లకు చేర్చండి' అని చెప్పారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది డ్రైవర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఫిట్‌నెస్ లేని బస్సులపై ఇటీవల ప్రత్యేక తనిఖీలు చేపట్టిన ఆర్టీఏ అధికారులు తాజాగా డ్రైవర్‌ల పనితీరుపై దృష్టి సారించారు. ప్రతి బస్సులో తప్పనిసరిగా అటెండర్లు ఉండాలని, పిల్లలు బస్సెక్కే, దిగే సమయాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో ప్రాంతీయ రవాణా అధికారులు పురుషోత్తంరెడ్డి. సీపీ వెంకటేశ్వర్లు, సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఫలక్‌నుమాలో యువకుడి దారుణ హత్య



జాకీర్ అలీ (ఫైల్)

చాంద్రాయణగుట్ట: గత కొన్ని రోజులుగా పాతబస్తీలో వరుస హత్యలు స్థానికులను కలవరానికి గురిచేస్తున్నాయి. ముఖ్యంగా ఫలక్‌నుమా, ఛత్రినాక ఏసీపీ డివిజన్ల పరిధిలో వరుసగా దారుణాలు చోటుచేసుకుంటున్నాయి. శాలిబండ, ఛత్రినాక పోలీస్‌స్టేషన్ల పరిధిలో వారం వ్యవధిలో జరిగిన ఘటనలు మరువక ముందే తాజాగా ఫలక్‌నుమా ఠాణా పరిధిలో ఓ యువకుడి హత్యోదంతం చర్చనీయాంశంగా మారింది. వివాహేతర సంబంధంతో పాటు మహిళను వేధింపులకు గురిచేస్తుండడంతో బాధితురాలు సోదరుడు ఓ యువకుడిని హతమార్చిన ఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌పురా హసన్‌నగర్‌కు చెందిన డ్రైవర్ జాకీర్ అలీ (29)కి అయిదేళ్ల క్రితం ఫలక్‌నుమా అచ్చిరెడ్డి నగర్‌కు చెందిన ఓ మహిళతో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. సదరు మహిళకు అప్పటికే భర్త, అయిదుగురు పిల్లలు సైతం ఉన్నారు. ఇటీవల కాలంలో జాకీర్ అలీ వేధింపులను తట్టుకోలేకపోయిన బాధితురాలు ఈ విషయాన్ని తన సోదరుడు షఫీ దృష్టి తీసుకెళ్లింది. షఫీ పలుమార్లు హెచ్చరించినా జాకీర్ తన ప్రవర్తనలో మార్పు రాలేదు. శుక్రవారం అర్ధరాత్రి వివాహిత భర్త లేని సమయంలో ఇంటికి చేరుకొని ఆమెను వేధించసాగాడు. దీంతో సదరు మహిళ తన సోదరుడికి ఫోన్ చేసి చెప్పింది. ఆగ్రహానికి గురైన షఫీ అక్కడికి చేరుకొని అతన్ని మందలించే క్రమంలో ఇద్దరి మధ్యా మాటా మాటా పెరిగింది. షఫీ వెంటనే జాకీర్ తలపై ఇనుప రాడ్‌తో బాదడంతో పాటు, గడ్డపారతో అతని ముఖంపై కొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

24న ప్రజావాణి

హిమాయత్‌నగర్: జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఈ నెల 24వ తేదీ (సోమవారం) ప్రజావాణి నిర్వహించనున్నారు. ప్రజావాణి సందర్భంగా ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు ఫోన్ ఇన్ ప్రోగ్రామ్ ఉంటుంది. ప్రజలు 040–23222182 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చు. అనంతరం ప్రజల నుంచి ఫిర్యాదులను అధికారులు స్వీకరిస్తారు. జోనల్, సర్కిల్‌లో కూడా ప్రజావాణి నిర్వహిస్తారని జీహెచ్‌ఎంసీ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.



ఫారిన్ కిక్కే వేరయా!

ధర ఎక్కువైనా వెనక్కి తగ్గని మద్యం ప్రియులు

సాక్షి, సిటీబ్యూరో: ఫారిన్ లిక్కర్ అంటే మద్యం ప్రియులకు ఎంతో మక్కువ. ఎవరైనా ఫారిన్ నుంచి వస్తుంటే చాలా వరకు ఫోన్లు, చాక్లెట్లు, బ్రాండెడ్ దుస్తులు తీసుకు రమ్మంటారు. కానీ మద్యం ప్రియులు మాత్రం ఫారిన్ సరుకు ఒక బాటిల్ అయినా తీసుకురమ్మని విదేశాల నుంచి వచ్చే వారిని కోరుతుంటారు. అదీ ఫారిన్ మందుకున్న క్రేజ్. ఇక్కడ ఎన్ని బ్రాండ్లు దొరికినా కూడా ఫారిన్ మందుకున్న డిమాండ్ అలాంటిది. ఎంత ధర అయినా సరే ఒక్కసారైనా విదేశీ మద్యం రుచి చూడాలని తాపత్రయపడుతుంటారు. ఒకప్పుడు నగరంలో ఫారిన్ లిక్కర్ లభించేది కాదు. కొన్నేళ్ల క్రితం వరకు గోవా నుంచి మాత్రమే తెప్పించుకునే వారు. లేదంటే అక్కడికి వెళ్లి పర్మిషన్ ఉన్న స్థాయిలో ఇక్కడికి తీసుకొచ్చుకొని అప్పుడో పెగ్.. ఇప్పుడో పెగ్ కొడుతుండేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. ఎంచక్కా అలా వైన్స్ షాప్ వెళ్లి.. ఇలా ఫారిన్ సరుకు తెచ్చుకునే వెసులుబాటుల లభించింది.

- గతంలో విదేశాలు, గోవా నుంచి తెప్పించుకునేవారు ..
- ప్రస్తుతం సిటీలో విదేశీ మద్యానికి పెరుగుతున్న డిమాండ్



బాప్‌రే ఎన్ని రకాలో..

టీఎస్‌బీసీఎల్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలో దేశీ మద్యంతో పాటు విదేశీ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. చాలా రకాల విదేశీ మద్యం అందుబాటులో ఉంది. గరిష్టంగా 750 ఎం.ఎల్ విదేశీ మద్యం రూ.70 వేల దాకా ఉంది. విస్కీ ఎంత పాతది అయితే అంత ఎక్కువ ధర ఉంటుంది. 26 ఏళ్ల గ్లెన్‌ఫిచ్ సింగిల్ మాల్ట్ స్కాచ్ విస్కీ 700 ఎం.ఎల్. ధర రూ.62,200 ఉంది.

ఏటా 2.5 లక్షల కేసులు

హైదరాబాద్‌లో ఏటా 2.5 లక్షల కేసుల విదేశీ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. దీని విలువ దాదాపు రూ.800 కోట్ల వరకు ఉంది. ఇక ఫారిన్ బీర్లకు కూడా కాస్త డిమాండ్ ఈ మధ్య పెరుగుతోంది. ఏటా 5,500 నుంచి 6 వేల కేసుల బీర్లు అమ్ముడవుతున్నాయి. రూ.5 కోట్ల విలువైన బీర్లు విక్ర యిస్తున్నారు. ఎక్కువగా ఎండాకాలంలో దేశీయ బీర్ల కొరత ఏర్పడినప్పుడు వినియోగదారులు విదేశీ బీర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. విస్కీ, స్కాచ్ ఇంగ్లండ్, స్కాట్‌లాండ్ నుంచి ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నాం. ఓడ్కా మాత్రం రష్యా నుంచి వస్తోంది.


సూపర్ పోలీస్

స్నాచర్లను పట్టుకునేందుకు పోలీసుల కొత్త ఎత్తుగడ

మెడలో చెయిన్‌తో, ఫోన్ మాట్లాడుతూ రోడ్డుపై నడక

- కాస్త దూరంలో తుపాకీతో మరో పోలీసు నిఘా
- స్నాచర్ పారిపోయేందుకు యత్నించే లోపు కాల్పులు
- ఓ స్నాచర్ కాలులోకి దూసుకెళ్లిన బుల్లెట్
- చిలకలగూడ, మార్కెట్– 2 ఠాణాల పరిధిలో కాల్పులు
- వరుస స్నాచింగ్‌ల నేపథ్యంలో స్పెషల్ టీమ్‌ల ఏర్పాటు

మొత్తం ఏడుగురు నిందితుల అరెస్టు



సాక్షి, సిటీబ్యూరో: 'మెడలో లావుపాటి బంగారం గొలుసు వేసుకొని, ఫోన్ మాట్లాడుతూ ఎంచక్కా రోడ్డు మీద నడుచుకుంటూ వెళుతున్నాడు ఓ బాటసారి. వెనకాలే బైక్ మీద వచ్చిన ఇద్దరు స్నాచర్లు అతని మెడ మీద నుంచి చెయిన్‌ను స్నాచింగ్ చేసే ప్రయత్నం చేయగా.. వెంటనే బైక్ వెనకాల నుంచి బుల్లెట్ పేలింది. అంతే బైక్ వెనక కూర్చున్న స్నాచర్ కాలిలో బుల్లెట్ దిగింది. ఏం జరుగుతుందో అర్థం కాని స్నాచర్ల బైక్ రేస్ పెంచి అక్కణ్నుంచి ఉడాయించారు'... ఇదీ స్నాచర్లను పట్టుకునేందుకు హైదరాబాద్ పోలీసులు వేసిన ప్లాన్. ఇటీవల కాలంలో నగరంలో ధార్, బవారియా గ్యాంగ్‌ల వరుస చెయిన్ స్నాచింగ్‌ల నేపథ్యంలో సిటీ పోలీసులు స్నాచర్ల కోసం వల వేశారు. స్థానిక ఠాణా, సీఆర్ హెడ్ క్వార్టర్స్ పోలీసులతో యాంటీ స్నాచింగ్ డెకాయ్ టీమ్‌లను ఏర్పాటు చేశారు.

ముందు చెయిన్, వెనక తుపాకీ..

సిటీలోని ప్రతి పోలీసు స్టేషన్, సీఆర్ హెడ్ క్వార్టర్స్ నుంచి ఇద్దరేసి చొప్పున మొత్తం నలుగురితో ఈ టీమ్ ఉంటుంది. ఠాణాకు చెందిన పోలీసు మఫ్టీ డ్రెస్‌లో మెడలో చెయిన్ వేసుకొని, బయటికి కనిపించేలా రోడ్డు మీద ఫోన్ మాట్లాడుతూ వెళ్తుంటాడు. ఇతనికి కాస్త దూరంలో తుపాకీతో సీఆర్ హెడ్ క్వార్టర్ పోలీసు నిఘా పెడుతూ నడుస్తుంటాడు. వీరిని సామాన్యులుగా భావించిన స్నాచర్లు స్నాచింగ్ చేసేందుకు వీరిని వెంబడిస్తారు. స్నాచింగ్ చేసే క్రమంలో పోలీసులు అప్రమత్తమై నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తారు. ఒకవేళ వారు పారిపోయేందుకు ప్రయత్నిస్తే.. వెనకాల తుపాకీతో గస్తీ కాస్తున్న పోలీసు వెంటనే నిందితులపై కాల్పులు జరుపుతారు.

రెండు చోట్ల కాల్పులు, ఏడుగురు అరెస్టు..

ఈ క్రమంలో శుక్రవారం రాత్రి చిలకలగూడ పీఎస్ పరిధిలోని ఆలుగడ్డ బావి ప్రాంతంలో మెడలో చెయిన్ వేసుకొని పోలీసులు వెళుతుండగా.. వెనక నుంచి ఇద్దరు స్నాచర్లు బైక్ వచ్చి స్నాచింగ్ చేసేందుకు ప్రయత్నించారు. దీంతో వెనక నుంచి మరో పోలీసు కాల్పులు జరపడంతో ఓ స్నాచర్‌కు కాలులో బుల్లెట్ దిగింది. గాయంతోనే బైక్ మీద పారిపోయిన ఇద్దరు నిందితులను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఇదే తరహాలో శనివారం మార్కెట్ స్టేషన్ పరిధిలోని బాట వద్ద స్నాచింగ్ చేసేందుకు వచ్చిన రెండు బృందాలపై పోలీసులు కాల్పులు జరిపి, ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఈ ఐదుగురు ఇచ్చిన సమాచారంతో మరో ఇద్దరు స్నాచర్లను పోలీసులు పట్టుకున్నారు. మొత్తం ఏడుగురిని అరెస్టు చేసి, విచారిస్తున్నారు. శనివారం నుంచి టాస్క్‌ఫోర్స్ పోలీసులలో ఏర్పాటు చేసిన 'ఆపరేషన్ ఛబుత్రా' టీమ్స్ పని చేయనున్నాయి. అర్ధరాత్రి వీధుల్లో తిరిగే ఆకతాయిలను ఈ బృందాలు పట్టుకొని, కౌన్సెలింగ్ ఇస్తాయి.

మహేశ్వరంలోనే ఏఐ సిటీ!

200 ఎకరాల్లో విస్తరణకు సన్నాహాలు

- ఇప్పటికే స్థల గుర్తింపు..
- త్వరలోనే ప్రభుత్వ ప్రకటన
- ఫార్మాసిటీ భూముల్లో జపాన్ పెట్టుబడులు
- 1,000 ఎకరాల్లో ఎలక్ట్రానిక్ సంస్థల ఏర్పాటుకు సంప్రదింపులు

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) సిటీని మహేశ్వరంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏఐ టెక్నాలజీకి మంచి భవిష్యత్ ఉన్న నేపథ్యంలో ఈ సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సిటీని అభివృద్ధి పరిచే దిశగా ఆలోచన చేస్తోంది. సైబరాబాద్ ఐటీ హబ్ ప్రాంతంలో స్థలాల కొరత, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని ఏఐ సిటీని మహేశ్వరంలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర సర్కారు ప్రాథమికంగా నిర్ణయించింది. అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్‌రోడ్డు, జాతీయ రహదారి, ఎంఎంటీఎస్ అందుబాటులో ఉండడంతో పాటు.. విరివిగా ప్రభుత్వ భూములు లభ్యత ఉన్నందున.. మహేశ్వరం నియోజకవర్గం వైపు మొగ్గు చూపుతోంది. దీనికితోడు మెట్రో రైలు కూడా ఈ ప్రాంతానికి పొడిగించే ఆలోచన చేస్తున్నందున ఐటీ నిపుణుల రాకపోకలకు ఇబ్బందులు ఉండవని అంచనా వేస్తోంది. వచ్చే నెలలో నగర వేదికగా నిర్వహించే ఏఐ సదస్సులో ప్రభుత్వం అధికారికంగా ఏఐ సిటీని ప్రకటించే అవకాశం ఉంది.

మరో మహా నగరం ఆవిష్కృతం

- మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల పరిధిలో ఫార్మాసిటీని ఏర్పాటు చేయాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం భావించింది. ఆ మేరకు యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల పరిధిలోని పది గ్రామాల్లో 19,330 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించింది. ఇప్పటికే 14,000 ఎకరాలు స్వాధీనం చేసుకుంది. ఈ ఫార్మా సిటీని రద్దు చేస్తున్నట్లు గతంలో ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వీటి స్థానే ఫార్మా విలేజ్‌లు, ఇతర సంస్థలను ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేసింది. ఇందులో భాగంగా తాజాగా 200 ఎకరాల్లో ఈ భూముల్లో ఏఐ సిటీని ప్రతిపాదిస్తోంది.
- జపాన్‌కు సంబంధించిన సంస్థ ఈ సిటీ ఏర్పాటుకు ముందుకు వచ్చినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. కుర్మిద్ద, మీర్‌ఖాన్‌పేట ప్రాంతాల్లో ఈ సిటీని ఏర్పాటు చేసే అంశంపై ఇటీవల టీజీఐఐసీ యంత్రాంగం .. స్థానిక ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు కూడా జరిపింది. అయితే, గతంలో ఫార్మాసిటీని రద్దు చేసి.. నిర్వాసితులకు భూములను వెనక్కి ఇస్తామని అధికార పార్టీ ప్రకటించింది. తాజాగా ఫార్మా స్థానే ఇతర కంపెనీలకు భూములు కేటాయిస్తే.. రైతుల నుంచి వ్యతిరేకత ఉంటుందనే సమాచారంతో సంస్థల పెట్టుబడులపై గోప్యతను పాటిస్తోంది.



ఇండోనేషియా కూడా...

మరోవైపు ఇండోనేషియాకు చెందిన సంస్థ కూడా ఇక్కడ పెట్టుబడులు పెట్టే దిశగా ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. మొబైల్ తయారీ యూనిట్లను ఇక్కడ నెలకొల్పే అంశాన్ని పరిశీలిస్తున్న సంస్థ.. అనువైన భూములను అన్వేషిస్తోంది. ఈ సంస్థకు కూడా ఫార్మాసిటీలోనే దాదాపు వేయి ఎకరాలు కేటాయించే అవకాశం లేకపోలేదు.

జంపింగ్ టైమ్..!

కారు దిగనున్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు?

- బల్దియాలో పెరగనున్న కాంగ్రెస్ బలం



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లలో పలువురు కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా బీఆర్‌ఎస్ నుంచి అధికసంఖ్యలో అధికార కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాలతో పలువురు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరుతారని సమాచారం. జీహెచ్‌ఎంసీ ఎన్నికలు జరిగినప్పుడు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉంది. అప్పుడు బీఆర్‌ఎస్ నుంచి 56 మంది కార్పొరేటర్లు గెలవగా.. కాంగ్రెస్ నుంచి కేవలం ఇద్దరు మాత్రమే గెలిచారు. ఇద్దరి సంఖ్య ప్రస్తుతం ఇరవైకి చేరువలో ఉంది. త్వరలోనే భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాజకీయ విశ్లేషకుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

వేచి చూసే ధోరణితో..

బీఆర్‌ఎస్ నుంచే కార్పొరేటర్లుగా గెలిచిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మోతె శ్రీలత, ఆమె భర్త బీఆర్‌ఎస్ కార్మిక సంఘం నాయకుడు శోభన్‌రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఆయన భార్య, కార్పొరేటర్ శ్రీదేవి, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్‌లు గతంలోనే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరు పార్టీ మారినప్పుడే వారి అభిమానులు, అనుయాయులైన కార్పొరేటర్లు సైతం కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం జరిగినా.. కొంతకాలం వేచి చూద్దామనే ధోరణిలో వారు పార్టీ మారలేదని సమాచారం. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోయినా, గ్రేటర్ పరిధిలో మాత్రం 16 మంది ఎమ్మెల్యేలుండటాన్ని వారు పరిగణనలోకి తీసుకున్నారు. అంతేకాకుండా లోక్‌సభ ఎన్నికల ఫలితాలను చూశాక చేరవచ్చనే యోచనలోనూ కొందరు విరామమిచ్చినట్లు తెలుస్తోంది. కార్పొరేటర్లు పార్టీ మారుతారనే అంచనాతోనే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. వారితో రెండుమూడు దఫాలు సమావేశాలు నిర్వహించారు. రాబోయే రోజుల్లో కాబోయే ఎమ్మెల్యేలు మీరేనని, మీకే టికెట్లిస్తామని ఆశ చూపారు. అయినా ప్రస్తుత బీఆర్‌ఎస్ పరిస్థితిని చూసి ఇక ఆపార్టీలో ఉండటం కంటే కాంగ్రెస్‌లోకి వెళ్లడమే మేలనేది మెజార్టీ కార్పొరేటర్ల ఆలోచనగా ఉంది.

డివిజన్‌లో పనులు.. భవిష్యత్ కోసం..

- ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం.. ప్రభుత్వం నుంచి అందే నిధుల ద్వారా తమ డివిజన్లలో ఎక్కువ అభివృద్ధి పనులు చేయించుకోవాలంటే బీఆర్‌ఎస్ కంటే కాంగ్రెస్‌లో ఉండటమే మేలనే తలంపులో పలువురు కార్పొరేటర్లున్నారు. అంతేకాదు.. గ్రేటర్ పరిధిలోని పలువురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సైతం ×ఆపరేషన్ ఆకర్ష్‌×లో భాగంగా కాంగ్రెస్‌లో చేరే పరిస్థితి కనిపిస్తోంది. అదే జరిగితే ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోని కార్పొరేటర్లు సైతం హస్తం గూటికి చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది.
- బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరడంతో ఆయనకు దగ్గరి కార్పొరేటర్లు పార్టీ మారే అవకాశం ఉంది. గ్రేటర్ పరిధిలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలంతా కాంగ్రెస్‌లో చేరుతారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ సంచలనం రేపాయి. అదే జరిగితే బీఆర్‌ఎస్‌లోని మెజార్టీ కార్పొరేటర్లు కాంగ్రెస్ కండువా కప్పుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ కూడా తొలుత ఎమ్మెల్యేలను, తర్వాత కార్పొరేటర్లను పార్టీలోకి చేర్చుకోవాలనే యోచనలో ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.
- ఎటొచ్చీ 2026 ఫిబ్రవరిలో ఏర్పాటయ్యే కొత్త పాలకమండలి నాటికి పార్టీ బలిష్టంగా, తిరుగులేని విధంగా ఉండాలన్నది కాంగ్రెస్ లక్ష్యంగా కనిపిస్తోంది. మరోవైపు బీఆర్‌ఎస్‌లోనే ఉండటంతో ఒరిగేదేమీ ఉండదనే అభిప్రాయాల్లో ఆ పార్టీ కార్పొరేటర్లున్నారు. వీరు కోరుకుంటున్నదీ, కాంగ్రెస్ ఆశిస్తున్నదీ ఒకటే కావడంతో ఎక్కువమంది కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీలోని వారు పార్టీ మారే పరిస్థితి లేదంటున్నారు. బీఆర్‌ఎస్ కార్పొరేటర్లలో కొందరు బీజేపీలో చేరుతారని చెబుతున్నారు. ఎటొచ్చీ బీఆర్‌ఎస్‌లోనే ఉండేందుకు గట్టిగా నిలబడేదెవరో కొద్ది రోజుల్లో వెల్లడి కానుంది.

నాలుగు స్థానాలు ఖాళీ..

జీహెచ్‌ఎంసీలో మొత్తం 150 మంది కార్పొరేటర్లుండగా, శాస్త్రిపురం కార్పొరేటర్ మహ్మద్ ముబిన్, మెహిదీపట్నం కార్పొరేటర్ మాజిద్ హుస్సేన్ ఎమ్మెల్యేలుగా ఎన్నికవడంతో ఆ రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్, ఎర్రగడ్డ కార్పొరేటర్ షాహీన్‌బేగం మృతి చెందడంతో వారి రెండు సీట్లు ఖాళీ అయ్యాయి. వెరసీ.. నాలుగు స్థానాలకు ఎన్నిక జరగాల్సి ఉంది. వీటి ఉప ఎన్నిక కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు ఎన్నికల సంఘానికి లేఖ రాసినట్లు సమాచారం.

వీధి కుక్కల వీరంగం



మహిళ వెంటపడి తరిమిన శునకాలు

- మణికొండ చిత్రపురి కాలనీలో ఘటన

మణికొండ: వాకింగ్ కోసం ఇంట్లోంచి బయటకు వచ్చిన ఓ మహిళను వీధి కుక్కలు వెంటపడి తరిమాయి. ఏకంగా పదికి పైగా కుక్కల గుంపు ఆమెను చుట్టుముట్టి భయభ్రాంతులకు గురిచేశాయి. కుక్కల బారి నుంచి తప్పించుకుంటూ ఆ మహిళ వంద అడుగుల దూరం వరకు వెళ్లింది. అయినా అవి వెంటపడి మరీ తరమడంతో మహిళ అదుపుతప్పి కింద పడిపోయింది. దీంతో అవి ఒక్కసారిగా ఆమెపై పడ్డాయి. అదే సమయంలో అటువైపుగా స్కూటీపై వచ్చిన వ్యక్తి వద్దకు సదరు మహిళ పారిపోయి కుక్కల బారి నుంచి తప్పించుకున్న ఘటన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీలో శనివారం చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. చిత్రపురి కాలనీకి



కుక్కలను తప్పించుకునే క్రమంలో కిందపడి..



మహిళ వెంట పడిన కుక్కలు (ఇన్‌సెట్‌లో) బాధితురాలు రాజేశ్వరి

చెందిన రాజేశ్వరి రోజు మాదిరిగానే శనివారం ఉదయం 6 గంటలకు వాకింగ్ నిమిత్తం ఇంట్లోంచి బయటకు వచ్చింది. అదే సమయంలో పదుల సంఖ్యలో ఉన్న కుక్కలు ఒక్కసారిగా ఆమె వెంట పడ్డాయి. వాటి నుంచి తప్పించుకునేందుకు ఆమె విశ్వ ప్రయత్నాలు చేసింది. వాటి కాటుకు బలి కాకుండా తప్పించుకోగలిగింది.

తిండి కోసం ఎదురు చూస్తుండగా..

కాలనీ వాసులు ముందు రోజు మిగిలిపోయిన ఆహారాన్ని కుక్కల కోసం వీధుల్లో పెడుతున్నారు. దీంతో ప్రతిరోజూ ఉదయం కుక్కలు ఆకలితో అక్కడికి చేరుకుంటున్నాయి. శనివారం కుక్కల బారిన పడిన మహిళ సైతం తమకు ఆహారం పెట్టేందుకే వచ్చి ఉంటుందని కొద్ది సేపు వెంటపడినట్టు సీసీ టీవీలలో రికార్డు అయ్యింది. ఎంతకూ అన్నం పెట్టకపోయేసరికి మహిళ వెంట పడ్డాయని కాలనీ వాసులు భావిస్తున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న అవినాష్ మహంతి

వ్యాపారంలో నష్టాలు రావడంతో చోరీలు!

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్‌లో బురఖా వేసుకుని నగల దుకాణంలోకి చొరబడి..యజమానిపై కత్తితో దాడి చేసి దోపిడీకి పాల్పడిన కేసును పోలీసులు ఛేదించారు. సీసీ టీవీ కెమెరాల సహాయంతో నిందితులు ప్రయాణించిన మార్గాన్ని గుర్తించిన పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో చోరీలు చేసేందుకు సిద్ధమైన ముగ్గురు నేరస్తులను అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. వివరాలను మేడ్చల్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి, ఎస్ఓటీ డీసీపీ శ్రీనివాస్, సీసీఎస్ డీసీపీ నర్సింహాలతో కలిసి కమిషనర్ అవినాశ్ మహంతి శనివారం మీడియాకు వెల్లడించారు.

- ముంబైకి చెందిన నజీమ్ అజీజ్ కొటాడియా చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం కోసం ఆఫ్రికా, చైనా, అమెరికా దేశాలకు వెళ్లాడు. ఇతని తల్లిదండ్రులు అమెరికాలో ఉంటున్నారు. యూఎస్ నుంచి హైదరాబాద్‌లోని కొంపల్లికి వచ్చి, 2023 ఆగస్టులో వివాహం చేసుకున్నాడు. ఇతనికి ఒక కుమారుడు కూడా ఉన్నాడు. స్థానికంగా ఉంటూ వ్యాపారం నిర్వహించగా నష్టాలొచ్చాయి. దీంతో రెండు బైకులు కొని ర్యాపిడోలో పెట్టి డ్రైవర్లతో నడిపించే వాడు. అయినా ఆశించిన ఆదాయం లేదని సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలో ఈ ఏడాది ప్రారంభంలో ఛాదర్‌ఘాట్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ నగల దుకాణంలో చొరబడి యజమానిని కత్తితో బెదిరించి దోపిడీకి పాల్పడ్డాడు. ఈ మేరకు నమోదైన కేసులో పోలీసులు నజీమ్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు.
- చంచల్‌గూడ జైలులో నజీమ్‌కు అప్పటికే పలు కేసుల్లో అరెస్టయిన షేక్ సోహైల్‌తో పరిచయం ఏర్పడింది. అది కాస్త స్నేహంగా ఏర్పడింది. బయటికెళ్లాక నేరాలు చేయాలని ఇరువురు భావించారు. ఈక్రమంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో నజీమ్, సోహైల్ ఇద్దరూ బెయిల్‌పై జైలు నుంచి విడుదలయ్యారు. వీరితో మరో స్నేహితుడు సల్మాన్ జతయ్యాడు. ముగ్గురు కలిసి మూడు కమిషనరేట్ల పరిధిలో 10 దోపిడీలు చేయాలని ప్లాన్ వేశారు. సైబరాబాద్‌లో నాలుగు, హైదరాబాద్‌లో మూడు, రాచకొండలో మూడు నగల దుకాణాలను ఎంచుకున్నారు. కుత్బుల్లాపూర్, జగద్గిరిగుట్ట, ఉప్పల్, బోడుప్పల్, కార్వాన్, బోరబండ, వెస్ట్ మారేడ్‌పల్లి, మలక్‌పేట, అంబర్‌పేటల్లోని జ్యువెలరీ షాపులపై రెక్కీ చేశారు. ఆఖరికి మేడ్చల్‌లోని జ్యువెలరీ షాపులోకి చొరబడ్డారు.

హబ్సిగూడలో బైక్ చోరీ చేసి..

పథకం ప్రకారం ఈనెల 17న హబ్సిగూడలో సోహైల్, ఇతని స్నేహితుడు మహ్మద్‌లు పల్సర్ బైక్ (టీఎస్07 జీయూ6478)ను చోరీ చేశారు. నజీమ్, సోహైల్‌లు బైక్‌పై మేడ్చల్ శివారులో నిర్మానుష్య ప్రాంతంలో దాన్ని పార్క్ చేశారు. ఆ తర్వాత బురఖా, కత్తి కొనుగోలు చేశారు. ఈ నెల 20న సల్మాన్‌కు చెందిన అశోక్ లేల్యాండ్ ట్రాలీలో నజీమ్, సోహైల్‌లు మేడ్చల్‌కు వచ్చారు. నాలుగుమార్లు శ్రీ జగదాంబ నగల దుకాణంపై రెక్కీ చేశారు. షాపులో కస్టమర్లు ఎవరూ లేరని నిర్ధారించుకున్న తర్వాత నజీమ్ బురఖా వేసుకొని, సోహైల్ హెల్మెట్ పెట్టుకొని దుకాణంలోకి చొరబడ్డారు. నజీమ్ యజమాని శేషారంను చంపుతానని బెదిరించాడు. అతను అడ్డుకునే ప్రయత్నం చేయబోగా కత్తితో పొడిచి, బంగారు ఆభరణాలను చోరీ చేసేందుకు యత్నించారు. ఇంతలో యజమాని కుమారుడు అప్రమత్తమై తండ్రిని రక్షించేందుకు పరుగెత్తాడు. దీంతో నిందితులు 40 సెకన్లలోనే నగలు, నగదు చోరీ చేసి, అక్కడ్నుంచి ఉడాయించారు.

రైలెక్కి పారిపోయేందుకు..

పల్సర్ బైక్‌పై సల్మాన్, సోహైల్‌లు మేడ్చల్ నుంచి నిజామాబాద్ మార్గం వైపు ప్రయాణించారు. శివారు ప్రాంతంలోని యూటర్న్ వద్ద అప్పటికే అక్కడ ఆటోలో కాపు కాస్తున్న సల్మాన్‌తో కలిసి పారిపోయారు. శనివారం తెల్లవారు జామున నజీమ్, సోహైల్‌లు నాంపల్లి రైల్వే స్టేషన్ ముందు ఉండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి పల్సర్ బైక్, బురఖా, చేతి గ్లౌజ్‌లు, బ్యాగ్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

పాత నేరస్తుడితో కలిసి 10 చోరీలకు ప్లాన్

- బురఖా వేసుకొని దోపిడీ చేయడమే వీరి స్టైల్
- మేడ్చల్ నగల షాపులో చోరీ కేసులో ముగ్గురు అరెస్టు
- నిందితుల్ని పట్టించిన సీసీ కెమెరాలు
- కమిషనర్ అవినాశ్ మహంతి వెల్లడి

సీసీటీవీలే పట్టించాయ్..

సంఘటన జరిగిన తర్వాత షాపు యజమానితో పాటు అతని కుమారుడిని విచారించిన పోలీసులు నిందితులు బురఖా ధరించడంతో వారి ముఖాలను గుర్తించలేకపోయామని తెలిపారు. దీంతో పోలీసులకు కేసు దర్యాప్తు పూర్తిగా సీసీటీవీ కెమెరాలపైనే ఆధారపడాల్సి వచ్చింది. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి.. వెంటనే 16 బృందాలను ఏర్పాటు చేశారు. దీంతో ఘటన జరిగిన పరిసర ప్రాంతాల్లోని 161 సీసీటీవీ కెమెరాలను అడుగడుగునా జల్లెడ పట్టారు. క్రమ పద్ధతిలో విశ్లేషించిన అనంతరం నిందితులు ప్రయాణించిన మార్గాన్ని గుర్తించారు.

మత్తు పదార్థాల పట్టివేత: పలువురి అరెస్టు



అరెస్టు చేసిన నిందితులతో పోలీసులు

మాదాపూర్: మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గం చెరువు డాక్టర్స్ కాలనీ వద్ద శనివారం నార్కోటిక్ డ్రగ్స్‌ను కలిగిఉన్న ఐదుగురిని అరెస్టు చేశారు. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు డాక్టర్స్ కాలనీలో నెల్లూరుకు చెందిన వెంకట సాయిచరణ్ అనే యువకుడు 12.72 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను విక్రయించడానికి ప్రయతిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. డ్రగ్స్‌తోపాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలోనూ కేసులున్నాయని పోలీసులు తెలిపారు. బెంగుళూరు కేంద్రంగా నిందితుడు వెంకటసాయి చరణ్..మరికొందరితో కలిసి వివిధ నగరాలు, పట్టణాలకు డ్రగ్‌ను రవాణా చేయడానికి భిన్నమైన విధానాలను అనుసరిస్తాడని వెల్లడించారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల డ్రైవర్లకు రూ.100 ఇచ్చి వారికి తెలియకుండానే ఓ చిన్నకవర్లో డ్రగ్స్ పెట్టి వివిధ పట్టణాలకు సరఫరా చేస్తున్నాడని తెలిపారు. ఇలా మార్నింగ్ స్టార్ ట్రావెల్స్, రాజేశ్వరి ట్రావెల్స్, జీవీఆర్ ట్రావెల్స్, చెర్రీ ట్రావెల్స్ ద్వారా హైదరాబాద్‌కు డ్రగ్స్ రవాణా చేసినట్టు గుర్తించారు. దీనికి సంబంధించిన అన్ని ట్రావెల్స్ ఏజెన్సీలకు నోటీసులు అందజేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సెల్‌ఫోన్ చోరీకి యత్నించి ప్రాణాలు కోల్పోయిన దొంగ

విజయనగర్‌కాలనీ: సెల్‌ఫోన్ దొంగిలించడానికి యత్నించిన ఓ గుర్తు తెలియని వ్యక్తి ప్రతిఘటనలో ప్రాణాలు కోల్పోయిన సంఘటన శనివారం తెల్లవారుజామున ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సౌత్‌వెస్ట్‌జోన్ డీసీపీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెల్పిన మేరకు.. కోల్‌కత్తా నగరానికి చెందిన బావా, బావమరుదులైన షేక్ సర్వర్, షేక్‌సలీంలు జీవనోపాధినిమిత్తం నగరానికి వచ్చినారు. మెహిదీపట్నం సంతోష్‌నగర్‌లో భవన నిర్మాణంలో మేస్త్రీ పని చేస్తూ అక్కడే నివసిస్తున్నారు. ఇదిలా ఉండగా శనివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఓ గుర్తు తెలియని అగంతకుడు తన సెల్‌ఫోన్ తస్కరిస్తుండగా షేక్ సలాంకు మెలకువ వచ్చి అతన్ని పట్టుకోబోయాడు. విడిపించుకనే ప్రయత్నంలో భాగంగా దుండగుడు తన వద్ద ఉన్న కత్తితో ఇరువురిని గాయపరిచాడు. దుండగుడి నుంచి తమను తాము రక్షించుకునే క్రమంలో అక్కడే ఉన్న కర్రతో దొంగను కొట్టగా అది అతడి తలకు తగిలి అక్కడే పడిపోయాడు. సర్వర్, సలీంలు దుండగుడు పారిపోకుండా తాళ్లతో కట్టివేసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు అగంతకుడిని వైద్య చికిత్సల నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా దొంగ చేతిలో గాయపడిన ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య చికిత్సలు చేయించుకున్నారు.

బెల్ట్ షాపులపై దాడులు: ముగ్గురి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులు, బార్లపై హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడులు చేశారు. బంజారాహిల్స్, బోరబండ, చిక్కడపల్లి పోలీసు స్టేషన్ల పరిధిలో ఆకస్మిక దాడులు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి రూ.1.06 లక్షల విలువైన 48 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్‌లోని ఇందిరానగర్‌లో చిట్లూరి శ్రీనివాస్, బోరబండకు చెందిన వీ నర్సింహా, రామాంతపూర్‌కు చెందిన ఎం మల్లేష్‌లు స్థానిక వైన్స్‌లలో మద్యాన్ని కొనుగోలు చేసి, అర్ధరాత్రి సమయంలో ఎక్కువ ధరకు మధ్యాన్ని విక్రయిస్తున్నారు. అలాగే ముషీరాబాద్‌లోని బ్లూ హెవెన్స్ బార్ అండ్ రెస్టారెంట్ ఎక్సైజ్ విభాగం అనుమతించి సమయం కంటే ముందే ఉదయం 6:30 గంటలకు మధ్యాన్ని విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో నిందితులను అరెస్టు చేసి, తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత పోలీసు స్టేషన్‌లకు అప్పగించారు.

బీఆర్ఎస్ నాయకులకు బెయిల్

సాక్షి, సిటీకోర్టులు: బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంటి ముట్టడి కేసు నిందితులుగా ఉన్న బీఆర్ఎస్ నాయకులకు ఊరట లభించింది. వీరికి నాంపల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంటికి వెళ్లిన సమయంలో బీఆర్ఎస్ నాయకులు పోచారం ఇంట్లోకి దూసుకెళ్లడంతోపాటు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో 12 మందిపై కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో పాటు మరో 10 మందిని అరెస్ట్ చేయగా ఒకరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో బాల్క సుమన్, కె.వాసుదేవ రెడ్డి, గెల్లు శ్రీనివాస్, అంజనేయ గౌడ్, కడారి స్వామి యాదవ్, తుంగ బాలు, డి.రాజు, కె.జంగయ్య, వరికుప్పల వాసు, చటారి దశరథ్‌లను కోర్టులో హాజరుపర్చగా, మన్నె గోవర్ధన్ రెడ్డి పరారీలో ఉన్నట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. వీరి తరుపున బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు జక్కుల లక్ష్మణ్, జి.కిరణ్‌లు బెయిల్ పిటిషన్ దాఖలు చేసి వాదనలు వినిపించారు. రిమాండ్ రిపోర్ట్‌ను పరిశీలించిన నాంపల్లి 3వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఈ కేసులో అరెస్ట్ విధానం సక్రమంగా లేదంటూ రిమాండ్‌ను తప్పుబట్టారు. రూ.10 వేల వ్యక్తిగత బాండ్‌తో విడుదల చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

మాలల గురించి మాట్లాడే అర్హత మంద కృష్ణకు లేదు

హిమాయత్‌నగర్: ఎస్సీ వర్గీకరణ పేరుతో స్వార్థం కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ రాజకీయాలు చేస్తూ దళితులను చీల్చే కుట్రలు చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఆరోపించింది. మాలల గురించి మాట్లాడే నైతిక అర్హత మందకృష్ణకు లేదని జేఏసీ చైర్మన్ చెరుకు రామచందర్ హెచ్చరించారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులను విభజించి రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా నష్టపరిచే విధంగా మందకృష్ణ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

మనువాదానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలి



సభలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ రమా మెల్కోటే

హిమాయత్‌నగర్: బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు చేస్తున్నాయని, అందుకోసమే మనువాదాలకు వ్యతిరేకంగా బలమైన పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో పీఓడబ్ల్యూ అర్ధశతాబ్ది వార్షికోత్సవ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ప్రొఫెసర్ రమా మెల్కోటే మాట్లాడుతూ మహిళలపై హింస, వివక్ష, దారుణాలు పెరుగుతున్న సందర్భంలో మహిళలు మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగం, హక్కులపై పూర్తి అవగాహన పెంపొందించుకుని పాలకులను ప్రశ్నించాలన్నారు. ప్రొఫెసర్ కాత్యాయని, రచయిత్రి, ఇండిపెండెంట్ జర్నలిస్ట్ బాషాసింగ్, అంబిక, పీఓడబ్ల్యూ వార్షికోత్సవ సమన్వయ కమిటీ సభ్యులు వి.సంధ్య, జి.ఝాన్సీ, చంద్ర అరుణ, అరుణోదయ విమలక్క తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సన్మానం



హిమాయత్‌నగర్: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యక్తిగత జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని బీజేపీ నేత కేశబోయిన శ్రీధర్ అన్నారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా కిషన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారి శనివారం బీజేపీ నగర కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు.

యోగా గురువులకు సన్మానం



వెంగళరావునగర్: మనకు విద్య నేర్పిన గురువులను గౌరవించుకుంటూ సన్మానించడం మన ధర్మమని మధురానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడె సాంబశివరావు తెలియజేశారు. యోగా డేను పురస్కరించుకుని మధురానగర్‌కాలనీ శ్రీసాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాల్‌లో యోగా గురువులైన నాగేశ్వరరావు, నరసింహనాయుడు, రాధలను ఘనంగా సన్మానించారు. మధురానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడె సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి కళ్యాణ చక్రవర్తి, కోశాధికారి ఉప్పలయ్య పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

ఖైరతాబాద్: డ్యూటీకి వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఖైరతాబాద్ ఏఎస్‌ఐ శ్రీరాములు సమాచారం మేరకు... ఖైరతాబాద్ ప్రేమ్‌నగర్‌లో నివాసముండే పి.మౌలాలి, ఉసేనమ్మ(48) దంపతులు. మౌలాలి అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, ఉసేనమ్మ ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. ఈ నెల 20న డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి ఉసేనమ్మ వెళ్లింది. సాయంత్రం 7 గంటలైనా తిరిగా రాకపోవడంతో భర్త ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

‘బడిబాట’కు భలే స్పందన



పాఠశాలలో చేరిన కొత్త విద్యార్థులు



నూతనంగా చేరిన కొత్త విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న టీచర్లు

- బడిబాటలో 519 మంది విద్యార్థుల చేరిక
- కొత్త విద్యార్థులతో కళకళలాడుతున్న సర్కారు బడులు
- వెలవెలబోతున్న పలు ప్రైవేటు పాఠశాలలు

బంజారాహిల్స్: విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని సర్కారు బడుల్లో ఈ నెలలో రెండు వారాలపాటు నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో భాగంగా కొత్త విద్యార్థుల సంఖ్య గణనీయంగా నమోదైంది. అన్ని పాఠశాలల్లోనూ బడిబాట కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించిన టీచర్లు తమ తమ పాఠశాలల్లో కొత్తగా విద్యార్థులను చేర్పించుకోవడంలో సఫలీకృతమయ్యారు.

- షేక్‌పేట మండలం పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధుల్లో ఉన్న 22 ప్రాథమిక, 4 ఉన్నత పాఠశాలల్లో కలిపి కొత్తగా బడిబాటలోనే 162 మంది విద్యార్థులు చేరారు. అలాగే ప్రైవేటు పాఠశాలల నుంచి కొత్తగా 30 మంది నమోదయ్యారు.
- ఖైరతాబాద్–1 మండల పరిధి కిందికి వచ్చే రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, బోరబండ, సైట్–3, శ్రీరామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉన్న 22 ప్రాథమిక, 6 ఉన్నత పాఠశాలల్లో మొత్తం విద్యార్థుల బడిబాటలో 220 మంది విద్యార్థులు నమోదయ్యారు.
- ఇతర పాఠశాలల నుంచి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు కలిపి కొత్తగా 500 మంది విద్యార్థులు చేరారు.
- ఖైరతాబాద్–2 మండల పరిధి కిందికి వచ్చే ఖైరతాబాద్, ఎర్రమంజిల్, పంజాగుట్ట, బింజారా, మక్తా తదితర ప్రాంతాల్లో ఉన్న ఏడు ప్రాథమిక, 6 ఉన్నత పాఠశాలల్లో కలిపి కొత్తగా బడిబాటలో 137 మంది విద్యార్థులు చేరారు. ఇక ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మరో 150 మంది చేరారు.
- బడిబాట కార్యక్రమం ఈసారి విజయవంతం కాగా పెద్దఎత్తున విద్యార్థులను చేర్చుకున్నారు. బడికి దూరంగా ఉన్న విద్యార్థులను గుర్తించి, డ్రాపవుట్స్‌పై దృష్టిసారించి మొత్తం విద్యార్థులను సర్కారు బడుల్లో చేర్చారు.
- ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. స్కూల్‌లో చేరిన మొదటి రోజునే విద్యార్థులకు ఉచితంగా స్కూల్ యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు అందజేశారు.
- దీంతో మిగతావారు కూడా స్ఫూర్తి పొందారు. ప్రైవేటు పాఠశాలల్లో సుమారు రూ.30 వేలు మొదలుకొని రూ. 40 వేల వరకు చెల్లించలేక, స్కూల్ యూనిఫాం, పాఠ్య పుస్తకాలకు మరో రూ. 10 వేలు చెల్లించే ఆర్థిక స్తోమత లేక వేలాది మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపారు. ఫలితంగా విద్యార్థులతో తరగతి గదులు కళకళలాడుతున్నాయి.

ప్రైవేటు వెలవెల...

విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, బోరబండ, వెంగళరావునగర్, ఎర్రగడ్డ డివిజన్ల పరిధిలో ఉన్న సుమారు 350కి పైగా ప్రైవేటు పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు టీసీలు తీసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు.

- ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు చెల్లించే స్తోమత లేకపోవడంతో తల్లిదండ్రులు విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉన్న సర్కారు బడుల్లో దృష్టిసారిస్తున్నారు.
- ఇటీవల పదో తరగతి పరీక్షల్లో కూడా ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు పెద్దగా విజయం సాధించలేదు. ఉత్తీర్ణత శాతం పడిపోయింది.
- ప్రభుత్వ పాఠశాలల్లో గణనీయమైన ఫలితాలు వచ్చాయి. దీంతో చాలామంది ప్రైవేటు కంటే ప్రభుత్వ పాఠశాల వైపు మొగ్గుచూపుతున్నారనడం నిర్వివాదాంశం.

ప్రత్యక్షమైన పబ్లిక్ నల్లా!



రహమత్‌నగర్: ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పబ్లిక్ నల్లాను కొందరు మాయం చేసిన వైనంపై ‘సాక్షి’ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. ‘ఆలయ నల్లా–మాయమైంది ఎలా’ అనే శీర్షిక శుక్రవారం ‘సాక్షి’లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ కథనంపై జలమండలి అధికారులు స్పందించారు. శనివారం ఎస్పీఆర్‌హిల్స్ రెండు బొమ్మల వద్ద ఉన్న శివాలయం నల్లాను సమీపంలో ఓ వ్యక్తి తన నివాసంలోకి మార్చుకున్నాడు. ‘సాక్షి’ కథనంతో అక్కడికి వచ్చిన జలమండలి అధికారులు పైప్‌లైన్ వద్ద తవ్వించి నల్లా తిరిగి ప్రజావసరాల కోసం పాత స్థానంలోనే ఏర్పాటు చేశారు. పబ్లిక్ నల్లాను పునరుద్ధరించడంపట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఖైరతాబాద్: మారుతీనగర్‌లో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఖైరతాబాద్ ఏఎస్‌ఐ శ్రీరాములు సమాచారం మేరకు... మారుతీనగర్‌లో నివాసముండే వడ్డి హరి హరిచందరావు(34)కు ఆర్థిక క్రితం వివాహమైంది. భార్య స్వస్థలో కలిసి ఉంటున్న హరిచందరావు చేస్తున్న ప్రైవేటు ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు బయటికి వెళ్లి 2.45 గంటలకు తిరిగి ఇంటికి వచ్చి ఇంటి వెనుక ఉన్న గదిలోకి వెళ్లాడు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో సోదరుడు వి.రామచంద్ర గది కిటికీ లోంచి చూడగా ఫ్యాన్‌కు ఉరిపై ఉరి వేసుకొని ఉండటాన్ని గమనించి వెంటనే స్థానికులు వాసవి హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కొంతకాలంగా మద్యానికి బానిసవడం, ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పైపుల సైజు వివాదం సద్దుమణిగేనా?

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–10లోని నూర్‌నగర్ బస్తీలో మసీదు ఎదురుగా నేలో సీవరేజీ పైప్‌లైన్ నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. ఆ పనులకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి గతేడాది శంకుస్థాపన చేశారు. రెండు వీధుల్లో సీవరేజ్ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టేందుకు రూ. 8 లక్షలు మంజూరయ్యాయి. పైప్‌లైన్ నిర్మాణం కోసం రోడ్డు మధ్యలో తవ్వకాలు కూడా చేపట్టారు. 8 ఇంచుల పైప్‌లైన్ నిర్మాణం చేపట్టేందుకు జలమండలి ఇంజినీర్లు ప్రయత్నించగా ఇక్కడ 8 ఇంచుల పైప్‌లైన్‌తో సమస్య పరిష్కారం కాదని, అంతకంటే పెద్ద సైజు అంటే 12 ఇంచుల పైప్‌లైన్ వేయాలని స్థానికులు డిమాండ్ పెట్టారు. ఈ పనుకు గల్లీని దృష్టిలో పెట్టుకుని ఇంజినీరింగ్ ప్రమాణాల ప్రకారం 8 ఇంచుల పైప్‌లైన్ మాత్రమే వేయడానికి కుదురుతుందని, 12 ఇంచుల పైప్‌లైన్ నిర్మాణం కుదరదని జలమండలి ఇంజినీర్లు స్థానికులకు నచ్చచెప్పారు. అయితే పెరుగుతున్న నివాసాలకు అనుగుణంగా భారీ పైప్‌లైన్ వేస్తేనే భవిష్యత్తులో తమకు సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉంటాయని స్థానికులు పేర్కొంటున్నారు. 12 ఇంచుల పైప్‌లైన్ తమతో అయ్యే పని కాదని ఇంజినీర్లు భీష్మించుకూర్చున్నారు. పైపుల కోసం తవ్విన రోడ్డు ఏడాది కాలంగా గుంతలమయంగా ఉండటంతో డ్రైనేజీ పొంగి పొర్లుతూ ఈ గుంతల్లో నిలిచిపోతుండటంతో స్థానికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మసీదు వెనుక సుమారు 150కి పైగా డిజైనర్ షాపులు, స్టిచ్చింగ్ షాపులు ఉన్నాయి. ఇక్కడే దుస్తులకు రంగులు వేయడం, రసాయనాలతో నీళ్లు పెద్ద ఎత్తున రోడ్డ పైకి వస్తుండటంతో స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ సీవరేజ్ పైప్‌లైన్ నిర్మాణం పూర్తయితేనే సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుంది. స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ఈ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టేందుకు చిత్తశుద్ధితో ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. పైపుల సైజు పంచి వేసేలా ఆమె ప్రయత్నిస్తుండగా ఇంజినీర్లు కుదరదని స్పష్టం చేస్తున్నారు. ఈ వివాదం ఎలా సద్దుమణుగుతుందో చూడాల్సి ఉంది.



బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–10 నూర్‌నగర్‌లో నిలిచిపోయిన పైప్‌లైన్ పనులు

వీధి దీపాల నిర్వహణపై దృష్టిసారించాలి



విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కవితారెడ్డి

బంజారాహిల్స్: వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాల నిర్వహణపై దృష్టిపెట్టాలని కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి సూచించారు. టీజీఎస్‌పీడీసీఎల్ డీఈ అశోక్, వీధిదీపాల విభాగం ఏఈ సుష్మ తదితరులతో ఆమె శనివారం కార్పొరేటర్ క్యాంప్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎక్కడెక్కడ వీధి దీపాలు వెలుగులను నోచుకోవడం లేదో వాటి వివరాలు అందజేసి మరమ్మతులు చేపట్టాలన్నారు. కొత్త స్తంభాల ఏర్పాటు, వీధిదీపాల బిగింపుపై చర్చించారు.

ఇష్టారాజ్యంగా వ్యర్థాల డంపింగ్

- ఏసీబీ కార్యాలయం ఎదుట జంతు కళేబరాల మూటలు
- దుర్గంధభరితంగా పరిసరాలు
- వాహనదారులు, పాదచారులకు తప్పని ఇబ్బందులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని ఎమ్మెల్యే కాలనీకి వెళ్లే దారిలో ఏసీబీ కార్యాలయం, చర్చి ముందు ఖాళీ స్థలం చెత్తాచెదారానికి, వ్యర్థాలకు డంపింగ్ యార్డుగా మారింది. ఇటీవల జంతు కళేబరాల మూటలు వదలి వెళ్లారు. ఇక్కడ పారేసి వెళ్లిపోయారు. దీంతో దుర్వాసనలు గుప్పుమంటున్నాయి. చెత్తాచెదారం పెద్ద ఎత్తున పేరుకుపోతుండడం, దుర్వాసనలు, దుర్గంధం, స్థానిక రాకపోకలకు నరకాన్ని చూపిస్తుంది. ఇక్కడ చెత్త వేయకుండా, కళేబరాల వ్యర్థాల మూటలు వేయకుండా ప్రణాళికలు రూపొందించలేదో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు చేతులెత్తేశారు. పక్కా ప్రణాళికలు రూపొందించి ఇక్కడ చెత్త కుప్పలు పేరుకుపోకుండా చూడాల్సిన ఎస్ఎఫ్ఏలు చేతులెత్తేస్తున్నారు. ఈ దుర్వాసన వల్ల ఏసీబీ ఉన్నతాధికారులు కూడా ఫిర్యాదులు చేసినా స్పందన కరువవుతుంది. కార్లల్లో వెళ్తున్న వారికి కూడా ముక్కుపుటాలదిరే దుర్వాసనలు వస్తున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గంజాయి బ్యాచ్ ఆగడాలకు పాల్పడుతుంది. ఈ ప్రాంతంలోకి వెళ్లకుండా ఫెన్సింగ్ నిర్మించి రోడ్డు పక్కన ఫుట్‌పాత్ నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుందంటున్నారు.



బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12 ఏసీబీ ఎదుట డంపింగ్ చేసిన వ్యర్థాలు

దుస్తుల పంపిణీ

లిబర్టీ: భారత ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. భారతీయ ధార్మిక సేవా సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.వి.ఎ.శర్మ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. లిబర్టీ అవంతినగర్, ఆదర్శనగర్ తదితర ప్రాంతాల్లోని నిరుపేద మహిళలకు, వృద్ధులకు చీరలు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ... ఆస్తి అంతస్తులు, డబ్బులు శాశ్వతం కాదని చేసిన సేవ చిరస్థాయిగా మిగులుతుందన్నారు.



యువతిని బెదిరిస్తున్న యువకుడిపై కేసు

- జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి

వెంగళరావునగర్: యువతిని మోసగించడమే కాకుండా చంపుతానని బెదిరింపులకు గురిచేసిన యువకునిపై మాదాపూర్ పీఎస్‌లో జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదు కాగా దానిని మధురానగర్ పీఎస్‌కు బదిలీ చేశారు. వివరాలిలా... కర్నూలునగర్‌కు చెందిన యువతిని మాదాపూర్ సమీపంలో ఉండే అర్జున్ అనే యువకుడు 2017 నుంచి 2022 మార్చి వరకు శారీరకంగా కలిశాడు. ఈ సందర్భంగా అనేక పర్యాయాలు ఫొటోలు కూడా తీశాడు. మార్చి తర్వాత ఇద్దరూ విడిపోయారు. దాంతో ఆ యువతి మరో యువకుడిని పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడింది. అయితే ఈ విషయం తెలుసుకున్న అర్జున్ ఆమెను వేధించడం మొదలు పెట్టాడు. అసభ్య పదజాలంతో మెసేజ్‌లు పంపడంతో పాటు తల్లిదండ్రులు, బంధువులకు ఆ ఫొటోలు పంపి సోషల్ మీడియాలో పెడతానని బెదిరింపులకు గురిచేస్తున్నాడు. తాను వేరే అమ్మాయిని పెళ్లిచేసుకుంటే ఆ విషయం తనకు తెలియజేసి చంపేస్తానని మెసేజీలు పెట్టాడు. అదేవిధంగా యువతి మరో అబ్బాయిని పెళ్లి చేసుకున్నా, తాను పిలిచినప్పుడు ఓయో రూంకు రావాలని, తన కార్యాలయానికి వచ్చి గొడవ చేస్తానని బెదిరించాడు. ఆమె తల్లిదండ్రులను సైతం చంపుతానని బెదిరిస్తున్నాడు. దాంతో ఆమె మాదాపూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా అక్కడ నుంచి శనివారం మధురానగర్‌కు కేసును బదిలీ చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆకృతి ఎగ్జిబిషన్ ప్రారంభం



బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో ఆకృతి ఎలైట్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ శనివారం ప్రారంభమైంది. ఎగ్జిబిషన్ ఆకృతి డైరెక్టర్ శశినాథ ప్రారంభించారు. మూడు రోజుల పాటు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుంది. ఆకృతి ఎలైట్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ కు, ఆదివారంల్లో అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.
– బంజారాహిల్స్

ఘనంగా అపోలో ఫెర్టిలిటీ సెంటర్ వార్షికోత్సవం



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని అపోలో ఫెర్టిలిటీ సెంటర్ మూడో వార్షికోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేషెంట్లతో పాటు వైద్యులు పాల్గొన్న ఈ వేడుకల్లో భాగంగా పలు వినోద కార్యక్రమాలు, ఫన్నీ గేమ్స్‌తో సందడి చేశారు. ఈ సందర్భంగా ఫెర్టిలిటీ అండ్ ఐవీఎఫ్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సునీత జరిజాని మాట్లాడుతూ... అధునాతన సంతానోత్పత్తి చికిత్సలను అందించడం నిరంతర సామాజిక ఉపకారంగా ఉన్నాం అని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సందీప్ కరుణాకరన్ మాట్లాడుతూ... అత్యాధునిక మానిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన సంతానోత్పత్తి నిపుణుల బృందంతో రోగులకు చికిత్స అందించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. తమ సేవలను మరింత విస్తరించడంతో పాటు సంతానోత్పత్తి కార్యంలో వస్తున్న మార్పులను స్వీకరించి తదనుగుణంగా చికిత్సలను అందించడం జరుగుతుందన్నారు.

కుమార్తెతో అసభ్యకర ప్రవర్తన: వ్యక్తిపై కేసు నమోదు

వెంగళరావునగర్: కన్నకూతురిపై అసభ్యంగా ప్రవర్తిస్తున్న భర్తపై ఓ మహిళ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల సమాచారం మేరకు... యాదాద్రి జిల్లాకు చెందిన ఓ మహిళ తన భర్తతో విబేధాలు తీసుకుని నగరానికి వచ్చింది. ఆమెను రాజశేఖర్ అనే వ్యక్తి పెళ్లి చేసుకోవాలని కోరాడు. తనకు గతంలో పెళ్లయిందని, భర్తతో విడాకులు తీసుకున్నానని తెలిపింది. రాజశేఖర్ తనకూ పెళ్లయిందని, కుమార్తె పుట్టిన తర్వాత భార్య నుంచి విడిపోయి ఒంటరిగా ఉంటున్నట్టు చెప్పాడు. దానికి ఆమె ఒప్పుకుని 2010లో అతనిని వివాహం చేసుకుంది. 2012లో వారికి కుమార్తె పుట్టింది. 2022లో ఆ పాపకు ఫంక్షన్ చేశారు. అదే ఏడాది జూన్ 15న అతను తన కుమార్తెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక తల్లికి చెప్పగా ఆమె రాజశేఖర్‌ను నిలదీసింది. క్షమించమని కాళ్లు పట్టుకుని వేడుకున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ 9వ తేదీ ఆ మహిళ వంట చేస్తుండగా కుమార్తె పెద్దగా అరిచింది. దాంతో ఆమె హుటాహుటిన వచ్చి చూడగా భర్త రాజశేఖర్ కుమార్తె పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. అడ్డుకోవడంతో తల్లి అతనిని కొట్టింది. ఈ క్రమంలో భర్త ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో అతనిపై జరిగిన సంఘటనలు వివరిస్తూ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

కారు ఢీకొని యువకుడికి గాయాలు

వెంగళరావునగర్: కారు అదుపు తప్పడంతో యువకునికి గాయాలైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం శుక్రవారం రాత్రి జవహర్‌నగర్‌లోని మసీదుగల్లీ సమీపంలో ఓ కారు (ఏపీ 10 ఎం 2012) అదుపుతప్పి దూసుకువచ్చింది. ఈ సమయంలో రోడ్డు పక్కన ద్విచక్ర వాహనంపై కూర్చుని ఉన్న సుభాన్‌కు గాయాలయ్యాయి. అంతేకాకుండా ఆ కారు మరో కారు, మూడు ద్విచక్ర వాహనాలపై దూసుకెళ్లింది. ఆయా వాహనాలు దెబ్బతిన్నాయి. హుటాహుటిన స్థానికులు వచ్చి క్షతగాత్రుడిని ఆసుపత్రికి తీసుకెళ్లారు. వాహనాన్ని నడిపిన యువకుడు తన కారును అక్కడే వదిలి పారిపోయినట్టు పోలీసులు తెలియజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ప్రేమ పేరుతో బాలికపై లైంగిక దాడి

- యువకుడిని అరెస్టు చేసిన పోలీసులు

హిమాయత్‌నగర్: కాలేజీకి వెళ్లిన ఓ మైనర్ బాలికను మాయమాటలు చెప్పి తీసుకెళ్లి లైంగికదాడి చేసిన యువకుడిపై నారాయణగూడ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. హైదరాబాద్ నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్ వివరాలను వెల్లడించారు. సైఫాబాద్‌కు చెందిన సయ్యద్ ఖలీల్(22) హిమాయత్‌నగర్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న మైనర్ బాలికను గత మూడేళ్లుగా ప్రేమిస్తున్నానంటూ వేధిస్తున్నాడు. ఈ నెల 19న కాలేజీకి అంటూ వెళ్లిన బాలికను ఖలీల్ తన వెంట తీసుకెళ్లాడు. బాలిక కాలేజీకు రాలేదని యాజమాన్యం తండ్రికి తెలపడంతో అతను నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు బాలిక సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ఆదిలాబాద్‌లో నాంపల్లి రైల్వేస్టేషన్‌లో వారిని గుర్తించారు. పోలీసులను గమనించిన సయ్యద్ ఖలీల్ బాలికను అక్కడే వదిలి పరారయ్యాడు. పోలీసులు బాలికను భరోసా సెంటర్‌కు తరలించగా, తనపై ఖలీల్ లైంగిక దాడి చేశాడని తెలిపింది. పోలీసులు ఖలీల్‌ను శనివారం అరెస్టు చేసి, అతనిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ శంకర్ పేర్కొన్నారు.

సాక్షి
ఆదివారం । 23 । జూన్ । 2024


కిరాక్ లుక్..





- 2,500 మిలియన్ సంవత్సరాల నాటి రాళ్లు
- హిమాలయాలకంటే 60 రెట్లు పురాతనమైనవి

కేబీఆర్ పార్కులో నడిచే వారికి, ఆ మార్గంలో ప్రయాణం చేసేవారికి ఈ రాళ్లు తెలిసే ఉంటాయి. పార్కు అవుటర్ వాక్‌వే వెంబడి ఉన్న ఇవి రాళ్లు మాత్రమే కాదు. లక్షల సంవత్సరాల నాటి హైదరాబాద్ చరిత్రకు గీటురాళ్లు. ఇలాంటి ప్రత్యేకతలెన్నో సంతరించుకున్న హైదరాబాద్ మహా నగరంలో నాటి ప్రత్యేకతలను తెలిపే కొండరాళ్లు, సెలయేళ్లు.. వృక్షరాజాలు.. ఒకటేమిటి ప్రకృతి ప్రసాదించిన ఎన్నెన్నో విశేషాలు నేటికీ ఎందరినో ఆకట్టుకుంటున్నాయి. ఎప్పుడో 2,500 మిలియన్ సంవత్సరాల నాటి ఈ రాళ్లు.. హిమాలయాల కంటే 60 రెట్లు పురాతనమైనవని ఐఎఫ్ఎస్ అధికారి కృష్ణ పేర్కొన్నారు. ప్రకృతి ప్రేమికులు, పర్యావరణవేత్తలు తమ ఆసక్తి కొద్దీ, తమ 'చూపు'తో వివిధ కోణాల్లో, వివిధ ఆకారాల్లో వీటిని 'క్లిక్' మనిపిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో



వైఈఏ యాప్ ఆవిష్కరణ



బంజారాహిల్స్: యువ పారిశ్రామికవేత్త సాధికారతే లక్ష్యంగా చేసుకుని రూపొందించిన మొబైల్ అప్లికేషన్ వైఈఏ యాప్‌ను యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ అసోసియేషన్(వైఈఏ) శనివారం ప్రారంభించింది. హోటల్ ఐటీసీ కోహినూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఓయో వ్యవస్థాపకుడు, గ్రూప్ సీఈఓ రితేష్ అగర్వాల్ ముఖ్యఅతిథిగా హాజరై అధికారికంగా వైఈఏ యాప్‌ను ఆవిష్కరించారు. దూరదృష్టితో ఆలోచించి యువ పారిశ్రామికవేత్తల అవసరాలకు అనుగుణంగా ఈ యాప్‌ను రూపొందించడం అభినందనీయమని ఆయన తెలిపారు. వైఈఏ ప్రెసిడెంట్ అశిష్‌కపూర్ మాట్లాడుతూ నగరం చుట్టుపక్కల ఉన్న యువ పారిశ్రామికవేత్తలకు తోడ్పాటు అందించే ఉద్దేశ్యంతో వైఈఏ యాప్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

ప్రమాదకరంగా టిప్పుఖాన్ బ్రిడ్జి



లంగర్‌హౌస్: అతిపురాతన టిప్పుఖాన్ బ్రిడ్జికి ప్రమాదం పొంచి ఉంది. రంగారెడ్డి జిల్లాను నగరానికి పశ్చిమ దిశ అయిన లంగర్‌హౌస్ వద్ద టిప్పుఖాన్ బ్రిడ్జి కలుపుతుంది. శివారు ప్రాంతాలైన వికారాబాద్, తాండూర్, నారాయణపేట్, కర్ణాటకతో పాటు సన్‌సిటీ, చిలుకూరు, మొయినాబాద్, చేవెళ్ల తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఈ బ్రిడ్జి పైనుంచే రాకపోకలు సాగించాలి. ప్రస్తుతం ఈ బ్రిడ్జి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జిపై ఇరువైపులా మొక్కలు పెరిగాయి. ఇవి మరింత ఏపుగా పెరిగి బ్రిడ్జి బీటలువారి కూలే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

వీనులవిందుగా గీతాలాపన



ఆత్మకూరు రామారావు స్కూల్‌లో ప్రపంచ సంగీత దినోత్సవం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–45లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరు రామారావు స్కూల్‌లో ప్రపంచ సంగీత వేడుకలు వీనులవిందుగా సాగాయి. శ్రావ్యమైన గొంతులతో సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు ఆలపించిన కీర్తనలు సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వర సాధన చేసిన విద్యార్థులు కీర్తనలు ఆలపించి ఆహూతులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తారు. స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు రోబోటిక్స్‌పై అవగాహన



పాఠశాల విద్యార్థుల రోబోటిక్స్ కిట్స్ అందిస్తున్న ప్రతినిధులు

రాయదుర్గం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రోబోటిక్స్‌పై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోహం అకాడమీ ఆధ్వర్యంలో 'రోబోటిక్స్ ఇన్ అకాడెమిక్స్' పేరిట నూతన కార్యక్రమాన్ని ఈ విద్యాసంవత్సరంలో ప్రారంభించారు. విద్యారంగంలో నూతన అధ్యాయాన్ని చూపించే లక్ష్యంతో సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఈ వినూత్న కార్యక్రమానికి ముందడుగు వేసింది. ఈ విద్యాసంవత్సరంలో నగరంలోని ఐదు ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులచే రోబోటిక్స్ తయారు చేయించి వాటి పనితీరును వివరించారు. రోబోట్లను తయారు చేసే విధానాన్ని తెలిపే పుస్తకాలను అందించి వారికి రోబోటిక్స్‌పై అవగాహన కల్పించారు. రూ.50 వేల విలువ చేసే కిట్లను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్కే తాజ్‌బాబుకు అందించారు. సంస్థ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు సుధీర, పావని, క్రాంతి, అంబర్సింగ్, దేవమణి, ఆంజనేయులు, గాంగ్యానాయక్, కృష్ణవేణి, మమత, ఆనంద్, పాండు, బాలయ్య, ప్రజ్ఞ, సుజాత పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించగలం



వాకథాన్‌ను ప్రారంభిస్తున్న హెటిరో డ్రగ్స్ చైర్మన్ డాక్టర్ పార్థసారథిరెడ్డి

బంజారాహిల్స్: ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించేందుకు అవకాశం ఉంటుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు, మెరుగుపర్చుకునేందుకు ప్రయత్నం చేయాలని రాజ్యసభ సభ్యుడు, హెటిరో డ్రగ్స్ చైర్మన్ డాక్టర్ బి.పార్థసారథిరెడ్డి అన్నారు. బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం ఫార్మసీ కాలేజీ, ఫార్మా కోపియల్ అసోసియేషన్లు సంయుక్తంగా శనివారం నిర్వహించిన ఫార్మా స్ట్రైడ్ క్లినికల్ అవేర్‌నెస్ వాకథాన్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు విభిన్నంగా ఆలోచించాలని, ఫార్మాపై మరింత జ్ఞానాన్ని పెంచేందుకు నిత్యం అన్వేషిస్తూనే ఉండాలన్నారు. సుల్తాన్ ఉలూం ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డా.అనుపమ కోనేరు, ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు టి.వి.నారాయణ, ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.రామ్‌కిషన్ పాల్గొన్నారు.

సడన్ బ్రేకులతో మెట్రో రైలు ప్రయాణికుల బెంబేలు

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రైలు సడన్ బ్రేకులతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. శనివారం రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో మియాపూర్ నుంచి ఎల్బీనగర్ వెళ్తున్న మెట్రో రైలు లక్డీకాపూల్ దాటిన తర్వాత అసెంబ్లీ స్టేషన్ సమీపంలో సడన్ బ్రేకులు పడటంతో స్టాండింగ్‌లో ఉన్న ప్రయాణికులు బ్యాలెన్స్ తప్పి పడిపోయారు. కొద్ది నిమిషాలు ఆగిన రైలు.. మళ్లీ ప్రారంభమై కొంత దూరం వెళ్లగానే తిరిగి సడన్ బ్రేక్‌లతో ఆగింది. ఇలా ఆగుతూ ముందుకు సాగుతుండటంతో నాంపల్లి స్టేషన్‌కు చేరుకోగానే చాలా మంది ప్రయాణికులు భయపడి మెట్రో రైలు దిగిపోయారు. ఆ తర్వాత కూడా మెట్రో సడన్ బ్రేకులతో ఆగుతూ ముందుకు సాగుతూ ఎల్బీనగర్‌కు చేరుకుంది. ఎలాంటి ప్రమాదం సంభవించనప్పటికీ ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఇది మామూలేనని మెట్రో అధికారులు తెలిపారు.

విజృంభిస్తున్న డయేరియా

నల్లకుంట: నగరంలో చాపకింద నీరులా డయేరియా(అతిసారం) వ్యాపిస్తోంది. రోజురోజుకూ అతిసారం విజృంభిస్తోంది. 20 రోజుల నుంచి వాంతులు, విరేచనాలు, వైరల్ ఫీవర్, కీళ్ల నొప్పులతో నగర ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి నిత్యం ఐదు నుంచి ఎనిమిది డయేరియా కేసులు వస్తున్నాయి. ఫీవర్‌లో ఈ నెల 1 నుంచి 21వ తేదీ వరకు మొత్తం 120కి పైగా డయేరియా కేసులు నమోదయ్యాయి అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వర్షాల కారణంగా ప్రజలు పలుచోట్ల అతిసారం బారిన పడుతున్నారు. ప్రధానంగా తాగునీరు కలుషితం కావడంతో డయేరియా వ్యాపిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అంటువ్యాధులు, డయేరియా కేసులు నమోదైతే జీహెచ్ఎంసీలోని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆయా ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించాలి. కానీ నగరంలో ఎక్కడా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్న దాఖలాలు లేవు.

దేశవ్యాప్తంగా దళితులు బీజేపీని నమ్మలేదు

- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య

లక్డీకాపూల్: రాజ్యాంగాన్ని మారుస్తామన్న నేతలను తిరిగి రాజ్యాంగమే మనకు రక్ష అనేలా చేయగలిగామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ జీ.చెన్నయ్య అన్నారు. రాష్ట్రంతో పాటు దేశ్యావ్యాప్తంగా దళితులు బీజేపీని నమ్మలేదన్నారు. బంజారాహిల్స్‌లోని మాలమహానాడు కేంద్ర కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రిజర్వుడ్ నియోజకవర్గాల్లో విపక్ష పార్టీలే విజయం సాధించాయన్నారు. రాష్ట్రంలో మూడు పార్లమెంట్ రిజర్వుడ్ ఎస్సీ నియోజకవర్గాల్లో బీజేపీ ఒక్క సీటు కూడా గెలవలేదని, ఈ విషయంలో మాలల పాత్ర మరువలేనిదన్నారు. సమావేశంలో మాల ప్రజాసంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మన్నే శ్రీధర్‌రావు, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాలుక రాజేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బైండ్ల శ్రీనివాస్, నాయకులు గోకుల కళ్యాణ్, కనకం ఎల్లస్వామి, గోవిందు, కమల్ ఆదర్శ్, కృష్ణ అనిల్, రాకేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీలు ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని గచ్చిబౌలి సాట్స్ షూటింగ్ రేంజ్‌లో రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు అమిత్ సంఘీ 10వ తెలంగాణ రాష్ట్ర షూటింగ్ పోటీలను శనివారం ప్రారంభించగా తెలంగాణ మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ప్రస్తుత రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అంజనీకుమార్ షూటర్లను ఉత్సాహపర్చారు. ఈ పోటీల్లో వివిధ విభాగాల్లో దాదాపు 200 మంది షూటర్లు పాల్గొన్నారు. తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు అమిత్ సంఘీ మాట్లాడుతూ.. అద్భుత నైపుణ్యం కలిగిన ఔత్సాహికులు ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు.

బాసరలో గోదావరి హారతి



లక్డీకాపూల్: గోదావరి జీవనదిగా ఉండాలని భావిస్తూ గోదావరి హారతి నిర్వహిస్తున్నట్లు బాసరకు చెందిన శ్రీవేద భారతీ పీఠం వేదపండితుడు గురుచరణ్ తెలిపారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాశీ పుణ్యక్షేత్రంలో నిరంతరాయంగా కొనసాగుతున్న గంగా హారతి మాదిరిగానే గోదావరి పరివాహక ప్రాంతంలో వెలసిన బాసర పుణ్యక్షేత్రంలో నిత్య గంగా హారతి కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. పీఠం వ్యవస్థాపకులు శ్రీవేదవిద్యానంద గిరి స్వామి ఆశీస్సులతో ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏడు సంవత్సరాలుగా ఉత్తర వాహిని గోదావరికి కాశీ తరహాలో ధూపదీప నైవేద్యాలను సమర్పించే కార్యక్రమం ప్రతిరోజూ సాయంత్రం 6.30 నుంచి రాత్రి 7.30 గంటలకు వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీవేద భారతీ పీఠం వలంటీర్లు సురేష్, మల్లేష్‌రెడ్డి, పుష్పాంజలి చవాన్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఏకు సాంకేతిక దన్ను!

- పౌరసేవలకు ఇక ఆధునిక హంగులు
- డ్రైవింగ్ ట్రాక్‌లు, వాహనాల స్క్రాబింగ్ విధానంపై ఫోకస్
- వివిధ రాష్ట్రాల్లో ఆర్టీఏ సేవలపై అధ్యయనం
- త్వరలో ఉన్నతాధికారుల బృందం పర్యటన



సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీఏ పౌరసేవలు ఆధునిక హంగులను సంతరించుకోనున్నాయి. డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లు, వాహనాల స్క్రాబింగ్ పద్ధతుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొనేందుకు రవాణాశాఖ చర్యలు చేపట్టింది. ఈ మేరకు వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న పౌరసేవలపై దృష్టి సారించింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల్లో పౌరసేవల అమలు తీరుతెన్నులపై అధ్యయనం కోసం అధికారుల బృందం త్వరలో ఆయా రాష్ట్రాల్లో పర్యటించనుంది. వివిధ అంశాలపై ఈ బృందం అందజేసే నివేదికల ఆధారంగా మార్పులు, చేర్పులు చేయనున్నారు.

ఏమేం పరిశీలిస్తారు?

కాలం చెల్లిన వాహనాలను తుక్కు చేసేందుకు కేంద్రం ప్రత్యేక చట్టాన్ని రూపొందించిన నేపథ్యంలో ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో ఇది పటిష్టంగా అమలవుతుండగా, మరికొన్ని చోట్ల ఇంకా అమల్లోకి రాలేదు. ఈ నేపథ్యంలో పొరుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన స్క్రాబ్ సెంటర్‌లను అధికారులు పరిశీలించనున్నారు. మెట్రోపాలిటన్ నగరాల్లో భారీగా పెరిగిన వాహనాల సంఖ్య, రోజురోజుకూ పెరుగుతున్న వాహనకాలుష్యం దృష్ట్యా 15 ఏళ్ల కాలపరిమితి ముగిసిన వాటిని నిషేధించాలని కేంద్రం రహదారి భద్రతా చట్టంలో సూచించింది. గ్రేటర్ హైదరాబాద్‌లో ఈ స్క్రాబ్ పాలసీని అమలు చేసేందుకు అధికారులు తాజాగా దృష్టి సారించారు. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న పౌరసేవల తీరుతెన్నులపైనా అధికారుల బృందం అధ్యయనం చేయనుంది. లెర్నింగ్ లైసెన్సులు, డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్‌లు, వాహన బదిలీలు, జీవితకాల పన్ను, త్రైమాసిక పన్ను వసూళ్లు వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న తీరును అధికారులు పరిశీలిస్తారు.

రారెత్తిస్తున్న కాలుష్యం..

గ్రేటర్‌లో ప్రస్తుతం వాహనాల సంఖ్య 80 లక్షలు దాటింది. సుమారు 18 లక్షల వరకు కాలం చెల్లిన వాహనాలు ఉన్నట్లు అంచనా. 15 ఏళ్ల కాలపరిమితి దాటిన వాహనాలు యథేచ్ఛగా రోడ్లపై పరుగులు తీస్తున్నాయి. ఇక వ్యక్తిగత వాహనాలపై ఎలాంటి కాలపరిమితి లేదు. దీంతో పాత, డొక్కు బండ్లు కూడా రోడ్లపై తిరుగుతున్నాయి. సాధారణంగానే పెట్రోల్, డీజిల్‌తో నడిచే అన్ని రకాల వాహనాలతో కాలుష్య కారకాలు ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయి. కాల పరిమితి ముగిసిన వాటితో ఇది మరింత ప్రమాదకరంగా మారింది. మరోవైపు రహదారి భద్రతకు సైతం డొక్కు వాహనాలు సవాలుగా మారాయి. ఇలాంటి వాహనాలను నియంత్రించేందుకు వినియోగించేందుకు అవకాశం లేని వాటిని తుక్కుగా మార్చాలని ప్రతిపాదన. ఇప్పటికే కొన్ని చోట్ల స్క్రాబ్ ఏజెన్సీలను ఏర్పాటు చేసి వాహనాలను తుక్కుగా మారుస్తున్నారు. గ్రేటర్‌లోనూ దీన్ని అమలు చేయనున్నారు. వివిధ రాష్ట్రాల్లో అమలవుతన్న స్క్రాబ్ పాలసీకి అనుగుణంగా హైదరాబాద్‌లో కూడా స్క్రాబ్ ఏజెన్సీలను ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు.

ఆటోమేటిక్ టెస్ట్ ట్రాక్‌లు..

వాహనదారుల్లో డ్రైవింగ్ నైపుణ్యాలను పెంచాలనే ప్రతిపాదన కూడా ఉంది. ప్రస్తుతం పెద్దగా నైపుణ్యం లేకపోయినప్పటికీ ఏజెంట్‌లు, మధ్యవర్తుల సహకారంతో కొంతమంది తేలిగ్గా లైసెన్సులను తీసుకోగలుగుతున్నారు. ఇలాంటి వ్యక్తులు వాహనాలతో రోడ్డెక్కి ప్రమాదాలకు కారణమవుతున్నారు. మరోవైపు డ్రైవింగ్ టెస్ట్ కేంద్రాలకు పరీక్షల కోసం వచ్చేవారి సామర్థ్యాన్ని పరీక్షించేందుకు ఎలాంటి ప్రామాణికమైన ఆధునిక పద్ధతులు లేవు. ఎంవీఐలు పరిశీలించి లైసెన్సులు ఇచ్చేస్తున్నారు. అలా కాకుండా టెస్టింగ్ కేంద్రాలను కంప్యూటరీకరించడంతో ఆటోమేటిక్‌గా డ్రైవర్‌ల నైపుణ్యం తెలుసుకొనేందుకు అవకాశం ఉంటుంది. గతంలో ఉప్పల్, నాగోల్‌లో ఆర్ఎఫ్ఐడీ టెక్నాలజీని అమలు చేసినప్పటికీ ఎక్కువ కాలం కొనసాగలేదు. ప్రస్తుతం తమిళనాడులో అమలవుతున్న ఆటోమేటిక్ టెస్ట్ ట్రాక్‌ల పనితీరును పరిశీలించి ఆ తరహాలో ఇక్కడ అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్లు రవాణాశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

పన్నుల విధానం పైనా ఫోకస్...

వ్యక్తిగత వాహనాల జీవితకాల పన్ను, రవాణా వాహనాల త్రైమాసిక పన్నులపైనా అధికారులు ఈ అధ్యయనంలో ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధమైన పనుల పద్ధతి అమల్లో ఉంది. ఏపీలో కొత్త వాహనాలపైన గరిష్టంగా 20 శాతం వరకు పన్ను వసూలు చేస్తున్నారు. రెండో వాహనంపై అదనంగా పనులు భారం విధించడం లేదు. ఇక్కడ ఒకటి కంటే ఎక్కువ వాహనాలను కొనుగోలు చేస్తే ప్రతి వాహనంపై 2 శాతం అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ద్విచక్ర వాహనాలపై కూడా ఇలా వసూలు చేయడం వాహనదారులకు భారంగా మారింది. ఈ క్రమంలో వివిధ రాష్ట్రాల్లో పన్నుల విధానాన్ని అధ్యయనం చేసి ఉత్తమ పద్ధతిని అమలు చేయాలని అధికారులు భావిస్తున్నారు.

నో స్మోకింగ్ జోన్ ఏమాయే?

- చార్మినార్ పరిసరాల్లో జోరుగా స్మోకింగ్
- ప్రముఖ పర్యాటక ప్రాంతంలోనూ నిర్లక్ష్యం

చార్మినార్: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయరాదనే నిబంధనలు ఉన్నా.. సిగరేట్ స్మోకర్స్ పెడచెవిన పెడుతున్నారు. అలాంటి వారిపై చర్యలు చేపట్టాల్సి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన చార్మినార్ పరిసర ప్రాంతాల్లో బహిరంగంగా సిగరెట్లు తాగేవారిని 2019 సంవత్సరంలో చార్మినార్ పోలీసులు కట్టడి చేశారు. ఆ ప్రాంతంలో నో స్మోకింగ్ జోన్ అంటూ బోర్డులు ఏర్పాటు చేసి ఒక ఎస్సైతో పాటు ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. వారు సివిల్ డ్రెస్సుల్లో తిరుగుతూ చార్మినార్ పరిసర ప్రాంతాల్లో ధూమపానం చేసే వారిని గుర్తించి వారి ఫొటోలు తీసి వారికి అవగాహన కల్పించారు. పలువురికి జరిమానాలు విధించారు.



సిగరెట్లు తాగిన వారికి జరిమానా విధిస్తున్న చార్మినార్ పోలీసులు(ఫైల్)

జరిమానాలు తప్పవు..

బహిరంగ ప్రదేశాల్లో స్మోకింగ్ చేస్తే చర్యలు తప్పవు. నిబంధనల మేరకు ఛలాన్లు విధిస్తాం. చార్మినార్ కట్టడం చుట్టూ నో స్మోకింగ్ జోన్ ఉంది. దీన్ని ఉల్లంగిస్తే కేసులు నమోదు చేసి ఛలాన్లు విధిస్తాం. ఫిర్యాదులు అందిన వెంటనే స్పందిస్తున్నాం. వారికి అవగాహన కల్పించి ఛలాన్లు విధిస్తున్నాం.

– కమతం చంద్రశేఖర్, చార్మినార్ ఇన్‌స్పెక్టర్

ఫీజులు కట్టలేక తల్లిదండ్రులు అప్పులపాలు

- విదేశీ విద్యా పథకం నిధులు విడుదల చేయాలి
- సీఎం, ఐటీ మంత్రికి పోస్టుకార్డు ద్వారా వినతి

చైతన్యపురి: బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌లో వివేకానంద విదేశీ విద్యా పథకంలో భాగంగా ఎంపిక చేసిన విద్యార్థులకు ఒక ఇన్‌స్టాల్‌మెంట్ ఇచ్చి నిలిపివేయడంతో విదేశాల్లో చదివే వందలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. దిల్‌సుఖ్‌నగర్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విదేశీ విద్యా పథకం కింద నిధులు మంజూరు చేసి విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నత చదువులకు వెళ్లిన బ్రాహ్మణ విద్యార్థులు ఫీజులు కట్టలేక తల్లిదండ్రులు అప్పులపాలు కావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు పోస్ట్ కార్డులు పంపిస్తున్నట్లు తెలిపారు. త్వరలో నగరంలోని అన్ని సంఘాల వారితో కలిసి పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షుడు మునిపల్లె శ్రీనివాస్, స్త్రీశక్తి అనురాధ, నాగరాజ్, అన్నంబోట్ల పవన్, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్ట్ కార్డులు ప్రదర్శిస్తున్న బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర నాయకులు

వద్దన్నా.. వినకుండా..

- హాట్‌టాపిక్‌గా మియాపూర్‌లో స్థలం కబ్జా వ్యవహారం
- క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలు
- ముగ్గురు ప్రధాన వ్యక్తులపై కేసులు నమోదు
- రాత్రి 9 గంటలకు వెళ్లిపోయిన ప్రజలు
- కొంతమంది రెచ్చిపోయి పోలీసులపై రాళ్ల దాడి

మియాపూర్: మియాపూర్‌లో ఇళ్ల స్థలాల వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. మియాపూర్‌లోని స్టాలిన్‌నగర్, ఎంఏనగర్ సమీపంలో ఉన్న 100, 101 సర్వే నంబర్‌లోని భూమిలో నాలుగు రోజులుగా వేలాదిమంది ప్రజలు గుడిసెలు వేసేందుకు తరలివచ్చి అక్కడే ఉండిపోయారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలు 100, 101 సర్వే నంబర్ భూమిలో ఎంఏనగర్, స్టాలిన్‌నగర్, పీఏనగర్, దీప్తీశ్రీనగర్ సమీప ప్రాంతాల వరకు తాళ్లు, చీరలు కట్టి స్థలాలు ఆక్రమించి అక్కడే కూర్చుండిపోయారు. ఆక్రమణదారులకు నచ్చజెప్పేందుకు హెచ్ఎండీఏ ఎస్టేట్ అధికారి, అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, శేరిలింగంపల్లి తహసీల్దార్ వెంకారెడ్డి, మాదాపూర్ అడిషనల్ డీసీపీ జయరాం, మియాపూర్ ఏసీపీ నర్సింహారావు ఆ ప్రాంతానికి తరలివెళ్లారు. ప్రభుత్వ భూమి విషయమై సుప్రీంకోర్టులో కేసు నడుస్తోందని, ఇక్కడ స్థలం ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరో అసత్య ప్రచారం చేస్తున్నారని, వాటిని నమ్మి మోసపోవద్దని, ఇక్కడ స్థలాన్ని ఆక్రమించేందుకు వీలులేదన్నారు. ఇక్కడకు వచ్చిన వారిలో చదువుకున్నవారు చాలామంది ఉన్నారని, భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు.



ఆక్రమణదారులకు నచ్చజెబుతున్న హెచ్ఎండీఏ ఎస్టేట్ అధికారి వీరారెడ్డి

పోలీసులపై ఆక్రమణదారుల దాడి..

శనివారం సాయంత్రం జనం కదలకుండా అక్కడే ఉండిపోయారు. మియాపూర్ ఏసీపీ నర్సింహారావు, ఇన్‌స్పెక్టర్ దుర్గారామలింగ ప్రసాద్, ఇతర పోలీసు అధికారులు నచ్చజెప్పి సగం మందిని అక్కడి నుంచి పంపించేశారు. మరి కొంతమంది మొండిగా అక్కడే ఉన్నారు. ఆక్రమణదారులను చెదరగొట్టే ప్రయత్నంలో పోలీసులు, ఆక్రమణదారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో సుమారు 250 మంది పోలీసులు వారిని చదరగొట్టే ప్రయత్నం చేశారు. దీంతో కొంతమంది పోలీసులపై రాళ్లు విసిరారు. ఈ రాళ్లదాడిలో ఓ పోలీస్ అధికారికి, హెచ్ఎండీఏ అధికారి రఘుకు రాళ్లు తగిలి స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మాదాపూర్ డీసీపీ వినీత్ ఘటనా స్థలానికి చేరుకుని వారిని హెచ్చరించారు. ఇళ్ల స్థలాలు కబ్జాకు తెరలేపిన ముగ్గురు ప్రధాన వ్యక్తులపై మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. ఘటనా స్థలంలోని ఆటోలు, ఇతర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని మియాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాత్రి 9 గంటల వరకు ప్రజలంతా ఆ ప్రాంతం నుంచి సొంత ప్రాంతాలకు వెళ్లిపోయారు.





గాయపడ్డ అధికారి రఘు



సాక్షి
11
హైదరాబాద్, ఆదివారం, 23 జూన్, 2024
సిటీ ప్లస్

ఇన్‌స్టంట్.. ఈ మాట వినగానే ఏదో కొత్త ఊపు వచ్చేస్తుంది మనకు...ఏ పనైనా త్వరగా పూర్తవ్వడమే ఇందులోని ప్రత్యేకత.. రకరకాల అడ్వర్టైజ్‌మెంట్ల ప్రేరణతో.. మనం దీనికి బాగానే అలవాటుపడిపోయాం.. అయితే ఇప్పుడీ అలవాటే కొంపముంచుతోంది.. ఆహారానికే కాదు.. దాని నుంచి అందే ప్రొటీన్లు ఇన్‌స్టంట్‌గా తీసుకోవాలనుకోవడం.. ఇన్‌స్టంట్‌గా కండలు పెంచేయాలనుకోవడం పొరపాటే అంటున్నారు నిపుణులు.. సప్లిమెంట్లు, అధిక ప్రొటీన్ వినియోగం ప్రయోజనాల కంటే ప్రమాదాలను ఎక్కువ కలిగిస్తుందని జాతీయ పౌష్టికాహార సంస్థ (ఎన్‌ఐఎన్) స్పష్టం చేసింది. దీని వల్ల కండరాల క్షీణత సహా అనేక రకాల అనారోగ్యాలు తప్పవని తేల్చింది. దీనిపై ఒక పరిశోధన ఆధారిత నివేదికను ఇటీవలే విడుదల చేసింది. ఆ విశేషాలు తెలుసుకుందాం... – సాక్షి, సిటీబ్యూరో

హై ప్రొటీన్..

వాడటం మంచిది కాదు



“ఆహారం ద్వారా ప్రొటీన్ అందడం లేదనే ఆలోచనతో వే ప్రొటీన్ తదితర పౌడర్లను విచ్చలవిడిగా వాడేస్తున్నారు.”

“ఆహారంలో తగినంత కార్బోహైడ్రేట్లు కొవ్వులు లేకుండా నాణ్యత కలిగిన అధిక ప్రొటీన్‌లను తీసుకున్నప్పటికీ అది సరిపోదు.”



- నగరంలో విరివిగా సప్లిమెంట్స్ వినియోగం
- తగిన శారీరక శ్రమ లేని ప్రొటీన్ వినియోగంతో కండరాల క్షీణత
- అతి వినియోగంతో అనర్థమంటున్న పరిశోధకులు
- పౌడర్స్‌లో అనారోగ్య కారకాలు ఉన్నాయని వెల్లడి
- ఆహారపదార్థాల ద్వారా పొందే ప్రొటీన్లే మేలని సూచన
- జాతీయ పౌష్టికాహార సంస్థ (ఎన్‌ఐఎన్) నివేదిక

ఒకప్పుడు విపరీతమైన శ్రమ చేసే క్రీడాకారులు లేదా సిక్స్‌ప్యాక్ వంటివి సాధన చేసే వ్యాయామ ప్రియులకు మాత్రమే పరిచయమున్న ప్రొటీన్ సప్లిమెంట్స్ నగరంలో ప్రతి ఒక్కరికీ చిరపరిచితంగా మారాయి. ఆహారం ద్వారా ప్రొటీన్ అందడం లేదనే ఆలోచనతో వే ప్రొటీన్ తదితర పౌడర్లను విచ్చలవిడిగా వాడేస్తున్నారు. అయితే ప్రొటీన్ సప్లిమెంట్ల వినియోగంపై నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్‌ఐఎన్) తాజాగా నిర్వహించిన పరిశోధన ఆశ్చర్యాన్ని కలిగించింది.. అందులోని కొన్ని అంశాలు..

- అదనంగా జత చేసిన చక్కెరలు, కృత్రిమ స్వీట్నర్లతో పాటు ప్రొటీన్ పౌడర్లలో సాధారణంగా ఉండే ఫ్లేవర్‌ల ప్రొటీన్ పౌడర్స్‌ను రెగ్యులర్‌గా తీసుకోవడం హానికరం.
- ఈ సప్లిమెంట్లలో సాధారణ ముడిపదార్థమైన వే ప్రొటీన్, బ్రాంచ్‌డ్-చైన్ అమైనో ఆమ్లాలను (బీసీఎఎఎస్) అధికంగా కలిగి ఉంటుంది. అధిక బీసీఎఎఎస్‌లు నాన్-కమ్యూనికబుల్ (అంటువ్యాధులు కాని) వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతాయి.
- సప్లిమెంట్లను తీసుకోవడం కండరాల బలాన్ని పెంచదు. అయితే ఆరోగ్యకరమైన వ్యక్తులు దీర్ఘకాలిక కఠిన వ్యాయామ సమయంలో మాత్రమే ప్రొటీన్ సప్లిమెంటేషన్ కండర పరిమాణాన్ని కొద్దిగా మెరుగుపరుస్తుంది.
- రోజుకు 1.6 గ్రా కంటే ఎక్కువ ప్రొటీన్ తీసుకోవడం ఏ విధమైన అదనపు ప్రయోజనాలను అందించదు.
- మన శరీరానికి ప్రొటీన్ అవసరాలు మనం అంచనా వేసుకున్నంత ఎక్కువగా ఉండవు.
- క్రీడాకారులు సైతం సప్లిమెంట్లపైనే ఆధారపడకుండా ఆహారం నుంచి తగిన మొత్తంలో ప్రొటీన్ పొందడం మేలు.
- దీర్ఘకాలం పెద్ద మొత్తంలో ప్రొటీన్ సప్లిమెంట్ తీసుకోవడం వల్ల ఎముక, కణజాలానికి నష్టం కలిగించవచ్చు. అలాగే మూత్రపిండాల సమస్యకు దారితీసే అవకాశం ఉంది.
- శాకాహారం లేదా మాంసాహారం నుంచి ఆరోగ్యకరమైన అమైనో ఆమ్లాలను సులభంగా అందుకోవచ్చు.
- తృణధాన్యాలు, పప్పుధాన్యాలను 3:1 నిష్పత్తిలో లేదా 30 గ్రాముల వరకూ పప్పులతోనో, రోజుకు 80గ్రా మాంసంతోనో ప్రొటీన్ స్థాయిల్ని భర్తీ చేయవచ్చు. ఇది సాధారణ వ్యక్తుల ప్రొటీన్ అవసరాలను తీర్చడానికి సరిపోతుంది.
- కేవలం ప్రొటీన్ వినియోగం మాత్రమే కండరాల నిర్మాణంలో ఉపకరిస్తుందనేది అపోహ మాత్రమే. ఆహారంలో తగినంత కార్బోహైడ్రేట్లు కొవ్వులు లేకుండా నాణ్యత కలిగిన అధిక ప్రొటీన్లను తీసుకున్నప్పటికీ అది సరిపోదు. ఆహారపు అమైనో ఆమ్లాలు (ప్రొటీన్లు) ద్వారా కండర శ్రేణి నిర్మాణానికి శరీరంలో అమైనో-యాసిడ్ సంబంధిత విధులకు కార్బోహైడ్రేట్లు కొవ్వుల నుంచి కూడా తగినంత శక్తి అందాల్సిన అవసరం ఉంది.
- తగినంత శారీరక శ్రమ లేకుండా, కండరాల నిర్మాణానికి ప్రొటీన్లు ఉపకరించవు.



సహజ ప్రొటీన్‌లతో మేలు..

మాంసం, పౌల్ట్రీ, చేపలు, గుడ్లు, పాలు ప్రొటీన్లు శరీరంలో కొత్త ప్రొటీన్లను తయారు చేయడానికి అవసరమైన ఇరవై అమైనో ఆమ్లాలను కలిగి ఉంటాయి. పప్పులు, పచ్చి శెనగలు, గుర్రపు శెనగలు, నల్ల శనగలు, చిక్‌పీస్, సోయాబీన్, పచ్చి బఠానీలు వంటి పప్పుధాన్యాల్లో ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి. బాదం, పిస్తా, జీడిపప్పు, వాల్‌నట్‌లు, హాజెల్‌నట్‌లు, సోయా గింజలు, గుమ్మడి గింజలు, అవిసె గింజలు, నువ్వులు గణనీయమైన పరిమాణంలో ప్రొటీన్‌లను కలిగి ఉంటాయి. పప్పులను తృణ ధాన్యాలతో కలిపి లేదా తృణధాన్యాలు మాంసం ఆహారం, గుడ్లు/ పాలతో కలిపి తిన్నప్పుడు ఆహారంలో ప్రొటీన్ నాణ్యత మెరుగుపడుతుంది. తక్కువ కొవ్వు అధిక ఫైబర్ కలిగిన పప్పులు ఇనుము, పొటాషియం, జింక్, మెగ్నీషియం వంటి ముఖ్యమైన విటమిన్లు, ఇతర ఖనిజాలను కలిగి ఉంటాయి. శాఖాహార ఆహారాలు 70%–85% వరకూ ప్రొటీన్‌ను జీర్ణం చేస్తాయి.

మితిమీరితే యూరిక్ యాసిడ్ పెరిగే ప్రమాదం...

తీసుకున్న ఆహారం ద్వారా గానీ, ఇతరత్రా గానీ శరీర బరువు కిలోకి 1.5 గ్రాముల్ని మించి ప్రొటీన్ తీసుకోకూడదు. అతిగా ప్రొటీన్ తీసుకుంటే కిడ్నీ సమస్యలతో పాటు యూరిక్ యాసిడ్ పెరిగే ప్రమాదాలున్నాయి. మార్కెట్లో అందుబాటులో ఉండే సప్లిమెంట్స్‌లో కొన్నింటిలో స్టెరాయిడ్స్ కలుస్తున్నాయని సమాచారం. వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే ప్రొటీన్ సప్లిమెంట్స్ వినియోగించాలి.
–డా.కిషోర్‌రెడ్డి, అమోర్ హాస్పిటల్స్



సిటీ విత్ ఎంగేజ్

పురోహితులకూ ఓ వెబ్‌సైట్...



సంప్రదాయ పూజలు, పెళ్లిళ్లు, యజ్ఞయాగాదులతో పాటు ఇతర క్రతువుల కోసం పురోహితులను అన్వేషించుకునే వారి అవసరార్థం వేదపురోహిత్ పేరిట ఓ వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఎవరైనా సరే తమ ప్రాంతానికి సమీపంలోని పూజారి, పురోహితుల సేవల కోసం తమను సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు. వైదిక ఆచారాలు, మతపరమైన వేడుకలు, వాస్తు, జ్యోతిష్యం తదితర సేవలకు అనుభవజ్ఞుల సేవల్ని తమ వేదపురోహిత్ బుకింగ్ వెబ్‌సైట్ అందిస్తుందన్నారు. దీని ద్వారా నిరుపేద హిందూ పిల్లల విద్యకు దాతలు సాయం కూడా అందించవచ్చన్నారు. దాతల విరాళం సనాతన ధర్మం ఉజ్వల భవిష్యత్తుకు అవసరమైన వనరులను అందిస్తుందన్నారు.

కెడిఎం నుంచి యోసిక్ లైఫ్ స్టైల్...



ప్రముఖ లైఫ్‌స్టైల్ – మొబైల్ యాక్సెసరీస్ బ్రాండ్ కెడిఎం 'కెడిఎం యోసిక్ లైఫ్' పేరిట ప్రత్యేక కాన్సెప్ట్ పరిచయం చేశామని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. 'యోసిక్' అంటే యోగ, మ్యూజిక్ సమ్మేళనమని, తమ దినచర్యలో యోసిక్ లైఫ్‌స్టైల్‌ని అందరూ అనుసరించేలా దీన్ని పరిచయం చేస్తున్నామని పేర్కొన్నారు. కెడిఎం ఉత్పత్తులైన ఇయర్‌బడ్స్, జెన్ ప్యాడ్‌లు, స్మార్ట్ ప్యాడ్‌లు, ఎంపి 3 ప్యాడ్‌లు యోసిక్ అనుభవాన్ని అందిస్తూ, యోగ సంగీత ప్రపంచంలో లీనమయ్యేలా చేస్తాయన్నారు.

బంగారం ఆయనతోనే కొనిపిస్తుంటా..



శ్రీనగర్‌కాలనీ: 'మా ఆయనకు బంగారం కొనడం ఇష్టం లేకున్నా ప్రతిసారీ నేను నచ్చిన బంగారాన్ని ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో కొనిపిస్తుంటాను' అని సినీ నటి అనసూయ అన్నారు. వాల్యూగోల్డ్ సంస్థ మొబైల్ గోల్డ్ బయ్యింగ్ సర్వీస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అనసూయ వాహనాన్ని ప్రారంభించారు. అమీర్‌పేట్‌లోని సారథి స్టూడియోలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఒకప్పుడు గోల్డ్‌ను అమ్మడం నామోషీగా ఫీలయ్యేవారని, ప్రస్తుత పరిస్థితుల్లో చాలా మందికి గోల్డ్ ఒక ఇన్వెస్ట్‌మెంట్‌గా మారిందని అన్నారు. చాలా మంది గోల్డ్‌లో ఇన్వెస్ట్‌మెంట్ చేస్తూ వారికి నగదు అవసరమైనప్పుడు వాటిని అమ్ముకుంటున్నారన్నారు. తొలిసారిగా గ్రామీణ ప్రాంతాల్లో గోల్డ్ అమ్ముకోవాలనుకునే వారి కోసం మొబైల్ గోల్డ్ బయ్యింగ్ కాన్సెప్ట్ తీసుకొచ్చిన సంస్థ ప్రతినిధులు అభిషేక్ చందాను ఆమె అభినందించారు.



సినీ నటి అనసూయ

పాటే మంత్రము.... గానం బంధము...

సాక్షి,సిటీబ్యూరో: ఆమె పాట... స్వరాల ఊయలలూగించింది... అనుభూతుల లోకంలో ముంచింది. ప్రముఖ నేపథ్య గాయని సుమధుర గాత్రంతో సంగీత సంచలనం ఎఆర్ రెహమాన్‌ను సైతం తన అభిమానిగా మార్చుకున్న రోంకిణి గుప్తా... నగరవాసుల్ని పాటల లోకంలో విహరింపజేశారు. తెలంగాణ పర్యాటక శాఖ, సురమండల్ సంస్థల ఆధ్వర్యంలో నగరంలోని మాసబ్ ట్యాంక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ ఆవరణలో నిర్వహించిన సంగీత ప్రదర్శనలో ఈ సంప్రదాయ సంగీత కళాకారిణి...హిందూస్తానీ క్లాసికల్ రాగాలాపనతో ప్రారంభించి తన ప్రాచుర్యం పొందిన పాటల్ని ఆలపించి ప్రేక్షకులను అలరించారు. ఆమెకు తోడుగా తబలా విద్వాంసులు అశిష్ రగ్వానీ, హార్మోనియం విద్వాంసులు దీపక్ మరాతెలు తమ స్వరాలతో సంగీతాభిమానులను ఓలలాడించారు. ఇద్దరు స్థానిక టంపోరా కళాకారులు సైతం ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.





వేగన్.. కేసేఫ్

వేగన్ ఫ్రెండ్లీ సిటీగా హైదరాబాద్..

- పదుల సంఖ్యలో వెలుస్తున్న కేఫ్‌లు
- గణనీయంగా పెరిగిన వేగనిస్టులు
- నయా ట్రెండ్ ఫాలో అవుతున్న యువత

మార్క్సిజం.. లెనినిజం.. జగనిజం.. ఇవన్నీ రెగ్యులర్‌గా వినేవే.. కొత్తగా ఈ వేగనిజం ఏంటి అనుకుంటున్నారా..? అదేనండి...జంతువుల మాంసమే కాకుండా పాలు, గుడ్లు, నెయ్యిలాంటి ఇతర జంతు సంబంధిత పదార్థాలను తినని వారిని, జంతు సంబంధిత పదార్థాలతో తయారు చేసిన వస్తువులను వాడని వారిని వేగన్స్‌గా పరిగణిస్తారు. దీనికున్న మరో పేరే వేగనిజం. నగరంలో గత కొంతకాలంగా వేగనిజం ప్రాచుర్యం పొందుతోంది. జీవ హింసకు వ్యతిరేకంగా, మూగజీవాల స్వేచ్ఛా వాతావరణానికి హాని తలపెట్టనివారందరూ వేగనిస్టులుగా మారుతున్నారు. వినూత్న రుచులకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన భాగ్యనగరంలో వేగనిస్టుల కోసం పదుల సంఖ్యలో వేగన్ కేఫ్‌లు, రెస్టారెంట్లు వెలుస్తున్నాయి.. ఈ నేపథ్యంలో వేగనిజంపై మరిన్ని విశేషాలు..



సాక్షి, సిటీబ్యూరో: నవాబుల కాలం నుంచి నేటి వరకూ... బిర్యానీ మొదలు విశ్వవ్యాప్త ప్రాచుర్యం కలిగిన కాంటినెంటల్ ఫుడ్స్ వరకూ భాగ్యనగరంలో దొరకనిదేదీ లేదు..ఒక్క మాటలో చెప్పాలంటే ఇక్కడ తయారయ్యే బిర్యాని విదేశాలకు ఎగుమతవుతుందనే విషయం చాలా మందికి తెలిసుండకపోవచ్చు.. అలా అనేక వెరైటీలకు పేరుగాంచిన నగరంలో ప్రస్తుతం కొత్తగా వినిపిస్తున్న మాట వేగన్ ఫుడ్. 'వేగనిజం'లో భాగంగా పుటుకొచ్చిందే ఈ వేగన్ ఫుడ్. జీవుల భద్రతకు పాటుపడే వారిని వేగన్స్‌గా పరిగణిస్తారు. గత దశాబ్దకాలంగా జంతు ప్రేమికుల ఆధ్వర్యంలో వేగన్ క్లబ్‌లు, వేగన్ గ్రూప్స్ ఏర్పడుతున్నాయి. ఇందులో భాగంగా వేగన్ ఫుడ్ తినే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ సందర్భంగా నగరంలో వేగన్ ఫుడ్ ప్రాచుర్యం పొందడమే కాకుండా ఎన్నో వేగన్ ఫుడ్ కోర్టులను ప్రారంభిస్తున్నారు. ఇలా 2015లో నగరంలోని బంజారాహిల్స్‌లో మొట్టమొదటి వేగన్ కేఫ్ ఏర్పాటు చేయగా ప్రస్తుతం పదుల సంఖ్యలో ఉన్నాయి. అంతేగాకుండా 2019లోనే 'పెటా' ఆధ్వర్యంలో 'మోస్ట్ వేగన్ ఫ్రెండ్లీ సిటీ'గా నగరాన్ని ఎంపిక చేయడం విశేషం.

వినూత్నంగా వేగన్ క్లబ్‌లు..

వేగనిజం పై అవగాహన పెరుగుతుండటంతో పలువురు జంతు ప్రేమికులు ఒక సమూహంగా వేగన్ క్లబ్‌లను ఏర్పాటు చేసుకొని వేగన్ ఫుడ్ కార్యక్రమాలను జరుపుతున్నారు. ఇందులో భాగంగా మాంసమే కాకుండా ఎలాంటి జంతు పదార్థాలను తినకూడదు. అందుకోసమే పల్లీలు, బాదం నుంచి తీసిన పాలతో పెరుగు, పన్నీర్‌లాంటి వినూత్న పదార్థాలను తయారు చేస్తున్నారు. మాంసాన్ని పోలి ఉండే ప్లాంట్ మీట్‌ను తయారు చేస్తున్నారు.

ఆరోగ్య ప్రదాయిని..

జంతు హింసపై అవగాహన పెంచడమే కాకుండా వేగన్‌ల ఆహార సౌలభ్యం కోసం వినూత్నంగా వేగన్ ఫుడ్ స్టోర్-కేఫ్‌ను ఏర్పాటు చేశాం. వేగన్స్‌ని సంతృప్తి పరచడానికి పిజ్జాలు, డిసర్ట్స్‌తో పాటు పలు రకాల ఫుడ్ వెరైటీలు తయారు చేస్తున్నాం. జీవన సమతుల్యం కోసమే కాకుండా మంచి ఆరోగ్యాన్ని అందించడంలో వేగన్ ఫుడ్ విశిష్టతను కలిగి ఉంటుంది. – వేద్ మోహన్, ఈ–వేగన్ ఫుడ్ స్టోర్–కేఫ్, సైనిక్‌పురి.

భిన్న రుచుల సమ్మేళనం..

వేగన్స్ కోసం బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సైనిక్‌పురి తదితర ప్రాంతాల్లో ఫుడ్ రెస్టారెంట్‌లు, బేకరీలు, ఐస్‌క్రీమ్ పార్లర్‌లు వంటి ఫుడ్ స్పాట్స్ ఉన్నాయి. జంతు సంబంధ పదార్థాలు లేకుండా కూరగాయలు, ఆకుకూరలు తదితర మొక్కల పదార్థాలతో ఈ ఫుడ్‌ని తయారు చేస్తారు. ఇందులో భాగంగా డిషెస్, సలాడ్స్, డిసర్ట్స్, కేక్‌లు, చాక్‌లెట్లు తయారు చేస్తున్నారు.

పార్టీ ఆఫీసు కూల్చేశారు

తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయం కూలగొట్టిన బాబు సర్కార్

- శనివారం ఉదయం 5:30 గంటలకు పొక్లెయిన్‌లు, బుల్డోజర్లతో కూల్చివేసిన సీఆర్‌డీఏ అధికారులు
- అంతకు ముందే శుక్రవారం హైకోర్టును ఆశ్రయించిన వైఎస్సార్‌సీపీ
- చట్టాన్ని మీరి వ్యవహరించ వద్దని హైకోర్టు ఆదేశం


నిర్మాణ దశలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని జేసీబీతో కూల్చివేస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, గుంటూరు/మంగళగిరి: తెలుగుదేశం ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన పది రోజుల్లోనే కక్ష సాధింపు చర్యలకు దిగింది. గుంటూరు జిల్లా తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ నిర్మిస్తున్న పార్టీ కార్యాలయాన్ని శనివారం తెల్లవారుజామున పొక్లెయిన్లు, బుల్డోజర్లతో కూల్చి వేసింది. దీనిపై శుక్రవారం హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, వాటిని ధిక్కరించి పార్టీ కార్యాలయాన్ని కూల్చేయడం చర్చనీయాంశంగా మారింది. పార్టీ కార్యాలయ నిర్మాణంపై ప్రొసీజర్ ప్రకారం వ్యవహరించాలని కోర్టు చెప్పింది. దీని ప్రకారం మరో రెండుసార్లు నోటీసులు ఇవ్వాల్సి ఉండగా, కోర్టు ప్రొసీడింగ్ అందలేదంటూ కూల్చి వేయడం ప్రభుత్వ కక్ష సాధింపుకు నిదర్శనం. నిర్మాణంలో ఉన్న పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం నుంచే పొక్లెయిన్లు, బుల్డోజర్లతో మోహరించారు. భవనం కూల్చివేతకు బందోబస్తు కావాలని పోలీసులను కోరగా, అసెంబ్లీ విధుల్లో ఉన్నందున తమ వద్ద తగిన సిబ్బంది లేరని వారు సమాధానం ఇచ్చారు. అయితే ఎట్టి పరిస్థితుల్లో శనివారం ఉదయానికి పార్టీ కార్యాలయాన్ని కూల్చి వేయాలని సీఎంఓ నుంచి ఒత్తిడి రావడంతో శనివారం ఉదయం ఐదున్నర గంటలకు ప్రారంభించి ఏడున్నర గంటలలోపు పార్టీ కార్యాలయాన్ని కూల్చివేశారు. సీఆర్‌డీఏ అధికారులు, మున్సిపల్ అధికారులు ఈ కూల్చివేతను పర్యవేక్షించారు.

పక్కాగా లీజున్నా దౌర్జన్యం

గుంటూరు జిల్లా తాడేపల్లి గ్రామంలోని బోట్ యార్డు వద్ద సర్వే నంబర్ 202/ఎ-1లోని రెండు ఎకరాల స్థలాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ భవన నిర్మాణం కోసం 33 ఏళ్లకు లీజుకు ఇస్తూ గత ఏడాది ఫిబ్రవరి 16వ తేదీన ఆదేశాలు జారీ అయ్యాయి. 2012లో రాష్ట్రంలో పార్టీ కార్యాలయాలకు భూ కేటాయింపులకు సంబంధించి విడుదల చేసిన జీవో నంబర్ 571 ఆధారంగా ఈ కేటాయింపులు జరిగాయి. స్థలం కేటాయించిన మూడేళ్లలో దేనికి కేటాయించారో ఆ విధంగా ఉపయోగించని పక్షంలో రద్దు చేస్తామని పేర్కొన్నారు. దీనికి భిన్నంగా భూమిని ఖాళీగా ఉంచితే ఆ భూమి కేటాయింపును జిల్లా కలెక్టర్ రద్దు చేసి వెనక్కు తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి. సాయిప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది మార్చి 31న జీవో-52 ప్రకారం కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఈ భూమిని అప్పటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాదరావుకు అప్పగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. భూమిని కేటాయించినందుకు ప్రభుత్వానికి గత ఏడాది జూలై 26న రూ.66 వేలు చలానా కట్టారు. మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌కు ఈ నెల 15న రూ.4,44,312 ఆస్తి పన్ను కూడా చెల్లించారు. ఈ మేరకు అన్ని వివరాలతో సీఆర్‌డీఏకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో మొదటి అంతస్తు శ్లాబ్ పూర్తి అయ్యి, రెండో అంతస్తు శ్లాబ్ వేసే సమయంలో ఈ నెల 10న సీఆర్‌డీఏ అధికారులు నోటీసు జారీ చేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ శుక్రవారం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. పార్టీ తరఫున పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదించారు. దీనిపై హైకోర్టు స్పందిస్తూ ప్రొసీజర్ పాటించాలని, తొందరపాటు చర్యలు వద్దని ఆదేశాలు జారీ చేసింది. ఈ సమాచారాన్ని వెంటనే సీఆర్‌డీఏ న్యాయవాదులతో పాటు సీఆర్‌డీఏ కమిషనర్‌కు వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్ రెడ్డి ఫోన్ ద్వారా చేరవేశారు. దీంతో కోర్టు ఆదేశాలు తమకు అందడానికి ముందే పడగొట్టాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో శుక్రవారం సాయంత్రం నుంచే అక్కడ బుల్డోజర్లను మోహరించారు. దీనిపై సీఆర్‌డీఏ అధికారులతో మాట్లాడటానికి వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రయత్నించినా వారు అందుబాటులోకి రాలేదు. శనివారం ఉదయం 5.30 గంటలకు అధికారులు కూల్చివేశారు.

రైతుల నుంచి లాక్కున్న భూమిలో టీడీపీ కార్యాలయం నిర్మాణం

గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని ఆత్మకూరులో జాతీయ రహదారిని ఆనుకుని కాలువ పోరంబోకు భూమిలో రైతులకు ఇచ్చిన పట్టా భూమిని ఆక్రమించుకుని టీడీపీ రాష్ట్ర కార్యాలయాన్ని నిర్మించారు. ఆత్మకూరులో 1974లో రైతులు బొమ్మి రామిరెడ్డి (0.65 ఎకరం), కొల్లు రాఘవరావు (1.75 ఎకరాలు), కొల్లు భాస్కరరావు (1.75 ఎకరాలు)లకు ప్రభుత్వం మొత్తం 4.15 ఎకరాలకు డీకేటీ పట్టాలు ఇచ్చింది. టీడీపీ ఆ భూముల్ని స్వాధీనం చేసుకుని, ఇది సరిపోదన్నట్టు పక్కనే ఉన్న రెండెకరాల కాల్వ పోరంబోకును ఆక్రమించుకుని పార్టీ కార్యాలయాన్ని నిర్మించింది. మొత్తంగా 6.15 ఎకరాల భూమిని అక్రమంగా దక్కించుకుంది. ఏటా ఎకరాకు రూ.వెయ్యి చొప్పున 99 ఏళ్ల పాటు ప్రభుత్వానికి లీజు చెల్లించేలా జీవో జారీ చేయించుకుంది. ఈ భూమి ధర దాదాపు రూ.100 కోట్లకు పైమాటే. టీడీపీ భూ దందాపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పటి తహసీల్దారు జి.వి.రామ్‌ప్రసాద్.. ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణలపై నోటీసులు జారీ చేశారు. కేవలం రోడ్డును ఆక్రమించి నిర్మించిన రేకుల షెడ్లను మాత్రమే తొలగించారు. కానీ నేడు వైఎస్సార్‌సీపీ నిర్మిస్తున్న కార్యాలయం మొత్తం కూల్చేయడం చంద్రబాబు కక్షపూరిత చర్యలకు అద్దం పడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరో స్థాయికి చంద్రబాబు దమనకాండ

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు దిగిన చంద్రబాబు తన దమనకాండను మరో స్థాయికి తీసుకెళ్లారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తాడేపల్లిలో దాదాపు పూర్తికావొచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఒక నియంత బుల్డోజర్లతో కూల్చి వేయించారు. హైకోర్టు ఆదేశాలనూ బేఖాతరు చేశారు. రాష్ట్రంలో చట్టం, న్యాయం పూర్తిగా కనుమరుగైపోయాయి. ఎన్నికల తర్వాత చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలతో రక్తాన్ని పారిస్తున్న చంద్రబాబు, ఈ ఘటన ద్వారా ఈ ఐదేళ్లపాటు పాలన ఏవిధంగా ఉండబోతుందనే హింసాత్మక సందేశాన్ని ఇవ్వకనే ఇచ్చారు. ఈ బెదిరింపులకు, ఈ కక్షసాధింపు చర్యలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తలొగ్గేది లేదు. వెన్నుచూపేది అంతకన్నా లేదు. ప్రజల తరఫున ప్రజల కోసం ప్రజలకు తోడుగా గట్టి పోరాటాలు చేస్తాం. దేశంలోని ప్రజాస్వామ్యవాదులంతా చంద్రబాబు దుశ్చర్యల్ని ఖండించాలని కోరుతున్నా' అంటూ శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్)లో పోస్టు చేశారు.


వైఎస్ జగన్‌ను ఆప్యాయంగా పలకరిస్తున్న మహిళలు

పులివెందులలో జగన్‌కు అఖండ స్వాగతం

- క్యాంపు కార్యాలయంలో ప్రజలతో మమేకం
- టీడీపీ దాడుల్లో గాయపడ్డ వారిని పరామర్శిస్తానని వెల్లడి

సాక్షి కడప/రాయచోటి/కడప అర్బన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం సాయంత్రం 4.30గంటల ప్రాంతంలో పులివెందులకు చేరుకున్నారు. పుట్టినగడ్డలో ఆయన అడుగుపెట్టగానే జనం ఘనంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత పులివెందులలోని క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజలతో మమేకమయ్యారు. కార్యాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరిని కలుస్తూ అడిగిన వారికి ఫొటో తీసుకునే అవకాశమిస్తూ వారిని ఆప్యాయంగా పలకరించారు. పులివెందుల పర్యటనలో భాగంగా జగన్ తొలిరోజంతా కార్యకర్తలతోనే గడిపారు.

టీడీపీ దాడులపై జగన్ ఆరా

మరోవైపు.. అన్నమయ్య జిల్లా రాయచోటిలో వైఎస్సార్‌సీపీ మున్సిపల్ కౌన్సిలర్లపై టీడీపీ రౌడీమూకలు చేసిన దాడులపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరా తీశారు. దాడిలో గాయపడిన వారికి ధైర్యాన్నిచ్చారు. త్వరలో బాధిత కుటుంబాలను పరామర్శించి అండగా నిలుస్తామన్నారు.

పచ్చ మీడియాలో దుష్ప్రచారం

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు, ఆయన్ను పలకరించేందుకు పెద్దఎత్తున ప్రజానీకం పులివెందుల చేరుకున్నారు. మ.2 గంటలకు పులివెందులకు వస్తారనుకున్న ఆయన ఐదు గంటలకు చేరుకున్నారు. అప్పటికే పెద్దఎత్తున అభిమానులు అక్కడకు తరలివచ్చా రు. బారులు తీరిన జనాన్ని కలుస్తూ, వారిని ఊరడిస్తూ ఆధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండిపోయారు. అంతే కాక.. తమ అభిమాన నేతను కలిసేందుకు కార్యకర్తలు ఎగబడ్డారు. ఈ క్రమంలో అభిమానుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. తోపులాటలో నగిరిగుట్టకు చెందిన ఓ యువకుడు క్యాంపు కార్యాలయం కిటికీ అద్దాలపై పడ్డాడు. అద్దాలు పగిలి చేతికి గాయం కూడా అయ్యింది. వాస్తవం ఇలా ఉంటే, జగన్‌కు పులివెందులలోనే ప్రతిఘటన.. జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలంటూ పచ్చ మీడియాలో తెగ దుష్ప్రచారం చేశారు. దీనిపై పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్‌రెడ్డి వివర ణ ఇస్తూ.. మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రజా దర్బార్ నిర్వహిస్తున్న సమయంలో కార్యకర్తల తోపులాట జరిగి కిటికీ అద్దాలు పగిలాయి కానీ, ఎలాంటి రాళ్లదాడి జరగలేదని, ఎవరూ నినాదాలు చేయలేదని స్పష్టం చేశారు. కేవలం వైఎస్ జగన్‌ను చూసేందుకు ప్రజలు ఉత్సాహం చూపడంతో ఒకరిపై ఒకరు పడి తోపులాట మాత్రమే జరిగిందన్నారు.

కోర్టు ఆదేశాలు తుంగలో తొక్కేస్తారా?

- సీఆర్‌డీఏ అధికారులపై ఏపీ మాజీ ఏఏజీ పొన్నవోలు మండిపాటు
- అధికారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునేలా పోరాడతాం



సాక్షి, హైదరాబాద్: తాడేపల్లిలో కొత్తగా నిర్మిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయాన్ని సీఆర్డీయే అధికారులు కూల్చి వేయడం చట్ట విరుద్ధమని, హైకోర్టు ఉత్తర్వులున్నా లెక్క చేయకుండా వ్యవహరించారని మాజీ అడిషనల్ అడ్వొకేట్ జనరల్, సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను ఖాతరు చేయని దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. శనివారం ఆయన హైదరాబాద్‌లోని ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. 'టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు కార్యాలయాలు కట్టుకునేందుకు 2016లో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే 340 జీవో తెచ్చారు. దీని ప్రకారం 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో ఎకరం వెయ్యి రూపాయల చొప్పున చాలా జిల్లాల్లో పార్టీ కార్యాలయాల కోసం భూములు పొందారు. పాలకులు మారిపోయినా చట్టం మాత్రం మారదు. అదే చట్ట ప్రకారం కేంద్ర కార్యాలయ నిర్మాణం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2 ఎకరాలు తీసుకుంది. భవన నిర్మాణానికి అనుమతి కోసం దరఖాస్తు చేశాం. ఈ ప్రభుత్వం రావడంతోనే మాకు ప్రొవిజినల్ ఆర్డర్ జారీ చేశారు. నోటీసుపై 10వ తేదీ అని ఉన్నా, మాకు ఇచ్చింది మాత్రం 15వ తేదీ. దీనిపై హైకోర్టులో లంచ్ మోషన్ దాఖలు చేసి ఉపశమన ఆదేశాలు పొందాం. చట్ట ప్రకారమే ముందుకు సాగాలని న్యాయస్థానం సీఆర్డీయేను ఆదేశించింది. న్యాయ వ్యవస్థ అంటే లెక్కలేనితనంతో ఆ ఆదేశాలను తుంగలో తొక్కారు' అని మండిపడ్డారు.

కూల్చి వేయము అని కోర్టుకు చెప్పి..

విచారణ సందర్భంగా న్యాయస్థానంలో వాదనలు వినిపిస్తూ ఎలాంటి కూల్చివేతలు చేపట్టబోమని అధికారులు చెప్పారని పొన్నవోలు తెలిపారు. చట్ట ప్రకారమే వ్యవహరిస్తామని చెప్పారన్నారు. రాత్రికి రాత్రే జేసీబీలు తీసుకొచ్చి కూల్చివేత చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సూర్యోదయానికి ముందు.. సూర్యాస్తమయం తర్వాత ఎలాంటి కూల్చివేత కార్యక్రమాలు చేపట్టవద్దని హైకోర్టు ఫుల్ బెంచ్ ప్రభుత్వాలకు గతంలోనే తేల్చి చెప్పింది. కన్ఫర్మేషన్ ఆర్డర్ ఇచ్చేంత వరకు కూల్చి వేయడానికి వీల్లేదు. కన్ఫర్మేషన్ ఆర్డర్ ఇచ్చిన తర్వాత అవతలి వారి వాదనలు వినాల్సి ఉంటుంది. అందుకు 15 రోజుల సమయం ఉంటుంది. అయినా ప్రభుత్వం ముందుకు వెళితే.. బాధితులు ట్రిబ్యునల్‌కు కూడా వెళ్లవచ్చు. ట్రిబ్యునల్‌లో మాకు వ్యతిరేకంగా తీర్పు వస్తే.. అప్పుడు ల్యాండ్ వ్యాల్యూపై 20 శాతం ఫైన్ స్వీకరించాలి. అట్లా పర్మిషన్ తీసుకోకుండా కడితే శిక్షార్హులు. కూల్చి వేత అనేది ఆఖరి అస్త్రం. అది కూడా ట్రిబ్యునల్ తీర్పు తర్వాతే. ప్రొవిజినల్ ఆర్డర్ మీద కూల్చి వేయడం చట్ట వ్యతిరేకం. ఇది చట్ట ప్రకారం పాటించాల్సిన విధానం. కానీ, ఇలాంటివేవీ పాటించ లేదు. ఈ కేసులో న్యాయవాదిగా ఉన్న నేనే కోర్టు ఆదేశాలను సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్‌కు మెయిల్ ద్వారా, వాట్సాప్ ద్వారా పంపించా. సీఆర్‌డీఏ చర్య కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది. వారిపై సివిల్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరతాం' అని వెల్లడించారు.

ప్రజావేదికతో సంబంధం లేదు

ప్రజా వేదికతో కొందరు పోలుస్తుండటం సరికాదని.. దానికి, దీనికి సంబంధం లేదని పొన్నవోలు తెలిపారు. 'నదీ పరివాహక ప్రాంతంలో ఎలాంటి నిర్మాణం చేపట్టడానికి వీల్లేదు. అలా ఎవరు చేసినా అది పూర్తి చట్ట వ్యతిరేకం. అలా చేస్తే ప్రజలు ముంపు సమస్య ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదనే.. చట్ట ప్రకారం నాటి ప్రభుత్వం ముందుకు వెళ్లింది. అంతే తప్ప అందులో కక్ష పూరితం లేదు. వైఎస్సార్‌సీపీకి ప్రభుత్వం ఇచ్చిన భూమిలో నిర్మాణం చేసుకోవడం చట్ట వ్యతిరేకం కాదు. ఈ వివాదం ఇప్పుడు అధికారులకు, కోర్టుకు మధ్య అన్న విధంగా మారింది. అధికారంలో ఉండగా వైఎస్సార్‌సీపీ ఏ ఒక్క అధికారిని ప్రభావితం చేయలేదు. టీడీపీ కట్టుకున్న పార్టీ కార్యాలయాలను కూల్చలేదు. వారు పొందిన స్థలాలను వెనక్కు తీసుకోలేదు. ఐదేళ్లు హుందాగా వ్యవహరించింది. సామాన్యుడు నిర్మాణం కోసం ఎలా అనుమతి పొందుతాడో అలాగే వైఎస్సార్‌సీపీ ముందుకు వెళ్లింది. ఏదేమైనా చట్ట విరుద్ధంగా కోర్టు ఆదేశాలను తుంగలో తొక్కిన అధికారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకునేలా పోరాడతాం' అని వివరించారు.

సీఆర్డీయే ప్రకటనలో అంశాలు వాస్తవం కాదు

తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి సంబంధించి ఈనెల 1వ తేదీనే కన్ఫర్మేషన్ ఆర్డర్ ఇచ్చామంటూ సీఆర్డీయే పేరుతో ఒక ప్రకటన సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతోందన్న విషయం మా దృష్టికి వచ్చిందని పొన్నవోలు సుధాకర్ రెడ్డి అన్నారు. అయితే ఇందులోని అంశాలు వాస్తవ విరుద్ధంగా ఉన్నాయని చెప్పారు. సీఆర్డీయే ప్రొవిజనల్ ఆర్డర్‌పై ఈనెల జూన్ 10వ తేదీ వేసి, మాకు జూన్ 15వ తేదీన ఇచ్చారు. నిన్న (శుక్రవారం) కోర్టులో దీనిపైనే వాదోపవాదాలు జరిగాయన్నారు. చట్టాన్ని ఫాలో అవ్వాల్సిందిగా హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని, ఇందుకు సంబంధించిన పత్రాలను మీ ముందు (మీడియా) ఉంచుతున్నామన్నారు.

2014-2019 మధ్య పార్టీ ఆఫీస్ నిర్మాణం కోసం టీడీపీ కేటాయించుకున్న స్థలాలు

జిల్లా	విస్తీర్ణం	లీజుకాలం	లీజు రేటు (ఏడాదికి)
వైఎస్సార్ కడప	ఎకరం	33 ఏళ్లు	ఎకరం రూ.1000
శ్రీకాకుళం	2 ఎకరాలు	99 ఏళ్లు	రూ.25 వేలు
గుంటూరు	3.65 ఎకరాలు	99 ఏళ్లు	ఎకరం రూ.1000
విజయనగరం	ఎకరం	33 ఏళ్లు	ఎకరం రూ.1000
గుంటూరు	20 సెంట్లు	33 ఏళ్లు	ఎకరం రూ.1000
కృష్ణా	95 సెంట్లు	33 ఏళ్లు	ఎకరం రూ.1000
ప్రకాశం	ఎకరం 96 సెంట్లు	33 ఏళ్లు	ఎకరం రూ.1000
వైఎస్సార్ కడప	2 ఎకరాలు	33 ఏళ్లు	ఎకరం రూ.1000
చిత్తూరు	ఎకరం 20 సెంట్లు	33 ఏళ్లు	ఎకరం రూ.1000
శ్రీకాకుళం	30 సెంట్లు	33 ఏళ్లు	రేట్లు పేర్కొనలేదు

ఏపీ అసెంబ్లీ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు

ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రొటెం స్పీకర్ బుచ్చయ్యచౌదరి ప్రకటన



సాక్షి, అమరావతి: రాష్ట్ర 16వ శాసనసభ స్పీకర్‌గా నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శాసనసభ ఆఖరిరోజైన శనివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రకటించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రులు సత్యకుమార్, అచ్చెన్నాయుడులు అయ్యన్నకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అయ్యన్నను తోడ్కొని వెళ్లి స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టారు. స్పీకర్‌ను అభినందిస్తూ సీఎంతో పాటు మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. ఉ.10:32 గంటలకు శాసనసభా సమావేశం ప్రారంభం అయిన అనంతరం శుక్రవారం ప్రమాణస్వీకారం చేయకుండా మిగిలిపోయిన వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, కాకినాడ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు)లతో ప్రొటెం స్పీకర్ బుచ్చయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కొద్దిసేపు సభను వాయిదా వేసి, తిరిగి సమావేశమయ్యాక స్పీకర్ ఎన్నికపై ప్రకటన వెలువరించారు. అదే విధంగా సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ అయ్యన్న ప్రకటించారు. రెండ్రోజులపాటు నిర్వహించిన ఈ సభలో సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికై న ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారాలతో పాటు, స్పీకర్‌ను ఎన్నుకున్నారు.

ఏపీలో ఐఏఎస్‌ల బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం భారీగా ఐఏఎస్‌లను బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. 18 మంది ఐఏఎస్‌లను బదిలీ చేసిన ప్రభుత్వం.. వారిలో ఏడుగురిని సాధారణ పరిపాలన విభాగం (జీఏడీ)కి అటాచ్ చేసింది.

టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా లావు

సాక్షి, అమరావతి: టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఎంపికయ్యారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో శనివారం టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పార్లమెంటరీ పార్టీ నేతలను ఎన్నుకున్నారు. లోక్‌సభలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా దగ్గుమళ్ల ప్రసాదరావు, బైరెడ్డి శబరి వ్యవహరిస్తారు. కోశాధికారిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పార్లమెంటరీ పార్టీ విప్‌గా గంటి హరీష్‌ను నియమించారు.

'పాలమూరు'కు జాతీయ హోదా ఇవ్వండి

కేంద్ర ప్రభుత్వానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వినతి


మీడియాతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

సాక్షి, న్యూఢిల్లీ: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క కోరారు. అదేవిధంగా మూసీ రివర్ డెవలప్‌మెంట్ కోసం అధిక నిధులు కేటాయించాలని.. రీజనల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) పూర్తి చేసేందుకు ఆర్థిక సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్) నిధుల విడుదల విషయంలో కొన్ని రాష్ట్రాలపట్ల పక్షపాతం చూపరాదని కేంద్రానికి సూచించారు. సీఎస్ఎస్ కింద రాష్ట్రానికి 2023-24కిగాను రూ.4.60 లక్షల కోట్లను విడుదల చేయాల్సి ఉండగా రూ. 6,577 కోట్లు మాత్రమే (1.4 శాతమే) విడుదలయ్యాయని అన్నారు. రాష్ట్ర జనాభా ప్రాతిపాదికన చూసినా ఇది చాలా తక్కువని.. అందువల్ల సీఎస్ఎస్ కేటాయింపులను జనాభా నిష్పత్తి ప్రకారం, నిర్ణీత సమయంలో తెలంగాణకు విడుదల చేయాలని కోరారు. శనివారం ఢిల్లీలోని భారత్ మండపంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన కేంద్ర బడ్జెట్ సన్నాహక సమావేశం, జీఎస్టీ కౌన్సిల్ భేటీకి భట్టి విక్రమార్క రాష్ట్ర అధికారులతో కలసి హాజరయ్యారు. అనంతరం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించి భేటీ వివరాలు వెల్లడించారు.

వెనకబడిన జిల్లాల నిధులు విడుదల కాలేదు

ఏపీ పునర్విభజన చట్టం-2014 సెక్షన్ 94 (2) కింద తెలంగాణలోని వెనకబడిన జిల్లాలకు రావాల్సిన రూ. 2,250 కోట్లు ఇంకా విడుదల కాలేదని, వాటిని విడుదల చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. అలాగే హైదరాబాద్ మినహా అన్ని జిల్లాలను వెనుకబడినవిగా ప్రకటించి ఇచ్చిన గ్రాంటును వచ్చే ఐదేళ్లు పొడగించాలని కోరామన్నారు. రాష్ట్రం ఏర్పడిన తొలి ఏడాది సీఎస్ఎస్ గ్రాంట్ల రూపంలో తెలంగాణ కోసం విడుదలైన రూ. 495.21 కోట్లను కేంద్రం పొరపాటుగా ఏపీకి విడుదల చేసిందని.. ఈ మొత్తాన్ని త్వరగా తెలంగాణకు తిరిగి ఇవ్వాలని కోరినట్లు ఆయన చెప్పారు. రాష్ట్రానికి మరిన్ని నవోదయ పాఠశాలలను కేటాయించాలని.. ప్రధాని సూర్యఘర్ పథకంలో విద్యుత్ సబ్సిడీ, ముఫ్తీ బిజిలీ పథకం కింద రాష్ట్ర సబ్సిడీ నిధులను రూటింగ్ చేయడానికి సహకరించాలని కోరినట్లు భట్టి వివరించారు.

వీటికి జీఎస్టీ మినహాయించండి

నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన 53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పలు అంశాలను ప్రస్తావించారు. ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి సారించిందని.. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ నిర్మాణాలకు జీఎస్టీని తొలగించాలని లేదా తగ్గించాలని కోరారు. అలాగే తెలంగాణలో వాడే ఫెర్టిలైజర్‌పై జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. బీడీ ఆకులపైనా జీఎస్టీని తగ్గించాలని కోరారు. అదనపు ఆల్కహాల్ (ఈఎన్ఏ)ని జీఎస్టీ పరిధి నుంచి మినహాయించాలన్నారు. అవగాహనలేమి వల్ల ఆలస్యంగా పన్ను చెల్లించిన వారిపై విధించిన పన్ను, జరిమానా, వడ్డీని కొన్ని షరతులకు లోబడి మినహాయించే ప్రతిపాదనపై జరిగిన చర్చలో పాల్గొని మద్దతు తెలిపారు.

కొత్తవి పథకాలు ప్రవేశపెట్టండి

కేంద్ర ప్రాయోజిత పథకా (సీఎస్ఎస్)ల్లో షరతులు, పరిమితులు విధించకుండా తెలంగాణకు వెసులుబాటు కల్పించాలని కేంద్రాన్ని కోరినట్లు భట్టి చెప్పారు. సీఎస్ఎస్‌లను సమీక్షించి అనవసరమైన పథకాలను తొలగించి కొత్త పథకాలను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని సూచించినట్లు చెప్పారు. ఆర్థిక సంఘాల సిఫారసుల ప్రకారం... పన్ను విభజనలో ఆయా రాష్ట్రాలకు వాటా తగ్గిందన్నారు. కేంద్రం సెస్, సర్‌చార్జీల రూపంలో పన్నులు సేకరిస్తోందని.. ఇందులో రాష్ట్రాల వాటా పొందుపరచకపోవడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలోనే రాష్ట్రాలకు నికర రుణపరిమితిని, సీలింగ్‌ని తెలియజేయాలని.. దీనివల్ల రాష్ట్రాలు అభివృద్ధి కార్యక్రమాలకు తమ వనరులను సమర్థంగా ఖర్చు చేసేలా ప్రణాళికలు రూపొందించుకోగలుగుతాయని నిర్మలా సీతారామన్‌కు చెప్పామన్నారు.

దొంగే.. దొంగ అన్నట్లు ఉంది

- సింగరేణి గనుల వేలాన్ని కాంగ్రెస్ అడ్డుకోలేదన్న కేటీఆర్ విమర్శలపై భట్టి కౌంటర్
- గతంలో బీజేపీ తెచ్చిన 'గనుల' చట్టానికి బీఆర్ఎస్ మద్దతిచ్చిందని వెల్లడి
- అందుకే సింగరేణికి రావాల్సిన బొగ్గు గనులు ప్రైవేటు పరమయ్యాయని వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని కాంగ్రెస్ పార్టీ అడ్డుకోలేదంటూ మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్ తీరు 'దొంగే.. దొంగా దొంగా' అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. 'గత బీఆర్ఎస్ ప్రభుత్వం కోయిగూడ, ఇల్లెందులో జరిగిన బొగ్గు గనుల వేలాన్ని అడ్డుకుంటే ఆ గనులు సింగరేణికి రావాలి కదా? అలా రాకుండా ప్రైవేటు కంపెనీలకు ఎందుకు వెళ్లాయో కేటీఆర్ సమాధానం చెప్పాలి' అని భట్టి డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గతంలో తీసుకొచ్చిన గనులు, ఖనిజాల అభివృద్ధి, నియంత్రణ చట్టం-2015కు పార్లమెంటులో మద్దతు పలికింది బీఆర్ఎస్ కాదా? అని ఆయన నిలదీశారు. అప్పుడు మద్దతిచ్చి ఇప్పుడు వేలం జరుగుతుంటే కాంగ్రెస్ అడ్డుకోవట్లేదని కేటీఆర్ విమర్శించడం అర్థరహితమన్నారు.

ఇంకెక్కడ బీఆర్ఎస్?: బీఆర్ఎస్ శాసనసభాపక్షాన్ని కాంగ్రెస్‌లో విలీనం చేసుకుంటారా? అని విలేకరులు అడగ్గా భట్టి వ్యంగ్యంగా బదులిచ్చారు. 'బీఆర్ఎస్సా.. ఇంకెక్కడ బీఆర్ఎస్? అందులో ఉన్న వాళ్లు ఎక్కడెక్కడికో వెళ్తున్నారు. ఎవరి దారి వాళ్లు చూసుకుంటున్నారు. ఇక విలీనం విషయం నాకు తెలీదు. అది మా పార్టీ అధ్యక్షుడికి తెలుస్తుంది' అని భట్టి పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం కట్టుబడి ఉందని తెలిపారు.

రుణమాఫీ మా సమస్య: ఏకకాలంలో రూ. 2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించామని.. కచ్చితంగా రుణమాఫీ చేసి తీరతామని భట్టి తెలిపారు. అయితే అది ఎలా చేస్తామనేది మాత్రం తమ సమస్య అన్నారు. లబ్ధిదారుల ఖాతాల్లోకే డబ్బును జమ చేస్తామని చెప్పారు. విద్య, వైద్యం ప్రభుత్వ లక్ష్యాలని.. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలనేది తమ ఆకాంక్ష అన్నారు. జూనియర్ డాక్టర్ల నిరసనపై స్పందిస్తూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ఉద్యోగులకు జీతాలు సక్రమంగా అందుతున్నాయని చెప్పారు.

అంబేడ్కర్ రాజ్యాంగం కాదు.. లోకేశ్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

రాజ్యాంగ వ్యవస్థలపై రాజకీయ దాడి

- ఏపీపీఎస్సీ సభ్యులు రాజీనామా చేయాలని ఒత్తిడి
- జీఏడీ కార్యదర్శి (సర్వీసెస్) పోలా భాస్కర్ మితిమీరిన స్వామి భక్తి
- సర్వీస్ కమిషన్ సభ్యులు ఆరేళ్లు లేదా 62 ఏళ్ల వయసు వరకు కొనసాగే అవకాశం
- కానీ సభ్యులకు ఫోన్లు చేసి బెదిరింపులు.. ఐఏఎస్‌లే విస్తుపోతున్న వైనం
- సమాచార హక్కు కమిషనర్లు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌పై కూడా ఒత్తిడి
- గతంలో టీడీపీ పాలనలో వచ్చిన సభ్యులు జగన్ ప్రభుత్వంలోనూ కొనసాగింపు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి





ఈ స్పైడర్ మ్యానుడు చపాతీలు కూడా చేస్తాడు

స్పైడర్ మ్యాన్ అంటే... పది అంతస్తుల బిల్డింగ్ నుంచి అవలీలగా జంప్ చేసేవాడు. అగ్నిగుండంలో హాయిగా మార్నింగ్ వాక్ చేసేవాడు... టోటల్‌గా చెప్పుకోవాలంటే 'స్పైడర్ మాన్' అంటే సాహసాల సాగరం.

'స్పైడర్ మ్యాన్ అంటే అస్తమానం సాహసాలేనా? ఇలా కూడా' అని ఒక జైపూర్ యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో వైరల్ అయింది.

13 మిలియన్‌లకు పైగా వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

'ఇంతకీ అతడు ఏంచేశాడు?' అనే విషయానికి వస్తే....

స్పైడర్‌మ్యాన్ డ్రెస్ వేసుకొని చపాతీలు చేశాడు. ఇల్లు శుభ్రంగా ఊడ్చాడు. గిన్నెలు శుభ్రం చేశాడు. ఎండలో తల మీద ఇటుకలు మోశాడు.

'అసలు సిసలు సాహసాలంటే ఇవే' అన్నారు నెటిజనులు.

'గ్రేట్ పవర్ కమ్స్ గ్రేట్ రెస్పాన్సిబిలిటీ' అంటూ స్పైడర్-మ్యాన్ సినిమాలలోని ఐకానిక్ డైలాగును ఉటంకించారు.

వైరల్

అహో!



వీడియో వైరల్ కావడానికి అసాధారణ అద్భుతాలతో పనిలేదు. 'ఆహా' అనిపిస్తే చాలు. ఇది అలాంటి వైరల్ వీడియోనే. ప్రఖ్యాత ఫొటోగ్రాఫర్ మార్క్ స్మిత్ తీసిన వీడియో నెటిజనులను మంత్రముగ్ధులను చేసింది. చేపను క్యాచ్ చేస్తున్న ఒక డేగకు సంబంధించిన క్లోజ్-అప్ షాట్ ఇది.

కెమెరామన్‌గా మార్క్ స్మిత్ అద్భుతమైన పనితనం ఈ వీడియోలో కనిపిస్తుంది. ఈ స్టన్నింగ్ వీడియో 124 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.



బ్రెజిల్ టు బెంగాల్

– ప్రేమకు దూరం తెలియదు

ఎక్కడి బ్రెజిల్? ఎక్కడి బెంగాల్?

అయితే ప్రేమ బలంతో సుదూర ప్రాంతాలు కూడా ఇరుగు పొరుగు గ్రామాలు అవుతాయి.

వేలాది కిలోమీటర్లు ప్రయాణం చేసి బ్రెజిల్ అమ్మాయి పశ్చిమ బెంగాల్‌లోని తన ప్రియుడిని వెదుక్కుంటూ వచ్చింది. బెంగాల్‌లోని నాడియా జిల్లాకు చెందిన కార్తీక్‌కు నాలుగు సంవత్సరాల క్రితం సోషల్ మీడియాలో బ్రెజిల్‌కు చెందిన మాన్యులా డి సిల్వాతో పరిచయం అయింది. గూగుల్ సాక్షిగా ఆ పరిచయం ప్రేమగా మారడానికి ఎంతోకాలం పట్టలేదు. భాష సమస్య వల్ల కార్తీక్ తల్లిదండ్రులు మాన్యులాతో మాట్లాడడానికి గూగుల్ ట్రాన్స్‌లెట్ యాప్‌ను ఉపయోగించేవారు. ఈ యాప్‌లో బెంగాలీలో టైప్ చేసి మాన్యులా కోసం ఇంగ్లిష్‌లోకి కన్వర్ట్ చేసేవారు. పెళ్లికి ఇరు కుటుంబాల వారు అంగీకరించారు.

కాబోయే అత్తారింటికి వచ్చిన డి సిల్వా ఇప్పుడిప్పుడే బెంగాలీ వంటకాల రుచులకు అలవాటు పడుతోంది. బెంగాలీ పదాలు నేర్చుకుంటోంది.

బెంగాల్‌లో జరగబోయే కూతురు పెళ్లికి హాజరు కావడానికి బ్రెజిల్‌లోని మాన్యులా తల్లిదండ్రులు సన్నాహాలు చేసుకుంటున్నారు.



నా తల్లివి నువ్వే

ఢిల్లీలోని ఒక అనాథాశ్రమంలో పెరిగింది శివాని. చా...లా సంవత్సరాల తరువాత భర్త, కూతురుతో కలిసి ఆ అనాథాశ్రమానికి వచ్చింది. 'నేను శివానిని. గుర్తున్నానా?' అన్నది గార్డియన్ దగ్గరికి వచ్చి. శివాని చిన్నప్పటి జ్ఞాపకాలు గార్డియన్‌ను చుట్టుముట్టాయి. అంతే....గార్డియన్‌కు ఏడుపు ఆగలేదు. ఆమెను ఓదార్చడానికి ప్రయత్నిస్తూ తాను కూడా ఏడ్చేసింది శివాని. చాలాసేపటి వరకు వారి మధ్య ఏడుపు తప్ప మాటలు లేవు.

ఈ వైరల్ వీడియోలోని భావోద్వేగాలు నెటిజనులను కళ్లనీళ్ల పర్యంతం చేశాయి.

శివాని గతంలోకి వెళితే...

ఆమె తండ్రి మద్యానికి బానిస అయ్యాడు.

తల్లిని హింసించేవాడు. ఈ హింస తట్టుకోలేక భర్త నుంచి విడాకులు తీసుకుంది.

తల్లి ఒకచోట, తండ్రి ఒకచోట. పిల్లల ఆలనాపాలనా చూసేవారు లేరు. చివరికి అనాథలుగా మిగిలారు. వీరి దీనస్థితి చూసి ఒక పుణ్యాత్ముడు అనాథాశ్రమంలో చేర్పించాడు. మూడు సంవత్సరాల తరువాత ఆ పిల్లలను ఒక కుటుంబం దత్తత తీసుకుంది. పెరిగి పెద్దయి జీవితంలో స్థిరపడింది. తన కష్టకాలంలో ఆదుకున్న ఆశ్రమాన్ని, తల్లిలా ఆదరించిన గార్డియన్‌ను చూడడానికి వచ్చింది.

అనాథాశ్రమంలో ఉన్నప్పుడు అక్కడి 'గార్డియన్' అక్కా, తమ్ముళ్లను సొంతబిడ్డల్లా చూసుకుంది.

'నా సొంత తల్లి దగ్గరికి వచ్చినట్లు ఉంది' అని గార్డియన్ గురించి రాసింది శివాని.

ఇద్దరు దొంగల ఫైటింగ్ కథ


దొంగతనం చేయాలంటే పకడ్బందీగా స్కెచ్ వేయాలి. ఈ ఇద్దరు దొంగలకు మాత్రం ఎలాంటి స్కెచ్, పెన్సిల్ అవసరం లేకుండానే బ్రహ్మాండమైన అవకాశం వచ్చింది. ఒక ఇంటి ముందు వారికి కొరియర్ ప్యాకేజీ కనిపించింది. దాన్ని చూడగానే 'యురేక' అంటూ పరుగెత్తుకు వెళ్లారు. ఆ తరువాతే అసలు సీన్ స్టార్ట్ అయింది. 'ఇది నాది' అంటూ ఆ ఇద్దరు దొంగలు వాదులాడుకోవడమే కాదు ఒకరి ముఖంపై ఒకరు పంచ్‌లు ఇచ్చుకున్నారు. ఫైటింగ్ సీన్‌లు ఎన్నో ప్రదర్శించారు. డోర్ బెల్ కెమెరా ఫుటేజీలో రికార్డ్ అయిన ఈ దృశ్యాలను ఇంటి యజమాని షేర్ చేయగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

'దొంగలు ప్యాకేజీని యాదృచ్ఛికంగా చూశారా? లేదా సాంకేతిక మాయాజాలంతో ఫలానా చోటుకి కొరియర్‌లో ప్యాకేజీ రానుందని తెలుసుకున్నారా? రెండోది నిజమైతే చాలా ప్రమాదమే' అంటూ ఆందోళన వ్యక్తం చేశారు నెటిజనులు.



భుక్తి కోసం మనిషి వలస వేల ఏళ్ల క్రితం మొదలెట్టాడు. నేటికీ కొనసాగిస్తూనే ఉన్నాడు. పక్షులు, పశువులు, జంతువులు రుతువుల వల్ల, ఆహార లేమి వల్ల వలస వెళుతుంటాయి. వెళ్లడం వాటి చేతుల్లో ఉన్నా తిరిగి రావడం రాకపోవడం ప్రాప్తం. ఇక్కడ నీటిలో నల్లగా కనిపిస్తున్నది డాల్ఫిన్లు కావు. గజరాజులు. ప్రాణాలకు తెగించి వలస పోతున్నాయి.

ఏ దారెటు పోతుందో ఎవరినీ అడగక



అస్సాంలో బ్రహ్మపుత్ర నది ఇప్పుడు ఉధృతంగా ప్రవహిస్తోంది. అక్కడ కురిసిన భారీ వర్షాలు ప్రవాహాన్ని పీకల్దాకా తెచ్చాయి. బ్రహ్మపుత్ర తీరంలో నివసించే ఏనుగులకు ఇప్పుడు ఆహార సంకటం వచ్చింది. జొర్హాట్ జిల్లాలోని నిమితిఘాట్ దగ్గర ఇవి అడవి మీద ఆధారపడి బతుకుతుంటాయి. వరద వల్ల అవి ఇక ఈ వైపు ఉండటం క్షేమం కాదని తలిచాయి. బ్రహ్మపుత్రకు ఆవలి వైపు మానవ ఆవాసాలు ఉన్నాయి. అక్కడ ఏదో ఒక ఊరి మీద పడి ఆహారం పొందవచ్చు అని అన్నీ కూడబలుక్కుని తీర్మానించుకున్నాయి. కలిసి కట్టుగా ప్రవాహంలో దూకాయి. ఏనుగులు మంచి ఈతగత్తెలు. కాని ప్రవాహం ఉధృతంగా ఉంటే వాటికీ ప్రమాదమే. ముఖ్యంగా గున్న ఏనుగులను కాపాడుకుంటూ తల్లి ఏనుగులు ఈత చేయాల్సి ఉంటుంది. అందుకే అన్నీ గుంపుగా ఒకదాన్ని ఒకటి కాపాడుకుంటూ ఈదుకుంటూ అవతలి తీరానికి చేరాయి. సచిన్ భరలి అనే వన్యప్రాణి ఫొటోగ్రాఫర్ ఈ వలసను డ్రోన్ ద్వారా చిత్రీకరించాడు. దాదాపు 100 ఏనుగులు బ్రహ్మపుత్రను దాటే అరుదైన సన్నివేశాన్ని చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. అయ్యో అంటున్నారు. మరోవైపు అవతలి తీరంలోని జనం భయంతో ఆందోళన చెందుతున్నారు. అటవీ అధికారులు అక్కడికి చేరుకున్నారు. చేరుకుంటే మాత్రం. ఆకలిని ఆపగలరా? ఆకలితో ఉన్న గజరాజును ఆపి బతగ్గలరా?



ఆహారం కోసం ఉధృతంగా ప్రవహిస్తున్న బ్రహ్మపుత్ర నదిని దాటుతున్న ఏనుగులు


హెల్త్

• పెయిన్‌కిల్లర్స్ అబ్యూజ్

పెయిన్ తగ్గించడమా?... ప్రాణసంకటమా?!!

మోకాళ్లూ, వెన్నుపూసల అరుగుదలకు కారణమయ్యే ఆర్థరైటిస్, స్పాండిలోసిస్ వంటి సమస్యలూ, కొన్ని ఇన్ఫెక్షన్ల తర్వాత కలిగే బాధలూ, నొక్కుకుపోయే నరాలతో కలిగే నొప్పుల తీవ్రత వర్ణించడానికి అలవి కాదు. భరించలేని నొప్పి కలుగుతుంటే ఒకే ఒక మాత్ర వేయగానే ఉపశమనంతో కలిగే హాయి కూడా అంతా ఇంతా కాదు. అందుకే నొప్పి నివారణ మాత్రలకు కొందరు అలవాటు పడతారు. పెయిన్ కిల్లర్స్ అదేపనిగా వాడితే మూత్రపిండాలు దెబ్బతినడంతో పాటు అనేక రకాల సైడ్ ఎఫెక్ట్స్ వస్తుంటాయి. వాటి గురించి తెలుసుకుని, పెయిన్ కిల్లర్స్‌ను విచక్షణతో వాడాలనే అవగాహన కోసం ఈ కథనం.





భరించలేనంత నొప్పి తీవ్రమైన బాధను కలగజేస్తుంది. ఆ నొప్పిని తగ్గించే మందును అదేపనిగా వాడుతూ ఉంటే అంతకు మించిన కీడు తెచ్చిపెడుతుందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. కొందరు మొదటిసారి డాక్టర్ దగ్గరకు వెళ్లినప్పుడు రాసిచ్చిన మందుల్ని పదే పదే వేసుకుంటూ ఉంటారు. దాంతో కొంతకాలానికి కొన్ని అనర్థాలు రావచ్చంటూ హెచ్చరిస్తున్నారు డాక్టర్లు.

నొప్పి నివారణ మందులతో కలిగే దుష్పరిణామాలు...

పొట్టలోపలి పొరలపైన : నొప్పి నివారణ మందులు వేసుకోగానే కడుపు లోపలి పొరలపై మందు దుష్ప్రభావం పడవచ్చు. దాంతో కడుపులో గడబిడ (స్టమక్ అప్‌సెట్), వికారం, ఛాతీలో మంట, కొన్నిసార్లు నీళ్లవిరేచనాలు లేదా మలబద్ధకం వంటివి కలగవచ్చు. నొప్పినివారణ మందుల వాడకం దీర్ఘకాలం పాటు కొనసాగితే పొట్టలోకి తెరచుకునే సన్నటి రక్తనాళాల చివరలతో పాటు కడుపులోని పొరలు దెబ్బతినడం వల్ల కడుపులో పుండ్లు (స్టమక్ అల్సర్స్) రావచ్చు. అందుకే నొప్పి నివారణ మాత్రలను పరగడపున వేసుకోవద్దని డాక్టర్లు స్పష్టంగా చెబుతారు. ముందుగా కడుపులో రక్షణ పొరను ఏర్పరచే పాంటప్రాజోల్ వంటి మందులను పరగడపున వాడాక లేదా ఏదైనా తిన్న తర్వాతనే పెయిన్ కిల్లర్స్ వేసుకోవాలని డాక్టర్లు సూచిస్తుంటారు.

హైపర్‌టెన్షన్ ఉన్నవారిలో : హైబీపీతో బాధపడే కొందరిలో పెయిన్ కిల్లర్స్ వల్ల రక్తపోటు మరింత పెరగడంతో ప్రధాన రక్తనాళాల చివరన ఉండే అతి సన్నటి రక్తనాళాలు దెబ్బతినే ప్రమాదముంటుంది. దాంతో గుండె పనితీరుపై ఒత్తిడి పెరగడం కారణంగా గుండెజబ్బులు రావచ్చు.

కాలేయంపై దుష్ప్రభావం : ఒంటిలోకి చేరే ప్రతి పదార్థంలోని విషాలను (టాక్సిన్స్‌ను) మొదట విరిచేసి, వాటిని వేరుచేసేది కాలేయమే. ఆ తర్వాత వడపోత ప్రక్రియ మూత్రపిండాల సహాయంతో జరుగుతుంది. అందుకే ఒంటిలోకి చేరగానే పెయిన్ కిల్లర్స్ దుష్ప్రభావం తొలుత కాలేయం మీదే పడుతుంది.

కిడ్నీలపైన : కడుపులోకి చేరే అన్ని రకాల పదార్థాలు రక్తంలో కలిశాక వాటిని వడపోసే ప్రక్రియను మూత్రపిండాలు నిర్వహిస్తాయి. దాంతో పెయిన్‌కిల్లర్ టాబ్లెట్స్‌లోని హానికర విషపదార్థాల ప్రభావాలు వడపోత సమయంలో మూత్రపిండాలపైన నేరుగా పడతాయి. అందుకే పెయిన్‌కిల్లర్స్ దుష్ప్రభావాలు కిడ్నీలపైనే ఎక్కువ. ఆ కారణంగానే... మిగతా దుష్ప్రభావాలతో పోలిస్తే... పెయిన్ కిల్లర్స్ కిడ్నీలను దెబ్బతీస్తాయనే అవగాహన చాలామందిలో ఎక్కువ. నొప్పినివారణ మందులు అతి సన్నటి రక్తనాళాలను దెబ్బతీసే ప్రమాదం ఉన్నందునా... అలాగే రక్తాన్ని వడపోసే అతి సన్నటి రక్తనాళాల చివర్లు కిడ్నీలో ఉన్న కారణాన ఇవి దెబ్బతినే ప్రమాదం ఎక్కువ. రక్తం వడపోత కార్యక్రమం పూర్తిగా సజావుగా జరగాలంటే కిడ్నీల సామర్థ్యంలో కనీసం 30 శాతమైన సరిగా పనిచేయడం తప్పనిసరి. నొప్పి నివారణ మందులు కిడ్నీల సామర్థ్యాన్ని దెబ్బతీయడం వల్ల 'ఎనాల్జెసిక్ నెఫ్రోపతి' అనే జబ్బుతో పాటు దీర్ఘకాలిక వాడకం 'క్రానిక్ కిడ్నీ డిసీజ్-సీకేడీ'కి దారితీసే ప్రమాదం ఉంది. అయితే కిడ్నీలు దెబ్బతింటూ పోతున్నా, వాటి పనితీరు మందగించే వరకు ఆ విషయమే బాధితుల ఎరుకలోకి రాదు.

రక్తం పైన : ఏ మందు తీసుకున్నా అది అన్ని అవయవాలకు చేరి, తన ప్రభావం చూపడానికి ముందర రక్తంలో ఇంకడం తప్పనిసరి. అప్పుడు రక్తం గడ్డకట్టడానికి ఉపయోగపడే ప్లేట్‌లెట్స్‌పై దుష్ప్రభావం పడినప్పుడు కోయాగ్యులోపతి వంటి ప్రమాదకరమైన పరిస్థితికి దారితీయవచ్చు.

చివరగా... తీవ్రమైన నొప్పిని కలిగించే ఆర్థరైటిస్, ఆస్టియోపోరోసిస్, కొన్ని రకాల క్యాన్సర్లు, స్పాండిలోసిస్ వంటి వ్యాధుల చికిత్సల్లో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. ఔషధాల తయారీలోనూ గణనీయమైన పురోగతి కారణంగా గతం కంటే మెరుగైన, తక్కువ సైడ్‌ఎఫెక్ట్స్ ఉన్న మందులు అందుబాటులోకి వచ్చాయి. వీటితో ఉపశమనం మరింత త్వరితం. దుష్ప్రభావాలూ తక్కువే. అందుకే డాక్టర్లు అప్పుడెప్పుడో రాసిన మందుల చీటీలోని నొప్పి నివారణ మాత్రలను వాడకుండా మరోసారి డాక్టర్‌ను సంప్రదించాలి. దాంతో నొప్పి తగ్గడంతో పాటు దేహంలోని అనేక కీలకమైన అవయవాలను రక్షించుకోవడమూ సాధ్యపడుతుంది.



డాక్టర్ హరికిషన్
సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్

దుష్ప్రభావాల లక్షణాలూ లేదా సూచనలివి...

- అకలి లేకపోవడం లేదా అకస్మాత్తుగా బరువు పెరగడం, మలం నల్లగా రావడం, తీవ్రమైన కడుపునొప్పి నొప్పితో మూత్ర విసర్జన జరగడం లేదా మూత్రం చిక్కగా లేదా ఏ రంగూ లేకుండా ఉండటం
- చూపు లేదా వినికిడి సమస్య రావడం వీటిల్లో ఏది కనిపించినా వెంటనే డాక్టర్‌ను సంప్రదించి తాము వాడుతున్న నొప్పి నివారణ మందుల వివరాలు, తమ లక్షణాలను డాక్టర్‌కు తెలపాలి.

దుష్ప్రభావాలను తగ్గించే కొన్ని జాగ్రత్తలివి...

నొప్పి నివారణ మందులు వాడాల్సి వచ్చినప్పుడు వాటి దుష్పరిణామాలను వీలైనంతగా తగ్గించడానికి కొన్ని జాగ్రత్తలు పాటించాలంటూ డాక్టర్లు సూచిస్తుంటారు. అవి...

- పరగడుపున నొప్పి నివారణ మందుల్ని వాడకూడదు.
- అవి వేసుకున్న తర్వాత మామూలు కంటే కాస్త ఎక్కువ నీరు తాగడం మేలు.
- కొన్ని రోజులు వాడాక నొప్పి తగ్గకపోతే మళ్లీ డాక్టర్ సలహా తర్వాతే వాటిని కొనసాగించాలి.
- పెయిన్ కిల్లర్స్ వాడేవారు డాక్టర్ల పర్యవేక్షణలో ఉంటూ తరచూ మూత్రపిండాలు, బీపీ, గుండె పనితీరును తరచూ పరీక్షింపజేసుకుంటూ ఉండాలి.

మెడి టిప్

తరచూ తలనొప్పి వస్తుంటే...



తరచూ వచ్చే తలనొప్పి నివారణకు అనుసరించాల్సిన సూచనలివి...

■ కంప్యూటర్‌పై లేదా ల్యాప్‌టాప్‌పై పనిచేసేవారు కంటిపై పడే ఒత్తిడిని తగ్గించేందుకు ప్రతి గంటసేపటి తర్వాత కనీసం అయిదు నిమిషాలు బ్రేక్ ఇవ్వడం మేలు ■ కంప్యూటర్ స్క్రీన్‌ను తదేకంగా చూడటం సరికాదు. అప్పుడప్పుడు కాస్త కనురెప్పలు మూస్తూ ఉండాలి ■ కుట్లు, అల్లికల పని చేసేవారు, సంక్లిష్టమైన డిజైన్లు అల్లుతున్నప్పుడు తరచూ బ్రేక్ తీసుకుంటూ ఉండాలి ■ సరిపడని ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి ■ టీ, కాఫీలను చాలా పరిమితంగా మాత్రమే తీసుకోవాలి. చాకొలెట్స్, శీతల పానీయాల విషయంలోనూ పరిమితి పాటించాలి ■ సరిపడని పర్‌ఫ్యూమ్‌లకూ, ఘాటైన వాసనలకు దూరంగా ఉండాలి ■ ఆల్కహాల్, పొగతాగడం వంటి దురలవాట్లు పూర్తిగా మానేయాలి ■ రోజూ కనీసం ఎనిమిది గంటలపాటు ప్రశాంతంగా నిద్ర పోవాలి.

పెర్నీషియస్ అనీమియా అంటే..?

రక్తహీనత (అనీమియా) అనేది రకరకాల కారణాల వల్ల ఏర్పడుతుంది. దాన్ని బట్టి ఆయా రక్తహీనతలకు రకరకాల పేర్లు ఉన్నాయి. ఉదాహరణకు... ఐరన్ తగ్గడం వల్ల వచ్చేది సాధారణ అనీమియా అయితే... ఎముకల్లోని మూలుగ ఫెయిల్యూర్ కారణంగా ఎర్ర రక్తకణాలను పుట్టించే ప్రక్రియ దెబ్బతినడం వల్ల వచ్చే 'అప్లాస్టిక్ అనీమియా'. ఇక డిస్క్ షేపులో ఉండే ఎర్రరక్తకణాలు కొడవలి లేదా నెలవంక షేపులోకి మారడం వల్ల వచ్చేది సికిల్ సెల్ అనీమియా. అలాగే... విటమిన్లలో బి12 అనేది లోపించడం వల్ల కూడా రక్తహీనత ఏర్పడుతుంది. ఇలా విటమిన్ బి12 లోపంతో వచ్చే అనీమియాను 'పెర్నీషియస్ అనీమియా' అంటారు. దీనివల్ల కనిపించే లక్షణాలూ, కలిగే దుష్పరిణామాలూ, అందించాల్సిన చికిత్స వంటి అనేక అంశాలపై అవగాహన కోసం... ఈ కథనం.



సొంత రోగనిరోధక వ్యవస్థ అయిన 'ఆటో ఇమ్యూనిటీ లోపం' కారణంగా కడుపులోని ఇన్‌ట్రిన్సిక్ ఫ్యాక్టర్ అనేది ఉత్పత్తి కాలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ఇన్‌ట్రిన్సిక్ వ్యవస్థ వల్లనే తీసుకున్న ఆహారంలోని విటమిన్ బి12 దేహానికి అందుతుంది. ఎర్ర రక్తకణాల ఉత్పత్తిలో సహాయపడే కొన్ని అంశాల్లో విటమిన్ బి12 కూడా ఒకటి. ఆటో ఇమ్యూన్ ఇన్‌ట్రిన్సిక్ వ్యవస్థలోని లోపం కారణంగా విటమిన్ బి12 అందకపోవడంతో ఎర్రరక్తకణాల ఉత్పాదన జరగదు. ఫలితంగా వచ్చే అనీమియాను 'పెర్నీషియస్ అనీమియా' అంటారు.

పెర్నీషియస్ అనీమియా ముప్పును తెచ్చిపెట్టే కొన్ని సమస్యలు... ● టైప్ 1 డయాబెటిస్ ● హైపో థైరాయిడిజమ్ ● ఎడిసన్స్ డిసీజ్ ● గ్రేవ్స్ డిసీజ్ ● కుటుంబంలో ఈ వ్యాధి ఉండటం ● 60 ఏళ్లకు పైబడిన వయసు.

లక్షణాలు : రక్తహీనత కారణంగా వచ్చే అన్ని లక్షణాలూ ఇందులోనూ కనిపిస్తాయి. ఉదా...
● తీవ్రమైన అలసట, నీరసం, నిస్సత్తువ ● ముఖం, దేహం, కనురెప్పల కింద, అరచేతులు, చర్మం పాలిపోయినట్లుగా కనిపించడం ● తలనొప్పి ● ఛాతీ నొప్పి ● బరువు తగ్గడం

సమస్య తీవ్రత మరీ ఎక్కువగా ఉన్నప్పుడు కనిపించే లక్షణాలు... ● నడక తీరు (గెయిట్) కుదురుగా సాగకపోవడం ● భుజమూ, కాళ్లలో తిమ్మిర్లు కనిపించే పెరిఫెరల్ న్యూరోపతి ● కండరాల బలహీనత ● మతిమరపు ● డిప్రెషన్.

విటమిన్ బి12 లోపం వల్ల కనిపించే లక్షణాలు... ● వికారం, వాంతులు ● ఆకలి లేకపోవడం ● ఛాతీలో మంట ● మలబద్ధకం ● అయోమయంగా అనిపించడం.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు
● కంప్లీట్ బ్లడ్ కౌంట్ ● రక్తంలో విటమిన్ బి12 మోతాదు తెలుసుకోవడం ● ఇన్‌ట్రిన్సిక్ ఫ్యాక్టర్, పెరైటల్ సెల్ యాంటీబాడీల కోసం చేసే రక్తపరీక్షలు.

నివారణ : ● విటమిన్ బి12 ఎక్కువగా దొరికే ఆహారాలు తీసుకోవడం.

చికిత్స : డాక్టర్ సలహా మేరకు... అవసరమైన మోతాదులో అందేలా విటమిన్ బి12 టాబ్లెట్లు లేదా విటమిన్ బి12 ఇంజెక్షన్లు ● ఏదైనా వ్యాధి (అండర్‌లైయింగ్ డిసీజ్) కారణంగా ఇన్‌ట్రిన్సిక్ ఫ్యాక్టర్ లోపం వస్తే... అంటే సీలియాక్ డిసీజ్, క్రోన్స్ డిసీజ్ వంటి కారణాల వల్ల విటమిన్ బి12 లోపం కలిగితే ఆ వ్యాధికి చికిత్స అందించడం.



డాక్టర్
డి.ఎస్.కె. సాహిత్య
కన్సల్టెంట్ హెమటాలజిస్ట్ & హెమటో ఆంకాలజిస్ట్



పారిస్ ఒలింపిక్స్‌కు నగాల్ క్వాలిఫై

భారత నంబర్‌వన్ టెన్నిస్ ఆటగాడు సుమీత్ నగాల్ వరుసగా రెండో ఒలింపిక్స్‌లో పాల్గొనబోతున్నాడు. తాను పారిస్ ఒలింపిక్స్‌కు అధికారికంగా అర్హత సాధించినట్లు నగాల్ స్వయంగా వెల్లడించాడు. '2024 పారిస్ ఒలింపిక్స్‌కు నేను అర్హత సాధించాననే విషయాన్ని ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది. నా మనసులో ఒలింపిక్స్‌కు ప్రత్యేక స్థానం ఉంది. కాబట్టి ఇది చెప్పుకోదగ్గ క్షణం. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొనడం నా కెరీర్ విశేషాల్లో చెప్పుకోదగ్గ అంశం. ఆ తర్వాతినుంచి పారిస్ ఒలింపిక్స్ లక్ష్యంగా శ్రమించాను. మెగా ఈవెంట్‌లో సత్తా చాటాలని పట్టుదలగా ఉన్నా' అని నగాల్ ట్వీట్ చేశాడు. గత ఏడాది కాలంగా మంచి ఫామ్‌తో వరుస విజయాలు సాధించిన నగాల్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 71వ స్థానానికి ఎగబాకాడు. రెండు చాలెంజర్ టైటిల్స్ గెలవడంతో పాటు ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ డ్రాకు అర్హత సాధించి రెండో రౌండ్ వరకు చేరుకున్నాడు. పురుషుల డబుల్స్‌లో రోహన్ బోపన్న – శ్రీరామ్ బాలాజీ జోడి భారత్ తరఫున బరిలోకి దిగనుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో బోపన్న ప్రస్తుతం టాప్-10లో ఉండటంతో తన భాగస్వామిని ఎంచుకునే అవకాశం అతనికి కలిగింది.

బంగ్లాపై విజయభేరి

50 పరుగులతో భారత్ ఘనవిజయం

- సెమీఫైనల్ చేరడం లాంఛనమే!
- పాండ్యా ఆల్‌రౌండ్ ప్రదర్శన
- రాణించిన బుమ్రా, కుల్దీప్
- రేపు ఆస్ట్రేలియాతో పోరు

నార్త్‌సౌండ్: భారత్ ఆల్‌రౌండ్ షోకు బంగ్లాదేశ్ తెల్లమొహం వేసింది. బ్యాటింగ్‌లో కలిపికొట్టి, తర్వాత పేస్, స్పిన్‌తో వికెట్లను చెదరగొట్టింది. టి20 ప్రపంచకప్ సూపర్-8 రెండో మ్యాచ్‌లో భారత్ 50 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై జయభేరి మోగించింది. వరుసగా రెండు విజయాలు సాధించిన టీమిండియా ఇక సెమీస్‌కు చేరడం లాంఛనమే. టాస్ నెగ్గిన బంగ్లా ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హార్దిక్ పాండ్యా (27 బంతుల్లో 50 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (28 బంతుల్లో 37; 1 ఫోర్, 3 సిక్స్‌లు), రిషభ్ పంత్ (24 బంతుల్లో 36; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), శివమ్ దూబే (24 బంతుల్లో 34; 3 సిక్స్‌లు) రాణించారు. అనంతరం బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 146 పరుగులే చేసింది. కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ (32 బంతుల్లో 40; 1 ఫోర్, 3 సిక్స్‌లు) కొద్దిగా ప్రతిఘటించగలిగాడు. కుల్దీప్ 3, బుమ్రా, అర్ష్‌దీప్ చెరో 2 వికెట్లు తీశారు. సూపర్-8 దశలో తమ చివరి మ్యాచ్‌లో సోమవారం ఆస్ట్రేలియాతో భారత్ తలపడుతుంది.

కలిసిమెలిసి దంచేసి...

కోహ్లితో ఇన్నింగ్స్ ఆరంభించిన కెప్టెన్ రోహిత్ (11 బంతుల్లో 23; 3 ఫోర్లు, 1 సిక్స్) నాలుగో ఓవర్లోనే అవుటయ్యాడు. ఈ కాసేపట్లోనే వేయాల్సినంత వేగవంతమైన పునాదిని వేసి వెళ్లాడు. ఇక కోహ్లి, పంత్ తమ కెప్టెన్ వేగాన్ని అందిపుచ్చుకోవడంతో పవర్‌ప్లేలో భారత్ 53/1 స్కోరు చేసింది. పవర్‌ప్లే ఆఖరి ఓవర్ (6)లో కోహ్లి కొట్టిన సిక్సర్‌తోనే జట్టు స్కోరు 50కి చేరింది. రిషాద్ వేసిన 8వ ఓవర్లో కోహ్లి మరో సిక్స్ బాదాడు. పంత్ కూడా బౌండరీ కొట్టడంతో 8 బంతుల ఈ సుదీర్ఘ ఓవర్లో 15 పరుగులు వచ్చాయి. ఇది భారత శిబిరాన్ని ఉత్సాహపరిస్తే... మరుసటి 9వ ఓవర్ భారత్‌ను దెబ్బమీద దెబ్బ తీసింది. తొలి బంతికే కోహ్లి, మూడో బంతికి సూర్యకుమార్ (6)లను తన్జీమ్ పెవిలియన్ చేర్చాడు. అయితే ఈ వికెట్ల ప్రభావం ఇన్నింగ్స్‌పై పడకుండా తర్వాత వచ్చిన బ్యాటర్లు చెలరేగారు.

హార్దిక్ మెరుపు ఫిఫ్టీ

11వ ఓవర్ నుంచి శివమ్ దూబే అండతో రిషభ్ పంత్ బ్యాట్ ఝుళిపించాడు. ముస్తఫిజుర్ ఓవర్లో 2 బౌండరీలు, ఓ సిక్స్ బాదాడు. మరుసటి ఓవర్లో రిషాద్‌పై విరుచుకుపడే క్రమంలో 6, 4 కొట్టిన పంత్ అదే జోరులో ఆడేందుకు ప్రయత్నించి అవుటయ్యాడు. 14 ఓవర్లలో భారత్ 120/4 స్కోరు చేసింది.


పాండ్యా

ఆ తర్వాత 6 ఓవర్లలోనే (36 బంతులు) 76 పరుగులు చేసింది. ఇంత స్కోరుకు, ఇన్నింగ్స్ జోరుకు హార్దిక్ పాండ్యా కారణమయ్యాడు. 15వ ఓవర్లో 6, 4తో 14 పరుగులు, 16, 17 ఓవర్లలో దూబే ఒక్కో సిక్సర్‌తో వరుసగా 12 పరుగులు, 9 పరుగులు వచ్చాయి. 18వ ఓవర్లో సిక్స్ కొట్టిన దూబే అవుట్ కాగా, హార్దిక్ మరో భారీ సిక్సర్ బాదడంతో 15 పరుగులొచ్చాయి. తన్జీమ్, ముస్తఫిజుర్ సహా బౌలర్లందరినీ చితకబాదిన హార్దిక్ 27 బంతుల్లో అర్ధసెంచరీ సాధించి నాటౌట్‌గా నిలిచాడు.

నజ్ముల్ ఒక్కడే...

టాప్-3 బ్యాటర్లలో లిటన్ దాస్ (13) విఫలమవగా, తన్జీద్ హసన్ (31 బంతుల్లో 29; 4 ఫోర్లు), కెప్టెన్ నజ్ముల్ మెరుగ్గానే ఆడారు. ఒక వైపు నజ్ముల్ పోరాడినా... మరోవైపు తౌహీద్ హ్రిదయ్ (4), ప్రతీ ప్రపంచకప్ ఆడిన విశేషానుభవజ్ఞుడు షకీబ్ (11), మహ్ముదుల్లా (13) చేతులెత్తేయడంతో బంగ్లా పరాజయం తప్పలేదు. ఆఖర్లో రిషాద్ (10 బంతుల్లో 24; 1 ఫోర్, 3 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించాడు .


కుల్దీప్

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) జాకీర్ (బి) షకీబ్ 23; కోహ్లి (బి) తన్జీమ్ హసన్ 37; పంత్ (సి) తన్జీమ్ హసన్ (బి) రిషాద్ 36; సూర్యకుమార్ (సి) లిటన్ దాస్ (బి) తన్జీమ్ హసన్ 6; దూబే (బి) రిషాద్ 34; పాండ్యా నాటౌట్ 50; అక్షర్ నాటౌట్ 3; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 196. వికెట్ల పతనం:** 1-39, 2-71, 3-77, 4-108, 5-161. **బౌలింగ్:** మెహదీ హసన్ 4-0-28-0, షకీబ్ 3-0-37-1, తన్జీమ్ హసన్ 4-0-32-2, ముస్తఫిజుర్ 4-0-48-0, రిషాద్ హుస్సేన్ 3-0-43-2, మహ్ముదుల్లా 2-0-8-0. **బంగ్లాదేశ్ ఇన్నింగ్స్:** లిటన్ దాస్ (సి) సూర్యకుమార్ (బి) పాండ్యా 13; తన్జీద్ హసన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 29; నజ్ముల్ (సి) అర్ష్‌దీప్ (బి) బుమ్రా 40; తౌహీద్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 4; షకీబ్ (సి) రోహిత్ (బి) కుల్దీప్ 11; మహ్ముదుల్లా (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 13; జాకిర్ అలీ (సి) కోహ్లి (బి) అర్ష్‌దీప్ 1; రిషాద్ (సి) రోహిత్ (బి) బుమ్రా 24; మెహిది హసన్ నాటౌట్ 5; తన్జీమ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 146. వికెట్ల పతనం:** 1-35, 2-66, 3-76, 4-98, 5-109, 6-110, 7-138, 8-145. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-30-2, బుమ్రా 4-0-13-2, అక్షర్ 2-0-26-0, హార్దిక్ పాండ్యా 3-0-32-1, జడేజా 3-0-24-0, కుల్దీప్ 4-0-19-3.

టి20 ప్రపంచకప్‌లో నేడు
ఆస్ట్రేలియా X అఫ్గానిస్తాన్
వేదిక: కింగ్స్‌టౌన్; ఉ.గం.6.00 నుంచి
ఇంగ్లండ్ X అమెరికా
వేదిక: బ్రిడ్జ్‌టౌన్; రాత్రి గం. 8 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

వెస్టిండీస్ చితక్కొట్టేసింది..!

- 65 బంతుల్లో 130 పరుగుల లక్ష్యఛేదన
- 9 వికెట్ల తేడాతో ఓడిన అమెరికా
- షై హోప్ మెరుపు ఇన్నింగ్స్

బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్): మాజీ చాంపియన్, టి20 వరల్డ్ కప్ ఆతిథ్య జట్లలో ఒకటైన వెస్టిండీస్ కీలక పోరుతో సత్తా చాటింది. సూపర్-8 దశ తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్ చేతిలో ఓడి ఇబ్బందుల్లో పడ్డ ఆ జట్టు ఇప్పుడు మరో ఆతిథ్య టీమ్ అమెరికాపై చెలరేగిపోయింది. భారీ విజయంతో గ్రూప్ '2'లో తమ రన్‌రేట్‌ను కూడా అమాంతం పెంచుకుంది. టోర్నీలో ఈ మ్యాచ్ ముందు వరకు ప్రతీ సారి స్ఫూర్తిదాయక ప్రదర్శనతో ఎంతో కొంత పోరాటపటిమ కనబర్చిన అమెరికా ఇక్కడ మాత్రం పూర్తిగా చేతులెత్తేసింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో విండీస్ 9 వికెట్ల తేడాతో అమెరికాపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అమెరికా 19.5 ఓవర్లలో 128 పరుగులకే కుప్పకూలింది. ఆండ్రీస్ గూస్ (16 బంతుల్లో 29; 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రోస్టన్ ఛేజ్ (3/19), ఆంద్రీ రసెల్ (3/13) ప్రత్యర్థిని పడగొట్టగా, అల్జారి జోసెఫ్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం వెస్టిండీస్ 10.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 130 పరుగులు సాధించి విజయాన్నందుకుంది. షై హోప్ (39 బంతుల్లో 82 నాటౌట్; 4 ఫోర్లు, 8 సిక్స్‌లు) సిక్సర్లతో చెలరేగగా, నికోలస్ పూరన్ (12 బంతుల్లో 27 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించారు. జాన్సన్ చార్లెస్ (15) అవుటైన తర్వాత జత కలిసిన ఈ ద్వయం 23 బంతుల్లో అభేద్యంగా 63 పరుగులు జోడించింది. ఈ క్రమంలో హోప్ టి20 వరల్డ్ కప్ చరిత్రలో విండీస్ తరఫున ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. తాజా ఫలితంతో గ్రూప్ '2'లో దక్షిణాఫ్రికా (0.625), ఇంగ్లండ్ (0.412)లకంటే విండీస్ రన్‌రేట్ (1.814) చాలా ఎక్కువగా వచ్చేసింది. సెమీస్ చేరాలంటే తమ చివరి మ్యాచ్‌లో సోమవారం దక్షిణాఫ్రికాపై గెలిస్తే సరిపోతుంది.


షై హోప్

భారత మహిళల జట్టు 'హ్యాట్రిక్'

వరల్డ్ కప్‌లో వరుసగా మూడో స్వర్ణం


సురేఖ, పర్నీత్, అదితి

అంటాల్యా (టర్కీ): వరల్డ్ కప్ ఆర్చరీ స్టేజ్ 3లో భారత మహిళల జట్టు (కాంపౌండ్ విభాగం) స్వర్ణ పతకం గెలుచుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో భారత్ 232-229 స్కోరుతో ఎస్తోనియాపై విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖతో పాటు అదితి గోపీచంద్ స్వామి, పర్నీత్ కౌర్ ఈ జట్టులో సభ్యులుగా ఉన్నారు. తుది పోరులో 4 ఎండ్‌లలో భారత్ వరుసగా 58, 57, 59, 58 పాయింట్లు సాధించగా...ఎస్తోనియా టీమ్ సభ్యులు వరుసగా 57, 57, 58, 57 స్కోర్లు చేసి ఓవరాల్‌గా 3 పాయింట్లతో వెనుకబడ్డారు. మన మహిళల జట్టు ఈ ఏడాది వరుసగా మూడో వరల్డ్ కప్‌లోనూ పసిడి పతకం గెలుచుకొని సత్తా చాటడం విశేషం. వరల్డ్ కప్ స్టేజ్ 1 (షాంఘై), వరల్డ్ కప్ స్టేజ్ 2 (యెజియాన్)లలో కూడా టీమ్ అగ్రస్థానంతో ముగించింది. మరో వైపు పురుషుల కాంపౌండ్ విభాగం ఫైనల్లో ఓడిన భారత ఆర్చర్ ప్రియాన్ష్ రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఫైనల్లో ప్రియాన్ష్ 148-149 స్కోరుతో మైక్ స్కాలెసర్ చేతిలో ఓటమిపాలయ్యాడు.

ఫ్రాన్స్, నెదర్లాండ్స్ మ్యాచ్ 'డ్రా'


గోల్‌ను తిరస్కరించడంతో నిరాశలో డచ్ ఆటగాళ్లు

లీప్‌జిగ్ (జర్మనీ): ప్రతిష్టాత్మక యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నీలో గోల్ నమోదు కాని తొలి 'డ్రా' నమోదైంది. అదీ యూరోప్‌లోని రెండు అగ్రశ్రేణి జట్ల మధ్య మ్యాచ్‌లో కావడం విశేషం. శనివారం గ్రూప్ 'డి'లో భాగంగా ఫ్రాన్స్, నెదర్లాండ్స్ మధ్య మ్యాచ్ 0-0తో 'డ్రా'గా ముగిసింది. హోరాహోరీ సమరంలో ఇరు జట్లు కూడా గోల్ కొట్టడంలో విఫలమయ్యాయి. అయితే మ్యాచ్ కీలక దశలో నెదర్లాండ్స్‌ను దురదృష్టం వెంటాడింది. డచ్ ప్లేయర్ గ్జేవీ సైమన్స్ చేసిన గోల్‌ను రిఫరీ తిరస్కరించాడు. సుదీర్ఘ సమయం పాటు వీడియో రీప్లేలు చూసిన తర్వాత ఆ గోల్‌ను 'ఆఫ్‌సైడ్'గా ప్రకటించారు. మరో వైపు తమ స్టార్ ప్లేయర్ ఎంబాపె లేకుండా ఫ్రాన్స్ ఈ మ్యాచ్ బరిలోకి దిగింది. మరో మ్యాచ్‌లో పోర్చుగల్ 3-0 గోల్స్ తేడాతో టర్కీని చిత్తు చేసింది.

సినిమా

ఎస్ఆర్‌కె సినిమాకి ఎస్?


సమంత

షారుక్ ఖాన్‌ని బాలీవుడ్‌లో ఎస్ఆర్‌కె అని పిలుస్తారని అందరికీ తెలిసిన విషయమే. ఎస్ఆర్‌కెకి సరసన సమంత హీరోయిన్‌గా నటించనున్నారన్నది తాజా టాక్. ఈ చిత్రంలో నటించడానికి సమంత దాదాపు 'ఎస్' చెప్పారట. రాజ్‌కుమార్ హిరానీ దర్శకత్వంలో ఈ సినిమా పొందనుందని టాక్. దేశభక్తి నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచరస్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారట. ఆగస్ట్ 15న ఈ చిత్రం గురించి అధికారిక ప్రకటన వచ్చే చాన్స్ ఉందని భోగట్టా. కాగా... ఇప్పటికే సమంత ఫలానా హిందీ చిత్రంలో నటించనున్నారనే వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే అవేవీ నిజం కాలేదు. కానీ ఎస్ఆర్‌కె-సమంత కాంబినేషన్ సినిమా నిజం అవుతుందని హిందీ చిత్రసీమ అంటోంది.

రామానుజాచార్యుల చరిత్రతో...

సాయి వెంకట్ నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న సినిమా 'జయహో రామానుజ'. జో శర్మ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో సుమన్, ప్రవళ్లిక కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రెండు భాగాలుగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా తొలి భాగం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సంస్కృత భాషల్లో జూలై 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన 'జయహో రామానుజ' లిరికల్ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో సాయి వెంకట్ మాట్లాడుతూ– ''మహిళల్ని గౌరవించాలని, కుల మతాలకు అతీతంగా ఐకమత్యంతో మానవాళి మెలగాలని సందేశాన్ని ఇచ్చిన గొప్ప గురువు రామానుజా చార్యుల వారు. ఆయన గొప్పతనం ఈ తరం వారికి తెలియజేయాలనే ఉద్దేశంతో 'జయహో రామానుజ' చిత్రాన్ని రూపొందించాను. సంగీత సాహిత్యాలు బాగుండాలని టైమ్ తీసుకుని ఖర్చుకు వెనకాడకుండా సాంగ్స్ డిజైన్ చేశాం'' అన్నారు. ''జయహో రామానుజ' సినిమా మా నాన్నగారు సాయి వెంకట్‌కి ఒక కల'' అన్నారు నిర్మాత ప్రవళ్లిక. ఈ చిత్రానికి సంగీతం: జయసూర్య, వెంకట్, హర్ష.


సాయి వెంకట్

కలలో బీట్ బాగుంది

- సంగీతదర్శకుడు కోటి


మార్కండేయ, కోటి

''కలలో... కలలో.. .' పాట చాలా ఫ్రెష్‌గా ఉంది. ఈ పాట బీట్, లిరిక్స్, నటీనటుల వేషధారణ, నటన అన్నీ బాగా కుదిరాయి. ఈ చిత్రబృందానికి శుభాకాంక్షలు'' అన్నారు సంగీత దర్శకుడు కోటి. నటుడు అలీ ఫ్యామిలీ నుంచి సదన్ హీరోగా పరిచయమవుతున్న 'ప్రణయ గోదారి' చిత్రంలోని 'కలలో... కలలో...' అంటూ సాగే పాటను కోటి రిలీజ్ చేశారు. పీఎల్ విఘ్నేష్ దర్శకత్వంలో పారమళ్ల లింగయ్య నిర్మించిన ఈ చిత్రంలో ప్రియాంకా ప్రసాద్ హీరోయిన్. ''ఫీల్ గుడ్ లవ్‌స్టోరీతో రూపొందించిన ఈ చిత్రంలోని 'కలలో..' అంటూ సాగే ప్రేమ పాటను సహజమైన లొకేషన్స్‌లో చిత్రీకరించాం. వీనుల విందుగా, కనువిందుగా ఉంటుంది. త్వరలో సినిమాని విడుదల చేస్తాం '' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మార్కండేయ, కెమెరా: ఈదర ప్రసాద్.

లక్కు నీ వెంట...

'లక్కు నీ వెంట కుక్క తోక లెక్క ఊపుకుంటూ వచ్చరో లచ్చన్న...' అంటూ మొదలవుతుంది 'పేకమేడలు' సినిమాలోని 'బూమ్ బూమ్ లచ్చన్న' పాట. 'నా పేరు శివ, అంధగారం' సినిమాల ఫేమ్ వినోద్ కిషన్ హీరోగా నటించిన చిత్రం ఇది. ఇందులో అనూషా కృష్ణ హీరోయిన్. రాకేష్ వర్రే నిర్మించిన ఈ చిత్రం జూలైలో విడుదలకు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'బూమ్ బూమ్ లచ్చన్న...' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రసంగీత దర్శకుడు స్మరణ్ సాయి నేతృత్వంలో భార్గవ్ కార్తీక్ సాహిత్యం అందించిన ఈ పాటను మనో పాడారు. రితికా శ్రీనివాస్, జగన్ యోగిరాజ్, అనూష నూతల, గణేష్ తిప్పరాజు, నరేన్ యాదవ్ ఈ సినిమాలోని ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు.


వినోద్, అనూష

సినిమా కథకు తగ్గట్లుగా డైలాగ్స్, డ్యాన్స్, ఫైట్స్ చేయడమే కాదు... క్యారెక్టరైజేషన్‌కు సరిపోయేట్లు హీరోల ఆహార్యం కూడా ఉండాలి... గెటప్ కుదరాలి. అప్పుడే సిల్వర్ స్క్రీన్‌పై కథ ఆడియన్స్‌కు మరింత కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. ఇలా కనెక్ట్ కావడం కోసం కొందరు హీరోలు మేకోవర్ మిషన్‌ను స్టార్ట్ చేశారు. ఇప్పటికే 'తండేల్' కోసం నాగచైతన్య, 'స్వయంభూ'కి నిఖిల్, 'స్వాగ్'కి శ్రీవిష్ణు వంటి హీరోలు మేకోవర్ అయ్యారు. త్వరలో సెట్స్‌కి వెళ్లడానికి మిషన్ మేకోవర్ అంటూ రెడీ అవుతున్న హీరోల గురించి తెలుసుకుందాం.


మహేశ్ బాబు


ఎన్టీఆర్


రామ్ చరణ్


విజయ్ దేవరకొండ

మిషన్ మేకోవర్

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. సిల్వర్ స్క్రీన్‌పై మహేశ్‌బాబును సరికొత్తగా చూపించాలని రాజమౌళి ఫిక్స్ అయిపోయారు. ఇందుకు తగ్గట్లుగానే మహేశ్ ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. మేకోవర్ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది జనవరిలో మహేశ్ విదేశాలకు వెళ్లొచ్చారు. ఈ సినిమాలో మహేశ్ లుక్, గెటప్ కంప్లీట్ డిఫరెంట్‌గా ఉండేలా రాజమౌళి ప్లాన్ చేశారని తెలుస్తోంది. ఈ చిత్ర కథను ఇప్పటికే పూర్తి చేశారు విజయేంద్రప్రసాద్. పాటల పని కూడా ఆరంభించారు సంగీతదర్శకుడు కీరవాణి. ఈ ఫారెస్ట్ యాక్షన్ అడ్వెంచరస్ మూవీ చిత్రీకరణ ఈ ఏడాదిలోనే ప్రారంభం కానుందనే టాక్ వినిపిస్తోంది. ఈ ఆగస్టు 9న మహేశ్‌బాబు బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమా చిత్రీకరణ గురించిన అప్‌డేట్ వచ్చే అవకాశం ఉంది. అలాగే ఈ సినిమాను రెండు భాగాలుగా తీయాలని అనుకుంటున్నారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. కేఎల్ నారాయణ ఈ సినిమాను నిర్మించనున్నారు.

కొత్త సినిమా మేకోవర్ అంటే చాలు... ఎన్టీఆర్ రెడీ అనేస్తారు. ఈసారి దర్శకుడు ప్రశాంత్ నీల్‌కు ఎన్టీఆర్ ఓకే చెప్పారు. ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) రానున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా చిత్రీకరణను ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభిస్తామని ఇటీవల మేకర్స్ వెల్లడించారు. అయితే ఈ గ్యాప్‌లో ఈ సినిమా కోసం మేకోవర్ అయ్యేలా ఎన్టీఆర్ ప్లాన్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో 'దేవర' సినిమా చేస్తున్నారు ఎన్టీఆర్. వీలైనంత త్వరగా ఈ సినిమా తొలి భాగం షూట్‌ను పూర్తి చేసి, 'డ్రాగన్' మేకోవర్ మీద దృష్టి పెట్టాలనుకుంటున్నారట ఎన్టీఆర్. ఈ సినిమాలో హీరోయిన్‌గా రష్మికా మందన్నా, విలన్‌గా బాబీ డియోల్‌ల పేర్లు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మించనున్నారు.

'గేమ్ చేంజర్' సినిమా షూటింగ్‌తో రామ్‌చరణ్ ప్రస్తుతం బిజీ బిజీగా ఉన్నారు. ఈ సినిమాలో తన వంతు షూటింగ్ ఓ కొలిక్కి వచ్చిన తర్వాత రామ్‌చరణ్ ఆస్ట్రేలియా వెళ్తారు. హాలీడే కోసం కాదు.... బుచ్చిబాబు సన దర్శకత్వంలో హీరోగా నటించనున్న సినిమాలోని క్యారెక్టర్ మేకోవర్ కోసం వెళ్లనున్నారు. ఈ సినిమా చిత్రీకరణను ఆగస్టులో ప్రారంభించనున్నట్లుగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు బుచ్చిబాబు. కాగా రూరల్ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో సాగే ఈ మూవీలోని గెటప్స్ కోసం చరణ్ ప్రత్యేక్ష శిక్షణ తీసుకోనున్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించనున్నారు. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.

విజయ్ దేవరకొండను ఇప్పటివరకు అర్బన్, సెమీ అర్బన్ కుర్రాడిగానే ఎక్కువగా సిల్వర్ స్క్రీన్‌పై చూశాం. కానీ తొలిసారి పక్కా పల్లెటూరి కుర్రాడిలా కనిపించేందుకు రెడీ అవుతున్నారు. విజయ్ దేవరకొండ హీరోగా 'రాజావారు రాణిగారు' ఫేమ్ రవికిరణ్ కోలా దర్శకత్వంలో రూరల్ మాస్ డ్రామాగా ఓ మూవీ రానుంది. ఈ సినిమా కోసమే విజయ్ పల్లెటూరి మాస్ కుర్రాడిగా మేకోవర్ కానున్నారు. ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ ఓ సినిమాలో నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తి కాగానే తన కొత్త మేకోవర్ ఆరంభిస్తారట విజయ్.


అఖిల్

అక్కినేని అఖిల్ హీరోగా నటించిన గత చిత్రం 'ఏజెంట్'. ఈ స్పై మూవీ కోసం అఖిల్ స్పెషల్‌గా మేకోవర్ అయ్యారు. సిక్స్ ప్యాక్ బాడీని డెవలప్ చేశారు. ఈ సినిమా తర్వాత అఖిల్ నటించాల్సిన కొత్త సినిమా గురించిన అధికారిక ప్రకటన ఇంకా రాలేదు. కానీ అఖిల్ అనే ఓ కొత్త దర్శకుడు తెరకెక్కించనున్న ఫ్యాంటసీ అండ్ పీరియాడికల్ యాక్షన్ మూవీలో అఖిల్ హీరోగా నటిస్తారని, 11వ శతాబ్దం నేపథ్యంలో సాగే ఈ సినిమాలో ఓ ట్రైబల్ నాయకుడిగా అఖిల్ కనిపిస్తారనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ సినిమాలోని తన గెటప్ కోసమే అఖిల్ మేకోవర్ అవుతున్నారు. ఈ మధ్యకాలంలో కాస్త పొడవాటి జుట్టుతో, సరికొత్త ఫిజిక్‌తో అఖిల్ సరికొత్తగా కనిపించడం చర్చనీయాంశమైంది. ఈ మూవీ కోసమే అఖిల్ ఇలా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారట. దాదాపు రూ. వంద కోట్ల బడ్జెట్‌తో యూవీ క్రియేషన్స్, హోంబలే ఫిలింస్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయనే ప్రచారం సాగుతోంది.

ఈ హీరోలే కాదు... కథానుగుణంగా మేకోవర్ అవుతున్న హీరోలు మరికొందరు ఉన్నారు.

పర్యావరణ హిత ఎకో టూరిజం

- రాష్ట్రంలో 40 ఎకో టూరిజం స్పాట్ల గుర్తింపు
- అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: పర్యావరణానికి, వన్య ప్రాణులకు హాని కలగకుండా, వాటి సహజ ఆవాసాలను పరిరక్షిస్తూ, స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రకృతి పర్యాటక విధానాన్ని రూపొందిస్తున్నట్టు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎకో టూరిజం అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్టు తెలిపారు. సచివాలయంలో శనివారం జరిగిన సమావేశానికి ఎకో టూరిజం కన్సల్టేటివ్ కమిటీ చైర్మన్ హోదాలో మంత్రి కొండా సురేఖ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ. ఇప్ప టివరకు రా ష్ట్రంలోని 12 సర్క్యూట్లలో 40 ఎకో టూరిజం స్పాట్లను గుర్తించినట్టు మంత్రి తెలిపారు. అడ్వెంచర్, రిక్రియేషన్, ఆధ్యాత్మిక, వారస త్వ, సినీ, వెడ్డింగ్, నేచర్, వైల్డ్‌లైఫ్, హెరిటేజ్–కల్చర్ వంటి అంశాల ఆధారంగా మరిన్ని ప్రాంతాలను గుర్తించి వాటిని ఎకో టూరిజం స్పాట్లుగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఎకో టూరిజం స్పాట్లను అభివృద్ధి చేసేందుకు పీపీపీ పద్ధతిలో నిధులు సమీకరించాలని కోరారు.

ఆధునిక వైద్యం అందుబాటులో ఉండాలి



ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహా

మణికొండ (హైదరాబాద్): ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న ఆధునిక వైద్యం మన రాష్ట్ర ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. శనివారం సాయంత్రం ఆయన ఔటర్ రింగ్ రోడ్డు పుప్పాలగూడ టోల్‌గేట్ వద్ద డాక్టర్ గౌడ్స్ డెంటల్ ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ గౌడ్స్ డెంటల్ ఆసుపత్రికి 55 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు, సీఎండీ ఎంఎస్ గౌడ్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో ఇది తమ ఆరో ఆసుపత్రి అని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మధుయాష్కిగౌడ్, ఆర్థోడాంటిక్స్, డెంటో ఫేషియల్ ఆర్థోపెడిక్ సీఈవో డాక్టర్ స్నిగ్ధాగౌడ్ పాల్గొన్నారు.

నిరంతర పఠనంతో చట్టాలపై అవగాహన

యువ న్యాయవాదులకు జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ శ్యామ్‌కోషి సూచన



కార్యక్రమంలో ప్రారంభోపన్యాసం చేస్తున్న బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి. చిత్రంలో జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ శ్యామ్ కోషి

సాక్షి, హైదరాబాద్: నిరంతర పఠనంతోనే చట్టాలపై అవగాహన పెంపొందుతుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ యువ న్యాయవాదులకు సూచించారు. మారుతున్న కాలానుగుణంగా చట్టాల్లో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. జూలై 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త క్రిమినల్ చట్టాలపై న్యాయవాదులకు జ్యుడీషియల్ అకాడమీ, బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆర్‌బీవీఆర్ఆర్ పోలీస్ అకాడమీలో నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణా తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ శ్యామ్ కోషి కార్యక్రమాన్ని ప్రారంభించారు. న్యాయవాదుల కోసం అకాడమీ, బార్ కౌన్సిల్ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అకాడమీని జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ శ్యామ్ కోషి ప్రశంసించారు. దాదాపు 400 మంది న్యాయవాదులు ఈ అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ ఎం.రాజేందర్, డిప్యూటీ డైరెక్టర్ వెంకట్‌రామ్, బార్ కౌన్సిల్ సభ్యులు లక్ష్మణ్‌కుమార్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి చొరవ చూపాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని. చిత్రంలో జస్టిస్ మాధవిదేవి

నాగర్ కర్నూల్: కేసుల సత్వర పరిష్కారానికి న్యాయమూర్తులు ప్రత్యేక చొరవ చూపాలని హైకోర్టు న్యాయమూర్తి, నాగర్ కర్నూల్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని అన్నారు. జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జిగా నియామకమైన జస్టిస్ ప్రియదర్శిని, మరో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవిదేవితో కలసి శనివారం మొదటిసారిగా జిల్లా కోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రాజేశ్‌బాబు, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ పుష్పగుచ్ఛం అందజేయగా.. వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తులు జిల్లా కోర్టు హాల్‌లో జ్యుడీషియరీ హాల్, డిజిటల్ గ్రంథాలయం, మహిళా బార్ అసోసియేషన్ చాంబర్, వీడియో కాన్ఫరెన్స్ హాల్, కోర్టు ప్రాంగణంలో క్యాంటీన్‌ను ప్రారంభించారు. అంతకుముందు కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. జిల్లాలోని అన్ని కోర్టుల న్యాయమూర్తులతో పెండింగ్ కేసులు, సమస్యల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని మాట్లాడుతూ.. జిల్లాలో 14 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో రాజీ అయ్యే కేసులను జాతీయ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు పరిష్కరించుకునేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా లోని ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో అధికారులను నియమించాలని జిల్లా జడ్జి రాజేశ్‌బాబు కోరగా.. న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవి దేవి మాటాడుతూ.. నాగర్ కర్నూల్ జిల్లాలో తొలి మహిళా అడ్వొకేట్‌గా పనిచేసిన అనుభవాన్ని పంచుకున్నా రు. కోవిడ్ సమయంలో డిజిటల్ ప్లాట్ ఫాం ద్వారా కేసుల పరిష్కారం దిశగా అడుగులు వేశామన్నారు. జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ ప్రియదర్శిని దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశా రు. అనంతరం జిల్లా జడ్జి, న్యాయవాదులు వారిని సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు రాధాకృష్ణ, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యమే మనిషికి అసలైన సంపద

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరెపల్లి నంద



పెద్దపల్లి కోర్టు ఆవరణలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జస్టిస్ సూరెపల్లి నంద

పెద్దపల్లిరూరల్: 'ప్రతీ ఒక్కరు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి. సంపద అంటే బంగారు, వెండి ఆభరణాలు కాదు. మహాత్ముడు చెప్పినట్లు ఆరోగ్యమే మనిషికి అసలైన సంపద' అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరెపల్లి నంద అన్నారు. పెద్దపల్లి జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జిగా వ్యవహరిస్తున్న జస్టిస్ నంద.. పెద్దపల్లిలో శనివారం నిర్వహించిన జిల్లా న్యాయాధికారుల సమీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ నందకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్, పెద్దపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లకిడి భాస్కర్ తదితరులు ఘనస్వాగతం పలికారు. అనంతరం కోర్టు ఆవరణలో జస్టిస్ మొక్క నాటారు. జిల్లా న్యాయస్థానం ఆవరణలో రెడ్‌క్రాస్ సొసైటీ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సహకారంతో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం జస్టిస్ నంద మాట్లాడుతూ, హైబీపీ, కొలెస్ట్రాల్‌తో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వ్యాధులను ముందే గుర్తిస్తే నయం చేసుకోవచ్చన్నారు. ప్రజారోగ్య స్థితిగతులు ఆ దేశ అభివృద్ధిని సూచిస్తాయని అన్నారు. ఆరోగ్యవంతమైన ప్రజలు విద్య, ఉపాధి, అభివృద్ధి అంశాల్లో ముందుంటారని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం అనేక ఆరోగ్య పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. ప్రజలు తమ వంతుగా వేకువజామునే వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవడం మంచిదన్నారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్ రాజగోపాల్, రాష్ట్ర సభ్యుడు వెంకటేశ్వర్‌రావు, ఏసీపీ కృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పెద్దపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ–కోర్టును జస్టిస్ సూరెపల్లి నంద ప్రారంభించారు. సీనియర్ సివిల్ జడ్జి స్వప్న, జూనియర్ సివిల్ జడ్జి రాణి, పెద్దపల్లి బార్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, మల్లేశం, రమణారెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు

- చెంచు మహిళపై దాడి అమానుషం
- మొలచింతలపల్లి బాధితురాలిని పరామర్శించిన మంత్రి జూపల్లి



బాధితురాలిని పరామర్శిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్: చెంచు మహిళపై జరిగిన దాడి ఘటన ఆటవిక చర్య అని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మొలచింతలపల్లి తండాకు చెందిన బాధిత మహిళను మంత్రి శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, నలుగురు వ్యక్తులు బాధిత మహిళపై పాశవికంగా దాడి చేసి అమానవీయంగా ప్రవర్తించారని, ఘటనకు పాల్పడిన నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఘటన జరిగిన వెంటనే స్పందించామని, నిందితులను అరెస్ట్ చేసి కఠినచర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించినట్లు వివరించారు. నిందితులను ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు కూడా పంపించినట్లు పేర్కొన్నారు. ఇలాంటి దాడులకు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదని, నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. వారి ముగ్గురు ఆడపిల్లలకు రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యను అందిస్తామని చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రస్తుతం రెండెకరాల భూమి ఉందని, ప్రభుత్వం తరఫున మరికొంత భూమిని కూడా ఇచ్చి ఆదుకుంటామని జూపల్లి హామీ ఇచ్చారు.

ప్రజా పాలన కాదు.. రాక్షస పాలన

మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి

చెంచు మహిళకు బీఆర్ఎస్ నేతల పరామర్శ



బాధితురాలిని పరామర్శిస్తున్న మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి

నాగర్‌కర్నూల్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో నడుస్తోంది ప్రజాపాలన కాదని.. రాక్షస పాలనని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రిలో ఆదివాసీ మహిళ ఈశ్వరమ్మను శనివారం మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాల్‌రాజు, బీరం హర్షవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. పార్టీ తరఫున ఆమెకు రూ.1.5 లక్షల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆమెకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. అక్కడి నుండే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి బాధితురాలికి వెంటనే మహిళా వైద్యురాలి పర్యవేక్షణలో మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం సత్యవతి రాథోడ్ విలేకరులతో మాట్లాడుతూ ఒక ఆడబిడ్డపై ఇలాంటి దారుణ ఘటన జరగడం చాలా బాధాకరమన్నారు. తనపై దాడికి పాల్పడిన వారి పేర్లు చెప్పినా చర్యలు తీసుకోవడం లేదని బాధితురాలు బాధపడుతోందని చెప్పారు. బాధితురాలికి మహిళా వైద్యురాలి పర్యవేక్షణ కూడా లేదని, తూతూమంత్రంగా డ్రెస్సింగ్ చేస్తూ నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. బాధితురాలి కుటుంబానికి వెంటనే రూ.50 లక్షల పరిహారం ప్రకటించి, ఆమె ముగ్గురు పిల్లలను చదివించే బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులకు పోలీస్ స్టేషన్‌లో కొత్త అల్లుడిలా మర్యాదలు చేస్తుండడం బాధాకరమని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. జిల్లా మంత్రి బాధితురాలిని పరామర్శించి.. ఆమె వద్ద మహిళా వైద్యులు లేరని గుర్తించకపోవడం దారుణమన్నారు. దాడిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీతో మాట్లాడి బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు బీఆర్ఎస్ తరఫున పోరాడతామన్నారు. జిల్లా ఆస్పత్రిలో కేవలం నలుగురు మహిళా వైద్యులుండటం ఘోరమని విమర్శించారు. మెరుగైన వైద్యం కోసం బాధితురాలిని హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, గువ్వల మాట్లాడుతూ ఆడబిడ్డపై ఘోరమైన పాశవిక దాడి జరిగి వారం రోజులు దాటినా నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు.




గుజరాత్ ద్వారకాలోని ద్వారకాదీశ్ మందిర్‌లో శనివారం కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థనలు చేస్తున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ.

'పనిపెట్టే' పది దేశాలు

రోజుకు ఎనిమిది గంటలు, వారానికి ఆరు రోజు లు.. ఉద్యోగాల్లో పని గంటలపై సాధారణ లెక్క ఇది. ఇందులో రోజుకు తొమ్మిది గంటలు, వారానికి ఐదు రోజులే పని.. మిగతా రెండ్రోజులు వీకాఫ్స్ అనే విధానం కూడా అమల్లోకి వచ్చి చాలా కాలమైంది. అసలు వారంలో నాలుగు రోజులే డ్యూటీ ఉంటే బాగుంటుందనే ట్రెండ్ ఈ మధ్య మొదలైంది. రోజుల లెక్క ఎలా ఉన్నా.. వారమంతా కలిపి ఎన్ని గంటల పాటు 'పని'చేయించుకుంటున్నారనే లెక్క మాత్రం పక్కా. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) ఇలా ఎక్కువ పనిగంటలు ఉన్న దేశాల జాబితాను రూపొందించింది. వీకాఫ్‌లు, క్యాజువల్, సిక్ లీవులు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ లెక్క వేసింది. మరి ప్రపంచంలో సగటున ఎక్కువ పని గంటలు అమల్లో ఉన్న టాప్–10 దేశాలివీ..

-సాక్షి, సెంట్రల్ డెస్క్



డీసీఏ దూకుడు

- అధిక ధరలు, తప్పుడు ప్రకటనలతో మోసగించే మెడికల్స్‌పై కొరడా
- మొత్తం రూ.4.50 లక్షల విలువైన మందుల స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: నకిలీ మందులు విక్రయిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడే అక్రమార్కులపై తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. ఈనెల 1 నుంచి 21 వరకు రాష్ట్ర వ్యాప్తంగా డీసీఏ బృందాలు నిర్వహించిన సోదాల్లో నిబంధనలు అతిక్రమించిన వారిపై 20 కేసులు నమోదు చేశారు. జబ్బులను నయం చేసే మందులంటూ తప్పుడు ప్రకటన లతో మోసగించే వారిపై, అధిక ధరలకు మందులు విక్రయిస్తున్న మందుల దుకాణాలపై, అదేవిధంగా ఎలాంటి అనుమతులు లేకుండా మెడికల్ షాప్‌లు నిర్వహించే వారిపై డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఇలా ఈనెలలో 21 రోజుల్లోనే 20 వరకు నిబంధనల అతిక్రమణలపై చర్యలు తీసుకున్నారు. వీటిలో హన్మకొండ, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్‌లోని మెడికల్ దుకాణాలు ఉన్నాయి. డ్రగ్ లైసెన్స్ లేకుండానే మహబూబ్‌నగర్ పట్టణం కొత్త చెర్వు రోడ్డులో మందుల దుకాణం నిర్వహిస్తున్న లవకుశరెడ్డిపై డీసీఏ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ మెడికల్ దుకాణంలో రూ.1.5 లక్షల విలువైన 65 రకాల మందులను సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. వీటితోపాటు 21 రోజుల్లో జరిపిన సోదాల్లో మొత్తం రూ.4.50 లక్షల మందులు స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. డయాబెటిక్, జ్వరం, థైరాయిడ్, మూత్రపిండాల్లో రాళ్లు కరిగించడం సహా పలు రకాల జబ్బులు నయం చేసే ఆయుర్వేదం, ఇతర మందుల పేరిట తప్పుడు ప్రకటనలు ఇస్తూ మోసగిస్తున్న 13 మెడికల్స్‌పై డీసీఏ అధికారులు కేసులు నమోదు చేశారు.

శిఖర స్కూల్‌లో 9వ తరగతి ప్రవేశాలుండవ్

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా దుండిగల్ మండలం బౌరాంపేట గ్రామం పరిధిలోని శిఖర స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరంలో 9వ తరగతి ప్రవేశాలు తీసుకోవడం లేదని సీబీఎస్ఈ ప్రకటించింది. పాఠశాల సెకండరీ స్థాయి తరగతుల కోసం సీబీఎస్ఈకి దరఖాస్తు చేసుకుందని, అందులో 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల సంఖ్య గురించి మాత్రమే సమాచారాన్ని ఇచ్చినట్లు సీబీఎస్ఈ ప్రాంతీయ అధికారి శేఖర్‌చంద్ర తెలిపారు. కానీ ఈ పాఠశాలలో 8వ తరగతి తర్వాత 9వ తరగతి, 10 తరగతులకు సంబంధించిన వివరాలు తెలియజేయలేదన్నారు. అకడమిక్ సెషన్ 01.04.2023 నుంచి క్లాస్–9ని ప్రారంభించాలనే నిర్దిష్ట షరతుతో పాఠశాలకు 25.06.2023న సెకండరీ స్థాయి వరకు అనుబంధం మంజూరు చేశామన్నారు. వారి 9వ తరగతి పరీక్ష ఉత్తీర్ణతకు లోబడి, విద్యార్థులను 10వ తరగతికి ప్రమోట్ చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సీబీఎస్ఈ అఫ్లియేషన్ నిబంధనలను ఉల్లంఘించిన కారణంగా 2024–25 విద్యాసంవత్సరంలో 9వ తరగతిలో విద్యార్థులను చేర్చుకోవద్దని నిర్దేశించామన్నారు. అయితే 9వ తరగతి కోసం 2023లో నమోదు చేసుకున్న విద్యార్థులు 2025 మార్చిలో జరిగే బోర్డు పరీక్షలకు హాజరయ్యేందుకు అర్హులని వెల్లడించారు.

పొన్నంపై ఆరోపణలు సహించం

కాంగ్రెస్ నేతలు పల్లె లక్ష్మణ్ గౌడ్, ఆరేపల్లి మోహన్

సాక్షి, హైదరాబాద్: మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఉద్దేశించి హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పల్లె లక్ష్మణ్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్‌లు తీవ్రంగా ఖండించారు. కౌశిక్‌రెడ్డి కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, అసలు భారతదేశంలో 70 టన్నులను తీసుకెళ్లే లారీలున్నాయా? అని ప్రశ్నించారు. పల్లె లక్ష్మణ్‌గౌడ్ శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన పొన్నం ప్రభాకర్ కష్టపడి రాజకీయాల్లో ఎదిగారని, అలాంటి వ్యక్తిని విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునే విధంగా రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం సంతోషకరమన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్ మాట్లాడుతూ అసలు లారీల సామర్థ్యమే 35 టన్నులైతే.. కావాలని బురద జల్లేందుకు 70 టన్నుల మట్టిని తీసుకెళ్తున్నారని కౌశిక్‌రెడ్డి ఆరోపించడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు.

గజరాజులతో గస్తీ

మైసూర్ నుంచి నల్లమలకు రానున్న ఏనుగులు

- ఆంధ్రాకు 9 ఏనుగులను పంపేందుకు అనుమతి
- శిక్షణ కోసం కర్ణాటక వెళ్లనున్న అటవీ సిబ్బంది



పెద్దదోర్నాల: నల్లమల అడవుల పరిరక్షణకు ఏపీ అటవీ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. అమూల్యమైన వృక్షసంపద అక్రమ రవాణాను అరికట్టేందుకు.. అరుదైన వన్య ప్రాణులను సంరక్షించి వేసవిలో అగ్నికీలల నుంచి అటవీ ప్రాంతాన్ని కాపాడేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఇందుకోసం ఇప్పటికే బేస్ క్యాంప్‌లు, స్ట్రైకింగ్ ఫోర్స్, యాంటీ పోచింగ్ బృందాలను ఏర్పాటు చేసింది. దీంతోపాటు అభయారణ్యాల్లో ఇకపై గజరాజులతో గస్తీ చేపట్టాలని అటవీ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

రెండు అభయారణ్యాల పరిధిలో..

మన రాష్ట్రంలోని ప్రకాశం, నంద్యాల, పల్నాడు జిల్లాల్లో 3,727.82 చదరపు కిలోమీటర్ల పరిధిలో వ్యాపించి ఉన్న అడవిని కేంద్ర ప్రభుత్వం 1983లో అభయారణ్యంగా ప్రకటించింది. పెద్దదోర్నాల నుంచి శ్రీశైలం శిఖరం వరకు రాజీవ్‌గాంధీ అభయారణ్యం.. మార్కాపురం, గిద్దలూరు, ఆత్మకూరు, నంద్యాల డివిజన్ల పరిధిలో గుండ్లబ్రహ్మేశ్వర అభయారణ్యం విస్తరించి ఉన్నాయి. వీటిలో పులులతోపాటు చిరుత, ఎలుగుబంటి, జింకలు, దుప్పులు, హైనా, నెమళ్లతోపాటు 70 రకాల క్షీరదాలు, సరీసృపాలు, ఎన్నోరకాల వృక్షాలు, ఔషధ మొక్కలు నల్లమల అభయారణ్యంలో ఉన్నాయి. ఇవన్నీ మారుమూల లోతట్టు ప్రాంతాల్లో జీవిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాలను సందర్శించి వాటిని సంరక్షించే బాధ్యత కత్తిమీద సాములా మారింది.

ఏనుగులతో గస్తీ నిర్వహించేలా చర్యలు




అభయారణ్యంలోని కొన్ని మారుమూల ప్రాంతాల్లో గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. నడక మార్గంలో సిబ్బంది కొంతమేర వరకు మాత్రమే వెళ్లగలరు. అదే ఏనుగులతో అయితే సుదూర ప్రాంతాల్లో గస్తీ నిర్వహించవచ్చు. పులులు సంచరించే ప్రదేశాల్లో సైతం భయం లేకుండా పెట్రోలింగ్ నిర్వహించవచ్చు. మనం చేసిన విజ్ఞప్తికి కర్ణాటక అటవీ శాఖ సానుకూలంగా స్పందించింది. త్వరలో ఏనుగుల్ని నల్లమలకు రప్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– విశ్వేశ్వరరావు, ఫారెస్ట్ రేంజి అధికారి, పెద్దదోర్నాల

మూలమూలల్నీ జల్లెడ పట్టేలా..

మారుమూల ప్రాంతాల్లో సైతం వన్యప్రాణులు, వృక్షాలను సంరక్షించేందుకు వీలుగా అటవీ శాఖ ఉన్నతాధికారులు సుశిక్షితులైన సిబ్బంది నేతృత్వంలో ఏనుగులతో గస్తీ ఏర్పాటు చేయాలన్న నిర్ణయం తీసుకున్నారు. మారుమూల ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించేందుకు తమకు శిక్షణ పొందిన 9 ఏనుగులు అవసరమవుతాయని గుర్తించారు. తమకు అవసరమైన 9 ఏనుగులను ఇవ్వాల్సిందిగా ఏపీ అటవీ శాఖ అధికారులు కర్ణాటక అటవీ శాఖకు లేఖ రాశారు. దీనిపై స్పందించిన కర్ణాటక అటవీ శాఖ అధికారులు శిక్షణ పొందిన ఏనుగులను ఆంధ్రప్రదేశ్‌కు పంపేందుకు ఆమోదం తెలిపారు. దీంతోపాటు ఏనుగులను కట్టడి చేసేందుకు మావటిలను తయారు చేసేందుకు అటవీశాఖ తమ సిబ్బందిని కర్ణాటక రాష్ట్రానికి పంపనుంది. రాష్ట్రానికి చెందిన సిబ్బంది అక్కడికి వెళ్లి గజరాజుల ఆహారపు అలవాట్లు, వాటి కదలికలు, వాటి ఇతర అలవాట్లను క్షుణ్ణంగా పరిశీలించి శిక్షణ పొందనున్నారు. 6 ఏనుగులను రాజీవ్‌గాంధీ వన్యప్రాణుల అభయారణ్యానికి, మరో మూడు ఏనుగులను గుండ్లబ్రహ్మేశ్వరం అడవులకు పంపేలా చర్యలు చేపట్టనున్నారు. ఏనుగుల్ని తీసుకొస్తే పెద్ద పులులు ఎక్కువగా సంచరించే లోతట్టు ప్రాంతాలైన నెక్కంటి, రేగుమానుపెంట, తూము గుండాలు, ఆలాటం తదితర ప్రాంతాల్లో సైతం ధైర్యంగా పెట్రోలింగ్ చేపట్టవచ్చని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు.



తిరుమలలో శనివారం రాత్రి పౌర్ణమి గరుడ సేవ వైభవంగా జరిగింది. శనివారం రాత్రి 7 గంటలకు గరుడ వాహన సేవ ప్రారంభమైంది. సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామి గరుత్మంతుడి వాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. వాహన సేవలో తిరుమల పెద్ద జీయర్, చిన్న జీయర్, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

- తిరుమల

సింగరేణి స్కూళ్లలో 'సీబీఎస్ఈ'

- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు
- సింగరేణి సీఎండీ బలరామ్ వెల్లడి



గోదావరిఖని: సింగరేణి చరిత్రలో తొలిసారి సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ విద్యాబోధన ప్రవేశపెడుతున్నామని సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. ఇందుకోసం రామగుండం–2 ఏరియా సెక్టార్–3 యైటింక్లయిన్ కాలనీలోని సింగరేణి పాఠశాలను ఎంపిక చేశామని వెల్లడించారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎండీ మాట్లాడారు. సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 9 పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, పీజీ కాలేజీ, పాలిటెక్నిక్‌ల పనితీరుపై హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని పాఠశాలల్లో గతేడాది సాధించిన పదో తరగతి ఫలితాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతేడాది పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించిన సెక్టార్–3, భూపాలపల్లి పాఠశాలల యాజమాన్యాలను సీఎండీ అభినందించారు. సింగరేణి విద్యా సంస్థల్లో దాదాపు 7,500 మంది విద్య అభ్యసిస్తున్నారని, గతేడాది 94 శాతం ఫలితాలు సాధించారని వెల్లడించారు. పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలని, ఖర్చుకు వెనకాడకుండా పాఠశాలల ఆధునీకరణకు చర్యలు తీసుకోనున్నట్లు బలరామ్ తెలిపారు. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, క్రీడాసక్తి పెంపొందించేలా బోధన సాగాలన్నారు. సింగరేణి విద్యాసంస్థల్లో ఇతరుల జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. సమస్యలు ఉంటే యాజమాన్యం దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరిస్తామని బలరామ్ భరోసా ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్, కోఆర్డినేషన్ జీఎం జి.దేవేందర్, ఎడ్యుకేషన్ జీఎం నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

యానిమేషన్, గేమింగ్‌లో మనమే టాప్

- ఇప్పటివరకు 3 వేలకుపైగా హాలీవుడ్ చిత్రాలకు రాష్ట్రం నుంచి ఔట్‌సోర్సింగ్ ద్వారా పనులు
- టీ–హబ్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్రం నుంచి ఇప్పటివరకు 3 వేలకుపైగా హాలీవుడ్ సినిమాలకు యానిమేషన్, వీఎఫ్ఎక్స్‌లకు సబంధించిన అవుట్ సోర్సింగ్ పనులు చేశారని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని టీ–హబ్ ప్రాంగణంలో శనివారం వరల్డ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్, యానిమేషన్, ఫిల్మ్, గేమింగ్ అనే అంశంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అలాగే తెలంగాణ వీఎఫ్ఎక్స్ యానిమేషన్, గేమింగ్ అసోసియేషన్, ఇండో–అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ సేవలపైనా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తెలంగాణ నుంచి యానిమేషన్, గేమింగ్, వీఎఫ్ఎక్స్, సినిమాల ప్రచారంతోపాటు ప్రపంచ యానిమేషన్, గేమింగ్, వీఎఫ్ఎక్స్, సినిమాలలో భారతదేశంలో రాష్ట్రం మొదటిస్థానంలో ఉందని ఆయన వివరించారు. సోనీ, కామ్‌కాస్ట్, నెట్‌ఫ్లిక్స్, వార్నర్ బ్రదర్స్, డిస్కవరీ వంటి పెద్ద కంపెనీలు భారత్‌లో భారీ పెట్టుబడులు పెట్టాయని చెప్పారు. ఈ రంగాన్ని ప్రోత్సహించడంలో ఇండో–అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ కీలకపాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. ఐఏసీసీ జాతీయ అధ్యక్షుడు పంకజ్ బొహ్రా మాట్లాడుతూ పెరుగుతున్న డిమాండ్, నిరంతర ఆవిష్కరణలు భారత్‌లో ఈ రంగాన్ని తాము ప్రోత్సహించడానికి ప్రధాన కారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, అమెరికన్ కాన్సులేట్ వాణిజ్య వ్యవహారాల సలహాదారు రాఘవన్ శ్రీనివాసన్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రాజెక్ట్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి. మధుసూదన్ ప్రసంగించారు.



సమావేశంలో తెలంగాణ వీఎఫ్ఎక్స్ యానిమేషన్, గేమింగ్ అసోసియేషన్, ఐఏసీసీ ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు

తాండూరు-జహీరాబాద్ రైల్వేలైన్ 'సర్వే' షురూ

- 70 కి.మీ నిడివి..రూ.1,400 కోట్ల అంచనా వ్యయం
- రైల్వే శాఖ ప్రతిపాదన నేపథ్యంలో ఫైనల్ లొకేషన్ సర్వే ప్రారంభం
- లైన్ పూర్తయితే ప్రయాణికులకు సౌకర్యం.. సరుకు రవాణాకు అనుకూలం



సాక్షి, హైదరాబాద్: సిమెంటు పరిశ్రమల క్లస్టర్‌గా ఉన్న తాండూరు నుంచి జహీరాబాద్ వరకు 70 కి.మీ నిడివితో కొత్త రైల్వే లైన్ నిర్మించేందుకు ప్రతిపాదించిన దక్షిణ మధ్య రైల్వే ఇప్పుడు దాని సాధ్యాసాధ్యాలను తేల్చేందుకు ఫైనల్ లొకేషన్ సర్వే ప్రారంభించింది. సికింద్రాబాద్– వాడి మార్గంలో ఉన్న తాండూరు, సికింద్రాబాద్ నుంచి బీదర్ మార్గంలో ఉన్న జహీరాబాద్ మధ్య రైల్వే లైన్ నిర్మించాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉంది. సిమెంటు, నాపరాయి, వ్యవసాయ ఉత్పత్తుల తరలింపు కూడా భారీగానే ఉంటుంది. వెరసి ఇటు ప్రయాణికులకు, అటు సరుకు రవాణాకు ఈ కొత్త మార్గం అనుకూలంగా ఉంటుంది.

ప్రస్తుతం రైల్లో రెట్టింపు దూరం..

తాండూరు–జహీరాబాద్ మధ్య దూరం (రోడ్డు మార్గం) 54 కి.మీ మాత్రమే. అదే రైలులో వెళ్లాలంటే 104 కి.మీ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. వికారాబాద్ మీదుగా వెళ్లాల్సి రావటమే దీనికి కారణం. జహీరాబాద్, సంగారెడ్డి ప్రాంతాలకు తాండూరు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి నిత్యం చాలామంది వస్తుంటారు. రైలులో చుట్టూ తిరిగి వెళ్లాల్సి ఉండటంతో ఎక్కువగా రోడ్డు మార్గానే వెళ్తారు. ఇక ముంబై వైపు వెళ్లేవారు ముంబై జాతీయ రహదారి మీద ఉన్న జహీరాబాద్‌కు వెళ్లి రోడ్డు మార్గాన వెళ్లే వాహనాలను ఆశ్రయిస్తారు. దీంతో ఈ రెండు ప్రాంతాల మధ్య ప్రయాణికుల రద్దీ బాగానే ఉంటోంది. ఇక తాండూరు చుట్టుపక్కల ఉన్న సిమెంటు పరిశ్రమలు, నాపరాయి పరిశ్రమల నుంచి రైళ్ల ద్వారా సరుకు దేశంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా అవుతుంటుంది. బీదర్ మార్గంలో సరుకు వెళ్లాలంటే వికారాబాద్ మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని రూ.1,400 కోట్ల అంచనా వ్యయంతో తాండూరు నుంచి నేరుగా జహీరాబాద్‌కు కొత్త రైల్వే లైన్‌ను గతంలో రైల్వే శాఖ ప్రతిపాదించింది. గతేడాది చివరలో ఫైనల్ లొకేషన్ సర్వే మంజూరైంది. దీంతో మూడు రోజుల క్రితం ఆ పనులు మొదలయ్యాయి. ఈ లైన్ పూర్తయింతే గంట సేపట్లో రైళ్లు గమ్యం చేరతాయి. జహీరాబాద్ నుంచి వాడీకి ఇది దగ్గరి దారిగా మారుతుంది. అటు వాడీ మార్గంలో, ఇటు సికింద్రాబాద్ మార్గంలో ఒకేసారి రైళ్ల ప్రయాణించేందుకు ఇది ప్రత్యామ్నాయ మార్గం అవుతుంది.




వెడ్డింగ్స్.. డెస్టినేషన్

తారామతిలో ఫొటోషూట్స్.. రాణిమహల్‌లో పెళ్లిళ్లు
అనంతగిరి హిల్స్‌కూ పెళ్లిళ్ల తాకిడి
ఆసక్తి చూపుతున్న అంతర్జాతీయ వెడ్డింగ్ ప్లానర్స్
లక్నవరం, సోమశిలనూ వేదికలుగా తీర్చిదిద్దనున్న పర్యాటక శాఖ

సాక్షి, హైదరాబాద్

వారసత్వ సంపదతోపాటు అద్భుత కట్టడాలకు కేంద్రం హైదరాబాద్ నగరం.ఇక్కడి చారిత్రాత్మక కట్టడం తారామతి బారాదరి వెడ్డింగ్ డెస్టినేషన్‌కు అడ్డాగా మారింది. ఎత్తయిన కొండపైన ఆనాటి రాజసం నింపుకున్న నిర్మాణ శైలి, వందలమంది ఒకేసారి కూర్చొని పెళ్లి వైభవం ఆస్వాదించే అవకాశం ఉండడంతో ఇక్కడ వేడుక చేసుకోవడానికి పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. తారామతిలో ఐదు గంటల ఫొటో షూట్‌కు ఉదయం అయితే రూ.8000, సాయంత్రం నుంచి అయితే రూ. 10 వేలు చార్జ్ చేస్తున్నారు. పెళ్లిళ్లు, రిసెప్షన్ లేదా ఇతర ఫంక్షన్లకు ఓపెన్ ఏరియా అయితే రూ.70 వేలు, ఇండోర్ బాంకెట్ హాల్ అయితే లక్ష రూపాయల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఫుడ్ కూడా అందుబాటులో ఉంది. ఒకవేళ ఇక్కడ ఫుడ్ కాకుండా బయట నుంచి తెప్పించుకోవాలనుకునేవారు అదనంగా రూ.11 వేలు చెల్లించాలి. నిర్వాహకులే స్వయంగా ఫుడ్ ఏర్పాటు చేసుకోవాలంటే...అదనంగా రూ.15 వేలు చెల్లించాలి. వేదిక, వసతుల అద్దె సాధారణంగానే ఉన్నా, ఆకర్షణీయమైన అలంకరణ, ఖరీదైన వంటకాలకు ప్రాధాన్యం ఇస్తూ ఇక్కడ పెళ్లిళ్లకు కనీసం పాతిక లక్షల పైనే ఖర్చు పెడుతున్నారు.

తారామతి బారాదరి, ఫలక్‌నుమా ప్యాలెస్..




→ నగరంలోని 'ఫలక్‌నుమా ప్యాలెస్' కూడా ఇప్పటికే అంతర్జాతీయ స్థాయితో ఖ్యాతి గడించిన విలాసవంతమైన వేదిక. గతంలో బాలీవుడ్ స్టార్ సల్మాన్‌ఖాన్ తన సోదరి వివాహం ఇక్కడే జరిపించిన విష యం తెలిసిందే. ఈ వేడుకకు బాలీవుడ్ స్టార్స్‌తోపాటు పలువురు వ్యాపారవేత్తలు వచ్చారు. మరెందరో ప్రముఖులు కూడా ఈ వేదికను వినియోగించుకున్నారు.

అనంతగిరి హిల్స్..

→ అటు అనంతగిరిహిల్స్ వేదికగా కూడా వివాహాల సంఖ్య పెరిగింది. పర్యాటక శాఖ ప్రత్యేక శ్రద్ధ చూపించి వందల మంది వేడుకల్లో పాల్గొనేలా సౌకర్యాలు అభివృద్ధి చేయడంతో పెళ్లిళ్ల, వెడ్డింగ్ షూట్లకు ఇక్కడ ఆదరణ పెరిగింది. ఇక్కడి ప్రకృతి పారవశ్యం నూతన జంటలకు ఆకర్షిస్తోంది. ఈ పరిసర ప్రాంతాల్లోనే పలు వెడ్డింగ్ షూట్ సెట్టింగ్ రిసార్టులూ వెలిశాయి. ఇక్కడ డెస్టినే షన్ వెడ్డింగ్‌లకు సాధారణంగా 5 లక్షల పైనే ఖర్చు అవుతుందని అంచనా. అయితే, వీటిల్లో వెడ్డింగ్ ప్లానర్ల ఖర్చులే అత్యధికంగా ఉంటాయి. తమ అభిరుచికి తగ్గ ట్టుగా కేవలం సెట్టింగ్‌లకు లక్షల్లో ఖర్చు చేసేవారూ ఉన్నారు. కొందరైతే సెట్టింగ్‌లకే కోటి రూపా యల దాకా ఖర్చు చేస్తున్నారని వెడ్డింగ్ ప్లానర్స్ చెబుతున్నారు.

ఫ్యూచర్ ప్లాన్.. లక్నవరం




→ వరంగల్‌కు సమీపంలోని లక్నవరం సరస్సు కూడా డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు మరో ఫేవరెట్ స్పాట్ కానుంది. ఇక్కడ 17 నుంచి 20 దాకా ఐల్యాండ్‌లు ఉన్నాయని, వాటిని కూడా ఈ దిశగా అభివృద్ధి చేసే యోచనలో ప్రభుత్వం ఉందని టూరిజం శాఖ ప్రతినిధి తెలిపారు. లక్నవరంలోని కాటేజె స్‌తో పాటు దీనికి దగ్గరలోనే వరంగల్ టూరిజం హోటళ్లు, రిసార్ట్‌లు ఉన్నాయి. తీసుకునే కాటేజీల సంఖ్య, అవసరానికి అనుగుణంగా సమీపంలోనే హరిత హోట ళ్లలో ఏర్పాటు చేసే సౌకర్యా లను బట్టి రూ. 3–5 లక్షల వరకు ఖర్చు అవుతుందని పర్యా టక అధికారులు చెబుతు న్నారు. వినూత్నమైన సెట్టింగులు, పూల అలంకరణలు, భోజన ఏర్పాట్లు ఇలా అన్నీ.. చేసే స్థాయిని బట్టి ఖర్చులో హెచ్చుతగ్గులు ఉంటాయి.

సోమశిల..

ప్రముఖ పర్యాటక ప్రదేశం సోమశిలలో జరిగిన డెస్టినేషన్ వెడ్డింగ్ కూడా అందరినీ ఆకర్షించింది. ఇక్కడి డ్రోన్ షాట్‌లు ప్రకృతి పారవశ్యాన్ని చిత్రీకరించిన విధానం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అలాగే నాగార్జునసాగర్‌వంటి పలు పర్యాటక ప్రదేశాలు ఇలాంటి వినూత్న వివాహాల వేడుకలకు అద్భుత వేదికలుగా అవతరిస్తు న్నాయి. కాగా, ప్రస్తుతం కొద్ది మందికి మాత్రమే ఇలాంటి సౌకర్యాలు అందు బాటులో ఉన్నా, వీటికున్న ఆదరణ దృష్ట్యా మరింత అభివృద్ధి చేస్తూ విదేశాలకు చెందిన వారిని సైతం డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు మన వైపు ఆకర్షించేలా ప్రణాళికలు రచిస్తున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు చెప్పారు.

మన సంస్కృతీ సంప్రదాయాలకు గౌరవిస్తూనే.. ఘనమైన చరిత్ర కలిగిన తెలంగాణలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు మంచి వేదికలుగా వాడుకుంటున్నారు. ఈ మార్పు పర్యాటక

వెలుగులోకి మరిన్ని వేదికలు



ప్రాంతాలకు ఆదరణ పెంచడంతోపాటు వారి పెళ్లిని చిరకాల మధుర జ్ఞాపకంగా నిలుపుతుంది. ఈ ఆనవాయితీ ఇలానే కొనసాగితే మరి కొన్నేళ్లలో మరో పది వరకు డెస్టినేషన్ వేదికలు వెలుగులోకి వస్తాయి. అంతటి విశిష్టత కలిగిన కోటలు, ప్రకృతి రమణీయ ప్రాంతాలు, జలపాతాలు, చారిత్రక కట్టడాలు రాష్ట్రంలో ఉన్నాయి. ఇవన్నీ హైదరాబాద్ నగరానికి సమీపంగా ఉండటంతో అంతర్జాతీయ వెడ్డింగ్ ప్లానర్లను సైతం ఆకర్షిస్తున్నాయి

– అరవింద్, పర్యాటక నిపుణుడు

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.